
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 173
శుక్రవారం 13-9-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'


అద్భుతమైన ప్రారంభోత్సవ ఆఫర్లు
ప్రపంచ స్థాయి షాపింగ్ అనుభూతి సరికొత్తగా ఇప్పుడు మన మేడ్చల్ లో
THE ONE STOP SHOP
1+1 OFFERS* COMBO OFFERS* ఇంకా మరెన్నో
CMR SHOPPING MALL
The joy of life
బస్‌స్టాండ్ ఎదురుగా
మేడ్చల్
FOLLOW US ON /cmrshoppingmallindia /cmrshoppingmall
శారీస్
1 బందరులంక శారీ ₹79*
1 సూరత్ ఫ్యాన్సీ శారీ ₹149*
1 బర్ఫీ చిఫాన్ శారీ ₹199*
1 కోరల్ సిల్క్ శారీ ₹249*
1 డిజైనర్ శారీ ₹299*
1 బొంబాయి కాటన్ శారీ ₹299*
1 ఫ్యాన్సీ బుట్ట శారీ ₹333*
1 సాఫ్ట్ బ్రోకేడ్ శారీ ₹444*
1 సిల్క్ బ్రోకేడ్ శారీ ₹499*
2 కేరళ కాటన్ శారీస్ ₹499*
2 చిఫాన్ బ్రాసో శారీస్ ₹649*
2 హ్యాండ్లూమ్ కాటన్ శారీస్ ₹666*
2 కరిష్మా శారీస్ ₹699*
3 జిగ్ జాగ్ శారీస్ ₹699*
2 సహారియ శారీ ₹749*
2 కాంచి కాటన్ శారీ ₹799*
3 సూరత్ కాంబో శారీ ₹799*
2 సనా సిల్క్ శారీ ₹799*
2 సూరత్ ప్రింట్ శారీ ₹849*
2 జార సిల్క్ శారీ ₹899*
3 సుపీరియర్ సిల్క్ శారీస్ ₹899*
1 బండారులంక శారీస్ ₹1199*
2 అరుప్పుకొట్టై శారీ ₹1199*
1 మహాదేవ పట్టు శారీస్ ₹1499*
1 ఐశ్వర్య పట్టు శారీ ₹1799*
1 సౌభాగ్య పట్టు శారీ ₹1999*
1 మాంగల్య పట్టు శారీ ₹2399*
2 ఉప్పాడ కాటన్ శారీస్ ₹2999*
1 అక్షయ పట్టు శారీ ₹2999*
ఉమెన్స్ వేర్
3 లేడీస్ చున్నీ ₹99*
1 లేడీస్ కుర్తా ₹99*
1 లేడీస్ లెగ్గింగ్స్ ₹99*
1 లేడీస్ నైటీ ₹99*
1 లేడీస్ టీ-షర్ట్ ₹99*
1 లేడీస్ ప్రింటెడ్ కుర్తా ₹199*
1 లేడీస్ కుర్తి ₹299*
3 లేడీస్ పలాజో ₹399*
1 కాటన్ డ్రెస్ మెటీరియల్ ₹399*
2 లేడీస్ ఫ్యాషన్ కుర్తా ₹444*
1 ఫ్రెటీకట్ చుడీదార్ ₹499*
1 జైపూర్ కాటన్ మెటీరియల్ ₹499*
1 ఖల్లీ చుడీదార్ ₹599*
1 రెడీమేడ్ చుడీదార్స్ ₹599*
1 ఫ్యాన్సీ గాగ్రా ₹599*
2 లేడీస్ అంబ్రెల్లా కుర్తా ₹699*
3 లేడీస్ కుర్తా ₹777*
3 డ్రెస్ మెటీరియల్స్ కాంబో ₹899*
3 లేడీస్ వెస్టర్న్ డ్రెస్ ₹999*
*CONDITIONS APPLY
మెన్స్ వేర్
1 మెన్స్ క్యాజువల్ షర్ట్స్ ₹299*
1 మెన్స్ క్యాజువల్ షర్ట్స్ ₹349*
2 మెన్స్ టీ- షర్ట్స్ ₹499*
2 మెన్స్ జీన్స్ ₹999*
4 మెన్స్ షార్ట్స్ ₹999*
2 మెన్స్ కాటన్ ట్రౌజర్స్ ₹1099*
2 మెన్స్ జీన్స్ ₹1499*
U.S. POLO ASSN. SINCE 1890
SHOP FOR ₹7999 AND GET A DUFFEL BAG @ 399
SHOP FOR ₹15999 AND GET A TROLLEY @ 799
OTTO | TWILLS | COOL COLORS CASUALS
BUY 2 SHIRTS ₹1499*
BUY 2 TROUSERS ₹1999*
Levi's
GET ₹2000 OFF* ON PURCHASE OF APPAREL WORTH ₹11999.
GET ₹1000 OFF* ON PURCHASE OF APPAREL WORTH ₹6999.
కిడ్స్ వేర్
3 గర్ల్స్ షార్ట్స్ ₹249*
3 బాయ్స్ షార్ట్స్ ₹299*
3 గర్ల్స్ లోవర్స్ ₹399*
5 గర్ల్స్ లెగ్గింగ్స్ ₹449*
5 గర్ల్స్ టీ-షర్ట్స్ ₹499*
4 బాయ్స్ టీ-షర్ట్స్ ₹499*
3 బాయ్స్ క్యాజువల్ షర్ట్స్ ₹549*
3 గర్ల్స్ కాటన్/హొసరీ ఫ్రాక్స్ ₹599*
3 బాయ్స్ కాటన్ ట్రౌజర్స్ ₹999*
3 బాయ్స్ జీన్స్ ₹999*
బెడ్ షీట్
A/C BLANKET ₹99*
BUY 2 B MILL BEDSHEET ₹299*
B MILL BEDSHEET (6x6) ₹599*
JAIPUR BEDSHEET 1+1 ₹499*
• చీరలు • చుడీదార్స్ • గాగ్రాస్ • ఉమెన్స్ వేర్ • మెన్స్‌వేర్ • కిడ్స్ రెడీమేడ్స్ • కాస్మెటిక్స్ • ఫుట్ వేర్
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా


'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 173

శుక్రవారం 13-9-2024



బుల్ 'హై'జంప్

ఫెడ్ వడ్డీరేట్ల తగ్గింపుపై మరింత స్పష్టత ప్రభావం - 15లో



రేట్లు పెరిగి.. కేరెట్లు తరిగి..

9 కేరెట్ల బంగారాన్ని అందుబాటులోకి తీసుకురానున్న కేంద్రం - 13లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

న్యూస్‌రీల్

చిన్నారిపై హత్యాచారం కేసులో దోషికి మరణశిక్ష



ఆరేళ్ల చిన్నారిపై హత్యాచారం కేసులో సంగారెడ్డి జిల్లా పోక్సో కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. బాలికపై అత్యాచారం, హత్య కేసులో దోషికి మరణ శిక్ష విధించినట్లు సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు.

- వివరాలు 16లో▶

సమన్వయంతో పనిచేయండి



పార్టీని బలోపేతం చేసేందుకు క్షేత్రస్థాయిలోని కార్యకర్త మొదలుకొని సీనియర్ నాయకుల వరకు అందరినీ కలుపుకొని సమన్వయంతో పనిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు.

- వివరాలు 3లో▶

మీరు చైల్డ్ పోర్న్ చూశారు!



'మీరు చైల్డ్ పోర్నోగ్రఫీ చూశారు. మా నోటీసులకు స్పందించకపోతే జైలుకు కూడా వెళ్లాల్సి వస్తుంది. కేసు నమోదు కాకుండా చూడాలంటే మేం సూచించే బ్యాంకు ఖాతాలకు డబ్బులు పంపాలి' అని సైబర్ నేరగాళ్లు అమాయకులను బెదిరిస్తున్నారు.

- వివరాలు 5లో▶

కౌశిక్ ఇంటిపై దాడి

ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఆయన అనుచరుల వీరంగం

- ఇంటి అద్దాలు పగలగొట్టి.. రాళ్లు, టమాటాలు, కోడిగుడ్లతో దాడి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటి వద్ద కుర్చీవేసుకుని కూర్చున్న అరికెపూడి
- 'నీ ఇంటికి వచ్చా.. దమ్ముంటే బయటికి రా..' అంటూ తీవ్ర వ్యాఖ్యలు
- పీఏసీ చైర్మన్ పదవి, ఫిరాయింపుల అంశంపై ఇద్దరి మధ్య వాగ్యుద్ధం
- గాంధీ ఇంటికెళ్లి పార్టీ కండువా వేస్తానన్న కౌశిక్.. అడ్డుకున్న పోలీసులు
- ఆపై అనుచరులతో కౌశిక్ నివాసానికి వెళ్లి విధ్వంసం సృష్టించిన గాంధీ
- భారీగా చేరుకున్న బీఆర్ఎస్ నేతలు
- గాంధీ, ఆయన అనుచరులపై ఫిర్యాదు కోసం సైబరాబాద్ సీపీ ఆఫీసుకు హరీశ్ రావు, ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- సీపీ ఆఫీసులోకి అనుమతి నిరాకరణ.. పోలీసులు, కౌశిక్‌రెడ్డి మధ్య వాగ్వాదం
- అక్కడే బీఆర్ఎస్ నేతల బైఠాయింపు.. అరెస్టు చేసి శంషాబాద్‌కు తరలింపు
- చినికి చినికి గాలివానలా మారిన అరికెపూడికి పీఏసీ చైర్మన్ పదవి వివాదం



బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి పాల్పడుతున్న కాంగ్రెస్ శ్రేణులు. (ఇన్‌సెట్లో) రాళ్ల దాడిలో ధ్వంసమైన కిటికీ

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నివాసంపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఆయన అనుచరులు దాడికి దిగారు. గాంధీ స్వయంగా కౌశిక్‌రెడ్డి నివాసంవైపు దూసుకురాగా.. అనుచరులు ఇంట్లోకి వెళ్లి అద్దాలు, పూల కుండీలు పగలకొట్టడంతోపాటు రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలు, చెప్పులు, కుర్చీలు విసురుతూ విధ్వంసానికి పాల్పడ్డారు. పాడి కౌశిక్‌రెడ్డి, ఆయన భార్య, కూతురు, కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండగానే.. సుమారు గంట పాటు వీరంగం సృష్టించారు. అరికెపూడి ఈ సమయంలో కౌశిక్‌రెడ్డి ఇంటి ముందే కుర్చీ వేసుకుని 'నీ ఇంటికి వచ్చా.. దమ్ముంటే బయటికి రా..నా కొడకా' అంటూ తీవ్ర పదజాలంలో సవాల్ చేశారు. దీనితో ఆయన అనుచరులు మరింత రెచ్చిపోయారు. ఇది తెలిసి పెద్ద సంఖ్యలో

మిగతా 12వ పేజీలో ▶

పట్టపగలే ఎమ్మెల్యేపై హత్యాయత్నమా?: కేటీఆర్

సీఎం రేవంత్ డైరెక్షన్‌లోనే దాడి: హరీశ్ 12లో

కామ్రేడ్ ఏచూరి కన్నుమూత



సంస్కరణవాది.. స్థిత ప్రజ్ఞుడు

తెలుగు కుటుంబంలో జన్మించిన సీతారాం ఏచూరి

విద్యార్థి నేతగా రాజకీయ ప్రస్థానం ప్రారంభం..

జేఎన్‌యూ అధ్యక్షుడిగా మొదలుపెట్టి సీపీఎం ప్రధాన కార్యదర్శి స్థాయికి...

ఉద్యమకారుడిగా, సామాజికవేత్తగా, రచయితగా పేరు ప్రఖ్యాతులు

- వివరాలు 2లో

నాకు తెలిసిన 'బాబు'

ఏచూరి మేనమామ, రిటైర్డ్ ఐఏఎస్ మోహన్ కందా మనోగతం

- వివరాలు 4లో

ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతూ ఢిల్లీ ఎయిమ్స్‌లో తుదిశ్వాస

సీపీఎం ప్రధాన కార్యదర్శికి రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు ప్రముఖులు, నేతల సంతాపం

ప్రియతమ కామ్రేడ్‌ను కోల్పోవడం తీవ్ర విషాదకరమన్న సీపీఎం

నేటి సాయంత్రం ఢిల్లీలోని వసంత్‌కుంజ్ నివాసానికి భౌతికకాయం

రేపు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పార్టీ కార్యాలయంలో పార్థివ దేహం

వైద్య పరిశోధనల నిమిత్తం భౌతికకాయాన్ని ఎయిమ్స్‌కు అప్పగించనున్న కుటుంబం

- వివరాలు 2లో▶

రాజీనామాకైనా సిద్ధం



- బెంగాల్ ప్రజలకు అసౌకర్యం కలగకూడదు
- వైద్యురాలికి న్యాయమే నా అభిమతం
- చర్చల ప్రత్యక్ష ప్రసారానికి జూడాల పట్టు
- సచివాలయానికి చేరుకున్నా లోనికి రాని వైనం
- రెండు గంటలు వేచిచూసిన మమత
- జరగని చర్చలు.. కొనసాగుతున్న ప్రతిష్టంభన

6లో

తప్పేడు సంకేతాలకు ఆస్కారం

- సీజేఐ ఇంటికి ప్రధాని మోదీ వెళ్లడం చూసి ఆశ్చర్యపోయా
- ఇలాంటి వేడుకలకు ప్రధాని వెళ్లకపోవడమే మంచిది
- ప్రైవేట్ కార్యక్రమాన్ని పబ్లిక్ చేయొద్దు.. రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ సూచన

6లో

సాంకేతికతతో జీవితాల్లో గుణాత్మక మార్పు

- రోడ్డు ప్రమాదాలతో ఆర్థిక వ్యవస్థపై ప్రభావం: మంత్రి శ్రీధర్‌బాబు
- వాహనాల తయారీలో భద్రతకు పెద్దపీట వేయాలని వెల్లడి
- హైదరాబాద్‌లో జెడ్ఎఫ్ గ్లోబల్ కేపబుల్ సెంటర్ ప్రారంభం

- వివరాలు 3లో▶

ఇరకాటం



బీఆర్ఎస్‌లోనే గాంధీ.. ప్రతిపక్షానికే పీఏసీ

ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

- నామినేషన్లన్నీ స్క్రూటినీ చేశాకే పీఏసీ పదవికి అరికెపూడి గాంధీ ఎంపిక
- గతంలో అక్బరుద్దీన్‌కు పీఏసీ చైర్మన్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తే స్పీకర్ విచక్షణాధికారం అన్నదెవరు?
- బతకడానికి వచ్చారంటూ చేసిన వ్యాఖ్యలపై కేసీఆర్, కేటీఆర్, హరీశ్ సమాధానం చెప్పాలి
- ఏ పార్టీ ఎమ్మెల్యేలు ఆ పార్టీలో ఉంటే తమకే మేలని వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: ప్రజా పద్దుల సంఘం (పీఏసీ) చైర్మన్‌గా ఎన్నికైన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ముమ్మాటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగానే ప్రతిపక్షానికి పీఏసీ పదవి కట్టబెట్టామని తేల్చిచెప్పారు. గతంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి అడ్డగోలు నియామకాలు చేసింది బీఆర్ఎస్ కాదా అని విరుచుకుపడ్డారు. 'అసెంబ్లీ చివరి రోజు పార్టీ బలాబలాలను స్పీకర్ ప్రకటించారు. బీఆర్ఎస్‌కు 38 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని చెబితే ఆరోజు బీఆర్ఎస్ ఎలాంటి

మిగతా 3వ పేజీలో ▶

ఫీజుల దరువుకు బ్రేకులెలా?

ఉప సంఘం ఆదేశాలతో పాఠశాల విద్య డైరెక్టరేట్ కసరత్తు

- ఏటా ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచేస్తున్న పలు ప్రైవేటు స్కూళ్లు.. కొన్నేళ్లుగా వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు
- ఫీజుల నియంత్రణకు అవసరమైతే ప్రత్యేక చట్టం తెచ్చే యోచనలో సర్కారు



సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇవ్వాలని మంత్రివర్గ ఉప సంఘం ఆదేశించిన నేపథ్యంలో, పాఠశాల విద్య డైరెక్టరేట్ దీనిపై కసరత్తుకు సిద్ధమవుతోంది. ఫీజుల నియంత్రణకు 2017లో ఆచార్య తిరుపతిరావు కమిటీ ఇచ్చిన నివేదికలోని అంశాలను పరిగణనలోకి తీసుకొని ముందుకెళ్లాలని భావిస్తోంది. అవసరమైతే ప్రత్యేక చట్టం తెచ్చే యోచనలో ప్రభుత్వం ఉంది. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు స్కూళ్లలోనే విద్యార్థులు ఎక్కువగా ఉన్నారు. సర్కారీ స్కూళ్లలో మౌలికవసతుల లేమి, ఉపాధ్యాయుల కొరత విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ల వైపు ఆకర్షితులయ్యేలా చేస్తున్నాయి. ప్రైవేటు యాజమాన్యాలు స్కూలును బట్టి రూ.12 వేల నుంచి రూ.4 లక్షల వరకు వార్షిక

మిగతా 12వ పేజీలో ▶

విద్యుత్ క్రయవిక్రయాలకు ఓకే

గ్రిడ్ కంట్రోల్ ఆఫ్ ఇండియా ఆంక్షలపై హైకోర్టు స్టే

- విద్యుత్ బిడ్డింగ్‌లకు అనుమతించాలని ఆదేశం
- కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి నిర్దేశం
- తెలంగాణ ప్రభుత్వం లంచ్ మోషన్ పిటిషన్‌లో మధ్యంతర ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. పవర్ ఎక్స్ఛేంజీల్లో విద్యుత్ క్రయవిక్రయాలు జరపకుండా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)పై గ్రిడ్ కంట్రోల్ ఆఫ్ ఇండియా విధించిన ఆంక్షలపై స్టే విధించింది. ఎక్స్ఛేంజీల్లో విద్యుత్ క్రయవిక్రయాలు జరిపేందుకు టీజీఎస్పీడీసీఎల్‌కు అవకాశం కల్పించాలంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు విద్యుత్ బిడ్డింగ్‌కు అనుమతించాలని నేషనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్‌డీసీ)ను ఆదేశిస్తూ తదుపరి విచారణను అక్టోబర్ 17కు వాయిదా వేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

అత్యవసరంగా హైకోర్టులో కేసు

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (పీజీసీఐఎల్)కు రూ.261.31 కోట్ల చార్జీలను బకాయిపడినందుకు పవర్ ఎక్స్ఛేంజీల్లో విద్యుత్ క్రయవిక్రయాలు జరపకుండా టీజీఎస్పీడీసీఎల్‌పై గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా గురువారం ఉదయం ఆంక్షలు విధించింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం అత్యవసరంగా హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసి.. ఈ నిర్ణయంపై స్టే విధించాలని కోరింది. నిషేధంతో రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, రాష్ట్రానికి మొత్తం విద్యుత్ కొనుగోళ్లు ఆగిపోయే

మిగతా 16వ పేజీలో ▶

ఎస్ఎఫ్ఐలో చేరికతో..

1974లో స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ)లో చేరికతో ఏచూరి రాజకీయ ప్రస్థానం మొదలైంది. 1975లో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్)లో సభ్యుడు అయ్యారు. పార్టీలో చురుకైన కార్యకర్తగా వ్యవహరించిన ఏచూరి అనేక ఉద్యమాల్లో భాగస్వాములు అయ్యారు. 1975లో దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో అరెస్టై కొన్నాళ్లు జైలు జీవితం గడిపారు. ఆ సమయంలో జేఎన్‌యూలో పీహెచ్‌డీ చేస్తున్న ఆయన..ఆ కారణంగా డాక్టరేట్ పూర్తి చేయలేకపోయారు. ఎంతోమంది సన్నిహితుల మధ్య తాను డాక్టరేట్ పూర్తి చేయలేకపోయానని ప్రస్తావిస్తూ బాధపడుతుండేవారు. దేశంలో అత్యవసర పరిస్థితిని ఎత్తివేసిన తర్వాత ఏచూరి జేఎన్‌యూ విద్యార్థి నాయకుడిగా మూడుసార్లు ఎన్నికయ్యారు. 1978లో ఎస్ఎఫ్ఐ సంయుక్త కార్యదర్శిగా, ఆ తర్వాత అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. పశ్చిమ బెంగాల్, కేరళయేతర వ్యక్తి ప్రెసిడెంట్ కావడం అదే తొలిసారి కావడం విశేషం. కాగా 1984లో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీకి ఆయన ఎన్నికయ్యారు. 1992లో పొలిట్‌బ్యూరో సభ్యుడయ్యారు.



తల్లి, సోదరుడితో..



భార్య సీమా చిస్తీతో..

ఏచూరి గొప్ప రచయితగా కూడా పేరు సంపాదించారు. పార్టీకి చెందిన వారపత్రిక పీపుల్స్ డెమోక్రసీకి రెండు దశాబ్దాలకు పైగా సంపాదకులుగా పనిచేశారు. సైద్ధాంతిక రంగంలో, హిందూత్వంపై ఆ పుస్తకంలో విమర్శలు చేసేవారు. ఇలా రచయితగా మంచి పేరు, ప్రఖ్యాతులు సంపాదించారు.

గొప్ప రచయిత



కుమారుడు ఆశిష్‌తో..


'లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్' పేరుతో ఆంగ్లపత్రికకు కాలమ్స్ రాసేవారు. 'క్యాస్ట్ అండ్ క్లాస్ ఇన్ ఇండియన్ పాలిటిక్స్ టుడే', 'సోషలిజం ఇన్ ఛేంజింగ్ వరల్డ్', 'మోదీ గవర్నమెంట్', 'న్యూ సర్జ్ ఆఫ్ కమ్యూనలిజం', 'కమ్యూనిలజం వర్సెస్ సెక్యులరిజం' వంటి పుస్తకాలను రాశారు. ఏచూరికి పాత హిందీ పాటలంటే ఎంతో ఇష్టం. సినిమాలు చూసేందుకు ఏచూరితో కలిసి రఫీ మార్గ్ నుంచి చాణక్య ప్రాంతానికి నడుచుకుంటూ వెళ్లే వాళ్లమని తోటి సీపీఎం నేతలు నాటి సంగతులు చెప్పారు.



1977 అక్టోబర్ నెల.. ఓ నూనూగు మీసాల యువకుడి నాయకత్వంలో వందలాది మంది విద్యార్థులు ఢిల్లీ వీధుల్లో కదం తొక్కారు. ఉక్కు మహిళగా పేరొందిన ఇందిరాగాంధీ ఇంటికి వారంతా ర్యాలీగా వెళ్లారు. ఎమర్జెన్సీ అనంతరం జరిగిన ఎన్నికల్లో ఇందిర నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఓడిపోయినప్పటికీ ఆమె జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ చాన్స్‌లర్ పదవిని మాత్రం వీడలేదు. దీన్ని వ్యతిరేకిస్తూ వారంతా నినాదాలు చేయడం ప్రారంభించారు. చివరికి ఇందిర తన నివాసం నుంచి బయటకు వచ్చారు. అప్పుడు లేచాడు.. జేఎన్‌యూ స్టూడెంట్ యూనియన్ ప్రెసిడెంట్ సీతారాం ఏచూరి. ఇందిర పక్కనే నిల్చుని.. ఆమె రాజీనామానే డిమాండ్ చేస్తూ.. మెమోరాండంను చదివి వినిపించాడు. ఈ ఘటన జరిగిన కొన్ని రోజులకే ఇందిర చాన్స్‌లర్ పదవికి రాజీనామా చేశారు.

రాజ్యసభ సభ్యుడిగా, వివిధ కమిటీల్లో..

2005లో పశ్చిమబెంగాల్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఇదే ఏడాది హోం వ్యవహారాల కమిటీలో సభ్యుడిగా నియమితులయ్యారు. 2006 రవాణా, పర్యాటకం, సాంస్కృతిక కమిటీలకు చైర్మన్‌గా, సాధారణ ప్రయోజనాల కమిటీలో సభ్యుడిగా, జనాభా, ప్రజా ఆరోగ్యంపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ ఫోరంలో సభ్యుడిగా, విలువల కమిటీలో సభ్యుడిగా, బిజినెస్ అడ్వైజరీ కమిటీలో సభ్యుడిగా నియమితులై సేవలు అందించారు. 2009లో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కాన్సులేటివ్ కమిటీతో పాటు, పార్లమెంట్ హౌస్‌లో దేశ నాయకులు, పార్లమెంటేరియన్ల చిత్రపటాలు, విగ్రహాల ఏర్పాటుకు ఉద్దేశించిన కమిటీలో సభ్యుడిగా నియమితులయ్యారు. 2010లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ వరల్డ్ అఫైర్స్‌లో సభ్యుడిగా ఉన్నారు. 2011లో తిరిగి రాజ్యసభకు తిరిగి ఎన్నికయ్యారు. 2012లో వ్యవసాయ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు.



సంస్కరణవాది.. స్థితప్రజ్ఞుడు

ప్రజా ఉద్యమకారుడిగా, సామాజికవేత్తగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, రచయితగా పేరు ప్రఖ్యాతులు

సాక్షి, నేషనల్ డెస్క్/సాక్షి, హైదరాబాద్

బహుభాషావేత్తగా, కాలమిస్ట్‌గా, రాజకీయవేత్తగా, వామపక్షవాదిగా సీతారాం ఏచూరిది సుదీర్ఘ ప్రస్థానం. అటు పార్టీ అగ్రనేతగా కొనసాగుతూనే ఇటు ఎర్రజెండా పట్టుకుని పలు ప్రజా ఉద్యమాల్లో తలమునకలయ్యారు. సమకాలీన భారత రాజకీయాల్లో అత్యంత కీలకమైన వామపక్ష నేతగా కొనసాగారు. తుదిశ్వాస వరకూ బడుగు, బలహీన, అణగారిన వర్గాల కోసం పాటుపడి నిఖార్సయిన కామ్రేడ్‌గా పేరు నిలబెట్టుకున్నారు. అద్భుతమైన వాక్పటిమతో సంప్రదింపులు జరపడంలో దిట్టగా ఏచూరికి పేరుంది.

తెలుగు కుటుంబంలో జననం.. : సీతారాం ఏచూరి 1952, ఆగస్టు 12న చెన్నైలో స్థిరపడిన తెలుగు వాస్తవ్యులు ఏచూరి సర్వేశ్వర సోమయాజి, కల్పకం దంపతులకు జన్మించారు. స్వస్థలం కాకినాడ కాగా బాల్యం అంతా అక్కడే గడిచింది. రామారావుపేటలో ప్రస్తుతం ఏచూరి పేరుతో ఉన్న అపార్టుమెంట్ స్థలంలోనే ఏచూరి కుటుంబ సభ్యుల ఇల్లు ఉండేది. తండ్రి సోమయాజి బదిలీపై విజయవాడ ఆర్టీసీలో ఉన్నతాధికారిగా పనిచేసిన సమయంలో ఆరు, ఏడు తరగతులను ఏచూరి విజయవాడలో చదువుకున్నారు. ఏచూరికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన మోహన్ కందా స్వయానా మేనమామ. చెన్నైలోని మేనమామ ఇంట్లో ఆయన జన్మించారు. హైదరాబాద్ ఆల్ సెయింట్స్‌లో, ఢిల్లీలో హైస్కూల్ విద్యను అభ్యసించారు. సీబీఎస్ఈ పరీక్షల్లో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో బీఏ (ఆనర్స్) ఆర్థిక శాస్త్రం, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ)లో ఆర్థికశాస్త్రంలో ఎంఏ పట్టా పొందారు.



హైదరాబాద్‌లోని ఆల్ సెయింట్స్ స్కూల్‌లో..

మా భుజాలపై తుపాకులు పెట్టి తప్పించుకుంటారా?

తెలంగాణ ఏర్పాటు విషయంలో రాజ్యసభలో చర్చ జరిగినప్పుడు కాంగ్రెస్ పార్టీ నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తోందన్న విమర్శలు వచ్చాయి. కొన్ని పక్షాలు ఒప్పుకోవడం లేదన్న భావనతోకాంగ్రెస్ పార్టీ వ్యవహరించేది. అలాంటి సందర్భంలో తెలంగాణపై జరిగిన చర్చలో సీతారాం ఏచూరి 'తెలంగాణపై ఏ పార్టీ అభిప్రాయాలు ఆ పార్టీకి ఉంటాయి. ఆయా పార్టీల అభిప్రాయాలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందా? తెలంగాణపై మీరేం చేయాలనుకుంటున్నారో అది చేయండి. అంతేగానీ మా భుజాలపై తుపాకులు పెట్టి పేల్చాలనుకోవడం సరికాదు..' అని ఏచూరి కాంగ్రెస్‌కు గట్టి కౌంటర్ ఇచ్చారని పార్టీ నేత జూలకంటి రంగారెడ్డి గుర్తు చేశారు.

సంకీర్ణ ప్రభుత్వాల్లో కీలక పాత్ర..

తన గురు సమానులు హర్‌కిషన్ సింగ్ సుర్జీత్‌లాగా 2004–2014 కాలంలో ఏచూరి సంకీర్ణ ప్రభుత్వాల్లో కీలక భూమిక అయ్యారు. 2004లో ప్రధాని పదవిని సోనియా గాంధీ తిరస్కరించాక నాటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం తర్వాత సోనియా కలిసిన తొలి కాంగ్రెసేతర నేత ఏచూరినే. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో కనీస ఉమ్మడి కార్యాచరణ రూపకల్పనలో కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరంతో కలిసి పనిచేశారు. యూపీఏ ప్రభుత్వాల కాలంలో కాంగ్రెస్‌కు అత్యంత సమ్మదగ్గ నేస్తంగా ఉన్నారు.

నెగ్గిన ఏచూరి బడ్జెట్ సవరణల ప్రతిపాదన..

గతంలో బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయ సభలనుద్దేశించి అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేసిన ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానానికి రాజ్యసభలో ఏచూరి సవరణలు ప్రతిపాదించారు. దీనిపై జరిగిన ఓటింగ్‌లో ఆయన చేసిన సవరణల ప్రతిపాదన నెగ్గింది. రాజ్యసభ చరిత్రలో ఇలా జరగటం కేవలం నాలుగోసారి మాత్రమే.

ఒబామా రాకను వ్యతిరేకించిన సందర్భం..

అమెరికాపై విమర్శలు చేయడంలో ఏచూరికి ఓ ప్రత్యేకత ఉంది. ఇస్లాం ఛాందసవాదం పెరగడానికి అమెరికానే కారణం అంటూ చురుకైన విమర్శలు చేసేవారు. గణతంత్ర వేడుకలకు అప్పటి అమెరికా అధ్యక్షుడు ఒబామా ముఖ్య అతిథిగా రావడాన్ని ఏచూరి వ్యతిరేకించారు. ఇటీవల మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన సీఏఏ, ఎన్ఆర్సీ చట్టాలను, జమ్మూ, కాశ్మీర్‌లో ఆర్టికల్ 370, 35అ రద్దును కూడా ఆయన వ్యతిరేకించారు.

ఇండియా కూటమికి కృషి..

పార్లమెంట్ వేదికగా సామాన్యుల సమస్యలను ఎలుగెత్తి, ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను దునుమాడారు. విపక్షాలను 'ఇండియా' కూటమిగా ఏకతాటి మీదకు తేవడంలో కూడా ఏచూరి పాత్ర కీలకమైంది. లోక్‌సభలో విపక్షనేతగా మోదీ సర్కార్‌ను తూర్పారబడుతున్న రాహుల్‌గాంధీకి రాజకీయ గురువుల్లో ఒకరిగా ఈయనకు పేరుంది.

ఇతర భాషల్లోనూ అనర్గళంగా..

అచ్చ తెలుగు వ్యక్తి అయిన ఏచూరి హిందీ, తమిళం, బెంగాళీ, మలయాళం సైతం అనర్గళంగా మాట్లాడేవారు. హిందూ పురాణాలను ఔపోసన పట్టిన ఏచూరి సందర్భోచితంగా తన ప్రసంగాల్లో వాటిని ఉదహరిస్తూ బీజేపీకి చురకలంటించేవారు. సాంకేతికతను అందిపుచ్చుకుని సామాజిక మాధ్యమాల్లో తరచూ పోస్టులు పెట్టేవారు. ప్రకాశ్‌కారత్ నుంచి పార్టీ పగ్గాలు తీసుకున్న ఏచూరి సౌమ్యంగా ఉంటూనే పార్టీలో కఠిన నిర్ణయాలు తీసుకుంటూ ముక్కుసూటిగా వ్యవహరించే నేతగా పేరొందారు.

మూడుసార్లు ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక

2015లో విశాఖలో జరిగిన సీపీఐ(ఎం) సదస్సులో పార్టీకి ఐదో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2018 ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో జరిగిన సదస్సులో, 2021 కోజికోడ్ మహాసభలోనూ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం అదే హోదాలో ఆయన మృతి చెందారు. ఏచూరి మొదటి భార్య ఇంద్రాణి మజుందార్ కాగా ప్రముఖ జర్నలిస్టు సీమా చిస్తీని రెండో వివాహం చేసుకున్నారు. కుమార్తె అఖిల, ఇద్దరు కుమారులు ఆశిష్, డ్యానిష్ కాగా.. 34 ఏళ్ల పెద్ద కుమారుడు ఆశిష్ 2021లో కోవిడ్‌తో కన్నుమూశారు. అఖిల.. యూనివర్సిటీ ఆఫ్ ఎడెన్‌బర్గ్, యూనివర్సిటీ ఆఫ్ సెయింట్ ఆండ్రూస్‌లో బోధిస్తారు.

అసాధారణ నేత..

- ఏచూరి మరణం తీవ్ర విషాదకరం. విద్యార్థి నేతగా మొదలై జాతీయ రాజకీయాల్లో కీలకంగా మారి పార్లమెంటేరియన్‌గా ఉంటూ ప్రజావాణిని వినిపించిన నేతను కోల్పోవడం విచారకరం. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడుతూనే అన్ని రాజకీయపార్టీల నేతలతో మైత్రి కొనసాగించారు. ఆయన కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. –ద్రౌపదీ ముర్ము, రాష్ట్రపతి
- ఐదు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో దేశ ప్రజాస్వామ్యం పటిష్టతకు ఏచూరి అవిశ్రాంతంగా కృషి చేశారు. ప్రజాసేవలో అలుపెరగక పనిచేశారు. – జగదీప్ ధన్‌ఖడ్, ఉప రాష్ట్రపతి



- వామపక్షాలకు ఏచూరి దారి దీపంగా మారారు. ప్రజా ఉద్యమాలను ముందుండి నడిపించారు. పార్టీలకతీతంగా అందరి నేతలతో కలిసిపోయే సామర్థ్యం ఆయన సొంతం. అలాంటి ఏచూరిని కోల్పోవడం విషాదకరం. పార్లమెంట్ సభ్యునిగా తనదైన ముద్ర వేశారు. ఈ విషాదకాలంలో ఆయన కుటుంబానికి మేమంతా అండగా నిలుస్తాం. – నరేంద్ర మోదీ, ప్రధాన మంత్రి
- ఏచూరి మరణం రాజకీయ రంగానికి తీరని లోటు. ఆయన కుటుంబ సభ్యులకు, పార్టీ నేతలకు నా ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నాను -కేంద్ర హోంమంత్రి, అమిత్ షా
- లౌకిక చాంపియన్ ఏచూరి. దేశ భిన్నత్వాన్ని పరిరక్షించడంలో తన నిబద్ధత చాటారు. 2004–08 ప్రభుత్వంలో కలిసి పనిచేశాం. చిరకాలం కమ్యూనిస్ట్‌గా ఉన్నా ఆయన మూలాలు ప్రజాస్వామ్య విలువల్లో దాగి ఉన్నాయి. – సోనియాగాంధీ, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్



- ఆయన నాకు అత్యంత ఆప్తుడు. దేశాన్ని లోతుగా అర్థం చేసుకున్న నేత. భారతదేశ ఆలోచన (ఐడియా ఆఫ్ ఇండియా)కు రక్షకుడు ఆయన. – రాహుల్ గాంధీ, లోక్‌సభలో విపక్షనేత
- సమకాలీన కమ్యూనిస్టు ఉద్యమాలకు సంబంధించిన అసాధారణ నేతల్లో ఏచూరి ఒకరు. దశాబ్దాల క్రితం ఆయన విద్యార్థి సంఘంలో, నేను ఆలిండియా యూత్ ఫెడరేషన్‌లో పనిచేశాం. ఆయన మరణం ప్రజాస్వామ్య వర్గాలకు తీరని లోటు. -డి.రాజా, సీపీఐ ప్రధాన కార్యదర్శి
- ఏచూరి మరణం భారత కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు. ప్రజా, దేశ సమస్యలు ప్రస్తావించే ఒక గొంతు మూగబోయింది. పార్టీ ప్రధాన కార్యదర్శి అయిన తర్వాత వామపక్షాల ఐక్యతను విస్తృతం, పటిష్టం చేసేందుకు మంచి కృషి చేశారు. – సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి
- కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ, పశ్చిమబెంగాల్, కేరళ సీఎంలు మమతా బెనర్జీ, పినరయి విజయన్, భారత్‌లో చైనా రాయబారి ఫెహోంగ్ తదితరులు ఏచూరి మృతిపై సంతాపం వ్యక్తం చేశారు.
- ఏచూరి పోరాటాలు ఎప్పటికీ స్ఫూర్తి దాయకం. ఆయన మరణం దేశ రాజకీయాలకు తీరని లోటు. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. – ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- సామ్యవాద భావాలు కలిగిన ఏచూరి.. మరణం భారత లౌకిక వాదానికి, కార్మిక లోకానికి తీరని లోటు. శోకతప్తులైన వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. – బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు
- ఏచూరి భారత దేశ రాజకీయాల్లో అత్యంత గౌరవనీయమైన వ్యక్తుల్లో ఒకరు. ఏచూరి మరణం దేశ రాజకీయాలకు తీరనిలోటు. – ఏపీ సీఎం చంద్రబాబు
- **దత్తాత్రేయ, కేంద్ర మంత్రుల సంతాపం..:** ఏచూరి మృతి పట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు డా.కె.లక్ష్మణ్, బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో సంతాపం ప్రకటించారు.
- **ప్రముఖుల సంతాపం..:** శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, అసదుద్దీన్ ఒవైసీ, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, తదితరులు ఏచూరి మరణంపై సంతాపం వ్యక్తం చేశారు.






కాలేజీ రోజుల్లో..



1987లో అప్పటి చైనా అగ్రనేత డెంగ్ సియో పింగ్‌తో..



సీపీఎం అగ్రనేత హరికిషన్ సింగ్ సుర్జీత్‌తో..



కార్ల్‌మార్క్స్ ద్విశతాబ్ది జయంతి ఉత్సవాల్లో మధు, సురవరం, ఏచూరి (ఫైల్)

కామ్రేడ్ ఏచూరి కన్నుమూత

ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతూ ఢిల్లీ ఎయిమ్స్‌లో తుదిశ్వాస

సాక్షి, న్యూఢిల్లీ: ఎర్రజెండా నీడలో ప్రకాశించిన అరుణతార నేల రాలింది. దశాబ్దాలుగా అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడుతూ భారత కమ్యూనిస్టు రాజకీయాలపై చెరగని ముద్రవేసిన వామపక్ష యోధుడు, ప్రజా ఉద్యమకారుడు, సామాజిక వేత్త, కాలమిస్ట్, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి (72) తుదిశ్వాస విడిచారు. న్యుమోనియాతో బాధపడుతూ ఆగస్టు 19వ తేదీన ఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఐసీయూలో చేరిన ఏచూరి ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ తీవ్రమవడంతో రెండురోజుల క్రితం విదేశాల నుంచి మెడిసిన్ తెప్పించారు. అది కూడా ఫలితాన్నివ్వకపోవడంతో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సీతారాం ఏచూరి కన్నుమూసినట్లు ఎయిమ్స్ వైద్య బృందం ప్రకటించింది. ఆయన భౌతికకాయాన్ని ఎయిమ్స్‌కు పరిశోధనల నిమిత్తం దానంగా ఇవ్వనున్నారు. ఏచూరి కోరిక మేరకే ఆయన కుటుంబసభ్యులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏచూరి రెండు వివాహాలు చేసుకున్నారు. మొదటి భార్య పేరు ఇంద్రాణి మజుందార్. రెండో భార్య సీమ చిస్తీ. ఆయనకు కుమార్తె అఖిల, కుమారుడు డానిష్ ఉన్నారు. పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత బుద్ధదేవ్ భట్టాచార్యకు నివాళులర్పిస్తూ ఆగస్టు 22న చివరిసారిగా ఏచూరి ఒక వీడియో సందేశంలో కన్పించారు. 'అనారోగ్యం కారణంగా ఎయిమ్స్ నుంచే మాట్లాడాల్సి వస్తోంది. విప్లవ లాల్ సలామ్‌లు బుద్ధదేవ్ గారికి..' అని ఆ సందేశంలో ఏచూరి అన్నారు. ఏచూరి మరణంతో అటు కమ్యూనిస్టు పార్టీలోనూ, ఇటు కుటుంబసభ్యుల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రియతమ కామ్రేడ్‌ను కోల్పోవడం తీవ్ర విషాదకరమని సీపీఎం పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఏచూరి మృతిపై భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతో పాటు పలువురు కేంద్రమంత్రులు, ప్రముఖులు, పార్టీలకు అతీతంగా రాజకీయ నేతలు తమ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఏచూరి భౌతికకాయాన్ని శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఢిల్లీ వసంత్‌కుంజ్‌లోని ఆయన నివాసానికి తరలించనున్నారు. ప్రముఖులు, పార్టీ నేతలు, కార్యకర్తల నివాళులు, సందర్శనార్థం ఏచూరి పార్థివదేహాన్ని శనివారం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఉంచుతామని సీపీఎం తెలిపింది. సాయంత్రం 5 గంటల తర్వాత ఎయిమ్స్‌కు అప్పగించనున్నారు.



ఢిల్లీలోని సీపీఎం కేంద్ర కార్యాలయంలో ఏచూరికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం అగ్రనేత ప్రకాశ్ కారత్. చిత్రంలో సుభాషిణి అలీ, బీవీ రాఘవులు తదితరులు

పరిశోధనల కోసం పార్థివ దేహం

ఏచూరి పార్థివ దేహాన్ని వైద్య విద్యార్థుల బోధన, పరిశోధనల కోసం దానం చేస్తున్నట్లు ఆయన కుటుంబీకులు అధికారికంగా ప్రకటించారు. పార్థివ దేహాలను పరిశోధనల కోసం దానం చేసే పద్ధతిని కమ్యూనిస్టులు కొంతకాలంగా కొనసాగిస్తున్నారు. ఇదే కోవలో పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం నేత బుద్ధదేవ్ భట్టాచార్య భౌతికకాయాన్ని కూడా దానం చేశారు. ఇలాగే మరికొందరి భౌతికకాయాలను కూడా ఆసుపత్రులకు అప్పగించారు.

నేడు విదేశీ కమ్యూనిస్టు నేతల రాక

ఏచూరి మరణవార్తను తెలుసుకున్న విదేశాలకు చెందిన కమ్యూనిస్టు పార్టీల నేతలు, ఆయనకు నివాళులర్పించేందుకు ఢిల్లీ రానున్నారు. శుక్రవారం చైనా, నార్త్ కొరియా, వియత్నాం, క్యూబా వంటి దేశాల నుంచి నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. మూడురోజుల పాటు ఢిల్లీలోనే ఉండి పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

బడుగు, బలహీన వర్గాలకు తీరని లోటు: తమ్మినేని

ఖమ్మం మయూరి సెంటర్/సాక్షి, హైదరాబాద్: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అభ్యుదయ భావజాలాన్ని ప్రచారం చేశారని, ఆయన మృతి పార్టీకే కాకుండా బడుగు, బలహీన వర్గాల ప్రజలకు, దేశానికి తీరని లోటని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన ఏచూరి సంతాప సభలో ఆయన మాట్లాడారు. నీ ఆశయాల సాధన కోసం కంకణబద్ధులమవుతామని, అదే మా ఆశయం, లక్ష్యం అంటూ ఏచూరికి పార్టీ రాష్ట్ర కమిటీ ఘన నివాళులర్పించింది.



2015లో ఏపీకి ప్రత్యేక హోదాను డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీలో మహాధర్నా చేపట్టినప్పుడు.. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మద్దతు తెలుపుతూ ప్రసంగిస్తున్న దృశ్యం

దేశ ప్రగతి కోసం నిర్విరామంగా చొరవ చూపారు

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

సాక్షి,అమరావతి: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణంపై మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జీవితాంతం వామపక్ష భావాలతో గడిపిన ఆయన, దేశ ప్రగతి కోసం నిర్విరామంగా చొరవ చూపారని పేర్కొన్నారు. ఏపీలోని కాకినాడకు చెందిన సీతారాం ఏచూరి, స్వశక్తితో జాతీయ స్థాయికి ఎదిగారని, విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు కనబర్చారని గుర్తు చేశారు. సీపీఎంలో అత్యున్నత విధాన నిర్ణాయక పొలిట్‌బ్యూరో సభ్యుడిగానూ, పార్టీ ప్రధాన కార్యదర్శిగానూ పనిచేశారని తెలిపారు. ఏచూరి మృతి దేశ రాజకీయాల్లో తీరని లోటని పేర్కొంటూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జయభేరి సంస్థకు 'రెరా' జరిమానా

సాక్షి, హైదరాబాద్: మెజారిటీ కొనుగోలుదారులకు సమాచారం ఇవ్వకుండా క్లబ్‌హౌజ్ నిర్మించిన జయభేరి ప్రాజెక్ట్స్ సంస్థకు తెలంగాణ రియల్ ఎస్టేట్ అథార్టీ (రెరా) రూ. 27.50 లక్షల అపరాధ రుసుము విధించినట్లు ఆ సంస్థ తెలిపింది. జయభేరి ప్రాజెక్ట్స్ పరిధిలోని ట్రెండ్‌సెట్ జయభేరి ప్రాజెక్ట్స్ ఎల్‌ఎల్‌పీ సంస్థ మంజూరైన భవన నిర్మాణ ప్లాన్‌కు విరుద్ధంగా క్లబ్‌హౌజ్ నిర్మించింది. ఫ్లాట్ కొనుగోలుదారుల్లో రెండింట మూడొంతుల మందికి సమాచారం ఇవ్వకుండా క్లబ్‌హౌజ్ నిర్మించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన రెరా చైర్మన్ సత్యనారాయణ, సభ్యులు లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు రూ. 27.50 లక్షల జరిమానా విధిస్తూ ఈనెల 5న తీర్పు చెప్పారు.

సాంకేతికతతో జీవితాల్లో గుణాత్మక మార్పు

రోడ్డు ప్రమాదాలతో ఆర్థిక, సామాజిక వ్యవస్థపై ప్రభావం: మంత్రి శ్రీధర్‌బాబు


జెడ్‌ఎఫ్ లైఫ్‌టెక్ సంస్థ ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: జీవితాల్లో గుణాత్మక మార్పు తేవడమే లక్ష్యంగా సాంకేతికతను ఉపయోగించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాల మూలంగా ఏటా లక్షలాది మంది మరణిస్తున్నారని, ఇది కుటుంబ వ్యవస్థతోపాటు ఆర్థిక, సామాజిక వ్యవస్థలపైనా ప్రభావం చూపుతోందన్నారు. ఈ నేపథ్యంలో వాహనాల తయారీలో భద్రతకు పెద్దపీట వేస్తూ సాంకేతిక ఆవిష్కరణలు, ఉత్పత్తులు అందుబాటులోకి రావాల్సిన అవసరముందని చెప్పారు. హైదరాబాద్‌లో జెడ్‌ఎఫ్ లైఫ్‌టెక్ సంస్థ ఏర్పాటు చేసిన నూతన గ్లోబల్ కేపబులిటీ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం శ్రీధర్‌బాబు సంస్థ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. తెలంగాణలో అద్భుతమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవవనరులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వాహన రంగంలో భద్రతకు సంబంధించి జెడ్‌ఎఫ్ లైఫ్‌టెక్ సంస్థ బలమైన భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకుని ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రానికి పెట్టుబడులతో వచ్చే సంస్థలకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని చెప్పారు. పారిశ్రామిక, పెట్టుబడిదారుల అనుకూల విధానాలు అవలంబిస్తామని చెప్పారు.

భద్రతా ప్రమాణాలు పెంచుతాం

ప్రపంచ ఇంజనీరింగ్ అవసరాలకు అనుగుణంగా నూతనంగా ప్రారంభించిన జెడ్‌ఎఫ్ గ్లోబల్ కేపబుల్ సెంటర్ ద్వారా కార్లు, ఇతర వాహనాల సీటు బెల్టులు, ఎయిర్‌బ్యాగ్‌లు, స్టీరింగ్‌ల్లో అధునాతన సాంకేతికత ద్వారా భద్రతా ప్రమాణాలు పెంచుతామని సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ రుడాల్ఫ్ స్టార్క్ చెప్పారు. వేగంగా వృద్ధి చెందుతున్న భారతీయ మార్కెట్‌తోపాటు ప్రపంచ ఇంజనీరింగ్ అవసరాలు తీర్చే విధంగా తమ సంస్థ కార్యకలాపాలు ఉంటాయన్నారు. సేఫ్టీ టెక్నాలజీలో తమ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ దిగ్గజ సంస్థలతో కలిసి పనిచేస్తామని జెడ్‌ఎఫ్ ఇండియా ప్రెసిడెంట్ ఆకాశ్ పస్సే అన్నారు. సమావేశంలో సంస్థ ఇండియా విభాగం ఈడీ రవికుమార్ తుమ్మలూరుతోపాటు రాష్ట్ర డిప్యూటీ డెవలప్‌మెంట్ కమిషనర్ భవానీ శ్రీ, టీజీఐఐసీ ఎండీ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ఖర్గే సూచన

- అధ్యక్ష ప్రకటన తర్వాత తొలిసారిగా ఢిల్లీ వచ్చిన మహేశ్
- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో భేటీ
- మరికొంతమంది పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్న మహేశ్
- ఉప ఎన్నికలు వస్తే తాము సిద్ధమేనని వ్యాఖ్య


గురువారం ఢిల్లీలో ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్

సాక్షి, న్యూఢిల్లీ: పార్టీ బలోపేతం చేసేందుకు క్షేత్రస్థాయిలోని కార్యకర్త మొదలుకొని సీనియర్ నాయకుల వరకు అందరినీ కలుపుకొని సమన్వయంతో పనిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సూచించారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడిగా నియామకం జరిగిన తర్వాత తొలిసారిగా ఢిల్లీ వచ్చిన మహేశ్ కుమార్ గురువారం ఖర్గేను కుటుంబసమేతంగా కలిశారు. ఈ సందర్భంగా రాబోయే రోజుల్లో పార్టీలో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రణాళికలపై ఖర్గే దిశానిర్దేశం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికలు సవాల్

ఖర్గేతో భేటీ అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో ప్రస్తుతం వచ్చిన స్థానాలకంటే ఎక్కువ సాధించి మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. ప్రజలు నమ్మకంతో తమకు అధికారాన్ని ఇచ్చారని.. అందరం సమన్వయంతో పనిచేస్తున్నామన్నారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక పార్టీ కొత్త కార్యవర్గంపై అధిష్టానంతో చర్చలు జరుపుతానని, కొత్త కమిటీలు ఏర్పాటయ్యేంతవరకు పాత కమిటీలు కొనసాగుతాయని తెలిపారు. కమిటీల్లో అన్ని సామాజిక వర్గాలకు సముచిత ప్రాధాన్యత ఉంటుందన్నారు. పీసీసీ కమిటీల్లో 50 శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయిస్తామని... స్థానిక సంస్థల ఎన్నికలు తమకు ఒక సవాల్ అని మహేశ్ గౌడ్ తెలిపారు. అంతేగాక, రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ గురించి ముఖ్యమంత్రి, ఏఐసీసీ పెద్దలు మాట్లాడారని... త్వరలో వారే నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు.

కేసీఆర్, కేటీఆర్ ఎక్కడ?

రాష్ట్రంలో ఉప ఎన్నికలు వచ్చే ప్రసక్తే లేదని... ఒకవేళ వచ్చినా ఆ స్థానాలు కాంగ్రెస్ ఖాతాలోనే చేరతాయని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించారు. పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు సమయం ఇచ్చిందని... మరికొంతమంది పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వర్షాలతో ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే కేసీఆర్, కేటీఆర్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. కేటీఆర్ సవాళ్లను పట్టించుకునే స్థితిలో లేరని, ప్రజలు బీఆర్‌ఎస్‌కు ప్రతిపక్ష పాత్ర ఇస్తే దాన్ని కూడా సమర్థవంతంగా నిర్వహించే స్థితిలో లేరని విమర్శించారు. బీఆర్‌ఎస్ నాయకత్వంపై నమ్మకం లేకనే ఆ పార్టీ నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని చెప్పారు. అంతేగాక ఉప ఎన్నికలు రాబోవని... ఒకవేళ ఉప ఎన్నికలు వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామని... కాంగ్రెస్ అభ్యర్థులే గెలుస్తారని మహేశ్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కాగా అరికెపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అయినందునే ఆయనకు పీఏసీ చైర్మన్ పదవి ఇచ్చారని తెలిపారు. హైడ్రా కూల్చివేతల్లో ఇల్లు కోల్పోతున్న పేదలకు సీఎం రేవంత్‌రెడ్డి న్యాయం చేస్తారని మహేశ్ గౌడ్ చెప్పారు.

బీఆర్‌ఎస్‌లోనే గాంధీ.. ప్రతిపక్షానికే పీఏసీ

▶ మొదటి పేజీ తరువాయి

అభ్యంతరం చెప్పలేదు. మా సంఖ్య 38 కాదు.. 28 మాత్రమే అని వాళ్లు అనలేదు. అలాంటప్పుడు అనర్హత అనే అంశమే ఇక్కడ తలెత్తదు' అని స్పష్టం చేశారు. పార్టీ పరిస్థితులపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో చర్చించేందుకు ఢిల్లీకి వచ్చిన రేవంత్.. తన అధికార నివాసంలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా అరికెపూడి గాంధీ, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వివాదంతోపాటు పలు అంశాలపై స్పందించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ హయాంలో పీఏసీ ఎంపిక తీరును తప్పుపట్టారు. 'కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 2018 నుంచి 2023 వరకు అక్బరుద్దీన్ ఒవైసీ పీఏసీ చైర్మన్ ఎలా ఉన్నారు. అప్పుడు సంఖ్యాబలం ఎక్కువగా ఉన్న కాంగ్రెస్‌కు పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వాలని అంటే... అది స్పీకర్ విచక్షణాధికారమని బీఆర్‌ఎస్ నేతలన్నారు. 2014లో టీడీపీకి 15 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పుడు టీఏసీ సభ్యులుగా ఎర్రబెల్లి దయాకర్ రావు, రేవంత్‌రెడ్డి పేర్లు ఇస్తే... రేవంత్‌రెడ్డి పేరుకు ప్రత్యామ్నాయం సూచించాలని స్పీకర్ ఎందుకు అన్నారు? ఎర్రబెల్లి పార్టీ మారినప్పుడు నన్ను ఫ్లోర్ లీడర్‌గా గుర్తించాలని చెబితే ఎందుకు గుర్తించలేదు? 2014, 2018లో ఈ విధానాన్ని ప్రారంభించింది మీరే కదా' అని అన్నారు. పీఏసీలో 13 మంది సభ్యులుంటే బీఆర్‌ఎస్ నుంచి ఆరుగురికి, సీపీఐ, ఎంఐఎం, బీజేపీ నుంచి ఒక్కొక్కరికి అవకాశం ఇచ్చి కాంగ్రెస్ నుంచి నలుగురికి మాత్రమే అవకాశం ఇచ్చామని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ సభ్యులు ఎన్నిక కోరలేదు కాబట్టే స్పీకర్ నామినేషన్‌లను పరిశీలించి గాంధీకి అవకాశం కల్పించారని తెలిపారు.

కౌశిక్ వ్యాఖ్యలపై వారంతా క్షమాపణ కోరాలి

కౌశిక్ వ్యాఖ్యలపై స్పందించిన రేవంత్‌రెడ్డి, 'బతకడానికి వచ్చినోళ్లు అంటూ గాంధీని ఉద్దేశించి కౌశిక్‌రెడ్డి వాళ్ల బాస్ చెప్పిందే మాట్లాడారు. కౌశిక్ అలా మాట్లాడొచ్చా లేదా అనేది కేసీఆరే చెప్పాలి. కౌశిక్ వ్యాఖ్యలపై కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సమాధానం చెప్పాలి' అని అన్నారు. బతకడానికి వచ్చిన వాళ్ల ఓట్లు కావాలి కానీ వాళ్లు వద్దా? అని నిలదీసిన ముఖ్యమంత్రి.. వాళ్లు ఓట్లేస్తేనే కదా గ్రేటర్‌లో గెలిచిందని గుర్తుచేశారు. 'బీఆర్‌ఎస్ పెద్దలు మాట్లాడమంటే కౌశిక్ మాట్లాడాడా, లేక ఆయన వ్యక్తిగత వ్యాఖ్యలా అనేది స్పష్టం చేయాలి. వీళ్లు మాట్లాడమంటే బహిరంగంగా క్షమాపణ చెప్పాలి. కౌశిక్ వ్యక్తిగతంగా మాట్లాడితే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి' అని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌ది సైకలాజికల్ గేమ్

ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి హైకోర్టు తీర్పును ప్రస్తావించగా, 'తీర్పును నేను అధ్యయనం చేయలేదు. అది చూస్తేనే దీనిపై మాట్లాడగలను' అని అన్నారు. ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్‌ఎస్ నేతలు అంటున్నారనగా.. 'బీఆర్‌ఎస్ నేతలు సైకలాజికల్ గేమ్ ఆడుతున్నారు. మా పార్టీకి 66 మంది ఎమ్మెల్యేలున్నారు. ఈ 66 మంది ఎమ్మెల్యేలు ఒళ్లు దగ్గర పెట్టుకుంటే ప్రభుత్వానికి ఇబ్బందులేం ఉండవు. ప్రభుత్వాన్ని పడగొడతామన్నందుకే ఈ సమస్యలన్నీ వచ్చాయి. ఈ చర్చలన్నీ బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి ప్రభుత్వాన్ని పడగొడతామని అన్నందుకే చర్చ జరుగుతోంది. ఆ రెండు పార్టీలు కలిసి ఈ ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి లేదని కోర్టు నుంచి ఆర్డర్ తీసుకొస్తే ప్రస్తుత ప్రభుత్వం మరింత పటిష్టంగా ఉన్నట్లే కదా. ఏ ఎమ్మెల్యే అయినా అటూఇటూ దిక్కులు చూస్తే అనర్హత వేటు పడుతుందంటే ఇక ప్రభుత్వానికి ధోకా ఎక్కడుంది' అని అన్నారు. ఇదే అంశంపై మరింత స్పష్టతనిస్తూ 'కోర్టుకెళ్లి అనర్హతలపై ఆర్డర్ తెచ్చామంటున్నారు. బీఆర్‌ఎస్ నేతలు ఏ ఆర్డర్ తెచ్చినా.. ప్రభుత్వంలోని పార్టీకి అడ్వాంటేజ్ అవుతుంది. ప్రభుత్వంలో ఉన్న పార్టీ నుంచి ఎమ్మెల్యేలను లాక్కునే అవకాశమే లేదని చట్ట ప్రకారం నిర్ణయం వస్తే, ప్రతిపక్ష పార్టీలకన్నా, మా పార్టీ వాళ్లమే ఎక్కువ సంతోషిస్తాం. ఎమ్మెల్యేలు ఎక్కడివారక్కడే ఉండాలని బీఆర్‌ఎస్ వాళ్లంటున్నారు. మేమూ అదే కోరుకుంటున్నాం. ఎక్కడివారు అక్కడే ఉంటే నా 66 మంది నాతో ఉంటారు. కేసీఆర్ లక్కీ నంబర్ నా వద్దే ఉంది కదా' అని అన్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని పడగొడతామని తిరిగేకంటే పథకాల అమలు గురించి ప్రశ్నిస్తే బాగుంటుందని సూచించారు. మంత్రివర్గం విస్తరించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించిన తర్వాతే ఎవరిని తీసుకోవాలనే విషయంలో సీఎం పాత్ర వస్తుందని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్రంలో అడ్డగోలుగా 14 వేల మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులిచ్చారని, వీటిని ఫిల్టర్ చేసేలా జర్నలిస్టు సంఘాలే ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

వరద బాధితుల సహాయార్థం కేఎన్‌ఆర్ రూ.2 కోట్ల విరాళం

బంజారాహిల్స్: ఇటీవల సంభవించిన వరదల నేపథ్యంలో నష్టపోయిన ప్రాంతాలకు తనవంతు సహాయంగా కేఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ ఎండీ కామిడి నర్సింహారెడ్డి రూ.2 కోట్ల సహాయాన్ని ప్రకటించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో సంస్థ ఈడీ జలంధర్‌రెడ్డితో కలిసి చెక్కును అందజేశారు.


వరద బాధితుల సహాయార్థం సీఎంకు చెక్ అందజేస్తున్న కామిడి నర్సింహారెడ్డి

కులగణన కోసం 14న సత్యాగ్రహం

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా వెంటనే కులగణన చేసి బీసీలకు న్యాయం చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈనెల 14న హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం ప్రధాన గేటు వద్ద ఓబీసీ సత్యాగ్రహ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. గురువారం ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి.కిరణ్ కుమార్, జాతీయ కార్యదర్శి ఎస్.సాయికిరణ్, రాష్ట్ర అధ్యక్షుడు శివ ముదిరాజ్, అభినేష్‌బొమ్మ ప్రవీణ్ కుమార్ తదితరులు శ్రీనివాస్‌గౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కులగణన చేసి రిజర్వేషన్స్‌పై ఉన్న 50 శాతం సీలింగ్ ఎత్తివేయాలని, బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలని, దేశవ్యాప్తంగా ఓబీసీ నేషనల్ ఫెలోషిప్‌లను 5 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా హైకోర్టు చెప్పిన విధంగా మూడు నెలల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని కులాల గణన చేయాలని కోరారు.

ఎవరయినా మీకు 'సలాం' చేసినప్పుడు మీరు అంతకంటే ఉత్తమరీతిలో జవాబు ఇవ్వండి లేదా కనీసం అదే విధంగానైనా చెప్పండి. నిశ్చయంగా అల్లాహ్ ప్రతిదానికీ లెక్క తీసుకుంటాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 13 సెప్టెంబర్ 2024

ఈ బద్ధకం వదిలేద్దాం!

ఆరోగ్యమే మహాభాగ్యమంటాం. ఆరోగ్యంగా ఉండేందుకు కనీసపాటి శ్రమైనా చేస్తున్నామా? శారీరక శ్రమ, క్రమం తప్పని కదలికల వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని తెలిసినా, భారతీయులు బద్ధకపు జీవనశైలినే అనుసరిస్తున్నారట. క్రియాశీలక జీవనవిధానానికి సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కొన్ని మార్గదర్శకాలు పేర్కొంది. కానీ, మన దేశం నుంచి 20 కోట్ల మంది (15.5 కోట్ల మంది వయోజనులు, 4.5 కోట్ల మంది కౌమార వయస్కులు) వాటిని పాటించడంలో విఫలమవుతున్నారు. డాల్‌బెర్గ్ వారి 'స్టేట్ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఫిజికల్ యాక్టివిటీ' (సాపా) నివేదిక తాజాగా ఈ సంగతి వెల్లడించింది. ఈ నివేదిక ఆందోళన కలిగించడమే కాక, ఆటలు, వ్యాయామం విషయంలో భారతీయులు శ్రద్ధ పెట్టాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది.

నిజానికి, ఇలాంటి జాతీయ స్థాయి సర్వే జరగడం ఇదే తొలిసారి. మేధావుల బృందమైన 'డాల్ బెర్గ్ అడ్వైజర్స్', స్వచ్ఛంద సంస్థ 'స్పోర్ట్స్ అండ్ సొసైటీ యాక్సలరేటర్' సంయుక్తంగా జరిపిన ఈ అధ్యయనం అనేక ఆందోళనకరమైన ధోరణులను వెల్లడించింది. మన దేశంలో వయోజనుల్లోని కాస్తంత పెద్దవారిలో 48 శాతం మంది ఆటల లాంటి శారీరక శ్రమ చేసేందుకు తమ వయసు మీద పడింది అనేస్తున్నారట. ఇంకా చిత్రం ఆటలు ఆడపిల్లలకు సురక్షితం కాదన్న అభిప్రాయంలో 45 శాతం మంది ఉన్నారట. అలాగే, శారీరక శ్రమ చేయడం ఋతుస్రావ మహిళలకు నష్టదాయకమనీ, ఒంటికి దెబ్బలు తగిలితే వివాహ అవకాశాలు దెబ్బ తింటాయనీ, భౌతిక శ్రమ వల్ల పెళ్ళయిన అమ్మాయిలకు గర్భస్రావం అవుతుందనీ... ఇలా రకరకాల దురభిప్రాయాలు నెలకొన్నాయి.

గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో... అలాగే పురుషులతో పోలిస్తే మహిళల్లో శారీరక శ్రమ బాగా తక్కువవడం గమనార్హం. దీనికి కారణాలు లేకపోలేదు. శారీరక శ్రమ చేసేందుకు అనుకూలంగా ఉద్యానాలు, మైదానాల లాంటి బహిరంగ ప్రదేశాలు పట్టణాల్లో కరవై పోయాయి. అందువల్ల గ్రామాలతో పోల్చి చూసినప్పుడు పట్టణాల్లో శారీరక శ్రమ రాహిత్యం రెట్టింపు ఉంటోంది. నగర జనాభా మరీ అతి సున్నితంగా తయారైంది. ఇక, మన భారతీయ మహిళల్లో... నూటికి 75 మందికి రకరకాల ఇంటిపనుల్లోనే సమయమంతా గడిచిపోతుంది. ఫలితంగా వారికి వ్యాయామం చేసేందుకు తీరిక దొరకని పరిస్థితి. ఈ కారణాలన్నీ కలిసి కొంప ముంచుతున్నాయి. జీవనశైలి వ్యాధులకు దారి తీస్తున్నాయి. చాలామంది రోజూ నడుస్తున్నామంటారు. నడక వల్ల ప్రయోజనాలు ఉన్నాయి కానీ, ఆరోగ్యవంతమైన శరీరానికి అదొక్కటే సరిపోదని నిపుణుల ఉవాచ.

తాజా సర్వే ఒక్కటే కాదు... ప్రతిష్ఠాత్మక 'లాన్సెట్' పత్రికలో ఇటీవలే ప్రచురితమైన మరో అధ్యయనం సైతం భారతీయ వయోజనుల్లో నూటికి 50 మంది శారీరకంగా తగినంత శ్రమ చేయట్లేదని పేర్కొంది. అంతంత మాత్రపు శారీరక శ్రమతోనే వయోజనులు సరిపెట్టుకొంటున్న ధోరణి ఉన్నతాదాయాలుండే ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ప్రధానంగా కనిపిస్తోంది. ఆ తరువాత రెండోస్థానంలో దక్షిణాసియా ప్రాంతం నిలిచింది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సహా పలువురు అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం చెబుతున్న మాట. ఆందోళనకరమైన అంశం ఏమిటంటే... మన దేశంలోని వయోజనుల (కనీసం 18 ఏళ్ళు, ఆపైన ఉన్నవారి)లో పెద్దగా శారీరక శ్రమ చేయని సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. 2000 నాటికి అలాంటివారు 22 శాతం పైచిలుకు ఉంటే, 2010 నాటికి వారు 34 శాతం దాకా పెరిగారు. 2022 నాటికి 50 శాతం దాకా చేరారు. ఇలాగే కొనసాగితే... 2030 నాటికల్లా ఇలాంటివాళ్ళు ఏకంగా 60 శాతానికి చేరతారని అంచనా. ఇది శారీరక, మానసిక ఆరోగ్యపరంగానే కాదు... సామాజికంగానూ ప్రమాదఘంటికే!

రోజూ బద్ధకంగా, శారీరక శ్రమ లేకుండా గడిపేస్తుంటే... మధుమేహం, గుండెజబ్బు వచ్చే ముప్పుంది. నిజానికి, ఎంతసేపూ కదలకుండా కూర్చొనే జీవనశైలి, శారీరక శ్రమ అంతకంతకూ తగ్గిపోవడం వల్ల ప్రపంచమంతటా ఈ జబ్బుల బారినపడుతున్నవారు పెరుగుతున్నారు. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలపై భారం పడుతోందని డబ్ల్యూహెచ్ఓ మాట. అంతేకాదు... ఈ బద్ధకపు జీవన విధానం వల్ల మన దేశంలో దాదాపు 25.4 కోట్లమందికి పైగా స్థూలకాయంతో, 18.5 కోట్ల మంది దాకా 'చెడు కొలెస్ట్రాల్'తో బాధపడుతున్నట్టు వెల్లడైంది. ఆరోగ్యానికే కాదు... దేశ ఆర్థిక బలిమికీ శారీరకంగా చురుకుదనం అత్యంత కీలకం. మన దేశ జనాభా మొత్తం శ్రమకు నడుంబిగిస్తే, 2047 నాటికి దేశ స్థూల జాతీయోత్పత్తి రూ. 15 ట్రిలియన్లు దాటిపోతుందని అంచనా. స్థూలకాయం, లాంటి జబ్బులు తగ్గడమే కాదు, వాటి కోసం ఖర్చు చేస్తున్న రూ. 30 ట్రిలియన్లు ఆదా అవుతాయి.

లెక్కతీస్తే, ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు మంది తగిన శారీరక శ్రమ చేయక చెరుపు చేస్తున్నారు, చేసుకుంటున్నారు. ఇక, డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాల్ని బట్టి చూసినా శారీరక శ్రమరాహిత్యం అత్యధికంగా ఉన్న 195 దేశాల్లో భారత్ 12వ స్థానంలో నిలిచిందని 'లాన్సెట్' అధ్యయనం. రోజువారీ వ్యాయామంతో సమయం వృథా అనీ, ర్యాంకుల చదువులతోనే జీవితంలో పైకి వస్తామనీ, ఆటలు అందుకు ఆటంకమనీ భావించే తల్లితండ్రుల ఆలోచనా ధోరణి ఇకనైనా మారాల్సి ఉంది. మనమైనా, మన దేశమైనా పైకి రావాలంటే... మనుషుల శారీరక, మానసిక ఆరోగ్యమే కీలకం. ప్రభుత్వాలు అది గుర్తించి ఆటలతో మేళవించిన విద్యా ప్రణాళికను తప్పనిసరి చేయాలి. పౌరుల కోసం వ్యాయామ కేంద్రాల వసతులూ పెంచాలి. ఎందుకంటే, జీవన సౌందర్యమే కాదు... జగమంతటినీ లక్ష్మీనివాసంగా మార్చే మహత్తూ శ్రమశక్తిదే మరి!

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.దశమి సా.5.31 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** పూర్వాషాఢ సా.6.04 వరకు,తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** రా.1.58 నుండి 3.30 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.05 వరకు, తదుపరి ప.12.22,నుండి 1.10 వరకు, **అమృత ఘడియలు:** ప.1.12 నుండి 2.49 వరకు.

సూర్యోదయం : 5.50
సూర్యాస్తమయం: 6.03
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

మార్క్సిస్టు మేధ... శ్రామిక జనయోధ

భారత రాజకీయ గగనంలో ఉజ్వలతార... విద్యార్థి రాజకీయాల నుంచి అంచెలంచెలుగా ఎదిగి సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగిన నిబద్ధనేత... సీతారాం ఏచూరి. జీవితాంతం కమ్యూనిస్టు ఉద్యమానికే కట్టుబడిన ఈ అచ్చతెలుగు వ్యక్తి ప్రస్థానం గర్వకారణం. ఆయన మరణం మేధా రాజకీయాల్లో పూడ్చలేని అగాధం.

నాకు తెలిసిన 'బాబు'


మోహన్ కందా

అది 1952 ఆగస్టు 12. చెన్నై. నా సోదరి కల్పకం మగ బిడ్డకు జన్మనిచ్చిందనే వార్త వచ్చినప్పుడు నేను నర్సింగ్ హోమ్ వెలుపల మా కారులో కూర్చుని ఉన్నాను. విన్న వెంటనే నా ఆనందానికి అవధులు లేవు. అప్పుడే పుట్టిన నా మేనల్లుడికి హలో చెప్పాలనే ఆత్రంతో పరుగెత్తాను. కొత్త శిశువు రోహిణీ నక్షత్రంలో, అది కూడా కృష్ణాష్టమి రోజున పుట్టాడని చెప్పారు. హిందూ పురాణాలలో, శ్రీకృష్ణుడు తన మామ కంసుడిని వధించిన రోజిది. సంప్రదాయం ప్రకారం నేను వాడిని చూడటానికి లేదా నేరుగా తాకడానికి ముందు, నూనె పాత్రలో శిశువు బొమ్మను నాకు చూపించారు.

బిడ్డను జాగ్రత్తగా చూసుకోవడంలో నేను మా సోదరికి, మా అమ్మకు సహాయం చేసేవాడిని. వాడిని తమ్ముడిలా చూసుకున్నాను. ఒకసారి నా అజాగ్రత్తతో ఒక రాయి మీద పడేశాను. అదృష్టవశాత్తూ, నా నిర్లక్ష్యం నుండి తన భౌతిక, మేధాపరమైన అవయవాలు బతికి బట్టకట్టాయి. వయసులో ఏడేళ్ల పైబడి తేడా ఉన్నా, మేమిద్దరం తోబుట్టువుల లాగానే పెరిగాం. మా అమ్మ తనను ఎంతగా ఇష్టపడేదంటే, నిజానికి నేను చాలాసార్లు అసూయతో రగిలిపోయేవాడిని. సీతారాం (తెలుగు సంప్రదాయం ప్రకారం వాడికి తాత పేరు పెట్టారు) మా అమ్మను అమ్మమ్మ అని కాకుండా అమ్మా అని పిలిచేవాడు. నా తల్లితండ్రులు బాబును ఎంతగానో గారాబం చేసే వారు. ఎంత అమాయకంగా, ముద్దుగా కనిపించే వాడంటే, వాడు చేసిన అల్లరికి నాకు దెబ్బలు పడేవి.

సన్నిహితులు, బంధువులు తనను 'బాబు' అని పిలిచేవారు. రానురాను, అందమైన మంచి యువకుడిగా ఎదిగాడు. ఉల్లాసంగా, మనోహరమైన చిరునవ్వుతో ఎంతో మృదువుగా మాట్లాడేవాడు. మంచి ప్రతిభావంతుడైన టెన్నిస్ ఆటగాడయ్యాడు. అదే సమయంలో పాఠశాల, కళాశాలలో చదువులోనూ రాణించాడు. బాబు ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయంలో చేరినప్పుడే రాజకీయాల్లో కెరీర్‌కు అది నాంది అయింది. అప్పటి విశ్వ విద్యాలయంలో తన సమకాలీనులుగా ఉన్నవారు, ఈనాటికీ ఆ సంగతులు ఎంతో గౌరవంతో, ఆప్యాయతతో స్మరించుకుంటారు.

1975లో ఎమర్జెన్సీ కాలంలో, పోలీసులు వెంటాడుతున్నందువల్ల తను అజ్ఞాతంలో ఉండవలసి వచ్చింది. సహజంగానే, ఆ సమయంలో నేను పోస్టింగ్‌లో ఉన్న కర్నూలులో తను నాతో ఉండాలని మా తల్లితండ్రులు నిర్ణయించారు. నాదైన ఆత్మీయ పద్ధతిలో తనతో తర్కించడానికీ, రాజకీయ కార్యకలాపాలను కొనసాగించకుండా నిరుత్సాహ పరచడానికీ ప్రయత్నించాను. కానీ నా ప్రయత్నంలో నేను విఫలం కావడమే కాదు, తన ప్రభావంతో కమ్యూనిస్ట్‌గా మారకుండా త్రుటిలో తప్పించుకున్నానని చెప్పాలి.

సర్వీస్ నుండి, జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ నుండి పదవీ విరమణ పొందిన తరువాత, నేను హైదరాబాదులో గడిపిన గత పదేళ్లలో, బాబు హైదరాబాద్ పర్యటనల సమయంలో మా ఇంట్లోనే ఉండేవాడు. నాతో, నా భార్య ఉషతో కాలం గడిపేవాడు. మాతో గడిపిన కొద్ది సమయం, సీపీఎం నాయకుడిగా తను ఎదుర్కోవాల్సిన తీవ్రమైన, భారమైన బాధ్యతల నుండి లభించే కాసింత విశ్రాంతి సమయమని అనుకునేవాడిని.

కొన్నేళ్ళ క్రితం తన చిన్న కుమారుడిని విషాదకరమైన రీతిలో కోల్పోయిన తరువాత ఆ దుఃఖాన్ని అధిగమించే విషయంలో, దేశ ప్రజల సంక్షేమం కోసం ప్రాథమిక నిబద్ధత వహించే చాలా మంది గొప్ప వ్యక్తుల మాదిరిగానే స్థిరంగా ఉన్నాడు. అలాగే, దేశం వేగవంతమైన, స్థిరమైన అభివృద్ధిని సాధించడంలో తన నిరంతర పోరాటాన్ని చివరి వరకూ కొనసాగించాడు.

కొడుకుగా, మనవడిగా, తోబుట్టువుగా, భర్తగా, తండ్రిగా, తాతగా మా 'బాబు' ఒక రోల్ మోడల్. ప్రత్యేకించి భారతదేశ తొలి చరిత్రలో చాలా కీలకమైన కాలంలో, ఒక ముఖ్యమైన పార్టీకి నాయకుడిగా తన సహకారం దేశంలోనూ, ప్రపంచంలోని అనేక దేశాలలోనూ గుర్తింపు, ప్రశంసలు పొందింది. 'హిందుస్థాన్ టైమ్స్' దినపత్రికలో పక్షం రోజులకు ఓసారి వచ్చే 'లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్' కాలమ్ ఇక కనపడదు. ఇకపై ఏచూరి కథనాలు ఉండవు. గంభీరస్వరంతో సాహసోపేతంగా, నిబద్ధతతో సాగే అతని ప్రసంగధాటి, అది కలిగించే ఎనలేని విశ్వాసం ఇప్పుడు శాశ్వతంగా మూగపోయాయి. అది బాధాకరం.

సీతారాంను ఆరాధించే, అభిమానించే లక్షలాది మందిలో నేనూ ఒకడిని. దేశంలోనూ, ప్రపంచం నలుమూలల నుండి నా వాట్సాప్‌కు వెల్లువెత్తుతున్న సానుభూతి, దుఃఖం... వారికి తన పట్ల ఉన్న ప్రేమ, ఆప్యాయతలను, అతనిపై వారికి ఉన్న అపారమైన గౌరవాన్ని చూపుతున్నాయి. 'బాబు' ఆత్మకు శాంతి చేకూరాలని ఆ పరమాత్ముడిని ప్రార్థిస్తున్నాను.

వ్యాసకర్త విశ్రాంత ఐఏఎస్ అధికారి, ఏచూరి మేనమామ

అలా వెళ్లిపోయావేం... ఏచూరీ!


తెలకపల్లి రవి

అలా వెళ్లిపోయావేం ఏచూరీ, ఆఖరి ఆశలు కూడా వమ్ముచేసి. తన్నుకొచ్చే దుఃఖాన్ని ఆపలేకపోతోంది మా భౌతికవాద చైతన్యం...

సమకాలీన భారత రాజకీయ రంగంలో అరుదైన ఆణిముత్యం సీతారాం ఏచూరి. పదహారణాల సంప్రదాయ తెలుగు కుటుంబంలో అత్యున్నత విద్యావంతుల ముద్దుబిడ్డగా పుట్టారు. తండ్రి ఎఎస్ సోమయాజులు అధికారి, తల్లి కల్పకం ఉద్యోగిని (కాకినాడలో సామాజిక కార్యక్రమాలకు కన్నతల్లి లాంటి ఆమె మూడేళ్ళ క్రితం కన్నుమూశారు.) మేనమామ ఉమ్మడి ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పదవీ విరమణ చేసిన మోహన్ కందా కాగా మిగిలిన వారిలోనూ ఐఏఎస్‌లే ఎక్కువ. చిన్నప్పటి నుంచి చదువు సంధ్యలలో మిన్న అయిన ఏచూరి కూడా అదే మార్గంలో నడుస్తాడనుకున్నారు. హైదరాబాద్ నిజాం కాలేజీలో చదువుతుండగా తండ్రి ఉద్యోగం కారణంగా కుటుంబం ఢిల్లీకి వెళ్లిపోయింది. అక్కడే చదువుతూ 1970లో సీబీఎస్ఈ 12వ క్లాసులో అఖిల భారత స్థాయిలో ప్రథముడుగా వచ్చారు. అమెరికా పర్యటించే అవకాశం దక్కించుకున్నారు. సెంట్ స్టీఫెన్స్ కాలేజీలో ఎకనామిక్స్‌లో పట్టభద్రుడై ప్రతిష్ఠాత్మక జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో చేరారు. 1974లో అక్కడే ఆయనకు ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు ప్రకాశ్ కరత్‌తో పరిచయమైంది. 1975లో సీపీఎంలో చేరిన ఏచూరి అర్థశాస్త్రంలో అపారమైన ఆసక్తితో పరిశోధన చేయాలనుకున్నా ఎమర్జెన్సీలో అరెస్టయ్యారు. రెండేళ్లలో మూడుసార్లు జేఎన్‌యూ విద్యార్థి సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైనారు. ఇందిరా గాంధీ జేఎన్‌యూ ఛాన్సలర్ హోదాలో ఉండగా, ఆమె నివాసానికి ప్రదర్శనగా వెళ్ళి, ఆమెను నిలబెట్టి అభియోగ పత్రం చదవడమే గాక, ఛాన్సలర్‌గా వుండటం తగదని మొహం మీదనే చెప్పేశారు. మొదట ఆశ్చర్యానికి గురైన ఆమె తర్వాత నిజంగానే ఆ బాధ్యత నుంచి వైదొలగారు. యాభై ఏళ్లపాటు ఏచూరి సాగించబోయే నిబద్ధ, నిశ్చల రాజకీయ ప్రస్థానానికి అది నాందీ ప్రస్తావన.



సీతారాం ఏచూరి (1952-2024)

ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడిగా ఏచూరి 1984 నుంచి 1986లో విజయవాడలో జరిగిన అఖిల భారత మహాసభల దాకా కొనసాగారు. 1985లోనే కలకత్తాలో జరిగిన సీపీఎం మహాసభల్లో కేంద్ర కమిటీ సభ్యుడైనాడు. నంబూద్రిపాద్, హరికిషన్ సింగ్ సూర్జిత్, జ్యోతిబసు, మాకినేని బసవపున్నయ్య వంటి సీనియర్ నాయకులు ఉద్యమాన్ని సమర్థంగా కొనసాగించడం కోసం వ్యూహాత్మకంగానే ఏచూరి, కరత్ వంటి యువనాయకులకు తర్ఫీదునిచ్చారు. తెలుగువాడిగా మాకినేనితోనూ, జాతీయ రాజకీయాల్లో సూర్జిత్‌తోనూ సీతారాం సన్నిహితంగా మెలుగుతూ ఆచరణాత్మక విషయాలూ ఆకళింపు చేసుకున్నారు.

1988లో సీపీఎం కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యుడైన ఏచూరి, 1989లో నేషనల్ ఫ్రంట్ ఏర్పడినప్పుడు సూర్జిత్‌తో పాటు ఆ పరిణామాలలో కీలక పాత్ర వహించారు. 1991లో సోషలిస్టు సోవియట్ విచ్ఛిన్నం పెద్ద ఎదురుదెబ్బగా మారిన తర్వాత కమ్యూనిస్టు ఉద్యమం వుండదనుకునేవారికి కనువిప్పు కలిగేలా భారత దేశంలో మూడు రాష్ట్రాలలో సీపీఎం, వామపక్షాలు గెలుపొందాయి. 1992లో మద్రాసులో జరిగిన సీపీఎం మహాసభలో ఈ సైద్ధాంతిక పరిణామాలపై తీర్మానం ఏచూరి ప్రవేశపెట్టడం, సమాధానమివ్వడం ఆయన ఎదుగుదలకు అద్దం పట్టాయి. అప్పుడే పొలిట్ బ్యూరోలో ప్రవేశించారు.

1992 డిసెంబరులో బాబ్రీ మసీదు విధ్వంసం తర్వాత దేశంలో మత రాజకీయాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఏచూరి కీలకపాత్ర వహించారు. అనేక ప్రామాణిక రచనలు వెలువరించారు. దేవెగౌడ యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ కాలానికి సూర్జిత్, జ్యోతిబసు, చంద్రబాబు, వీపీ సింగ్ వంటివారితో పాటు సీతారాం ఏచూరి కూడా ఒక కీలక పాత్రధారిగా రూపొందారు. ఇదే కాలంలో పొలిట్ బ్యూరో సభ్యుడుగా సీపీఎం పత్రాల విధానాల రూపకల్పనలో తనదైన ముద్ర వేస్తూ, ఉపన్యాసకుడుగా వాటిని దేశమంతటా ప్రజలకూ పార్టీ శ్రేణులకూ వివరిస్తూ సవ్యసాచిలా పనిచేశారు. ఆ క్రమంలోనే 2004లో యూపీఏ ఏర్పాటు, కార్యక్రమ రూపకల్పనలో ముఖ్య భూమిక పోషించారు. ఏపీ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరెడ్డి వంటివారు కూడా ఆ రోజులలో ఏవైనా రాష్ట్రానికి సంబంధించిన సమస్యలను ఆయనతో ప్రత్యేకంగా చర్చించేవారు.

వామపక్ష ఐక్యతలో భాగంగా సోదర పార్టీలతోనూ, లౌకిక పార్టీలతోనూ సంప్రదింపులు జరపడంలో ఏచూరి పట్టువిడుపులకు పేరు పొందారు. ఆ విషయంలో అక్షరాలా సూర్జిత్ వారసుడనే చెప్పాలి. అరుణ్ జైట్లీ, వెంకయ్యనాయుడు వంటి బీజేపీ నేతలు కూడా ఏచూరి ప్రత్యేకతను చెప్పకుండా వుండలేరు. అదే సమయంలో అపారమైన అధ్యయనం, అర్థశాస్త్రంలో పట్టు, ఆధునిక పరిణామాల అవగాహన ఆయనకు రాజకీయ నేతలలో ప్రత్యేక స్థానం తెచ్చిపెట్టాయి. జాతీయంగా ఇంత ఉన్నత స్థాయిలో వ్యవహరించే ఏచూరి సామాన్య కార్యకర్తలతో, ప్రత్యేకంగా యువతతో అలవోకగా కలసిపోయేవారు. ఎక్కడైనా ఏచూరి ప్రవేశించడమే ఏదో ఒక ఛలోక్తితో జరిగేది.

సామాజిక న్యాయం, సాంస్కృతిక రంగాల్లో సీతారాం ఏచూరిని ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అంబేడ్కర్ మాటలను, రాజ్యాంగ స్ఫూర్తిని ప్రస్తావించకుండా మాట్లాడేవారు కాదు. మీడియా మిత్రుడిగా టీవీ డిబేట్లలో కీలకంగా కనిపించిన కొందరు తొలి నేతలలో ఆయనొకరు. సీపీఎం అధికార పత్రిక 'పీపుల్స్ డెమోక్రసీ'కి ఇరవయ్యేళ్లు సంపాదకులుగా వున్నారు. పుష్కరకాలం రాజ్యసభ సభ్యుడిగా వున్న ఏచూరి ప్రసంగాలంటే పాలక పక్షానికి పరీక్షలే. తను ఎదిగిన జేఎన్‌యూపై 2019లో రాజ్యసభలో చర్చ జరిగినపుడు నాటి మంత్రి స్మృతీ ఇరానీకి షేక్స్పియర్ భాషలో ఆయన సమాధానమిచ్చిన తీరు మర్చిపోలేనిది. అందుకే ఏచూరికి ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు కూడా వచ్చింది. ఆయన రచనలు, ప్రసంగాలు అనేకం పుస్తకాలుగా అందుబాటులో ఉన్నాయి. 'ప్రపంచీకరణ యుగంలో సోషలిజం', 'ప్రపంచీకరణలో అర్థశాస్త్రం', 'హిందూరాష్ట్ర', 'లౌకికతత్వం అంటే ఏమిటి?' వంటివి ప్రత్యర్థి పార్టీల వ్యూహాల లోతుపాతులు తెలియాలంటే చదవాల్సిందే. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ ఏచూరి కీలక పాత్రధారిగా మెలిగారు. ఒక దశలో భారత దేశంలో ఐక్యతా ప్రయత్నాల లాగే నేపాల్‌లోనూ కమ్యూనిస్టు గ్రూపులను ఒక వేదిక మీదకు తేవడానికి దోహదం చేశారు. అనేక కారణాల వల్ల వామపక్షాల బలం తగ్గుతున్న పరిస్థితులలో రాజకీయ పోరాటాలలోనూ, ఎన్నికలలోనూ లౌకిక శక్తులను పునరేకీకరణ చేయడానికి సహేతుక ప్రాతిపదిక ఏర్పరచడానికి ఆయన నిరంతరం పనిచేశారు. 2024 ఎన్నికలకు ముందు 'ఇండియా' వేదిక ఏర్పాటు, లోక్‌సభ బలాల పొందిక మార్పు వెనక ఈ కృషి వుంది.

బెంగాలీ, తమిళం, హిందీ, ఇంగ్లీషు వంటి బహు భాషల్లో ధారాళంగా మాట్లాడే ఏచూరి తెలుగు బిడ్డగా తెలుగువారికి మరింత ప్రేమపాత్రులైనారు. ఢిల్లీలో వుండిపోవడం వల్ల సరైన తెలుగు మాట్లాడలేనంటూ మొదలుపెట్టినా అదో ప్రత్యేకమైన మంచి భాష మాట్లాడేవారు. మన రక్తం ఎర్రగా వున్నంతవరకూ ఎర్రజెండా ఎగురుతుంటుందని ఆయన అనే మాటతో చప్పట్లు మోగిపోయేవి. తెలుగు పాటలు కూడా ఇష్టపడేవారు. శాస్త్రీయ సంగీతంలోని ముగ్గురు ప్రముఖులు దక్షిణాది వారే కావడంపై ఆయన కేతు విశ్వనాథరెడ్డి పుస్తకానికి రాసిన ముందుమాటలో ప్రస్తావించారు. దేశభాషలందు తెలుగు లెస్స అన్న పద్యం మూలాలను గురించి చర్చించిన సందర్భం నాకింకా గుర్తుంది. 1980లో ఎస్ఎఫ్ఐ మహాసభల నుంచి అంచెలంచెలుగా ఎదిగిన ఆయన ప్రస్థానం తెలుగువారికి గర్వకారణమే. ఆయన తన కోసం ఏమీ కోరుకోలేదు. తీసుకుపోలేదు. ఆశయాల బాట మిగిల్చివెళ్లారు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

అక్షర లక్షలు... ఆ గీతాలు!

'ఆత్రేయ సాహితి' సంపాదకులు డా॥ జగ్గయ్య – 'సినిమా పాటకు సాహిత్య మందిరంలో పట్టాభిషేకం చేయించిన అపర శ్రీనాథుడు. మనిషికీ, మనసుకీ కొత్త భాష్యాలు పలికిన అక్షర యోగి...' అంటూ ఆత్రేయను ప్రశంసించారు.

'కొమ్మ కొమ్మకో సన్నాయి' అనే స్వీయ వ్యాస సంపుటిలో వేటూరి 'శబ్దాడంబరం లేకుండా నిర్మల గంగా ప్రవాహం లాగ చిరు చిరు అలలతో అగాథాల్ని దాస్తూ... ప్రకటిస్తూ సాగిన సాహితీగంగ ఆత్రేయది' అని మెచ్చుకున్నారు. వెన్నెలకంటి ఆత్రేయను 'సినీ వేమన' అన్నారు. శ్రీశ్రీ తెలుగు కవిత్రయంగా తిక్కన, వేమన, గురజాడలను పేర్కొంటే వారి సరసన సినీరంగం నుంచి ఆత్రేయను చేర్చారు వెన్నెలకంటి! ఆత్రేయ మాటలు పాటలు లాగా, పాటలు మాటలు లాగా వుంటాయనీ, ఆత్రేయ పత్రికల్లో వార్తలా వచనం రాసినా, అది మామ మహదేవన్ స్వరకల్పనలో పాటగా ఒదిగేదనీ నిర్మాత మురారి అంటుండేవారు. అటువంటి ఆత్రేయ పాటల్లో పంక్తులు కొన్ని తెలుగునాట నానుడులుగా, నిత్య సత్యాలుగా, హితోక్తులుగా స్థిర పడిపోయాయి కూడా! అలాంటి ఆణిముత్యాలను కొన్నిటిని ఏరుకుందాం.


ఆత్రేయ

ఆత్రేయకు జనం పెట్టిన పేరు మన'సు' కవి. అది జనం మనసుల్లో ఆయనకు పడిన ముద్ర తప్ప, ఏ సన్మాన సభలోనో, సాహితీ సంస్థో, ప్రభుత్వమో ప్రదానం చేసిన బిరుదు కాదు. ఆత్రేయ మనసు పాటల్లో తరళరత్నం 'ప్రేమనగర్' చిత్రంలోని 'మనసు గతి యింతే/ మనిషి బ్రతుకింతే/ మనసున్న మనిషికి/ సుఖము లేదంతే...' అనే పంక్తులు. అవి విని మురిసిపోయిన దర్శకుడు కె.ఎస్. ప్రకాశరావు ఆత్రేయను మెచ్చుకుంటూనే చిన్న సందేహం వచ్చి 'చివర్లో 'అదంతే' ఎందుకు?' అని అడిగారట. 'అదంతే' అని చిరునవ్వుతో బదులిచ్చారట... మాటల్ని ఆచితూచి ప్రయోగించే అక్షరయోగి ఆత్రేయ.

'ప్రేమలు–పెళ్లిళ్లు' చిత్రంలోని – 'మనసులేని దేవుడు మనిషికెందుకో మనసిచ్చాడు/ మనసు మనసును వంచన చేస్తే/ కనుల కెందుకో నీరిచ్చాడు' అనే పంక్తులు కూడా నిత్యజీవితంలో అందరికీ గుర్తొచ్చే గొప్ప అభివ్యక్తులు. పద క్రీడలతో సార్వకాలిక సత్యాలను వెల్లడించిన ఆత్రేయ 'ఉండడం', 'లేకపోవడం' అనే రెండు పదాలను తీసుకొని అమ్మ గొప్పతనం గురించి ఎంత క్లుప్తంగా, ఆప్తంగా చెప్పారో చూడండి – 'అమ్మ ఉంటే లేనిదేమీ లేదు/ అమ్మ లేక ఏమున్నా ఉన్నది కాదు' (కలసిన మనసులు)! ప్రేమ గురించి 'అది', 'ఇది' అంటూ ఆత్రేయ అంత గోప్యంగా చెప్పిన కవులు అరుదు. 'నువ్వంటే నాకెందుకో ఇంత యిది, ఇంత యిది' (అంతస్తులు); 'ఇదే నన్నమాట – ఇది అదే నన్నమాట/ మది మదిలో లేకుంది – మనసేదో లాగుంది/ అంటే ఇదేనన్నమాట – ఇది అదేనన్న మాట' (కొడుకు–కోడలు).

మరో రెండు వాక్చిత్రాలను కూడా పేర్కొనాలి. అందులో మొదటిది అందరికీ తెలిసిన 'మూగ మనసులు' చిత్రంలో నూతన వధూవరులు, పెద్దల సమక్షంలో కథానాయకుడు గోపి పాడిన 'ముద్ద బంతి పూవులో...' పాటలోని – 'నవ్వినా ఏడ్చినా... కన్నీళ్లే వస్తాయి.' ఇది పది వాక్యాల పెట్టు అని డాక్టర్ సి.నా.రె. వ్యాఖ్యానించిన తర్వాత ఇంకే వివరణ కావాలి?

ఇలా అక్షర లక్షల విలువైన జీవిత సత్యాలను గమనిస్తే ఆత్రేయ... వేమనలా కవి మాత్రమే కాదు– ఒక యోగి కూడా అనిపిస్తారు.

– డా॥ పైడిపాల
సినీ గేయ సాహిత్య పరిశోధకులు | 99891 06162
(నేడు ఆత్రేయ వర్ధంతి: ఈ నెల 22న విజయవాడలో 'అక్షర శిల్పి ఆత్రేయ' పుస్తకావిష్కరణ)

ఎవరిని మభ్యపెట్టాలని ఈ చట్టాలు?

అభిప్రాయం


మాడభూషి శ్రీధర్


కొత్త న్యాయ చట్టాలను తీసుకు వచ్చామని ఆర్భాటంగా ప్రకటించి అమలుకు శ్రీకారం చుట్టిన కేంద్ర ప్రభుత్వం ఒక్క విషయాన్ని స్పష్టం చేయాలి: ఆ చట్టాలను ప్రభుత్వం కొత్తగా రూపొందించిందా లేక పాత చట్టాల నుంచి వివిధ అంశాలను స్వీకరించిందా? ఎందుకంటే పేరుకు కొత్త చట్టాలే కాని వీటిలో అధిక భాగాలు పాత చట్టాల నుంచి కాపీ కొట్టినవేనని న్యాయశాస్త్ర కోవిదులు చాలా మంది ప్రకటిస్తున్నారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ తరుణబ్ ఖైతాన్ ఈ చట్టాలను 'టర్న్ ఇట్ ఇన్' అనే టెక్నాలజీని ఉపయోగించి పరిశీలించినప్పుడు బయటపడిన అంశాలు ఈ సందర్భంగా గమనార్హం.

1. భారతీయ న్యాయ సంహిత –2023లోని 83 శాతం అంశాలు ఇండియన్ పీనల్ కోడ్ 1860 (పాత బ్రిటిష్ చట్టం) నుంచి కాపీ, పేస్ట్ చేసిందే. 2. భారతీయ నాగరిక సురక్ష సంహిత– 2023ను అంతకు ముందున్న కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్–1973 నుండి 82 శాతం తీసుకున్నదే. 3. భారతీయ సాక్ష్య చట్టం–2023 అంతకుముందు అమలులో ఉన్న ఇండియన్ ఎవిడెన్స్ చట్టం–1872 నుంచి 82 శాతం మక్కికి మక్కీ కాపీ కొట్టినదే.

ఈ సందర్భంగా కాపీ కొట్టడం గురించి కొంత వివరణ చూద్దాం. నల్సార్ యూనివర్సిటీలో నేను పనిచేస్తున్నప్పుడు వేపా పార్థసారథి (వీపీ సారథి) అనే అద్భుతమైన ప్రొఫెసర్ ఉండేవారు. ఆయన సాక్ష్య చట్టంలో ప్రముఖ నిపుణుడు. మొత్తం చట్టం ఒక్కో అక్షరం, పదం, కామా, ఫుల్‌స్టాప్ వంటి అర్థాలను చక్కగా వివరించేవారు.

ఓసారి జడ్జీలకు క్లాస్ చెబుతున్నారు. 'సాక్ష్య చట్టంలో ఇలా ఉంది సార్' అని ఓ వ్యాఖ్యానం ప్రతిపాదించారు ఓ జడ్జిగారు. వారు చాలా బాగా అధ్యయనం చేసిన జడ్జిగారు. అప్పుడు సారథిగారు 'మీరు ఈ కామా గురించి చూడాలి. అందువల్ల దాని అర్థం మారిపోతుంది' అని వివరించడంతో జడ్జి అవాక్కయ్యారు. అంత సునిశితంగా పరిశీలించే సారథిగారు మన పాత నేర చట్టాలపై తన అభిప్రాయాన్ని 'పాతదే అయినా మన సాక్ష్య చట్టాన్ని 90 శాతం సవరించాల్సిన అవసరం లేదు, కొన్ని మంచి సంస్కరణల అవసరం ఉంది' అని కుండబద్దలు కొట్టారు. ప్రతి

ఇవీ మన కొత్త చట్టాలు-7



పాతాన్నీ సున్నితమైన హాస్యంతో కలిపి అద్భుతంగా క్రిమినల్ లా సూత్రాలను చెప్పేవారాయన.

ఆయన కాపీ కొట్టే విషయంలో ఒక జోక్ చెప్పేవారు. ఓ విద్యార్థికి ఓ అంశం మీద 5 పేజీల వ్యాసం రాయాలని పరీక్ష పెట్టారు. ఆ విద్యార్థి ఎవరిదో పరిశోధనాపత్రంలోని విషయాలను చక్కగా దించేశాడు. కానీ పరిశోధనా పత్రం రాసిన స్కాలర్ పేరును మాత్రం ఎక్కడా పేర్కొనలేదు. అయితే ఆ పరీక్ష పేపర్ దిద్దుతున్న ప్రొఫెసర్ అది తన వ్యాసాన్ని కాపీ కొట్టి రాసిన జవాబుగా గుర్తించారు. ప్రశ్నకు 10 మార్కులకు గాను 8 మార్కులు ఇచ్చారు. విద్యార్థి 'సార్ నేను ఫెయిల్ అవుతాననుకున్నాను. మీరు 8 మార్కులు ఇచ్చారే ఆశ్చర్యం' అన్నాడా విద్యార్థి క్లాసులో. అందుకు 'నిజమే, అప్పట్లో మా ప్రొఫెసర్ నే రాసిన ఈ జవాబుకు చాలా తక్కువగా 4 మార్కులే ఇచ్చారు. ఇప్పటికీ నేనే కరెక్టు రాశానని నా నమ్మకం. అదే రాసిన నీకు నేను 8 మార్కులు ఇచ్చాను' అన్నారట ప్రొఫెసర్. దీంతో విద్యార్థి నోరెళ్ల బెట్టాడట. అటువంటి పార్థసారథిగారు ఇప్పుడు జీవించి లేరు. కానీ, ఆయన అభిప్రాయాలు మాత్రం నిలిచే ఉన్నాయి.

ఇండియన్ ఎవిడెన్స్ చట్టాన్ని సవరించాల్సిన అవసరం లేనే లేదనీ, ఒకవేళ ఎవరైనా మార్చితే దాన్ని ప్రభుత్వాలు దుర్మార్గం చేయడానికే వాడతాయనీ ఆయన అనేవారు. ఎవిడెన్స్ చట్టాన్ని నేను కూడా బోధించే వాడిని. అందుకే నేను కొన్ని మార్పులు, సూచనలు చేశాను. సారథిగారు ఒక రోజంతా చదివి ఆలోచించి, మరునాడు నల్సార్‌లో నా గదికి వచ్చి, 'మీరన్నది కరెక్టే, కొన్ని మార్పులు చేయడం అవసరమే' అని ఒప్పుకోవడమే కాకుండా, తరువాత వచ్చే ఎడిషన్‌లో 'ప్రొఫెసర్ శ్రీధర్ సలహా ఇచ్చారు' అని ముందుమాటలో నా పేరు రాశారు. ఎంత గొప్పవ్యక్తి ఆయన! ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, ఒకరి అభిప్రాయమో, లేక పుస్తకం, వ్యాసాల్లో ఉన్న విషయాలనో మనం ఉపయోగించి ఏమైనా రాసేటప్పుడు తప్పనిసరిగా సోర్స్‌ను ఉటంకించడం కనీస ధర్మం. ప్రొఫెసర్ పార్థసారథి చేసింది అదే. ఇంగితం ఉన్న ఎవరైనా చేయాల్సిందీ అదే!

పాత బ్రిటిష్ కాలపు క్రిమినల్ చట్టాలను పూర్తిగా సంస్కరించుకునే బంగారంలాంటి అవకాశాన్ని ప్రభుత్వం, పార్లమెంట్, ఎంపీలు పూర్తిగా వదిలేసుకున్నారని మా నల్సార్ విశ్వవిద్యాలయం విద్యార్థి... ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న 'నేషనల్ లా యూనివర్సిటీ' ప్రొ॥ అనూప్ సురేంద్రనాథ్ కూడా అభిప్రాయం వ్యక్తం చేశారు. దీన్నిబట్టి ఏమర్థమవుతోంది? ఎవరిని మభ్యపెట్టడానికి ఈ కొత్త నేర చట్టాలు?

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా'లో ప్రొఫెసర్

మీరు చైల్డ్ పోర్నోగ్రఫీ చూశారు!

- బెదిరింపులతో బురిడీ కొట్టించేందుకు సైబర్ నేరగాళ్ల యత్నాలు
- మోసపోవద్దంటున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) పేరిట వచ్చే తప్పుడు లేఖలు, నోటీసులు నమ్మి మోసపోవద్దని ఐ4సీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. 'మీరు చైల్డ్ పోర్నోగ్రఫీ చూశారు..ఇది సైబర్ నేరం కిందకు వస్తుంది..మీరు వెంటనే మా నోటీసులకు స్పందించకపోతే జైలుకు వెళ్లాల్సి వస్తుంది..'అని ఐ4సీ (ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్) సీఈఓ పేరిట సైబర్ నేరగాళ్లు నకిలీ నోటీసులు పంపుతున్నారు. మీరు చైల్డ్ పోర్న్ వీడియోలు చూసినట్టుగా మీ ఐపీ అడ్రస్ మా దగ్గర ఉందంటూ బెదిరిస్తున్నారు. విషయం తెలియక, ఈ బెదిరింపులకు హడలిపోయి ఎవరైనా వారిని సంప్రదిస్తే అప్పుడు అసలు మోసానికి తెరతీస్తున్నారు. కేసు నమోదు కాకుండా చూడాలంటే సూచించిన బ్యాంకు ఖాతాలకు డబ్బులు పంపాలని సైబర్ నేరగాళ్లు డిమాండ్ చేస్తున్నారు. ఇవి అచ్చంగా నిజమైన అధికారుల నుంచే వచ్చినట్టుగా నమ్మించేలా ఈ నోటీసులను తయారు చేస్తున్నారు. ఇందులో సీబీఐ, ఇంటెలిజెన్స్ బ్యూరోల లోగోలు, అధికారుల పేరిట సంతకాలు, వాటి కింద స్టాంప్‌లు సైతం ఉంటున్నాయి. పోక్సో, ఐటీ చట్టాల కింద కేసులు నమోదు చేస్తామంటూ ఆ నోటీసులలో పేర్కొంటున్నారు. ఇలా అచ్చంగా నిజమైనవిగా భ్రమింపజేసే నోటీసులతో సైబర్ నేరగాళ్లు బెదిరింపులకు పాల్పడుతున్నట్టు ఐ4సీ అధికారులు వెల్లడించారు. అలాంటి లేఖలు, నోటీసులన్నీ ఫేక్ అని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇలాంటి నోటీసులకు స్పందించవద్దని, నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు.

17ను విమోచన దినంగా నిర్వహించాలి

బీజేఎల్పీ డిమాండ్

- వరద ప్రభావిత ప్రాంతాల్లో రైతులకు ఆర్థిక సాయం చేయాలి
- రైతు భరోసా, పూర్తి రుణమాఫీ డిమాండ్‌పై 20న రైతు దీక్ష


బీజేఎల్పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఏలేటి, డీకే అరుణ, ఈటల, ధర్మపురి అర్వింద్, విశ్వేశ్వరరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినంగా అధికారికంగా నిర్వహించాలని బీజేపీ శాసనసభాపక్ష సమావేశం డిమాండ్ చేసింది. రైతు భరోసా, రుణ మాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న బీజేఎల్పీ ఆధ్వర్యంలో రైతు దీక్ష చేపట్టాలని నిర్ణయించింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను స్పీకర్ తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేసింది. గురువారం అసెంబ్లీ ఆవరణలోని బీజేఎల్పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వివిధ అంశాలతో పాటు రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపైనా చర్చించారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీలు డా.కె. లక్ష్మణ్, ఈటల రాజేందర్, అర్వింద్, డీకే అరుణ, గోడెం నగేశ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, కాటిపల్లి వెంకట రమణారెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, డా.పాల్వాయి హరీశ్‌బాబు, రామారావు పాటిల్, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, అర్హులకు రైతు రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వాలని, అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధిత రైతులకు ఆర్థిక సహాయం అందించాలని, 'హైడ్రా' నిష్పక్షపాతంగా వ్యవహరించాలనే డిమాండ్లను ఈ సమావేశం ప్రభుత్వం ఎదుట పెట్టింది. దీంతో పాటు పార్టీపరంగా వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, దేవాలయ భూముల రక్షణకు పోరాడాలని, బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

వరద నిధుల వ్యయంపై శ్వేతపత్రం: ఏలేటి డిమాండ్

వరద నష్టానికి సంబంధించి ఇప్పటివరకు చేసిన పనులు, ఖర్చు చేసిన నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. వరద సహాయంపై కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం బద్నాం చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. బీజేఎల్పీ భేటీ అనంతరం ఎంపీ అర్వింద్ మీడియాతో మాట్లాడుతూ కేంద్రం వరద సహాయం చేయడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. కాగా, అరికెపూడి గాంధీకి పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. వలసదారుడు, పార్టీ ఫిరాయించిన వ్యక్తికి ఆ పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. హైడ్రా అధికారులు పాతబస్తీకి వెళ్లడానికి భయపడుతున్నారని, మూసీ నది పక్కన ఉన్న అక్రమ నిర్మాణాలను దమ్ముంటే కూల్చాలని అన్నారు.

మహిళా పీఈటీ అకృత్యం

విద్యార్థినులు స్నానాలు చేస్తుండగా వీడియో రికార్డింగ్

- నెలసరి సమయంలోనూ ప్రార్థనకు రావాలని వేధింపులు... విసిగిపోయి రోడ్డెక్కిన గిరిజన గురుకుల విద్యార్థినులు
- గురుకులాన్ని పరిశీలించిన కలెక్టర్
- పీఈటీ జ్యోత్స్న సస్పెన్షన్, కేసు నమోదు


సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిపై బైఠాయించిన గిరిజన విద్యార్థినులు

తంగళ్లపల్లి (సిరిసిల్ల): క్రమశిక్షణ పేరుతో వ్యాయామ ఉపాధ్యాయురాలు (పీఈటీ) విద్యార్థినులపై కర్కశంగా వ్యవహరించిన ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో చోటుచేసుకుంది. తమను పీఈటీ జ్యోత్స్న బారి నుంచి రక్షించాలని కోరుతూ విద్యార్థినులు గురువారం తెల్లవారుజామున 5 గంటలకు పాఠశాల గోడదూకి సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిపై బైఠాయించారు. తమను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్న పీఈటీని వెంటనే విధుల నుంచి తొలగించాలని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం విద్యార్థినులు మీడియాకు తమగోడు వెళ్లబోసుకుంటూ.. ఐదేళ్లుగా గిరిజన గురుకులంలో పీఈటీగా పనిచేస్తున్న జ్యోత్స్న బదిలీ అయినప్పటికీ కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకుని ఇక్కడే కొనసాగుతోందన్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ.. విద్యార్థినులను బూతులు తిడుతూ దాడి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఇద్దరు బాలికలకు నెలసరి రావడంతో బాత్‌రూమ్‌లలో స్నానం చేస్తుండగా ప్రార్థన సమయంలో ఎందుకు స్నానాలు చేస్తున్నారని ఆగ్రహంతో బాత్‌రూమ్‌ల తలుపులు పగులగొట్టి స్నానం చేస్తుండగా తన ఫోన్‌లో వీడియో తీయడంతోపాటు కర్ర తో చితకబాదారని బాలికలు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినుల ఆందోళన విషయం తెలుసుకున్న సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, తంగళ్లపల్లి ఎస్సై డి.సుధాకర్ అక్కడికి చేరుకొని వారితో మాట్లాడి ధర్నాను విరమింపజేయగా.. బాలికలు మరోసారి పాఠశాల గేటు ఎదుట ఆందోళనకు దిగారు. పలు విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల వద్దకు చేరుకుని బాలికలకు మద్దతుగా నిలిచారు.

రంగంలోకి కలెక్టర్.. పీఈటీ సస్పెన్షన్

గిరిజన బాలికల ఆందోళన గురించి తెలుసుకున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా హుటాహుటిన గురుకుల పాఠశాలకు చేరుకున్నారు. జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్‌తో మాట్లాడి అప్పటికప్పుడు పీఈటీ జ్యోత్స్నను విధుల నుంచి తొలగించారు. పీఈటీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సీఐ మొగిలిని ఆదేశించారు. విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ పద్మను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పీఈటీ జ్యోత్స్నపై కేసు నమోదైంది.

కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

కాల్వశ్రీరాంపూర్ (పెద్దపల్లి): విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువు దారితప్పడంతో దేహశుద్ధి చేసిన ఘటన గురువారం పెద్దపల్లి జిల్లాలో జరిగింది. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఓ జెడ్పీ హైస్కూల్లో కొంతకాలంగా ఇద్దరు ఉపాధ్యాయులు బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తుండటంతో వారు తమ తల్లిదండ్రులకు మొరపెట్టుకున్నారు. దీంతో కోపోద్రిక్తులైన తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి ఓ ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసి హెచ్చరించి వదిలిపెట్టారు. మరో ఉపాధ్యాయుడు విధులకు గైర్హాజరు కావడంతో దాడి నుంచి తప్పించుకోగలిగాడు. ఈ విషయమై హెచ్ఎంను వివరణ కోరగా, ఇద్దరు ఉపాధ్యాయులు అసభ్యంగా ప్రవర్తిస్తున్న విషయాన్ని విద్యార్థినులు తన దృష్టికి తీసుకురావడంతో మందలించానని, అయినా వారు ప్రవర్తన మార్చుకోకపోవడంతో విషయం తల్లిదండ్రుల దృష్టికి వెళ్లిందన్నారు. ఇద్దరు ఉపాధ్యాయుల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు.



ఏపీ సీఎం చంద్రబాబుతో ఉత్తమ్ దంపతుల భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడకు వెళ్లిన ఉత్తమ్ దంపతులు గురువారం ఏపీ సీఎంను ఆయన నివాసంలో కలిసి నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినందుకు అభినందనలు తెలిపారు.

బీపాస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భవన నిర్మాణాల అనుమతి (టీజీ బీపాస్) దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి ఎం. దానకిషోర్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో గురువారం ఆయన టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీ బీపాస్ దరఖాస్తుల పరిష్కార పురోగతిని ఆయా కార్పొరేషన్లు, పట్టణాభివృద్ధి సంస్థల వారీగా అడిగి తెలుసుకున్నారు. టీజీ బీపాస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. దరఖాస్తుదారులు ఏమైనా డాక్యుమెంట్లను జతచేయకపోతే ఆ విషయాన్ని వారికి తెలియజేసి, తిరిగి పూర్తిస్థాయి పత్రాలతో దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. ఈ సంవత్సరం జనవరి నుంచి ఇప్పటి వరకూ టీజీ బీపాస్ కింద హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీలకు వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కార ప్రగతిపై నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ఇకనుంచి ప్రతి శనివారం టీజీ బీపాస్ దరఖాస్తుల పరిష్కార ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీటీసీపీ దేవేందర్‌రెడ్డి, హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్లు విద్యాధర్, రాజేంద్రప్రసాద్ నాయక్, జీహెచ్ఎంసీ చీఫ్ సిటీప్లానర్ శ్రీనివాస్, ప్లానింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.







స్పేస్‌వాక్ కోసం క్యాప్సూల్ నుంచి బయటికొస్తున్న జేర్డ్ ఐజాక్‌మాన్

మొట్టమొదటి ప్రైవేట్ స్పేస్‌వాక్

రికార్డుకెక్కిన బిలియనీర్ జేర్డ్ ఐజాక్‌మాన్ • స్పేస్‌ఎక్స్ సంస్థ మరో ఘనత

కేప్ కెనావెరాల్: ప్రైవేట్ అంతరిక్ష నౌకలో నింగిలోకి వెళ్లి, స్పేస్‌వాక్ చేసిన మొట్టమొదటి నాన్-ప్రొఫెషనల్ వ్యోమగామిగా బిలియనీర్, టెక్నాలజీ వ్యాపారవేత్త జేర్డ్ ఐజాక్‌మాన్(41) రికార్డు సృష్టించారు. గురువారం భూమి నుంచి దాదాపు 1,400 కిలోమీటర్ల ఎగువన 'డ్రాగన్' స్పేస్ క్యాప్సూల్ నుంచి బయటకు వచ్చి, దాదాపు 15 నిమిషాల పాటు అంతరిక్షంలో విహరించారు. అక్కడి నుంచి భూగోళాన్ని తిలకించారు. పరిపూర్ణమైన ప్రపంచాన్ని కళ్లారా దర్శించానని ఆయన పేర్కొన్నారు. ఐజాక్‌మాన్ తర్వాత స్పేస్‌ఎక్స్ ఇంజనీర్ సారా గిల్లిస్ స్పేస్‌వాక్ చేశారు. అనంతరం మరో ఇద్దరు డ్రాగన్ క్యాప్సూల్ నుంచి బయటికొచ్చి అంతరిక్ష నడకలో పాల్గొన్నారు. స్పేస్‌ఎక్స్ తలపెట్టిన 'పోలారిస్ డాన్' ప్రాజెక్టులో భాగంగా ఫాల్కన్-9 రాకెట్ ద్వారా మంగళవారం ఐజాక్‌మాన్ సహా మొత్తం నలుగురు అమెరికాలోని ఫ్లోరిడా నుంచి అంతరిక్షంలోకి బయలుదేరారు. గురువారం తమ లక్ష్యాన్ని పూర్తిచేశారు. ఇప్పటి దాకా ప్రొఫెషనల్ వ్యోమగాములకు మాత్రమే పరిమితమైన స్పేస్‌వాక్‌ను సామాన్యులకు సైతం అందుబాటులోకి తీసుకురావడానికి స్పేస్‌ఎక్స్ సంస్థ వ్యాపారాత్మకంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో ఎలాన్ మస్క్‌తోపాటు ఐజాక్‌మాన్ భారీగా పెట్టుబడి పెట్టారు. ఆయన పెట్టుబడి ఎంత అనేది బహిర్గతం చేయలేదు. భవిష్యత్తులో ఇలాంటి ప్రైవేట్ అంతరిక్ష యాత్రలు ఊపందుకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి.



స్పేస్‌వాక్ కోసం క్యాప్సూల్ నుంచి బయటికొస్తున్న సారా గిల్లిస్

రాజీనామాకైనా సిద్ధం

బెంగాల్ ప్రజలకు అసౌకర్యం కలుగకూడదు

న్యాయం జరగాలనేదే నా అభిమతం: మమత

- చర్చల ప్రత్యక్షప్రసారానికి జూనియర్ డాక్టర్ల పట్టు
- సచివాలయానికి చేరుకొని.. లోనికి వెళ్లేందుకు నిరాకరణ
- ప్రత్యక్షప్రసారానికి న్యాయపరమైన అడ్డంకులు ఉన్నాయన్న సర్కారు
- రెండు గంటలు వేచిచూసిన మమత
- పట్టువీడని జూడాలు.. జరగని చర్చలు
- కొనసాగుతున్న ప్రతిష్టంభన

కోల్‌కతా: బెంగాల్ ప్రజల కోసం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. వైద్యురాలికి న్యాయం జరగాలని తాను కూడా కోరుకుంటున్నానని తెలిపారు. 'వైద్యుల సమ్మెపై ప్రతిష్టంభన ఈ రోజుతో తొలగిపోతుందని ఆశించిన బెంగాల్ ప్రజలకు క్షమాపణ చెబుతున్నాను. జూనియర్ డాక్టర్లు నబన్నా (సచివాలయం)కు వచ్చి కూడా చర్చలకు కూర్చోలేదు. తిరిగి విధులకు వెళ్లాలని నేను వారికి విజ్ఞప్తి చేస్తున్నా' అని మమత గురువారం విలేకరుల సమావేశంలో అన్నారు. 'సదుద్దేశంతో గత మూడురోజులుగా ఎన్ని ప్రయత్నాలు చేసినా మెడికోలు చర్చలకు నిరాకరించారు' అని సీఎం అన్నారు. 'ప్రజల కోసం నేను రాజీనామా చేసేందుకు సిద్ధం. కానీ ఇది పద్ధతి కాదు. గడిచిన 33 రోజులుగా ఎన్నో అభాండాలను, అవమానాలను భరించాం. రోగుల అవస్థలను దృష్టిలో పెట్టుకొని మానవతా దృక్పథంతో చర్చలకు వస్తారని భావించా' అని మమత పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించినా.. తమ ప్రభుత్వం జూనియర్ డాక్టర్లపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోబోదని హామీ ఇచ్చారు. ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీలో ఆగస్టు 9న పీజీ ట్రైనీ డాక్టర్ హత్యాచారంతో జూనియర్ డాక్టర్లు నిరసనలకు దిగిన విషయం తెలిసిందే. నెలరోజులకు పైగా వీరు విధులను బహిష్కరిస్తున్నారు. సెప్టెంబరు 10న సాయంత్రం 5 గంటల్లోగా విధుల్లో చేరాలని సుప్రీంకోర్టు జారీచేసిన ఆదేశాలను బేఖాతరు చేశారు. మమత సమక్షంలో చర్చలకు జూడాలు డిమాండ్ చేయగా.. బెంగాల్ ప్రభుత్వం దానికి అంగీకరించి వారిని గురువారం సాయంత్రం 5 గంటలకు చర్చల కోసం నబన్నాకు రావాల్సిందిగా ఆహ్వానించింది. అయితే ప్రత్యక్షప్రసారం ఉండాలనే జూడాల డిమాండ్‌ను ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో చర్చలు జరగలేదు.



వైద్యుల కోసం ఎదురుచూస్తున్న మమత

రెండుగంటలు వేచిచూశా

సమ్మె చేస్తున్న డాక్టర్లను కలవడానికి రెండు గంటల పాటు సచివాలయంలో వేచిచూశానని, వారి నుంచి ఎలాంటి ప్రతిస్పందన రాలేదని మమత అన్నారు. గురువారం సాయంత్రం 5:25 గంటలకు సచివాలయానికి చేరుకున్న డాక్టర్లు ప్రత్యక్షప్రసారానికి పట్టుబట్టి బయటే ఉండిపోయారు. ప్రత్యక్ష ప్రసారం డిమాండ్‌కు తాము సానుకూలమే అయినప్పటికీ హత్యాచారం కేసు కోర్టులో ఉన్నందువల్ల న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయనే.. చర్చల రికార్డింగ్‌కు ఏర్పాట్లు చేశామని మమత వివరించారు. 'పారదర్శకత ఉండాలని, చర్చల ప్రక్రియ పక్కాగా అధికారిక పత్రాల్లో నమోదు కావాలనే రికార్డింగ్ ఏర్పాటు చేశాం. సుప్రీంకోర్టు అనుమతిస్తే జూడాలతో వీడియో రికార్డును పంచుకోవడానికి కూడా సిద్ధం పడ్డాం' అని మమత చెప్పుకొచ్చారు. రహస్య పత్రాలపై ఇలా బాహటంగా చర్చించలేమన్నారు. గడిచిన నెలరోజుల్లో వైద్యసేవలు అందక రాష్ట్రంలో 27 మంది చనిపోయారని, 7 లక్షల మంది రోగులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. '15 మందితో కూడిన ప్రతినిధి బృందాన్ని చర్చలకు పిలిచాం. కానీ 34 మంది వచ్చారు. అయినా చర్చలకు సిద్ధపడ్డాం. చర్చలు సాఫీగా జరగాలనే ఉద్దేశంతోనే వైద్యశాఖ ఉన్నతాధికారులెవరినీ పిలువలేదు (వైద్యశాఖ కీలక అధికారుల రాజీనామాకు జూడాలు డిమాండ్ చేస్తున్నారు)' అని మమతా బెనర్జీ అన్నారు. నబన్నాకు చేరుకున్న జూనియర్ డాక్టర్లను ఒప్పించడానికి ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్, డీజీపీ రాజీవ్ కుమార్‌లు తీవ్రంగా ప్రయత్నించారు. ముమ్మర సంప్రదింపులు జరిపారు. అయినా జూడాలు తమ డిమాండ్‌పై వెనక్కితగ్గలేదు. ప్రభుత్వం జూడాలను చర్చలకు పిలవడం రెండురోజుల్లో ఇది మూడోసారి.

రాజకీయ ప్రేరేపితం

చర్చలు జరపాలని తాము చిత్తశుద్ధితో ఉన్నామని, అయితే డాక్టర్ల ఆందోళనలు రాజకీయ ప్రేరేపితమని మమతా బెనర్జీ సూచనప్రాయంగా చెప్పారు. 'డాక్టర్లలో చాలామంది చర్చలకు సానుకూలంగా ఉన్నారు. కొందరు మాత్రమే ప్రతిష్టంభన నెలకొనాలని ఆశిస్తున్నారు' అని ఆరోపించారు. బయటిశక్తులు వారిని నియంత్రిస్తున్నాయన్నారు. ఆందోళనలు రాజకీయ ప్రేరేపితమని, వాటికి వామపక్షాల మద్దతుందని ఆరోపించారు.

మమత రాజీనామా కోరలేదు: జూడాలు

ప్రత్యక్షప్రసారాన్ని అనుమతించకూడదనే సర్కారు మొండి పట్టుదలే చర్చలు కార్యరూపం దాల్చకపోవడానికి కారణమని జూనియర్ వైద్యులు ఆరోపించారు. తామెప్పుడూ సీఎం మమతా బెనర్జీ రాజీనామా కోరలేదని స్పష్టం చేశారు. ప్రతిష్టంభనకు వైద్యులే కారణమని మమత పేర్కొనడం దురదృష్టకరమన్నారు. తమ డిమాండ్లు నెరవేరేదాకా విధుల బహిష్కరణ కొనసాగిస్తామని తేల్చిచెప్పారు.

ప్రపంచ విమానయాన హబ్‌గా భారత్: మోదీ

'ఉడాన్'పై అధ్యయనం చేయాలని విదేశీ ప్రతినిధులకు సూచన



న్యూఢిల్లీ: దేశంలో విమానయాన రంగ అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని ప్రధాని మోదీ చెప్పారు. భారత్‌ను ప్రపంచ విమానయాన హబ్‌గా మార్చడానికి చర్యలు చేపట్టామని వివరించారు. ప్రాంతీయ అనుసంధాన పథకంతో విమాన ప్రయాణం ప్రజలందరికీ అందుబాటులోకి వస్తోందని అన్నారు. ద్వితీయ శ్రేణి నగరాల నుంచి సైతం విమానాల్లో ప్రయాణించేవారి సంఖ్య నానాటికీ పెరుగుతోందని వెల్లడించారు. పౌర విమానయానంపై గురువారం ఢిల్లీలో జరిగిన రెండో ఆసియా–పసిఫిక్ మినిస్టీరియల్ సదస్సులో మోదీ మాట్లాడారు. 29 దేశాల నుంచి 300 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. భారత ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఉడాన్' పథకం విజయవంతంగా కొనసాగుతోందని, దీనిపై అధ్యయనం చేయాలని విదేశీ ప్రతినిధులకు మోదీ సూచించారు. ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో విమానయాన రంగంలో నూతన అవకాశాలు సృష్టించేందుకు ప్రయత్నించాలని కోరారు. దాంతో ఆయా దేశాల్లో ఆర్థిక వృద్ధితోపాటు నూతన ఆవిష్కరణలు, శాంతి, సౌభాగ్యానికి బాటలు వేసినట్లు అవుతుందని ఉద్ఘాటించారు. ఇంటర్నేషనల్ బుద్ధిస్ట్ సర్క్యూట్‌ను వైమానిక రంగంతో అనుసంధానిస్తే వివిధ దేశాలకు, ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. మధ్య తరగతి ప్రజల సంఖ్య పెరుగుతుండడం, వారు సృష్టిస్తున్న డిమాండ్ విమానయాన రంగానికి చోదకశక్తిగా మారుతున్నాయని మోదీ స్పష్టంచేశారు. భారత్‌లో విమానయాన సంస్థల నెట్‌వర్క్, సేవలు నానాటికీ విస్తరిస్తున్నాయని తెలిపారు. ఈ రంగంలో అధిక నైపుణ్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయన్నారు. ఏవియేషన్ సెక్టార్‌లో 'మహిళల సారథ్యంలో ప్రగతి'కి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. భారత్‌లోని మొత్తం పైలట్లలో 15 శాతం మంది మహిళలు ఉన్నారని గుర్తుచేశారు. ఈ విషయంలో ప్రపంచ సగటు 5 శాతమేనని పేర్కొన్నారు.

19 నుంచి నైరుతి తిరోగమనం

న్యూఢిల్లీ: ఈనెల 19 నుంచి 25 తేదీల మధ్య నైరుతి రుతుపవనాలు వెనక్కి మళ్లడం మొదలవుతుందని భారత వాతావరణ శాఖ గురువారం వెల్లడించింది. నైరుతి రుతుపవనాలు ఏటా సాధారణంగా జూన్ ఒకటో తేదీన తొలిసారిగా కేరళను తాకుతాయి. అక్కడి నుంచి విస్తరిస్తూ జూలై ఎనిమిదో తేదీకల్లా దేశమంతా చుట్టేస్తాయి. తర్వాత సెప్టెంబర్ 17వ తేదీన తిరోగమనం మొదలై అక్టోబర్ 15 కల్లా వెళ్లిపోతాయి. ఈ నైరుతి సీజన్‌లో దేశంలో సగటున 836.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణ సగటు వర్షపాతం కంటే ఈసారి 8 శాతం ఎక్కువ నమోదవడం గమనార్హం.

కేజ్రీవాల్‌కు ఊరట దక్కేనా?

బెయిల్ పిటిషన్‌పై నేడు సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన సీబీఐ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఊరట లభిస్తుందా? లేదా? అనేది నేడు తేలిపోనుంది. ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించనుంది. ఈ మేరకు నేడు విచారణ చేపట్టనున్న పిటిషన్ల జాబితాను సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై తీర్పును ధర్మాసనం ఈ నెల 5వ తేదీన రిజర్వ్ చేసిన సంగతి తెలిసిందే. మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్‌ను ఈ ఏడాది జూన్ 26న సీబీఐ అరెస్టు చేసింది. తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ ఆయన తొలుత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కేజ్రీవాల్ అరెస్టును హైకోర్టు సమర్థించింది. బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ ఆగస్టు 5న ఉత్తర్వు జారీ చేసింది. దీంతో కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. సీబీఐ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేయడంతోపాటు బెయిల్ ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరారు. ఇదిలా ఉండగా, ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌ను ఈ ఏడాది మార్చి 21న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో కేజ్రీవాల్‌కు జూలై 12వ తేదీన సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఇక సీబీఐ కేసులోనూ బెయిల్ లభిస్తే తీహార్ జైలు నుంచి అరవింద్ కేజ్రీవాల్ విడుదల కానున్నారు.

తప్పుడు సంకేతాలకు ఆస్కారం..!

సీజేఐ ఇంటికి ప్రధాని మోదీ వెళ్లడం చూసి ఆశ్చర్యపోయా

ఇలాంటి వేడుకలకు ప్రధానమంత్రి వెళ్లకపోవడమే మంచిది | ప్రైవేట్ కార్యక్రమాన్ని పబ్లిక్ చేయొద్దు | రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ సూచన

న్యూఢిల్లీ: 'భారత ప్రధాన న్యాయమూర్తి ఇంటికి ఒక ప్రైవేటు కార్యక్రమం కోసం ప్రధానమంత్రి వెళ్లడం తప్పుడు సంకేతాలను పంపదా? నరేంద్ర మోదీ అలా వెళ్లకుండా ఉండాల్సింది. ఆయన సలహాదారులైనా చెప్పాలిగా.. తప్పుడు సంకేతాలు వెళ్లే ఆస్కారం ఉంద'ని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కపిల్ సిబల్ అన్నారు. వ్యవస్థలపై ప్రజల్లో చర్చకు తావిచ్చే ఇలాంటి ప్రైవేట్ వేడుకల పట్ల ప్రధానమంత్రి ఆసక్తి చూపకపోవడమే మంచిదని అన్నారు. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నివాసంలో బుధవారం జరిగిన గణపతి పూజలో ప్రధాని మోదీ పాల్గొనడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ప్రధాన న్యాయమూర్తిని ప్రభావితం చేసేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అత్యున్నత పదవుల్లో ఉన్న వ్యక్తులు ప్రైవేట్ కార్యక్రమాన్ని ఇలా బహిరంగపర్చడం సరైంది కాదని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ గురువారం పేర్కొన్నారు. అత్యున్నత సంస్థ గురించి ప్రజల్లో రకరకాల ఊహాగానాలు చెలరేగేందుకు అవకాశం కల్పించకూడదని సూచించారు. సీజేఐ ఇంట్లో పూజలో మోదీ పాల్గొన్న వీడియోను సోషల్ మీడియాలో చూసి ఆశ్చర్యపోయానని సిబల్ వెల్లడించారు. గత 50 ఏళ్లుగా తాను సుప్రీంకోర్టులో పని చేస్తున్నానని, ఎంతోమంది గొప్పగొప్ప ప్రధాన న్యాయమూర్తులను చూశానని తెలిపారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్‌పై ఎంతో గౌరవం ఉందని పేర్కొన్నారు. మనం నమ్మే మతం, మన విశ్వాసాలు పూర్తిగా వ్యక్తిగతమని, అవి అందరికీ తెలియజేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఫొటోలు, వీడియోలు చిత్రీకరించి, బయటపెట్టాల్సిన అవసరం లేదని కపిల్ సిబల్ తేల్చిచెప్పారు. తాజా వివాదంపై సీనియర్ లాయర్ ఇందిరా జైసింగ్ స్పందించారు. కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ మధ్య స్పష్టమైన విభజన రేఖ ఉందని గుర్తుచేశారు. ఈ విభజన రేఖ విషయంలో సీజేఐ రాజీ పడుతున్నట్లు కనిపిస్తోందని ఆక్షేపించారు.

ఆ పిటిషన్ల విచారణ నుంచి సీజేఐ తప్పుకోవాలి: సంజయ్ రౌత్

సీజేఐ నివాసంలో ప్రధాని మోదీ గణపతి పూజ పట్ల శివసేన(ఉద్ధవ్) పార్టీ సీనియర్ నేత సంజయ్ రౌత్ అభ్యంతరం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీ తిరుగుబాటు ఎమ్మెల్యేలపై అనర్హతకు సంబంధించిన పిటిషన్లు సుప్రీంకోర్టులో ప్రస్తుతం జస్టిస్ చంద్రచూడ్ ఎదుట పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఈ పిటిషన్లపై విచారణ నుంచి జస్టిస్ చంద్రచూడ్ తప్పుకోవాలని గురువారం డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన వ్యక్తులు రాజకీయ నాయకులను కలవడంపై ప్రజల్లో సందేహాలు తలెత్తుతున్నాయని తెలిపారు. మోదీతో జస్టిస్ చంద్రచూడ్ బంధం బయటపడిందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జస్టిస్ చంద్రచూడ్ మనకు న్యాయం చేకూర్చగలరా? అని సంజయ్ రౌత్ ప్రశ్నించారు.



బుధవారం సీజేఐ చంద్రచూడ్ దంపతులతో కలిసి పూజల్లో పాల్గొన్న ప్రధాని మోదీ(ఫైల్)

న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉంది: సుప్రియా సూలే

జస్టిస్ చంద్రచూడ్ ఇంటికి ప్రధాని మోదీ వెళ్లిన సంగతి తెలిసి తాను చాలా ఆశ్చర్యపోయానని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎస్పీ) వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంపీ సుప్రియా సూలే గురువారం పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థపై తనకు నమ్మకం ఉందని చెప్పారు. వయసులో, అనుభవంలో ప్రధాని మోదీ, జస్టిస్ చంద్రచూడ్ తనకంటే చాలా పెద్దవారని, వారిపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేనని వెల్లడించారు. అయితే, సీజేఐ ఇంటికి ప్రధాని వెళ్లడం గతంలో తాను ఎప్పుడూ వినలేదన్నారు.

నీచ రాజకీయాలు చేయొద్దు: సంబిత్ పాత్రా

సీజేఐ ఇంటికి ప్రధాని మోదీ వెళ్లడం పట్ల ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్షాలపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా విరుచుకుపడ్డారు. గతంలో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ఇచ్చిన విందుకు అప్పటి సీజేఐ వెళ్లినప్పుడు ఎందుకు మాట్లాడలేదని మండిపడ్డారు. అప్పట్లో అభ్యంతరం వ్యక్తంచేయని నాయకులు ఇప్పుడెందుకు స్పందిస్తున్నారో చెప్పాలని నిలదీశారు. గణపతి పూజలో మోదీ పాల్గొంటే తప్పేంటని ప్రశ్నించారు. నీచ రాజకీయాలు చేయొద్దని ప్రతిపక్షాలకు హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో భారత వ్యతిరేకి ఇల్హాన్ ఒమర్‌ను కలిస్తే ఇక్కడి రాజకీయ పార్టీలేవీ స్పందించడం లేదని సంబిత్ పాత్రా ధ్వజమెత్తారు.

మోదీ గొప్ప స్నేహితుడు: పుతిన్

బ్రిక్స్ భేటీకి రావాలంటూ ఆహ్వానం

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీపై రష్యా అధ్యక్షుడు ప్రశంసలు కురిపించారు. మోదీ తనకు గొప్ప మిత్రుడంటూ పొగిడారు. రష్యాలోని కజాన్‌లో వచ్చే నెలలో జరిగే బ్రిక్స్ శిఖరాగ్రానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరుగుతున్న బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా(బ్రిక్స్) దేశాల జాతీయ భద్రతాదారుల సమావేశానికి మన జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ హాజరయ్యారు. ఈ నేపథ్యంలో గురువారం అజిత్ దోవల్ అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయ్యారు. మోదీతో భేటీకి ఆసక్తిగా ఉన్నట్లు ఈ సందర్భంగా పుతిన్ తెలిపారు. దాదాపు మూడు వారాల క్రితం ప్రధాని మోదీ ఉక్రెయిన్‌లో జరిపిన పర్యటన, అధ్యక్షుడు జెలెన్‌స్కీతో చర్చల వివరాలను దోవల్ ఆయనకు వివరించారు. 'బ్రిక్స్ శిఖరాగ్రం సమయంలో అక్టోబర్ 22వ తేదీన మోదీతో సమావేశమవ్వాలని, రెండు దేశాల మధ్య విజయవంతంగా అమలవుతున్న ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం, భద్రతా పరమైన అంశాలపై చర్చించాలని అధ్యక్షుడు పుతిన్ ప్రతిపాదించారు' అని రష్యా ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. వచ్చే నెల 22–24 తేదీల్లో రష్యాలోని కజాన్ నగరంలో బ్రిక్స్ శిఖరాగ్రం జరగనుంది. జూలైలో మోదీ రష్యాలో పర్యటించారు. ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించడంలో భారత్, బ్రెజిల్, చైనాలకు కీలకంగా ఉన్నాయని ఇటీవల పుతిన్ పేర్కొనడం తెలిసిందే. కాగా, బ్రిక్స్ శిఖరాగ్రానికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కూడా హాజరవనున్నారు. ఈ విషయాన్ని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ధ్రువీకరించారు. గురువారం ఆయన పుతిన్‌తో సమావేశమయ్యారు.

మా గొంతు ఎవ్వరూ నొక్కలేరు

ఎంపీ ఇంజనీర్ రషీద్



శ్రీనగర్: 'జమ్మూకశ్మీర్ ప్రజలు శాంతిని ఆకాంక్షిస్తున్నారు. అదీ వారి అభీష్టం ప్రకారమే. కేంద్రం ఆంక్షలకు లోబడి మాత్రం కాదు' అని అవామీ ఇత్తెహాద్ పార్టీ(ఏఐపీ) చీఫ్, లోక్‌సభ ఎంపీ షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజనీర్ రషీద్ స్పష్టం చేశారు. ఉగ్ర నిధుల కేసులో తిహార్ జైల్లో ఉన్న ఆయనకు ఇటీవల సుప్రీంకోర్టు బెయిలివ్వడంతో విడుదలైన విషయం తెలిసిందే. గురువారం ఐదేళ్ల తర్వాత మొట్టమొదటిసారిగా శ్రీనగర్ చేరుకున్న ఎంపీ రషీద్.. విమానాశ్రయంలో కాలు మోపిన వెంటనే మోకాళ్లపై వంగి నుదుటితో నేలను తాకి, బయటకు వచ్చారు. తన కోసం ఎదురుచూస్తున్న కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. 'మా కంటే వేరెవరికీ కశ్మీర్‌లో శాంతితో అవసరం లేదని ప్రధాని మోదీకి చెప్పదల్చుకున్నా. అయితే, మేం పెట్టే షరతులకు లోబడే శాంతి నెలకొనాలి తప్ప కేంద్రం విధించే ఆంక్షలకు లోబడి కాదు. మాక్కావాల్సింది గౌరవంతో కూడిన శాంతి ఒక్కటే. శ్మశాన నిశ్శబ్దంతో కూడిన శాంతి కాదు' అని అన్నారు. 'సత్యం మాతోనే ఉంది. నరేంద్ర మోదీ, అమిత్ షా.. ఎవరైనా కానీ మా గొంతు నొక్కలేరు. మేం యాచించడం లేదు. మనుషుల్లా చూడండని కోరుతున్నాం. ఆర్టికల్ 370 రద్దు, రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడగొడుతూ మోదీ ప్రభుత్వం 2019 ఆగస్టు 5న తీసుకున్న నిర్ణయాన్ని మేం ఒప్పుకోం. ఇంజనీర్ రషీద్‌ను తిహార్ జైలుకు పంపినా, మరెక్కడికి పంపినా విజయం మాదే' అని చెప్పారు.

ఇండియా కూటమికి మద్దతిస్తాం..అయితే

జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమికి తాము మద్దతిస్తామని రషీద్ చెప్పారు. అయితే, ఇండియా కూటమికేంద్రంలో అధికారంలోకి వస్తే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ను పునరుద్ధరిస్తామని ముందుగా హామీ ఇవ్వాలన్నారు. అలాంటి హామీ ఇస్తే మా కార్యకర్తలు ప్రతి ఒక్కరూ ఆ కూటమి అభ్యర్థులకే ఓటేస్తామని ప్రతిజ్ఞ చేస్తారన్నారు. భారత్ ప్రపంచ శక్తిగా ఎదగాలన్న కల నెరవేరాలంటే ముందుగా కశ్మీర్ అంశాన్ని పరిష్కరించాలని సూచించారు.'మేం భారత్ శత్రువులం కాదు, అదే సమయంలో పాకిస్తాన్‌కు మిత్రులమూ కాదు' అని వ్యాఖ్యానించారు. 'ఆర్టికల్ 370ని సాధించుకోవాలనే వారు ఇళ్లలో కూర్చుని ప్రకటనలిస్తే చాలదు. లాల్‌చౌక్‌లో నిరసనలు చేపట్టి, లాఠీచార్జీలను ఎదుర్కొనేందుకు సిద్ధమవ్వాలి. నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ నేతలు ఆ పని చేయలేదు' అని వ్యాఖ్యానించారు.

నమాజ్ వేళ దుర్గా పూజ మైకులు ఆపండి

బంగ్లాదేశ్‌లో ప్రభుత్వం ఆదేశాలు

ఢాకా: షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయాక మైనారిటీ హిందువులపై దాడులు, ఆంక్షలు పెరిగాయన్న వార్తల నడుమ దుర్గాపూజకూ అక్కడి తాత్కాలిక ప్రభుత్వం అవరోధాలు సృష్టిస్తోంది. ముస్లింలు నమాజ్, అజాన్ వేళల్లో దుర్గామాత మండపాల వద్ద పూజా కార్యక్రమాలు నిశ్శబ్దంగా జరగాలని, ఎలాంటి సంగీత వాయిదాల శబ్దాలు వినిపించడానికి వీల్లేదని తాత్కాలిక సర్కార్ గురువారం హుకుం జారీచేసింది. దేశంలో శాంతిభద్రతలకు సంబంధించిన సమావేశం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. నమాజ్, అజాన్ సమయాల్లో దుర్గాపూజ మండపాల వద్ద ఎలాంటి సౌండ్ సిస్టమ్‌లను వాడకూడదని, సంగీత పరికరాలను వాయించకూడదని బంగ్లాదేశ్ హోం శాఖ సలహాదారు లెఫ్టినెంట్ జనరల్(రిటైర్డ్) మొహమ్మద్ జహంగీర్ ఆలం చౌదరి చెప్పారు.

ట్రెయినీ ఆర్మీ అధికారులపై దాడి

- మహిళపై గ్యాంగ్ రేప్, దోపిడీ
- మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఘటన

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో దుండగులు దారుణానికి ఒడిగట్టారు. యువ సైనికాధికారులను తీవ్రంగా కొట్టి, వారి స్నేహితురాలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఇండోర్ సమీపంలోని మోవ్ ఆర్మీ కాలేజీలో శిక్షణ పొందుతున్న ఇద్దరు అధికారులు, తమ స్నేహితురాళ్లతో కలిసి బుధవారం మధ్యాహ్నం చోటీ జామ్ వద్ద ఫైరింగ్ రేంజ్ సమీపంలోని ప్రదేశానికి పిక్నిక్‌కు వెళ్లారు. తుపాకులు, కత్తులు, కర్రలతో వచ్చిన 8 మంది దుండగులు అకస్మాత్తుగా వారిని చుట్టుముట్టారు. నలుగురినీ చితకబాది వారివద్ద డబ్బు, విలువైన వస్తువులను దోచుకున్నారు. ఒక అధికారిని, అతడి స్నేహితురాలిని బందీలుగా ఉంచుకున్న దుండగులు రూ.10 లక్షలు తెస్తేనే విడిచిపెడతామంటూ మరో అధికారి, అతడి స్నేహితురాలిని పంపించారు. బాధితుడు హుటాహుటిన తన యూనిట్‌కు వెళ్లి కమాండింగ్ అధికారికి సమాచారమిచ్చారు. ఈ మేరకు పోలీసులు, మిలటరీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకోగా.. వారిని చూసి దుండగులు పారిపోయారు. నలుగురు బాధితులను పోలీసులు మోవ్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఇద్దరు అధికారులకు గాయాలయ్యాయి. ఓ మహిళపై అత్యాచారం జరిగినట్లు పరీక్షల్లో నిర్ధారణ అయిందని పోలీసులు తెలిపారు. దోపిడీ, అత్యాచారం, ఆయుధాల చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేశారు. మోవ్ ఘటనపై కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ తీవ్రంగా స్పందించారు. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో శాంతి భద్రతలు మచ్చుకైనా కానరావడం లేదని దుయ్య బట్టారు. మహిళలపై జరుగుతున్న నేరాలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఆందోళనకర అంశమని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



పెట్.. బ్యూటీ సెట్..
మై పెట్ ఈజ్ బ్యూటీఫుల్ అంటూ సగర్వంగా చెప్పకోవాలనే ఆరాటం పెరుగుతుండడంతో పెట్స్‌కు అందాలను అద్దే పార్లర్లు శరవేగంగా విస్తరిస్తున్నాయి. - సిటీ ప్లస్‌లో



ఉన్నది ఒకటే.. 'జిమ్'దగీ
శరీర సౌష్టవం కలిగిన వారికి పార్ట్‌టైం, ఫుల్ టైం ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. నగరంలో వందలాది కుటుంబాలు ఈ రకంగా ఉపాధి పొందుతున్నాయి. - సిటీ ప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 31.0/23.0
నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 31, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

మీ వెంట నేనున్నా.. ధైర్యంగా పని చేయండి

ఈస్ట్, సౌత్ ఈస్ట్ జోన్ల అధికారులతో కొత్వాల్ ఆనంద్



సాక్షి, సిటీబ్యూరో: గణేష్ సామూహిక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ ఊరేగింపులకు సంబంధించి ఏర్పాట్ల సమీక్షలో భాగంగా కొత్వాల్ సీవీ ఆనంద్ గురువారం సౌత్, సౌత్ ఈస్ట్ జోన్ల అధికారులతో వేర్వేరుగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రెండు జోన్లలో నివసించే జనాభా కారణంగా అత్యంత సున్నితమైన ప్రాంతాలుగా పరిగణిస్తామన్నారు. అధికారులంతా స్వేచ్ఛగా పని చేయాలని సూచించారు. కమ్యూనల్ రౌడీలతో పాటు ఇతర సంఘ విద్రోహ శక్తులపై నిఘా ఉంచాలని, మత సామరస్యానికి భంగం కలిగించే వారిని కౌన్సెలింగ్ చేసి బైండోవర్ చేయాలని ఆదేశించారు. సిబ్బంది ఎలాంటి పరిస్థితిని అయినా ఎదుర్కోవడానికి మానసికంగా సిద్ధంగా ఉండాలని, ఎటువంటి అవరోధాలు ఎదురైనా మీ వెంట నేనుంటానని పోలీసు కమిషనర్ ఆనంద్ భరోసా ఇచ్చారు. ఊరేగింపు వాహనాలు విగ్రహాల ఎత్తుకు తగ్గట్టుగా నిర్దేశిత మార్గాల్లో వెళ్లేలా చూడాలని కొత్వాల్ సూచించారు. ఆయా మార్గాల్లో రద్దీ తగ్గించి ఊరేగింపులు సజావుగా సాగేలా చూడాలని ట్రాఫిక్ అధికారులను ఆదేశించారు. సౌత్ ఈస్ట్ డీసీపీ పటేల్ కాంతిలాల్ సుభాష్, ఈస్ట్ జోన్ డీసీపీ బి.బాలస్వామి, ట్రాఫిక్ డీసీపీ ఎస్.అశోక్ కుమార్, టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు సహా వివిధ స్థాయిలకు చెందిన అధికారులతో కొత్వాల్ ఆనంద్ సమీక్ష నిర్వహించారు.

నిమజ్జనం సందర్భంగా ఎంఎంటీఎస్ ప్రత్యేక రైళ్లు

సాక్షి, సిటీబ్యూరో: వినాయక నిమజ్జనం సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎంఎంటీఎస్ ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న రాత్రి 10 గంటల నుంచి 18న ఉదయం 4 గంటల వరకు 8 ప్రత్యేక రైళ్లు వివిధ మార్గాల్లో రాకపోకలు సాగించనున్నాయి. సికింద్రాబాద్–నాంపల్లి, ఫలక్‌నుమా–లింగంపల్లి, నాంపల్లి–లింగంపల్లి, ఫలక్‌నుమా–సికింద్రాబాద్, లింగంపల్లి–సికింద్రాబాద్ మధ్య ఈ రైళ్లు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

నిమజ్జనంపై అపోహలు వద్దు

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి



పంజగుట్ట: గణేశ్ నిమజ్జనాలకు గత ప్రభుత్వం ఎలా అవకాశం ఇచ్చిందో అలాగే ఈ సంవత్సరం కూడా అవకాశం కల్పించాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. 2021 హైకోర్టు నిబంధనల ప్రకారం ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలకు నిమజ్జనం చేసుకునే అవకాశం ఉందని వారు తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి అధ్యక్షుడు రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.రాజవర్ధన్ రెడ్డి మాట్లాడారు. కాలుష్య కారకాలకు తామూ వ్యతిరేకమే అని, కానీ.. పూర్తిగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు నియంత్రించేందుకు కొంత సమయం పడుతుందన్నారు. విగ్రహాలు తయారు చేసే వారికి ప్రభుత్వం చేయూతనివ్వాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డులో నిమజ్జనానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. వినాయక నిమజ్జనం వల్ల హుస్సేన్‌సాగర్ ఎలాంటి కలుషితం కావడం లేదని, బంజారా నాలా, బల్కాపూర్ నాలా నుంచి వస్తున్న వ్యర్థాలతో విపరీతంగా కలుషితమవుతోందని బీజేపీ నాయకురాలు మాధవీలత అన్నారు. నిమజ్జనం చేయనివ్వకపోతే.. ఎక్కడైతే వినాయక మండపాలు ఏర్పాటు చేశారో అక్కడే సంవత్సరం మొత్తం పూజలు నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు.

జంట జలాశయాల గేట్లు మూసివేత



సాక్షి, సిటీబ్యూరో: జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ గేట్లను జలమండలి అధికారులు గురువారం మూసివేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టి రెండు రిజర్వాయర్లకు వరద ప్రవాహం తగ్గడంతో వాటి గేట్లను మూసేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జంట జలాశయాలకు భారీగా వరద ప్రవాహం వచ్చి చేరింది. దీంతో హిమాయత్‌సాగర్ రిజర్వాయర్ ఒక గేటును, ఉస్మాన్‌సాగర్ రెండు గేట్లను ఒక్క అడుగు మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. తాజాగా పూర్తిగా ఇన్‌ఫ్లో తగ్గడంతో గేట్లను మూసివేశారు.



మహా టౌన్‌షిప్‌లు

ఓఆర్ఆర్ – ట్రిపుల్ ఆర్ మధ్యలో..

- రైతుల నుంచి భూములు సేకరించనున్న హెచ్ఎండీఏ
- ఫ్యూచర్ సిటీ అభివృద్ధే లక్ష్యంగా అడుగులు
- రోడ్లు, రవాణా, మౌలిక సదుపాయాలకు ప్రణాళికలు

సాక్షి, సిటీబ్యూరో: శరవేగంగా విస్తరిస్తున్న మహా నగరానికి అనుగుణంగా ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు వరకు సకల సదుపాయాలతో టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ప్రణాళికలను రూపొందించింది. ఇందుకోసం రైతుల నుంచి భూములను సేకరించి లేఅవుట్‌లను అభివృద్ధి చేయనుంది. రోడ్లు, రవాణా, విద్యుత్, తాగునీరు, పార్కులు తదితర మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసిన లే అవుట్‌లలో 60 శాతం భూమిని తిరిగి రైతులకు అందజేయనుంది. మిగతా 40 శాతం భూమిని హెచ్ఎండీఏ ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించనుంది.

వాటి తరహాలోనే..

- నగరంలోని ఉప్పల్ భగాయత్, కోకాపేట్, బుద్వేల్, మోకిల్లా, బాచుపల్లి, హయత్‌నగర్, మేడిపల్లి తదితర ప్రాంతాల్లో హెచ్ఎండీఏ సొంత భూములతో పాటు, రైతుల నుంచి సేకరించిన భూముల్లో లేఅవుట్‌లను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కోకాపేట్, బుద్వేల్, మోకిల్లాలో హెచ్ఎండీఏ ప్లాట్‌లు హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి. రియల్ ఎస్టేట్ సంస్థలు, బడా నిర్మాణ సంస్థలు పెద్ద ఎత్తున పోటీపడి స్థలాలను కొనుగోలు చేశాయి. ఇదే తరహాలో ఔటర్ నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు ప్రతిపాదించిన రేడియల్ రోడ్లకు ఆనుకొని టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేసేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు.

అంతర్జాతీయ ప్రమాణాలకనుగుణంగా..

- ప్రభుత్వం హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరువాత నాలుగో నగర నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తోన్న సంగతి తెలిసిందే. అంతర్జాతీయ హంగులతో అభివృద్ధి చేయనున్నట్లు భావిస్తున్న ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగానే అత్యాధునిక టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు ప్రభుత్వం ఓఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని జీహెచ్ఎంసీ వరకు పెంచడంతో పాటు హెచ్ఎండీఏ పరిధిని రీజినల్ రింగ్‌రోడ్డు వరకు విస్తరించింది. దీంతో హెచ్ఎండీఏ పరిధి 7,250 చదరపు కిలోమీటర్ల నుంచి సుమారు 10 వేల చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించనుంది. ఇందుకనుగుణంగానే భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని టౌన్‌షిప్‌ల అభివృద్ధిపై చర్యలు చేపట్టనుంది.

రేడియల్ రోడ్డు మార్గంలో..

ఓఆర్ఆర్‌ను, ట్రిపుల్ ఆర్‌ను కలుపుతూ రావిర్యాల నుంచి ఆమన్‌గల్ వరకు 300 మీటర్ల విస్తీర్ణంలో నిర్మించనున్న 41.5 కిలోమీటర్ల రేడియల్ రోడ్డు మార్గంలో టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేసేందుకు హెచ్ఎండీఏ దృష్టి సారించింది. రేడియల్ రోడ్డుకు రెండు వైపులా మొదటి దశలో ఒక కిలోమీటర్ పరిధిలో, రెండో దశలో 500 మీటర్ల పరిధిలో టౌన్‌షిప్‌ల విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకోసం రైతుల నుంచి భూములను సేకరించి అభివృద్ధి చేస్తారు. ఇందులో రోడ్లు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రజారవాణా సదుపాయాలు, పార్కులు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలు తదితర మౌలిక సదుపాయాలతో పాటు సుమారు 353.72 ఎకరాల్లో భవన నిర్మాణాల కోసం ప్లాట్‌లను కేటాయిస్తారు. రెండో దశలో మరో 171.65 ఎకరాల విస్తీర్ణంలో నివాస సముదాయాలను ఏర్పాటు చేయనున్నారు. రైతుల నుంచి సేకరించి అభివృద్ధి చేసినందుకు హెచ్ఎండీఏ 40 శాతం ప్లాట్‌లను తన వాటాగా తీసుకోనుంది. మిగతా 60 శాతం ప్లాట్‌లను రైతులు విక్రయించుకోవచ్చు.

మొదటి దశలో..

రేడియల్ రోడ్డుకు ఇరువైపులా కిలోమీటర్ పరిధిలో 21 లక్షల చదరపు మీటర్ల (518.92 ఎకరాలు) విస్తీర్ణంలో టౌన్‌షిప్ అభివృద్ధి.

అభివృద్ధి చేయనున్న ప్రాంతం	చదరపు మీటర్లు	ఎకరాలలో	శాతం
రోడ్డు ఏరియా	3,78,360.0	93.49	18.10
సోషల్ ఇన్‌ఫ్రా ఏరియా	70,378.9	17.39	3.37
సదుపాయాలు	41,027.4	10.14	1.96
పార్క్ ఏరియా	1,68,781.4	41.71	8.08
మొత్తం	6,58,547.68	162.73	31.51
ఇందులో ప్లాట్ల ఏరియా	14,31,452.0	353.72	68.49
రైతుల వాటా	8,58,871.2	212.23	41.09 (60)
హెచ్ఎండీఏ వాటా	5,72,580.8	141.49	27.39 (40)

రెండో దశలో..

- రేడియల్ రోడ్డుకు ఇరువైపులా 500 మీటర్ల పరిధిలో టౌన్‌షిప్ అభివృద్ధి.
- అభివృద్ధి చేయనున్న ఏరియా 10,90,000 (269.34 ఎకరాలు) చదరపు మీటర్లు.

వివిధ అవసరాల కోసం కేటాయింపులు ఇలా..

అభివృద్ధి	చదరపు మీటర్లు	ఎకరాలలో	శాతం
రోడ్డు ఏరియా	2,54,448.0	62.88	23.34
సోషల్ ఇన్‌ఫ్రా	31,446.2	7.77	2.88
సదుపాయాలు	27,707.3	6.85	2.54
పార్కు ఏరియా	81,751.5	20.20	7.50
మొత్తం	3,95,353	97.69	36.27
ఇందులో ప్లాట్ల ఏరియా	6,94,646.9	171.65	63.73
రైతుల వాటా	4,16,788.1	102.99	38.23 (60)
హెచ్ఎండీఏ వాటా	2,77,858.8	68.66	25.49 (40)

రేడియల్ రోడ్డు రూట్ ఇదే..

ఔటర్‌రింగ్‌రోడ్డు ఎగ్జిట్ 13 నుంచి రావిర్యాల మీదుగా ఆమన్‌గల్ వరకు నిర్మించనున్న రేడియల్ రోడ్డు పరిధిలో కొంగరకుర్దు, కొంగరకలాన్, ఫిరోజ్‌గూడ, లేమూరు, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట్,ముచ్చర్ల,కుర్మిద్ద, కడ్తాల్, ఆమన్‌గల్, ఆకుతోటపల్లి తదితర ప్రాంతాలు రానున్నాయి.

పనులకు పచ్చజెండా

పాతబస్తీలో రూ.20 కోట్లతో రహదారి అభివృద్ధి

- కేబీఆర్ పార్కులో మల్టీలెవల్ పార్కింగ్
- స్ట్రీట్‌లైట్స్ కోసం రూ.2.98 కోట్లు
- 14 అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం



సాక్షి, సిటీబ్యూరో: న్యూసిటీతో పాటు పాతబస్తీలోనూ రహదారుల విస్తరణ పనులకు సిద్ధమైన జీహెచ్ఎంసీ.. బండ్లగూడ జంక్షన్ నుంచి ఎర్రకుంట జంక్షన్ వరకు రహదారిని వంద అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేసేందుకు సిద్ధమైంది. ఇటీవలే కమిషనర్ పాతబస్తీలో అభివృద్ధి చేయాల్సిన రహదారుల ప్రాంతాల్ని తనిఖీ చేశారు. వాటిలో ఒకటైన బండ్లగూడ జంక్షన్– ఎర్రకుంట జంక్షన్ వరకు రహదారి అభివృద్ధికి గురువారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశం ఆమోదం తెలిపింది. దీని అంచనా వ్యయం రూ. 20 కోట్లు. ఈ పనుల కోసం 44 ఆస్తుల సేకరణ అవసరం. దీంతో సహా మొత్తం 14 అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది.

ఆమోదం పొందిన వాటిలో..

- 15,500 కొత్త ఎల్ఈడీ స్ట్రీట్ లైట్లు కొనుగోలు చేసేందుకు రూ. 2,98,72,000 లకు పరిపాలన అనుమతి, షార్ట్ టెండర్లు. కేబీఆర్ పార్కు వద్ద మల్టీలెవల్ స్మార్ట్ పార్కింగ్ ఏర్పాటుకు అత్యధిక బిడ్‌తో ముందుకు వచ్చిన ఏజెన్సీకి లెటర్ ఆఫ్ అవార్డు ఇచ్చేందుకు రాటిఫికేషన్ కోసం కమిషనర్‌కు సిఫారస్. చందానగర్ సర్కిల్‌లో కేఎస్ఆర్ లే ఔట్ వద్ద సీఎస్సార్ కింద 43,600 చదరపు అడుగులలో అర్బన్ ఫారెస్ట్ అభివృద్ధి చేసేందుకు తువక్కం వెల్ఫేర్ అసోసియేషన్‌తో మూడు సంవత్సరాలకు ఎంఓయూ కుదుర్చుకునేందుకు జోనల్ కమిషనర్‌కు అనుమతి.
- శేరిలింగంపల్లి జోన్‌లోని ఐదు పార్కుల్లో ఇంజక్షన్ బోర్‌వెల్స్ రీచార్జ్, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలకు వాటర్ ఎయిడ్ ఆర్గనైజేషన్‌తో ఎంఓయూకు జోనల్ కమిషనర్‌కు అనుమతి. బంజారాహిల్స్ ఎన్‌బీటీ నగర్‌లో రూ.3.85 కోట్ల అంచనా వ్యయంతో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి పరిపాలన అనుమతి. శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలో 500 గజాల స్థలంలో పెంపుడు జంతువుల శ్మశానవాటిక నిర్మాణానికి రాగ ఫౌండేషన్‌తో జోనల్ కమిషనర్ ఒప్పందం కుదుర్చుకునేందుకు ఆమోదం. నిర్మాణ వ్యయంతో పాటు మూడు సంవత్సరాల నిర్వహణ బాధ్యతలు కూడా ఫౌండేషన్‌కే ఉండేలా ఒప్పందం కుదుర్చుకోనున్నారు. హఫీజ్‌పేట కైదమ్మకుంటను సీఎస్సార్ కింద పునరుద్ధరించేందుకు మల్లిగావడ్ ఫౌండేషన్‌తో ఆరు నెలల కాలానికి జీహెచ్ఎంసి కమిషనర్ ఎంఓయూ కుదుర్చుకునేందుకు ఆమోదం.
- సికింద్రాబాద్ – సీతాఫల్ మండి రైల్వే స్టేషన్ల మధ్య బాక్స్ పుషింగ్ పద్ధతిలో కొత్త వంతెన నిర్మాణానికి రూ. 19,74,13,837 లకు పరిపాలన అనుమతి, ప్రభుత్వానికి సిఫారసు చేస్తూ కమిటీ ఆమోదం. లోతుకుంట రైల్వే బ్రిడ్జి నుండి అల్వాల్ ఆర్ఓబీ వరకు 60 మీటర్ల ప్రతిపాదిత రోడ్డు వెడల్పు నకు ప్రభావితమయ్యే 107 ఆస్తుల సేకరణకు కమిటీ ఆమోదం. మజీద్ బండ కుడికుంట నాలాకు రూ. 3.96 కోట్ల అంచనా వ్యయంతో వరద కాలువ ఆర్‌సీసీ బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికి పరిపాలన అనుమతి, షార్ట్ టెండర్ పిలిచేందుకు ఆమోదం.

అధికారుల తీరుపై మేయర్ అసంతృప్తి

ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరు కావడం లేదని స్టాండింగ్ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. తాను తనిఖీలు చేస్తున్నప్పటికీ, సంబంధిత ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని తప్పుబట్టారు. చెరువుల్లో దోమల నివారణకు సీఎస్సార్ కింద డ్రోన్ల ద్వారా మందులు స్ప్రే చేసేందుకు, చెరువుల అభివృద్ధికి ముందుకొచ్చేవారిని గుర్తించాల్సిందిగా మేయర్ అధికారులను ఆదేశించారు. స్టాండింగ్ కమిటీ సభ్యులతో పాటు కమిషనర్ ఆమ్రపాలి, వివిధ విభాగాల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

భవిష్యత్ నగరి.. ఇదీ దారి

ఫ్యూచర్ సిటీకి పలు కొత్త నగరాలు ఆదర్శం

- పుత్రజయ, నవ రాయ్‌పూర్, గిఫ్ట్ సిటీ కొత్తగా నిర్మించినవే
- ఆఫీసులు, నివాస, వాణిజ్య సముదాయాలన్నీ ఇక్కడే

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో కొత్తగా నాలుగో నగరం 'ఫ్యూచర్ సిటీ'ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. గ్రీన్‌హౌస్, కర్బన ఉద్గారాలు లేకుండా దేశంలోనే తొలి నెట్‌జీరో సిటీగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. హైదరాబాద్‌కు దక్షిణ భాగంలో సుమారు 14 వేల ఎకరాల్లో భవిష్యత్ నగరి రానుంది. గతంలో ఫార్మాసిటీగా ప్రతిపాదించిన ముచ్చర్ల, మీర్‌ఖాన్‌పేట వంటి 10 గ్రామాలను ఫ్యూచర్ సిటీ కవర్ చేస్తుంది. ఇప్పటికే ఈ తరహాలో అభివృద్ధి చెందిన పలు నగరాలు ఫ్యూచర్ సిటీకి ఆదర్శంగా నిలుస్తున్నాయి.

నవ రాయ్‌పూర్..

2000 నవంబర్‌లో దేశంలో ఛత్తీస్‌గఢ్ కొత్త రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత అక్కడి ప్రభుత్వం రాయ్‌పూర్‌కు ప్రత్యామ్నాయంగా కొత్త నగరాన్ని నిర్మించాలని భావించింది. సుమారు 58 వేల ఎకరాల్లో నిర్మించిన గ్రీన్‌ఫీల్డ్ నగరమిదే. అటల్ నగర్–నవ రాయ్‌పూర్ సిటీలో 41 గ్రామాలు, 5.6 లక్షల జనాభాతో సుమారు 2.2 లక్షల మందికి ఉద్యోగావకాశాల నగరంగా అభివృద్ధి చెందింది. 23 వేల ఎకరాలను కేవలం గ్రీన్‌బెల్ట్ కోసమే కేటాయించిన ఇక్కడి ప్రభుత్వ ఆఫీసులతో పాటు సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్, జెమ్స్ అండ్ జ్యువెలరీ పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలు, విద్య, వైద్య పరిశోధన సంస్థలు, వినోద సంస్థలు, నందన్ వ్యాన్ జూ అండ్ సఫారీ, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, ఫైవ్ స్టార్ హోటల్స్, లైబ్రరీ, బొటానికల్ గార్డెన్, ఫిల్మ్ సిటీ వంటివి ఎన్నో ఉన్నాయి. నవ రాయ్‌పూర్‌కు బస్సు, రైలు సదుపాయాలతో పాటు 10 కి.మీ. దూరంలోనే స్వామి వివేకానంద విమానాశ్రయం ఉంది. ఇక్కడి నుంచి దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు విమాన సర్వీసులున్నాయి. నవ రాయ్‌పూర్ నుంచి రాయ్‌పూర్, భిలాయ్ మీదుగా దుర్గ్ వరకు లైట్ మెట్రో నిర్మాణానికి ప్రతిపాదించింది.

గిఫ్ట్ సిటీ..

గాంధీనగర్‌లో గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీ (గిఫ్ట్)ని అభివృద్ధి చేశారు. 886 ఎకరాల్లో అభివృద్ధి చేసిన గిఫ్ట్ సిటీలో 67 శాతం వాణిజ్యం, 22 శాతం నివాసం, 11 శాతం కమ్యూనిటీ అవసరాల కోసం భూములను కేటాయించారు. అంతర్జాతీయ సంస్థల కోసం స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్), దేశీయ కంపెనీల కోసం డొమెస్టిక్ టారిఫ్ ఏరియా (డీటీఏ) ఇలా రెండు జోన్లుగా దీన్ని అభివృద్ధి చేశారు. డీటీఏకు కేటాయించిన 625 ఎకరాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పన్ను ప్రోత్సాహకాలు, రాయితీలు, ఇతరత్రా ప్రయోజనాలుంటాయి. ఎగుమతులు, విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు 261 ఎకరాలను సెజ్‌లకు కేటాయించారు. ఇందులోని సంస్థలకు పన్ను మినహాయింపులు, సుంకం లేని దిగుమతులు, ఎగుమతులు, సరళీకృత విధానాలు వంటివి ఉంటాయి. దేశంలో తొలి గ్రీన్‌ఫీల్డ్ అండ్ స్మార్ట్ సిటీ అయిన గిఫ్ట్‌లో 23 బహుళ జాతీయ బ్యాంక్‌లు, 35 ఫిన్‌టెక్ సంస్థలున్నాయి. రెండు అంతర్జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీలు, దేశంలోనే తొలి ఇంటర్నేషనల్ బులియన్ ఎక్స్ఛేంజీ కూడా ఇక్కడే ఉంది. ఇందులో అపార్ట్‌మెంట్లు, హోటళ్లు, ఆసుపత్రులు, విద్యాలయాలు అన్ని రకాల మౌలిక సదుపాయాలుంటాయి. మోటెరా స్టేషన్ నుంచి గిఫ్ట్ సిటీ, గాంధీనగర్‌కు మెట్రో పనులు జరుగుతున్నాయి.


పుత్రజయ..

మలేషియాలో రద్దీ పెరిగిపోతుండటంతో 1999లో స్థానిక ప్రభుత్వం కౌలాలంపూర్ తరహాలో మరో పట్టణ ప్రాంతం పుత్రజయను నిర్మించాలని నిర్ణయించారు. క్లాంగ్ వ్యాలీని కవర్ చేసే ప్రత్యేక ఆర్థిక మండలిగా దీన్ని నిర్మించారు. 11,320 ఎకరాల్లో విస్తీర్ణంలో 8.1 బిలియన్ డాలర్ల వ్యయంతో పుత్రజయ సిటీని నిర్మించారు. లక్షకు పైగా జనాభా నివాసం ఉంటున్న ఈ సిటీలో ఇస్లామిక్ మధ్యప్రాచ్య నిర్మాణ శైలితో మౌలిక సదుపాయాలను డిజైన్ చేశారు. పుత్రజయలో ప్రధాన మంత్రి ఆఫీసు, నివాస భవనాలతో డిప్యూటీ పీఎం, పాటు న్యాయ శాఖ ఇతరత్రా కార్యాలయాలున్నాయి. వారసత్వ కట్టడాలు, ఆలమండ పుత్రజయ షాపింగ్ సెంటర్ వంటివి ఉన్నాయి. బస్సు, రైలు సౌకర్యాలున్నాయి.



పాడి వర్సెస్ ఆరెకపూడి

- గాంధీకి బీఆర్ఎస్ కండువా కప్పుతానన్న కౌశిక్‌రెడ్డి
- ఆయనను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు
- ఇంటి వద్ద ధర్నాకు దిగిన గాంధీ వర్గం
- బీఆర్ఎస్ కార్యాలయం వద్ద నిరసన
- సైబరాబాద్ సీపీ ఆఫీస్ చెంత బాహాబాహీ



ఆరెకపూడి గాంధీ



పాడి కౌశిక్ రెడ్డి

సిటీలో 'కండువా' హీట్!

సాక్షి, సిటీబ్యూరో: బీఆర్ఎస్‌కు చెందిన ఫిరాయింపు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) చైర్మన్‌ను చేయడంతో మొదలైన వివాదం గురువారం కీలక మలుపు తిరిగింది. ఆయనకు బీఆర్ఎస్ కండువా కప్పుతానని, ఆయన ఇంటిపై పార్టీ జెండా ఎగురవేస్తానంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన ప్రకటన, తదనంతర పరిణామాలతో నగరం మొత్తం పొలిటికల్ హీట్ వ్యాపించింది. హౌస్ అరెస్టులు, అడ్డుకోవడానికి, దాడులు, వాగ్వాదాలు, నిరసనలతో నిండిపోయింది. ఆద్యంతం దూషణలు, అసభ్య పదజాలంతో సాగింది.

ఇంటి అద్దాలు.. ఫర్నిచర్ ధ్వంసం..

బుధవారం రాత్రి ఓ మీడియా చానల్‌లో మాట్లాడిన కౌశిక్‌రెడ్డి గురువారం ఉదయం గాంధీ ఇంటికి వెళ్లి బీఆర్ఎస్ కండువా కప్పడంతో పాటు ఆయన ఇంటిపై పార్టీ జెండా ఎగురవేస్తానని ప్రకటించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు గురువారం ఉదయం నుంచి కూకట్‌పల్లిలోని గాంధీ, కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి ఇళ్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌశిక్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేయగా... తన అనుచరులతో అక్కడకు వచ్చిన గాంధీ ఇంటిపై దాడికి దిగారు. దీంతో ఇంటి అద్దాలతో పాటు కొంత ఫర్నిచర్ ధ్వంసమైంది. ఈ ఉదంతంపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకున్నారు.

మహిళా కాంగ్రెస్ నేతల ధర్నా..

ఇదిలా ఉండగా.. 'చీరలు– గాజులు' అంటూ బుధవారం కౌశిక్‌రెడ్డి చేసిన ప్రకటనలకు నిరసనగా మహిళా కాంగ్రెస్ నేతలు బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ధర్నా చేయడంతో పాటు ప్లకార్డులు ప్రదర్శించారు. పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మధ్యాహ్నానికి సీన్ సైబరాబాద్ కమిషనరేట్ వద్దకు చేరుకుంది. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడితో పాటు ఇతర అంశాలపై పోలీసు కమిషనర్‌కు కలిసి ఫిర్యాదు చేయడానికి బీఆర్ఎస్ నాయకులు అక్కడికి చేరుకున్నారు. నాయకుల వెంట కార్యకర్తలు భారీగా ఉండటంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలోనే పోలీసులతో వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ఆ సమయంలో పోలీసు కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో చివరకు ముగ్గురు ఎమ్మెల్యేలు సంయుక్త సీపీ జోయల్ డెవిస్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చి వచ్చారు.

దేవుడికైనా సీట్‌బెల్ట్ తప్పనిసరి!

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసు అధికారి



సాక్షి, సిటీబ్యూరో: రోడ్డు భద్రతా నిబంధనలు వాహనదారులకే కాదు భగవంతుడికి కూడా! హెల్మెట్, సీట్‌బెల్ట్‌లు రోడ్డు ప్రమాదాల నుంచి కేవలం వాహనదారులనే కాదు దేవుణ్నైనా రక్షిస్తాయి. గణేశ్ నవరాత్రుల నేపథ్యంలో రాచకొండ పోలీసు కమిషనరేట్‌కు చెందిన ఓ మహిళా అధికారి ట్రాఫిక్ పోలీసు వాహనంలో వినాయకుడికి సీట్‌బెల్ట్ వేసి రోడ్లపై చక్కర్లు కొట్టారు. తోటి వాహనదారులకు సీట్‌బెల్ట్ ప్రాధాన్యత, రోడ్డు భద్రతలపై అవగాహన కల్పించారు. కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నా పెడచెవిన పెట్టే వాహనదారులెందరో! తీరా రోడ్డు ప్రమాదం జరిగిన తర్వాత నెత్తినోరు మొత్తుకున్నా లాభం ఉండదు, జరా.. నిబంధనలు పాటించండి!

దేశంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ

- కేంద్ర మాజీమంత్రి రాజీవ్ చంద్రశేఖర్
- ఉప్పల్‌లో ఎంపీ ఈటలతో కలిసి సభ్యత్వ నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీమంత్రి రాజీవ్ చంద్రశేఖర్

కుషాయిగూడ: రానున్న రోజుల్లో దేశంలోనే అతిపెద్ద పార్టీగా భారతీయ జనతా పార్టీ అవతరించబోతుందని కేంద్ర మాజీమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. కుషాయిగూడలోని మనీషా గార్డెన్స్‌లో జరిగిన బీజేపీ ఉప్పల్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో కూడా అతిపెద్ద పార్టీగా బీజేపీ అవతరించాలని, ప్రతి భారతీయుడు బీజేపీలో చేరాలన్నదే తమ అభిమతమన్నారు. 'సబ్ కా సాత్', 'సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్'అన్నది బీజేపీ నినాదమన్నారు. ఈ సందేశాన్ని కిందిస్థాయి వరకు తీసుకెళ్లి సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎంపీ ఈటల మాట్లాడుతూ గత నాలుగైదు రోజులుగా దేశమంత బాధపడి, తలదించుకునే వార్తలు ప్రసారమవుతున్నాయన్నారు. ఇక్కడ మాట్లాడటం చేతకాని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విదేశాల్లో భారత దేశ ఆత్మ గౌరవం, ఔన్నత్యాన్ని అభాసుపాలు చేస్తున్నారని మండిపడ్డారు. గత పది సంవత్సరాల పాలనలో ప్రపంచ దేశాలు భారత్ స్ఫూర్తిని కొనియాడుతున్న తరుణంలో దేశంలో శాంతి లేదంటూ చౌకబారు ఆరోపణలు చేయడం భారతజాతిని అవమానపరచడమే అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి, కార్పొరేటర్లు చేతన, శ్రీవాణి, రాజ్యలక్ష్మీ, జిల్లా సభ్యత్వ నమోదు ప్రముఖ్ పోతమగాని గోపాల్‌గౌడ్, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ బాలచందర్ పాల్గొన్నారు. అనంతరం మీర్‌పేట్–హెచ్‌బీ కాలనీ డివిజన్ తిరుమలనగర్ బూత్ నెంబర్ 99ని వారు సందర్శించారు. యువకులతో మాట్లాడుతూ వారికి ఆన్‌లైన్‌లో రాజీవ్ చంద్రశేఖర్, ఈటల చేతుల మీదుగా సభ్యత్వాలను అందజేశారు.

రాష్ట్రపతి ఉత్తర్వుల ధిక్కరణ

- జీవో నెం.317కు విరుద్ధంగా డీఎస్పీల బదిలీలు
- ఒక మల్టీజోన్ వారికి మరో దాంట్లో పోస్టింగ్స్
- ఆ పోస్టులను రాష్ట్రస్థాయిగా పరిగణిస్తున్న ఉన్నతాధికారులు
- న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్న కొందరు డీఎస్పీలు



సాక్షి, సిటీబ్యూరో: కొందరి స్వార్థ రాజకీయ అవసరాల కోసం పోలీసు శాఖ ఏకంగా రాష్ట్రపతి ఉత్తర్వులనే ధిక్కరిస్తోంది. వీటి ఆధారంగా జారీ అయిన జీవోలోని అంశాలను తుంగలో తొక్కుతోంది. ప్రెసిడెంట్ దృష్టికి తీసుకువెళ్లకుండా, ఆయన అనుమతి లేకుండా అవసరమైన మార్పులు, చేర్పులు చేసేసింది. దీంతో మల్టీ జోన్–1, మల్టీ జోన్–2లకు చెందిన డీఎస్పీలకు మరో జోన్‌లో పోస్టింగ్స్ వస్తున్నాయి. దీనిపై న్యాయ పోరాటం చేయడానికి కొందరు డీఎస్పీలు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర పోలీసు విభాగంలో ఒకప్పుడు హైదరాబాద్ జోన్, వరంగల్ జోన్ మాత్రమే ఉండేవి. వీటికి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు(ఐజీ) స్థాయి అధికారులు నేతృత్వం వహించేవారు. అప్పట్లో పోలీసు పోస్టుల్లో 80 శాతం లోకల్, 20 శాతం నాన్–లోకల్ అభ్యర్థులకు అవకాశం ఉండేది. అయితే స్థానికులకే ఎక్కువ అవకాశాలు దక్కాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ జోన్లను పునర్ వ్యవస్థీకరించింది. ఈ మేరకు రాష్ట్రపతికి ప్రతిపాదనలు పంపి 2018లో ఆమోదం పొందింది. దీని ప్రకారం స్థానికులకు 95 శాతం, స్థానికేతరులకు ఐదు శాతం చొప్పున కోటా నిర్దేశించారు.

రెండు మల్టీ జోన్ల ఏర్పాటు

ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలి. అలా కాకుంటే మూడేళ్ల తర్వాత ఆ ఉత్తర్వులు వాటంతట అవే లాప్స్ అవుతాయి. ఆఖరి నిమిషం వరకు పట్టనట్లు వ్యవహరించిన ప్రభుత్వం 2021 డిసెంబర్‌లో ఇతర విభాగాలతోపాటు పోలీసు విభాగంలో మల్టీ జోన్–1, మల్టీ జోన్–2 ఏర్పాటు చేస్తూ జీవో నెం.317 జారీ చేసింది. హైదరాబాద్ జోన్ మల్టీ జోన్–1గా, వరంగల్ జోన్ మల్టీ జోన్–2గా మారింది. ఈ మార్పులు, చేర్పుల నేపథ్యంలో ఒకప్పుడు హైదరాబాద్ జోన్‌లో ఉన్న నిజామాబాద్ కమిషనరేట్‌తోపాటు సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలు మల్టీ జోన్–2లోకి వెళ్లిపోయాయి. దీంతో జోన్–1లో ఉండాల్సిన శాంక్షన్ పోస్టుల సంఖ్య తగ్గిపోయింది. ఫలితంగా అదనంగా ఉన్నారంటూ కొందరు అధికారులను దాదాపు బలవంతంగా జోన్–2కు పంపారు. ఓ ప్రామాణికత, సరైన మార్గదర్శకాలు లేకుండా ఈ ప్రక్రియ చేపట్టారు. హోంగార్డులు, స్పెషల్ పోలీసు ఆఫీసర్లను మినహాయిస్తే పోలీసు విభాగంలోకి రిక్రూట్‌మెంట్స్ నాలుగు స్థాయిల్లోనే జరుగుతాయి. కానిస్టేబుల్, ఎస్సై, డీఎస్పీ, ఐపీఎస్‌ల్లో ఈ ప్రక్రియ జరుగుతుంది. ఇందులో తొలి మూడు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉంది.

2021 వరకు డీఎస్పీ పోస్టు రాష్ట్ర క్యాడర్‌లోనిదే..

2021 డిసెంబర్ డీఎస్పీ పోస్టు రాష్ట్ర క్యాడర్‌కు చెందినదిగా ఉంది. దీని ప్రకారం రాష్ట్రంలో పని చేస్తున్న డీఎస్పీని ఏ ప్రాంతం నుంచి ఏ ప్రాంతానికైనా బదిలీ చేసే అవకాశం ఉండేది. అయితే జీవో నెం.317 ఆధారంగా డీఎస్పీ పోస్టు మల్టీ జోనల్ స్థాయికి తగ్గింది. దీని ప్రకారమే అధికారుల పోస్టుల పంపకాలు కూడా జరిగాయి. తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఈ ఏడాది ఫిబ్రవరిలో గ్రూప్–1 నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో 115 డీఎస్పీ పోస్టులను కేటగిరీ–2లో చూపించింది. వీటి నుంచి మల్టీ జోన్–1లో 52, జోన్–2లో 63 ఖాళీలు ఉన్నట్లు పేర్కొనడమే డీఎస్పీ మల్టీ జోనల్ పోస్టు అనడానికి తాజా ఉదాహరణ. నిబంధనల ప్రకారం ఏ మల్టీ జోన్‌కు చెందిన డీఎస్పీని ఆ మల్టీ జోన్‌లోని మరో ప్రాంతానికి మాత్రమే బదిలీ చేయాల్సి ఉంది. అయితే డీఎస్పీ బదిలీలన్నీ దీనికి విరుద్ధంగా జరుగుతున్నాయి. ఇప్పటికీ రాష్ట్రస్థాయి పోస్టుగానే పరిగణిస్తూ రాష్ట్రవ్యాప్తంగా బదిలీలు చేస్తున్నారు.

అసంబద్ధంగా అంతర్గత ఉత్తర్వులు

కొందరు అధికారులు తమ స్వార్థం కోసం ఉన్నతాధికారులను మేనేజ్ చేస్తూ డీఎస్పీని రాష్ట్ర క్యాడర్ పోస్టుగానూ పరిగణించవచ్చంటూ అంతర్గత ఉత్తర్వులు జారీ చేయించారు. అయితే రాష్ట్రపతి ఉత్తర్వుల ఆధారంగా వెలువడిన జీవో నెం.317లో ఏ మార్పు చేర్పులు చేయాలన్నా అది పెద్ద ప్రహసనం. విధానపరమైన నిర్ణయాలు, తీర్మానాలు పూర్తయిన తర్వాత రాష్ట్రపతికి సవరణ ప్రతిపాదనలు పంపాలి. ఆయన ఆమోదముద్ర పడ్డాకే మార్పులు, చేర్పులు చేయాలి. అయితే రాష్ట్ర పోలీసు విభాగం మాత్రం ఈ నిబంధనల్ని తుంగలోతొక్కి బదిలీలు చేస్తోంది. ఫలితంగా తాము నష్టపోతున్నామని, తమను నియమించాల్సిన పోస్టుల్లోనూ జోన్–2కు చెందినవారితో నింపేస్తున్నారని జోన్–1కు చెందిన అధికారులు చెప్తున్నారు. జోన్–1లో ఉన్న పోస్టులకే డిమాండ్ ఉండటంతో అనేకమంది డీఎస్పీలు పైరవీలు చేసుకుని ఇక్కడకు వస్తూ తమ అవకాశాలు గండికొడుతున్నారని చెప్తున్నారు. దీనిపై తాము త్వరలో న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

కొచ్చి కటకటాల్లోకి హైదరాబాదీ

- నేవీలో లెఫ్టినెంట్‌గా పనిచేస్తున్న సునీల్
- ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువతిపై అఘాయిత్యం



సాక్షి, సిటీబ్యూరో: నేవీలో అధికారిగా పనిచేస్తున్న నగరానికి చెందిన యువకుడు ఓ యువతిని ప్రేమ పేరిట మభ్యపెట్టి అఘాయిత్యానికి పాల్పడి చివరికి కటకటాలపాలయ్యాడు. వివరాలు... హైదరాబాద్‌కు చెందిన సునీల్(26) ఇండియన్ నేవీలో లెఫ్టినెంట్‌గా పనిచేస్తున్నాడు. కొచ్చి కేంద్రంగా ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ ఐఎన్ఎస్ విక్రాంత్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతడికి కొన్నాళ్ల క్రితం ఇన్‌స్టాగామ్ ద్వారా హిమాచల్‌ప్రదేశ్‌లోని సిమ్లాకు చెందిన యువతితో పరిచయమైంది. అప్పటి నుంచి వీరి మధ్య చాటింగ్, ఫోన్ కాల్స్ నడుస్తున్నాయి. ఇటీవల ఆ యువతికి కొచ్చిలోని కడవంతర ప్రాంతంలో ఉద్యోగం వచ్చింది. దీంతో ఆమె కూడా సిమ్లా నుంచి కేరళకు చేరుకుంది. ఈ క్రమంలో ప్రేమ, పెళ్లి అంటూ మభ్యపెట్టి కొచ్చిలోని తన అద్దె ఇంటికి తీసుకువెళ్లి అఘాయిత్యం చేయడంతో బాధితురాలు కొచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) సెక్షన్ 69 కింది కేసు నమోదు చేసుకున్న అధికారులు సునీల్‌ను అరెస్టు చేశారు. కొచ్చి కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

మరో ఘటనలో...

గుజరాత్‌లోని సూరత్ వస్త్ర కర్మాగారంలో పనిచేస్తున్న ఓ బీహార్ యువకుడు నేపాల్ బాలిక(13)ను నగరానికి తీసుకువచ్చి అఘాయిత్యానికి పాల్పడగా, పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు... బీహార్‌కు చెందిన సయీద్ (29) రైలులో ప్రయాణిస్తుండగా ఆ బాలికతో పరిచయం ఏర్పడింది. బాలిక కుటుంబం కూడా నేపాల్ నుంచి వలస వచ్చి సూరత్‌లో ఉంటోంది. ఈ క్రమంలో అతడు ప్రేమ, పెళ్లి పేరుతో ఆమెను లోబరుచుకున్నాడు. గత నెల 12న ఆమెను తీసుకొని బీహార్, ముంబై, బెంగళూరుల్లో తిరిగి, చివరికి హైదరాబాద్‌కు వచ్చాడు. మెహదీపట్నంలోని ఓ అద్దె ఇంటిలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్న ఇతడు ఆమెపై పలుమార్లు అత్యాచారానికి ఒడిగట్టాడు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన సూరత్ పోలీసులు సాంకేతిక ఆధారాలను బట్టి వారు మెహదీపట్నంలో ఉన్నట్లు గుర్తించి ఆ ఇంటిపై దాడి చేశారు. సయీద్‌ను అరెస్టు చేసి, బాలికను తమ వెంట తీసుకువెళ్లారు.

రేషన్ బియ్యం పక్కదారి.. నిల్వలపై దాడి

70 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసిన అధికారులు



అధికారులు సీజ్ చేసిన బియ్యం వాహనం

సుభాష్‌నగర్: అక్రమంగా రేషన్ బియ్యం కొనుగోలు చేసి నిల్వ ఉంచిన గదిపై సివిల్ సప్లై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. వివరాల్లోకి వెళితే... సూరారం డివిజన్ విశ్వకర్మ కాలనీలో ఇంటింటా సేకరించిన రేషన్ బియ్యం విక్రయానికి తరలిస్తుండగా సమాచారం అందుకున్న సివిల్ సప్లై విజిలెన్స్ సీనియర్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ కృష్ణతో కలిసి గురువారం ఉదయం దాడులు చేసి పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న టీఎస్ 08 యూజే 0325, టీఎస్ 08 యూఈ 0947 నెంబర్ గల వాహనాలను, 70 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. స్థానికంగా కొంతమందితో ఇంటింటా రేషన్ బియ్యాన్ని సేకరిస్తూ నిజామాబాద్, మహారాష్ట్రలో విక్రయిస్తున్న అర్జున్ పాండేను అదుపులోకి తీసుకొన్నారు. నెలలో ఎన్ని క్వింటాళ్ల బియ్యం తీసుకొని ఎవరికి విక్రయిస్తున్నారన్న విషయంపై ఆరా తీస్తున్నారు. ఈ మేరకు సూరారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపాలిటీలో విలీనంతోనే అభివృద్ధి

- ఆర్డినెన్స్ నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇవ్వలేం
- 'ఘన్సిమియాగూడ'పై పిటిషనర్‌కు తేల్చిచెప్పిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేస్తే మరింత అభివృద్ధి చెందుతాయని హైకోర్టు అభిప్రాయపడింది. ఇలాంటి విషయాల్లో ప్రజాప్రయోజనం కాకుండా వ్యక్తిగత లబ్ధి కోసం పిటిషన్లు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఘన్సిమియాగూడ గ్రామ పంచాయతీని శంషాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్ నిలిపివేతకు హైకోర్టు నిరాకరించింది. విలీనంపై రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. 2 వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. మున్సిపాలిటీల్లో చుట్టుపక్కల గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ సెప్టెంబర్ 2న ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు శంషాబాద్ మున్సిపాలిటీలో ఘన్సిమియాగూడను విలీనం చేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఘన్సిమియాగూడకు చెందిన సిద్ధయ్యతోపాటు మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సత్యంరెడ్డి వాదనలు వినిపించారు. అనంతరం ధర్మాసనం జీఏడీ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శులకు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. విచారణ 2 వారాలకు వాయిదా వేసింది.

రూ.2.60 లక్షల విలువైన డ్రగ్స్ పట్టివేత

గుండ్ల పోచంపల్లిలో ఘటన

మేడ్చల్‌రూరల్: ఈజీమనీ కోసం పక్కదారి పట్టిన ముగ్గురు యువకులు చివరికి పోలీసులకు చిక్కారు. డీఎస్పీ తిరుపతి యాదవ్ వివరాల ప్రకారం... షణ్ముక సాయి, జూపాక నందు, ఉమేశ్‌చంద్ర అనే యువకులు సులభంగా డబ్బు సంపాదించాలని భావించారు. ఈ క్రమంలో పరిచయమైన అజయ్ సన్నీ డ్రగ్స్, హాష్ ఆయిల్, గంజాయి అమ్మకాలు జరిపితే ఈజీగా డబ్బు సంపాదించవచ్చని వారికి ఆశచూపాడు. దీంతో ముగ్గురు యువకులు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఓ గదిని అద్దెకు తీసుకుని కళాశాల విద్యార్థులే టార్గెట్‌గా డ్రగ్స్ అమ్మకానికి పాల్పడుతున్నారు. ఎండీఎంఏ డ్రగ్‌ను ఒక గ్రాము రూ.6 వేలకు, హాష్ ఆయిల్ రూ.1,200, 10 గ్రాముల గంజాయిని రూ.1,500లకు విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ బృందం డ్రగ్స్ వినియోగించేవారిగా నటిస్తూ వారి వద్దకు వెళ్లారు. డ్రగ్స్ విక్రయిస్తుండగా ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2.11 కేజీల గంజాయి, 0.68 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్, 250 గ్రాముల హాష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన డ్రగ్స్ విలువ రూ.2.60 లక్షలు ఉంటుందని తెలిపారు. డ్రగ్స్ అమ్మకాలు సాగిస్తున్న మరో ముగ్గురు అజయ్ సన్నీ, అరుణ్‌కుమార్, మేకల శివరాం పరారీలో ఉన్నారు. దాడుల్లో సీఐ నాగరాజు, ఎస్సై అన్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

కేబినెట్‌లోకి ఆరుగురు బీసీలను తీసుకోవాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



ముషీరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో ఆరుగురు బీసీలకు స్థానం కల్పించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గత కేబినెట్‌లో బీసీలకు కేవలం రెండు మాత్రమే ఇచ్చారని, అవి కూడా ప్రాధాన్యం లేని పదవులని అన్నారు. బీసీలను చిన్నచూపు చూసినా, నిర్లక్ష్యం చేసినా సహించేది లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో బలమైన బీసీ నాయకులు ఉన్నారని, వారికి పదవులు ఇవ్వకుండా తొక్కి పెట్టారని అన్నారు. ముఖ్యమంత్రి బీసీలపట్ల తన వైఖరి మార్చుకొని అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్, ప్రభుత్వరంగ సంస్థలు, ఇతర సంస్థల చైర్మన్, డైరెక్టర్ పోస్టుల్లో బీసీలకు 50 శాతం కోటా ఇవ్వాలని ఆర్.కృష్ణయ్య కోరారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం బీసీలు కష్టపడ్డారని, వారికి పదవులు కేటాయించి గుర్తింపు ఇవ్వాలని అన్నారు. బీసీ ప్రజల ఓట్లు వేయించుకుంటూ వారికే అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల అభివృద్ధికి ఒక చిన్న స్కీం కూడా పెట్టలేదన్నారు. అన్ని బీసీ కులాలకు కార్పొరేషన్లు, పాలకమండళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం వంద బీసీ గురుకుల పాఠశాలలు, 50 ఇంజనీరింగ్ కాలేజీలు, రెండు యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలన్నారు. కాలేజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు చెల్లించాలని కోరారు. బీసీల కులగణనను వెంటనే చేపట్టాలని, పంచాయతీ రాజ్ రిజర్వేషన్లు జనాభా ప్రకారం పెంచాలని డిమాండ్ చేశారు.

డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా దాడులు

– సే నో డ్రగ్స్.. టీ షర్ట్ విడుదల

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో డ్రగ్స్ మహమ్మారిని పూర్తి తరిమికొట్టడమే లక్ష్యంగా నిరంతరం దాడులను కొనసాగించాలని ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ గురువారం ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. నాంపల్లిలోని ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన రంగారెడ్డి జిల్లా సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'సే నో డ్రగ్స్'టీ షర్ట్‌ను ఆయన విడుదల చేశారు. రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ దశరథ్, అసిస్టెంట్ కమిషనర్ కిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ యువత డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్త పడాలన్నారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌కు చెక్ పెట్టాలని చెప్పారు. సమావేశంలో శంషాబాద్ వికారాబాద్, మల్కాజిగిరి, మేడ్చల్, సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లు కృష్ణప్రియ, విజయభాస్కర్, ఫయాజుద్దీన్, కె.నవీన్‌కుమార్, ఉజ్వలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాడ్జిపై నుంచి దూకి యువకుడి ఆత్మహత్య

– ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఘటన

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఓ యువకుడు లాడ్జిపై నుంచి కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. చిక్కడపల్లి పోలీసుల కథనం ప్రకారం... ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన దువ్వాడ మాధవ్ కుమారుడు గజానంద్(24) వారం క్రితం నగరానికి పనికోసం వచ్చాడు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ లాడ్జిలో హౌస్‌కీపర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం లాడ్జిపై నుంచి దూకడంతో పక్కనే ఉన్న బిల్డింగ్ టెర్రస్‌పై పడి చనిపోయాడు. తోటి సిబ్బంది గమనించి లాడ్జి యాజమాని ప్రశాంత్‌కు సమాచారం అందించారు. ప్రశాంత్ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. అయితే ప్రేమ వ్యవహారమే కారణమై ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు. అతడి బాబాయ్ ఉత్తమ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భరత్‌నగర్ ఫ్లైఓవర్‌పై ప్రమాదం

- బైక్‌ను ఢీకొట్టిన గుర్తుతెలియని ద్విచక్ర వాహనం
- ఆర్టీసీ బస్సు చక్రాలు కింద పడి వ్యక్తి దుర్మరణం



కాట్రగడ్డ గంగాధర్(ఫైల్)

సనత్‌నగర్: ఇద్దరు సహచర ఉద్యోగులు బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి ఆ వెనుకాలే వస్తున్న ఆర్టీసీ చక్రాల కింద పడి మృతి చెందాడు. సనత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కాట్రగడ్డ గంగాధర్(50) నగరానికి వలసవచ్చి కూకట్‌పల్లి ప్రగతినగర్‌లో నివాసం ఉంటూ గండి మైసమ్మ దగ్గర గల వయాట్రిస్‌లో ఏజీఎంగా పనిచేస్తున్నాడు. అదేసంస్థలో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తూ విజయ్‌రామ్‌రాజు(47)తో కలిసి బుధవారం రాత్రి 10.40 గంటలకు బైక్‌పై మూసాపేట నుంచి ఎర్రగడ్డ వైపు వెళ్తున్నారు. భరత్‌నగర్ ఫ్లైఓవర్ పైకి చేరుకోగానే వెనుక వచ్చిన గుర్తుతెలియని ద్విచక్ర వాహనం వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వెనుక కూర్చొన్న గంగాధర్ కిందపడగా అదే మార్గంలో వెళ్తున్న ఆర్టీసీ బస్సు చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవింగ్ చేస్తున్న విజయ్‌రామ్‌రాజు గాయాలకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన డీసీఎం

– బేగంపేట ఫ్లైఓవర్‌పై ఘటన



బేగంపేట ఫ్లైఓవర్‌పై డివైడర్‌ను ఢీకొట్టిన డీసీఎం

సనత్‌నగర్: బేగంపేట ఫ్లైఓవర్‌పై డీసీఎం వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. బేగంపేట పోలీసులు తెలిపిన వివరాలు... గురువారం తెల్లవారుజామున బేగంపేట నుంచి పంజగుట్ట వైపు సరుకుల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వాహనం బేగంపేట ఫ్లైఓవర్ పైకి రాగానే డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో చాసిస్, ముందున్న రెండు టైర్లు విరిగిపోయాయి. వాహనంలో డ్రైవర్‌తోపాటు మరొకరున్నారు. వారికి ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డారు. డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు చేరుకుని క్రేన్ వాహనం సాయంతో డీసీఎంను అక్కడి నుంచి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
శుక్రవారం ।13। సెప్టెంబర్ । 2024

సేవాభావాన్ని జీవితంలో భాగం చేసుకోవాలి

– ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకున్న వెంకయ్య నాయుడు



ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతిని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు దర్శించుకున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి ప్రత్యేకంగా సన్మానించారు. అనంతరం వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ఖైరతాబాద్ విగ్రహ ప్రతిష్ట ఎంతో ఘనమైందని, దర్శన్ కుటుంబ సభ్యులతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు ఎంతో కష్టపడి మహాగణపతి ఉత్సవాలను ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. కలియుగంలో దేశంలో, ప్రపంచంలో ప్రకృతి వైపరీత్యాలు పెరిగిపోతున్న తరుణంలో అందరూ భక్తిభావాన్ని అలవాటు చేసుకొని ధర్మంవైపు నిలబడాలన్నారు. ప్రజలు సేవాభావాన్ని జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. భగవంతుడు ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలను కాపాడి సుఖశాంతులు అందించాలని వినాయక మహారాజును కోరుకున్నానని ఆయన తెలిపారు.

దేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శం

– చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్



లక్డీకాపూల్: భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శమని చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్ గౌడ్ అన్నారు. ఎర్రమంజిల్‌లోని నియాూత్ ఫర్ యాంటీ కరప్షన్ కేంద్ర కార్యాలయంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గురువారం ఆరో రోజు గణేష్ లడ్డూ వేలం నిర్వహించగా చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ రూ.16,116లకు దక్కించుకున్నారు. డా.స్రవంతి, మీడియా కార్యదర్శి జయరాం, కోమటి రమేశ్‌బాబు, కొన్నె దేవేందర్, వరికుప్పల గంగాధర్, జి.హరిప్రకాశ్, బత్తిని రాజేశ్, కొక్కుల ప్రశాంత్, డా.అన్నపూర్ణ, గీతానంద్, స్వప్నారెడ్డి, శివనాగరాజు, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ పద్మజారావు

కీసర: రాంపల్లిలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు మరో ప్రతిష్టాత్మక సిఫోర్ స్కూల్ ఎక్సెలెన్స్ ర్యాంకింగ్స్ 2024 అవార్డు లభించింది. బ్రెయిన్ ఫీడ్ మ్యాగజీన్ వారు దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో నేటి అవసరాలకు అనుగుణంగా సాంస్కృతిక, శాస్త్ర సాంకేతిక విద్యా విధానాన్ని మోటోగా స్వీకరించి, విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దే క్రమంలో రాంపల్లిలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ముందువరుసలో ఉందనడానికి నిదర్శనంగా జాతీయ స్థాయిలో ఇండియాస్ బెస్ట్ డే కో ఎడ్యుకేషన్ సీబీఎస్ఈ స్కూల్ అవార్డును కైవసం చేసుకుంది. ఢిల్లీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సిఫోర్ వ్యవస్థాపకులు ప్రేమ్‌చంద్ పాటిల్ చేతులమీదుగా జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ రాంపల్లి పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజారావు అవార్డు అందుకున్నారు. జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ ఎ.మురళీముకుంద్ ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

రేషన్ షాపుల్లో.. నో స్టాక్

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో పీడీఎస్ బియ్యం స్టాక్ జీరోకు చేరింది. సరుకుల పంపిణీ గడువు మరో ఐదు రోజులకు మందే బియ్యం కోటా నిండుకుంది. దీంతో రెండు రోజులుగా లబ్ధిదారులు రేషన్ షాపుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. రేషన్ షాపులకు నెలసరి కోటా సరఫరా అవుతున్నా.. పోర్టబిలిటీ విధానం బియ్యం కోటాపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీంతో అదనపు కోటా కోసం డీలర్లు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. డీలర్లు అదనపు కోటా కోసం ముందస్తుగానే ఇండెంట్ పెట్టినా.. సరఫరా మాత్రం నత్తలకు నడక నేర్పిస్తోంది.

ఆదర్శ దంపతులకు పురస్కారాల ప్రదాన మహోత్సవం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సర్వేజనా సుఖినోభవంతు సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఆదర్శ దంపతులకు పురస్కారాల ప్రదాన మహోత్సవం జరిగింది. ముఖ్య అతిథులుగా జస్టిస్ డాక్టర్ జి.చంద్రయ్య పాల్గొని మాట్లాడుతూ సూర్య సుధాలయస్ డాక్టర్ సూర్యనారాయణ మాస్టర్‌లకు 40 ఏళ్ల వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కులాంతర మతాంతర వివాహం చేసుకున్న దంపతులు ఒకరిని ఒకరు అర్థం చేసుకొని దాంపత్యాన్ని సుఖసంతోషాలతో కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో సభాధ్యక్షులుగా జాతీయ వినియోగదారుల మండలి కేంద్ర ప్రభుత్వ సంస్థ అధ్యక్షుడు మందడి కృష్ణారెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ అదనపు కలెక్టర్ ఈ.వెంకటాచారి, కంటోన్మెంట్ కాంటెస్ట్ ఎమ్మెల్యే, గద్దర్ రివార్డ్ కమిటీస్ మెంబర్ జి.వెన్నెలమ్మ, లయన్ ఉమాశంకర్‌రెడ్డి, లయన్ డాక్టర్ భారతీ, సూర్యవంశీ, ఈ.సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ కాంగ్రెస్ కాదు.. ఇటాలియన్ కాంగ్రెస్

- రాహుల్ వ్యాఖ్యలపై దృష్టి మరల్చేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాటకం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో పూజలు చేస్తున్న బండి సంజయ్

రాంగోపాల్‌పేట్: రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి చేసిన వ్యాఖ్యలు దుమారం లేపుతున్న నేపథ్యంలో వాటి నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు బీఆర్ఎస్–కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల ఇళ్లపై దాడులు చేసే కొత్త నాటకానికి తెరతీశారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని జనరల్ బజార్‌లో ఆయన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం వివిధ వ్యాపార వర్గాల వద్దకు వెళ్లి సభ్యత్వ నమోదు చేయించారు. అంతకుముందు ఆయన ఉజ్జయినీ మహంకాళి దేవాలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన ఉజ్జయినీ మహంకాళి దేవాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. విదేశాలకు వెళ్లిన ప్రతిసారి రాహుల్ గాంధీ విదేశీయులకు మద్దతు పలికేలా మాట్లాడతారని, అలాగే ఇటీవల ఆయన ఇతర దేశానికి వెళ్లిన సమయంలో మన దేశంలో ఎన్నికల కమిషన్ మోదీకి అనుకూలంగా ఉందని వ్యాఖ్యానించారని అన్నారు. ఎన్నికల కమిషన్ ఎన్డీఏకు అనుకూలంగా ఉంటే సీట్లు ఎందుకు తగ్గుతాయని ప్రశ్నించారు. అలాగే సిక్కులను ఊచకోత కోసింది రాహుల్ గాంధీ నానమ్మ ఇందిరాగాంధీ అని, కానీ ఇప్పుడు సిక్కులు చేతికి కడియం, తలపాగా చుట్టుకునే స్వేచ్ఛ లేదని వ్యాఖ్యానించడం దారుణమన్నారు. ఇప్పుడు అలాంటి వ్యాఖ్యలు చేసే నైతిక అర్హత రాహుల్ గాంధీకి లేదన్నారు. గతంలో కూడా దేశంలో ప్రజాస్వామ్యం చనిపోతుందని వ్యాఖ్యానించి విదేశాలు భారత్‌లో జోక్యం చేసుకోవాలని అన్నారని, ఆయనకు దేశంలో ఉండే చట్టాలు, ప్రజాస్వామ్యంపై నమ్మకం కంటే విదేశాలపైనే అపార నమ్మకం ఉందన్నారు. మన దేశాన్ని ముక్కలు చేయాలని కుట్రలు చేసే టెర్రరిస్టులు రాహుల్‌ను సమర్థిస్తున్నారని, వారితో ఆయన చేతులు కలిపారని ఆరోపించారు. ఇండియన్ కాంగ్రెస్ పార్టీ కాదని, అది ఇటాలియన్ కాంగ్రెస్ పార్టీ అని, రాహుల్ గాంధీ ఇటాలియన్ బ్రాండ్ అని దుమ్మెత్తి పోశారు. రాహుల్ గాంధీ అవసరమైతే ఇటలీ, పాకిస్తాన్, బంగ్లాదేశ్ ఎక్కడికైనా వెళ్లిపోవచ్చని ఎద్దేవా చేశారు. విదేశాల్లో చేసిన రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై మన దేశంలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతుంటే.. వీటి దృష్టి మరల్చేందుకు కాంగ్రెస్–బీఆర్ఎస్ ఒక ఎమ్మెల్యే ఇంటిపై మరో ఎమ్మెల్యే దాడి చేస్తూ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు.

హైడ్రాతో హైడ్రామా

ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా వాటి నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు కాంగ్రెస్ పార్టీ హైడ్రా పేరుతో హైడ్రామా సృష్టిస్తోందని బండి సంజయ్ విమర్శించారు. తాము హైడ్రాకు వ్యతిరేఖం కాదని, చెరువులు, ప్రభుత్వ భూములు కాపాడాలనే దానికి తమ మద్దతు ఉంటుందన్నారు. కానీ గతంలో గ్రామ పంచాయితీ, మున్సిపాలిటీలు అనుమతులు ఇచ్చి, రిజిస్ట్రేషన్ శాఖ రిజిస్ట్రేషన్ చేయగా, బ్యాంకు రుణాలతో ఇళ్లు కట్టుకున్న పేద, మధ్య తరగతి ప్రజల ఇళ్లను ఉన్నఫలంగా ఎలా కూలగొడతారని ఆయన ప్రశ్నించారు.

నగరంలో నేడు

- డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో అక్కినేని నాగేశ్వరరావు అభినయ పురస్కారాన్ని సినీ కథా నాయకులు డాక్టర్ సుమన్ తల్వార్‌కు ప్రదానం చేస్తారు. రాత్రి 7.15 గంటలకు కౌశల్య సుప్రజా రామా నాటికను ప్రదర్శన ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



చికిత్స పొందిన రోగితో వైద్యులు

రాంగోపాల్‌పేట్: లివర్ సిర్రోసిస్‌తో బాధపడుతున్న ఓ 63 ఏళ్ల వృద్ధుడికి చిన్నపాటి కోతతో (మినిమల్లీ ఇన్వేజివ్ పద్ధతి)తో కాలేయ మార్పిడి చేసి అరుదైన ఘనతను సాధించారు సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి వైద్యులు. ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ హెపటోబైలియరీ పాంక్రియాస్, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ సచిన్ డాగా తెలిపిన వివరాల ప్రకారం లివర్ సిర్రోసిస్ అనేది చాలా తీవ్రమైన సమస్య, దానికి కాలేయ మార్పిడి మాత్రమే సరైన చికిత్స, దీనికి సాంప్రదాయ పద్ధతిలో పెద్ద కోతలతో శస్త్ర చికిత్సలు చేస్తారు. దీనివల్ల ఎక్కువ రోజులు ఆస్పత్రిలో ఉండటం, కోలుకునేందుకు చాలా సమయం పడుతుంది. అయితే 63 ఏళ్ల ఓ వృద్ధుడు లివర్ సిర్రోసిస్‌తో బాధపడుతూ కిమ్స్ వైద్యులను ఆశ్రయించారు. అయితే అతడికి చిన్నపాటి కోతతో మినిమల్లీ ఇన్వేజివ్ పద్ధతితో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స చేయాలని నిశ్చయించిన వైద్యులు దిగ్విజయంగా ఈ చికిత్సను పూర్తి చేసి ఐదు రోజుల్లోనే డిశ్చార్జ్ చేశారు. ఇది దేశంలోనే అరుదైన శస్త్ర చికిత్స అని డాక్టర్ తెలిపారు.

మహిళలంటే అంత చులకనా..?

- కౌశిక్‌రెడ్డి మహిళలకు క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ భవన్ ఎదుట కాంగ్రెస్ మహిళా నేతల నిరసన



బంజారాహిల్స్: మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మహిళలకు క్షమాపణలు చెప్పాలని టీపీసీసీ మహిళా నేతలు డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ భవన్ ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి చిత్రపటాలను దహనం చేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు చీరలు కట్టుకొని గాజులు వేసుకోవాలంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం లేపిన నేపథ్యంలో మహిళా కాంగ్రెస్ నేతలు పెద్దఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కేటీఆర్ కూడా మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యానించారని వెంటనే మహిళా కమిషన్ ముందుకొచ్చి క్షమాపణలు చెప్పినట్లు గుర్తు చేశారు. చీరలు, గాజులు కట్టుకున్న మహిళలంటే అంత చులకనా అని విమర్శించారు. టీపీసీసీ మహిళా నేత కాల్వ సుజాత, కాంగ్రెస్ జూబ్లీహిల్స్ డివిజన్ నేత కాటూరి రమేష్, అంబర్‌పేట నియోజకవర్గం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బంజారాహిల్స్ పోలీసులు బీఆర్ఎస్ భవన్ ఎదుట భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నిరసనకారులను అక్కడి నుంచి తరలించారు.


జస్టిస్ సిటీలో కరువైన న్యాయం

- నల్సార్ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ విద్యార్థులు
- యూనివర్సిటీ విద్యార్థులందరికీ సమన్యాయం చేయలంటూ విద్యార్థుల ఆందోళన



శామీర్‌పేట్: జస్టిస్ సిటీలోనే జస్టిస్(న్యాయం) కరువైందంటూ శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీ, హైదరాబాద్ క్యాంపస్ విద్యార్థులు గురువారం ఆందోళన చేపట్టారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని జస్టిస్ సిటీలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో మేనేజ్‌మెంట్ విద్యార్థులకు సరైన వసతులు కల్పించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నల్సార్ యూనివర్సిటీలో లా చదువుతున్న విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల కంటే మేనేజ్‌మెంట్ కోర్సులు చదువుతున్న సుమారు 500 మంది విద్యార్థులకు అరకొర వసతులు కల్పిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మమ్మల్ని రెండోస్థాయి పౌరులుగా యూనివర్సిటీ యాజమాన్యం, మిగతా విద్యార్థులు పరిగణిస్తున్నారని, యూనివర్సిటీ విద్యార్థి సంఘంలో సభ్యత్వం కూడా ఇవ్వడం లేదన్నారు. రూ.లక్షల్లో ఫీజులు చెల్లిస్తున్నా సౌకర్యాలు కల్పించడంలో చిన్నచూపు చూస్తున్నారని, ఇప్పటికైనా న్యాయం చేయకుంటే ఆందోళనను ఉధ్రుతం చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు. అనంతరం అడ్మినిస్ట్రేషన్, మెయిన్‌గేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.

అంధత్వానికి చరమగీతం



- కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో సమస్యకు పరిష్కారం
- దేశవ్యాప్తంగా 50 కార్నియా బ్యాంకులు ఏర్పాటు చేయాలి
- అంకిత భావంతో పనిచేసే కంటి వైద్యులు అవసరం
- ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జీఎన్‌రావు

సాక్షి, సిటీబ్యూరో: దేశంలో అంధత్వాన్ని చాలా సులువుగా పారదోలవచ్చని, అందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేస్తే సాధ్యమవుతుందని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ జీఎన్‌రావు పేర్కొన్నారు. ఎల్వీ ప్రసాద్ సంస్థకు చెందిన శాంతిలాల్ సంఘ్వీ కార్నియా ఇన్‌స్టిట్యూట్ ఇప్పటి వరకు 50 వేల కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్స్ పూర్తి చేసిన సందర్భంగా గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జీఎన్ రావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 50 కార్నియా బ్యాంకులు, 30 ఆస్పత్రులు ఏర్పాటు చేసి అంకితభావంతో పనిచేసే నైపుణ్యం కలిగిన డాక్టర్లు ఉంటే త్వరలోనే అంధత్వానికి చెక్ పెట్టొచ్చని, ఇది చాలా చిన్న సమస్య, లేనిపోని అపోహలతో జటిలం చేసుకుంటున్నామని వివరించారు. తమ బ్యాంకు తరఫున దాదాపు 1.2 లక్షల కార్నియాలను సేకరించామని, ఈ విషయంలో ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉన్నామని ప్రకటించారు. వాటిలో 50 వేలకు పైగా కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్స్ నిర్వహించామని వెల్లడించారు. ఏటా దాదాపు 2 వేల ట్రాన్స్‌ప్లాంటేషన్స్ నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో 3 వేల ట్రాన్స్‌ప్లాంటేషన్స్ నిర్వహించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని వివరించారు. దీనిద్వారా కార్నియా సంబంధిత అంధత్వాన్ని సమూలంగా నిర్మూలించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

నాలుగు రకాలుగా కార్నియా అంధత్వం

ఎల్వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్ మాట్లాడుతూ.. వ్యవసాయ పనులు చేసుకునే సమయంలో ప్రమాదవశాత్తూ దుమ్ము, ధూళి వంటివి పడినా.. కళ్లకు ఏదైనా గుచ్చుకున్నా అంధత్వం వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. సున్నం లేదా రసాయనాలు కళ్లలో పడినప్పుడు కూడా అంధత్వం వచ్చే అవకాశం ఉందని చెప్పారు. మేనరికం పెళ్లిళ్ల వల్ల వారసత్వంగా వచ్చే కంటి జబ్బులు తర్వాతి తరానికి వచ్చే ప్రమాదం ఉందని, అందులో కార్నియా అంధత్వం కూడా ఒకటని వివరించారు. కాటరాక్ట్ శస్త్రచికిత్సలు సరిగ్గా నిర్వహించకపోవడం వల్ల కూడా కార్నియా డ్యామేజీ అయ్యి అంధత్వం వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అయితే ప్రమాదాల వల్ల కార్నియా దెబ్బతింటే సులువుగా పరిష్కరించొచ్చని చెప్పారు. దెబ్బ తగిలినప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కళ్లలో పాలు వేయడం లేదా ఇతర నాటు వైద్యం చేస్తారని, ఇది సరికాదని హెచ్చరించారు. ఇలా చేస్తే మరింత ప్రమాదకరంగా మారి ఇన్‌ఫెక్షన్లకు దారి తీస్తుందని సూచించారు. శాంతిలాల్ సంఘ్వీ కార్నియా ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెత్తా చెదారం, వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగింపు



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఖైరతాబాద్ డీసీ రజనీకాంత్‌రెడ్డి

బంజారాహిల్స్: చెత్తా చెదారం, వ్యర్థాలు తొలగించేందుకు అదనంగా 10 వాహనాలు ఏర్పాటు చేస్తున్నామని జీహెచ్ఎంసీ సర్కిల్–17 డీసీ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. ఖైరతాబాద్ బడా గణేష్ దగ్గర నుంచి నిమజ్జన ఊరేగింపు జరిగే రూట్‌ను రజనీకాంత్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్‌వేస్ట్ తరలింపునకు మరోమూడు వాహనాలు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. నిరంతరం గార్బేజ్ శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో నెక్లెస్‌రోడ్డులో నిర్మించిన బేబీపాండ్‌ను ఆయన పరిశీలించారు. ప్రతిరోజూ నిమజ్జనాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతాల్లో పర్యటించి సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేశారు.

శానిటేషన్‌ను పరిశీలించిన కమిషనర్

సెక్రటేరియట్, ఎన్టీఆర్ మార్గ్‌లలో గురువారం తెల్లవారుజామున జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. రోజూ నిమజ్జనాలు జరుగుతున్న నేపథ్యంలో గ్రీన్‌వేస్ట్‌ను ఎప్పటికప్పుడు తొలగించాలని, రోడ్లన్నీ పరిశుభ్రంగా ఉండాలని అధికారులకు సూచించారు. తెల్లవారుజాము 4 గంటలకే ఆమె ఈ ప్రాంతంలో సుడిగాలి పర్యటన చేపట్టారు.

డ్రోన్ ద్వారా నాలాలను తనిఖీ చేసిన హైడ్రా

ఐదు గంటలపాటు డ్రోన్‌తో ఫొటోలు తీసిన అధికారులు



డ్రోన్ ద్వారా నాలా కొలతలను పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

బంజారాహిల్స్: నాలాలను ఆక్రమించిన వారి భరతం పట్టేందుకు హైడ్రా రంగంలోకి దిగింది. నాలాలకు రెండువైపులా ఆక్రమణలు చేపట్టి వరదనీటి మార్గాలకు అడ్డంకులు సృష్టించిన అక్రమ కట్టడాలను గుర్తించేందుకు డ్రోన్ సహాయం తీసుకుంటుంది. ఇందులో భాగంగానే షేక్‌పేట ఓయూ కాలనీ నుంచి ఫిలింనగర్ రామానాయుడు స్టూడియో వరకు 10 కిలో మీటర్ల మేర విస్తరించి ఉన్న బుల్కాపూర్ నాలాను హైడ్రా టీమ్ డ్రోన్‌తో ఫొటోలు తీసింది. హైడ్రా ఏఈ సుజిత్, డ్రోన్ టీం, షేక్‌పేట మండల సర్వేయర్ మధుసూదన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ ఏఈ మోహన్‌రావు, ఇరిగేషన్ ఏఈ కిషోర్‌వర్మ తదితరుల బృందం 5 గంటల పాటు డ్రోన్‌తో ఈ నాలాకు రెండు వైపులా వీడియోలు, ఫొటోలు తీసింది. లే అవుట్ ప్రకారం గూగుల్ మ్యాప్‌లో ఈ భారీ బుల్కాపూర్ నాలా ఎంత వెడల్పు, పొడవు ఉంది, ఇప్పుడు దాని పరిస్థితి ఏమిటి అన్నదానిపై ఫొటోలు తీసి సిస్టంలో పెట్టి సూపర్ ఇంపోజ్ చేయనున్నారు. ఈ డ్రోన్ 200 నుంచి 300 మీటర్ల ఎత్తులో ఎగురుతూ క్లారిటీతో ఫొటోలు, వీడియోలను తీయడం వల్ల నాలా ఏ మేర ఆక్రమణకు గురైందో స్పష్టంగా తెలుసుకునే అవకాశాలు ఉన్నాయి. రెండురోజుల పాటు హైడ్రా డ్రోన్ టీమ్ ఈ నాలా వెంబడి ఫొటోలతో పరిశీలన చేపట్టింది. చాలాచోట్ల నాలాకు రెండు వైపులా పెద్ద ఎత్తున ఆక్రమణలు జరిగి కుంచించుకుపోయిన విషయం బట్టబయలవుతుంది.

హైదరాబాద్‌తో ప్రత్యేక అనుబంధం

ఇరాన్ డిప్యూటీ మంత్రి షల్పాఫియాన్



సాక్షి, సిటీబ్యూరో: ఇరాన్‌తో భారత్‌తో పాటు హైదరాబాద్ నగరానికీ శతాబ్దాలుగా చారిత్రక, సాంస్కృతిక అనుబంధం ఉందని ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ శాఖ డిప్యూటీ మంత్రి షల్పాఫియాన్ అన్నారు. గురువారం నగరంలో జరిగిన ఇరాన్ పర్యాటక రోడ్ షో కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఇరాన్ పట్ల సానుకూల వాతావరణాన్ని ప్రోత్సహించడం, అంతర్జాతీయ పర్యాటకులను రప్పించడం, కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించడం, సాంస్కృతిక అనుబంధాన్ని మరింత విస్తరించడమే లక్ష్యంగా భారత్‌లో పర్యాటక రోడ్ షో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.సందర్శకుల మార్పిడితో రెండు దేశాల్లో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

పర్యాటకంతో సత్సంబంధాలు: మంత్రి జూపల్లి

పర్యాటకం వల్ల కేవలం కొత్త ప్రదేశాలను సందర్శించడం మాత్రమే కాదని, ఇరు ప్రాంతాల మధ్య సత్సంబంధాలు ఏర్పడతాయని మంత్రి జూపల్లి కృష్ణారావు అభిప్రాయపడ్డారు. ఇరాన్ సాంస్కృతిక సంపద గురించి మరింత లోతుగా తెలుసుకోవటానికి, ఇరు దేశాల మధ్య పర్యాటక సంబంధాలను బలోపేతం చేయటానికి ఈ రోడ్ షో ఒక గొప్ప వేదికగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ కాన్సుల్ జనరల్ మైదీ షహారొఖి, ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్, ఇరాన్ టూరిజం డైరెక్టర్ జనరల్ షోజేహి, ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి స్నేహజ, తెలంగాణ పర్యాటక శాఖ డైరెక్టర్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు

ముగిసిన టీజీసెట్ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీసెట్–2024 పరీక్షలు ముగిశాయి. గురువారం జరిగిన పరీక్ష ప్రశ్నపత్రం కీ పాస్‌వర్డ్‌ను ఓయూ ఇన్‌చార్జి వీసీ ఎం.దానకిశోర్ సచివాలయంలోని తన ఛాంబర్‌లో విడుదల చేశారు. టీజీసెట్‌కు 33,764 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వివిధ జిల్లాల్లో జరిగిన పరీక్షలకు 24న సీబీటీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండు విడతలుగా జరిగిన పరీక్షకు ఉదయం 79.5 శాతం, మధ్యాహ్నం 79 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. టీజీసెట్–2024 పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు పేర్కొన్నారు.

నూతన క్రీడా విధానానికి శ్రీకారం

- క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం
- స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి



స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తొమ్మిది నెలల కాలంలో అన్ని రంగాల్లో మార్పు సాధిస్తున్నట్లుగానే క్రీడారంగంలో సమూలమైన మార్పులు సాధిస్తున్నామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి తెలిపారు. ఎల్బీ స్టేడియంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత క్రీడలకు చారిత్రాత్మకమైన బడ్జెట్ రూ.364 కోట్లు కేటాయించినట్లు గుర్తు చేశారు. గ్రామీణ క్రీడారంగానికి ప్రాధాన్యత ఇచ్చేందుకు నూతన క్రీడా విధానానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రతి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఒక క్రీడా పాఠశాలను ఏర్పాటు చేస్తూ వాటిని క్రీడా విశ్వవిద్యాలయానికి అనుసంధానం చేసేలా సత్వర చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. తెలంగాణ క్రీడా సమాజంలో నూతనోత్సాహం నెలకొందని, వివిధ క్రీడా సంఘాల సహకారంతో స్పోర్ట్స్ అథారిటీ తరఫున విరివిగా కార్యక్రమాలు చేపడుతూ.. క్రీడా సమాజానికి మరింత చేరువవుతామని ప్రకటించారు.

స్పోర్ట్స్ హబ్‌గా హైదరాబాద్..

నగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణం, గోల్ఫ్ క్లబ్ ఏర్పాట్లతో పాటు క్రీడలకు ప్రాధాన్యత కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. నగరంలో ఉన్న అన్ని స్టేడియాల పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నామని, జాతీయ, అంతర్జాతీయ పోటీలకు ఆతిథ్యం ఇచ్చేలా అన్ని స్టేడియాలను తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఇటీవల అంతర్జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించినట్లు గుర్తుచేశారు. అదేవిధంగా రాబోయే 3 నెలల కాలంలో సీఎం కప్, ఇతర క్రీడా పోటీలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

కొత్త కోర్టులతో సత్వర న్యాయం

హైకోర్టు న్యాయమూర్తులు



న్యాయమూర్తులకు జ్ఞాపిక అందజేస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

కుషాయిగూడ: కొత్త కోర్టులతో సత్వర న్యాయం జరుగుతుందని భవిష్యత్తులో మరిన్ని కొత్త కోర్టులు ప్రారంభం కానున్నాయని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, బి.విజయ్‌సేన్‌రెడ్డి అన్నారు. కుషాయిగూడలోని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కోర్టు ఆవరణలో గురువారం 4వ అదనపు డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రస్తుతం కోర్టుల్లో చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులు సత్వరం పరిష్కారం కావాలంటే జిల్లాలో మరిన్ని కొత్త కోర్టుల ఏర్పాటు అవసరముందన్నారు. భవిష్యత్తులో కొత్త కోర్టుల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అందరి సహకారం ఉంటేనే కేసులకు త్వరగా పరిష్కారం లభిస్తుందని, ఆ దిశగా పరస్పర సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జిల్లా న్యాయమూర్తి బాల భాస్కర్, ఫస్ట్ అడిషనల్ జిల్లా న్యాయమూర్తి ఆర్.రఘునాథ్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమ రేందర్‌రెడ్డి, సెక్రటరీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతి విషాదం నన్ను దృఢం చేసింది

- హైదరాబాద్ బిర్యానీకి పెద్ద ఫ్యాన్
- ఇక్కడి హలీం తినడానికి ఇష్టపడతాను
- పెద్ద బాక్సుల్లో పార్శిల్స్ వచ్చేవి
- అలనాటి ప్రముఖ నటి పూజా బేడీ

సాక్షి, సిటీబ్యూరో, రాయదుర్గం: నా జీవితంలో చోటు చేసుకున్న ప్రతి విషాదం నన్ను దృఢంగా చేసిందని ప్రముఖ నటి పూజా బేడీ అన్నారు. గచ్చిబౌలిలో గురువారం ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆమె కాసేపు మీడియాతో ముచ్చటించారు. చాలా తెలుగు సినిమాల్లో నటించాను. మోహన్‌బాబు నుంచి జూ.ఎన్టీఆర్ లాంటి అగ్ర హీరోల వరకూ అనేక సినిమాల్లో నటించాను. హైదరాబాద్ షూటింగ్ ప్రదేశాలను ఎంతగానో ఎంజాయ్ చేశాను. చార్మినార్ గల్లీల్లో తిరిగాను, గాజుల దుకాణాలు ఆకట్టుకుంటాయి. స్థానిక పర్యాటక ప్రాంతాలను సందర్శించాను. ప్రత్యేకించి హైదరాబాద్ ధమ్ బిర్యానీకి పెద్ద ఫ్యాన్‌ను. అలాగే సలాడ్ కూడా ఇష్టం. వివిధ సందర్భాల్లో వచ్చినపుడు బిర్యానీతో పాటు హలీం తినడానికి ఇష్టపడతాను. హైదరాబాద్ నుంచి ముంబయి వెళ్లే సమయంలో పెద్ద పెద్ద బాక్సుల్లో బిర్యానీ పార్శిల్స్ వచ్చేవి. తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకోవడం ఇష్టం అని తెలిపారు. అంతకు ముందు ఎఫ్ఐసీసీఐ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ) గచ్చిబౌలి చాప్టర్ సత్వ నాలెడ్జ్ సిటీలో 'లిమిటేషన్ టు లిబరేషన్ అండ్ అన్‌లాక్ యువర్ ఇన్నర్ స్ట్రెంక్త్' అనే అంశంపై ఫిల్మ్ స్టార్, వెల్నెస్ ఎవాంజెలిస్ట్ పూజా బేడితో ఇంటరాక్టివ్ సెషన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్ఓ చైర్‌పర్సన్ ప్రియా గజ్దర్, ఫ్లో సభ్యులు పాల్గొన్నారు.

నేనెప్పుడూ ఏడవలేదు..

విద్యార్థి దశలో నేను తరగతిలో ఫస్ట్ ఉండేదాన్ని. సినిమాల్లోకి వస్తానని అస్సలు అనుకోలేదు. మా అమ్మ మంచి డ్యాన్సర్. ఈ ఫీల్డ్‌లోకి వచ్చాక ఎక్కడా వెనుదిరిగి చూడలేదు. గత కొన్నేళ్లుగా నా కుటుంబంలో ప్రతి ఆరు నెలలకూ చెడు వార్త వినాల్సి వచ్చింది. అమ్మమ్మ చనిపోయింది. నాకు ఇష్టమైన కుక్క మృతి చెందింది. తండ్రిలాంటి వ్యక్తిని కోల్పోయాను. నా తమ్ముడికి మరో సమస్య వచ్చింది. నాకు విడాకుల సమస్య. నేనెప్పుడూ ఏడవలేదు. విచారిస్తూ నా లక్ష్యాన్ని మర్చిపోలేదు. ఆత్మ స్థైర్యం కోల్పోలేదు. పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొన్నాను. వెల్‌నెస్ సంస్థను నిర్మించాను. ప్రతి విషాదం నన్నో దృఢమైన వ్యక్తిని చేసింది. జీవితం చాలా చిన్నది. ఇదొక ప్రయాణం. అందరికీ సమస్యలు ఉంటాయి. జీవితంలో అవి ఒక భాగం మాత్రమే. వాటిని మనం ఎలా ఎదుర్కొంటామనేదే నిజమైన వ్యక్తిత్వం.

అలా విముక్తి లభించింది..

'నా జీవితంలో ప్రతి విషాదం నన్ను బలమైన వ్యక్తిగా తయారు చేసింది. విడాకుల సమయంలోనూ 12 ఏళ్ల సంతోషమైన జీవితం కోసం 50 ఏళ్లు దయనీయంగా ఉండరాదనుకున్నా. అప్పుడు నాకు విముక్తి లభించింది' అని తెలిపారు.



మనం బాగుంటే చాలదు.. మనవి అన్న ప్రతిదీ బాగుండాలి. మనం ఎక్కి తిరిగే కారు నుంచి మన వెనుకే తిరిగే శునకం, పెంపుడు జంతువు దాకా..అన్నీ బాగుండాలి. గ్లామర్ మేనియా నానాటికీ విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో పెద్దలూ, పిల్లలూ దాటి చివరకు పెట్స్ వరకూ వచ్చేసింది. మై పెట్ ఈజ్ బ్యూటీఫుల్ అంటూ సగర్వంగా చెప్పుకోవాలనే ఆరాటం పెరుగుతుండడంతో పెట్స్‌కు అందాలను అద్దే పార్లర్లు శరవేగంగా విస్తరిస్తున్నాయి. దీని కోసం నగరంలో మొబైల్ పార్లర్లు, గ్రూమింగ్ సేవలను అందించే పార్లర్స్, బ్యూటీ సెలూన్స్ ఇలా ఒక్కటేమిటి.. మనుషులకు ఎన్ని రకాల సౌందర్య సాధనాలు ఉన్నాయో.. అవన్నీ పెంపుడు జంతువులకూ అందుతున్నాయి..

- సాక్షి, సిటీబ్యూరో





స్నానం నుంచి.. హెయిర్ డ్రై వరకూ..

ఈ పెట్స్ పార్లర్ల సేవల జాబితాలో ఔషధ స్నానం, జుట్టు కత్తిరించడం, నెయిల్ క్లిప్పింగ్, చెవి శుభ్రపరచడం, హెయిర్ క్లీనింగ్, డ్రై.. వంటివి ఉన్నాయి. ఈ సేవల కోసం పూర్తిగా రసాయనాలు లేని ఉత్పత్తులను మాత్రమే ఉపయోగిస్తున్నామని పార్లర్ల నిర్వాహకులు అంటున్నారు. పెంపుడు జంతువులకు, మొత్తం గ్రూమింగ్ ప్రక్రియ దాదాపు ఒక గంట పడుతుందనీ పొడవాటి బొచ్చు కలిగిన శునకాలు, లేదా హస్కీలు వంటి వాటికి 90 నిమిషాల వరకూ పడుతుందని గ్రూమర్లు చెబుతున్నారు. తమ సెలూన్‌లలో పనిచేసే గ్రూమర్లందరూ వెటర్నరీ కళాశాల డిప్లొమా హోల్డర్లు. ఉద్యోగంలో భాగంగా తొలుత వారు మూడు నెలల పాటు శిక్షణ పొందుతారని జస్ట్ గ్రూమ్ నిర్వాహకులు అంటున్నారు.

పెట్.. బ్యూటీ సెట్..



అడుగడుగునా పెట్ పార్లర్స్, పోటాపోటీగా గ్రూమింగ్ సేవలు..

వాకిట్లో మొబైల్ పార్లర్లు, డ్రెస్సులేస్తున్న స్టైలిస్ట్స్..

నగరవాసుల స్టేటస్ సింబల్స్‌గా..

వ్యయ ప్రయాసలకు రెడీ అంటున్న సెలబ్స్..

హైదరాబాద్ వైబ్స్

సౌందర్య పిపాసలో మనుషులతో శునకాల పోటీ..

శునకాలు చూపే ఆప్యాయత ఎలా ఉంటుందో వాటి యజమానులకు మాత్రమే అర్థం అవుతుంది. అవి అలవాటైన మనుషులతో అల్లుకుపోతుంటాయి. కాబట్టి పెట్స్ ఆరోగ్యంగా ఉండాలంటే వాటిని పరిశుభ్రంగా ఉంచడం వాటికి మాత్రమే కాదు వాటి యజమానులకు కూడా అత్యవసరం. రోజువారీ స్నానం చేయించడం, నులిపురుగుల నిర్మూలన, జుట్టు కత్తిరించడం, పళ్లను పాలిష్ చేయడం, గోళ్లను కత్తిరించడం ఇలాంటివెన్నో చేయడం అవసరం. అయితే పెట్‌ను ఇంటికి తెచ్చుకున్నంత సులభం కాదు వాటికి ఈ సేవలన్నీ చేయడం.. ఇందుకు సమయంతో పాటు అనుభవం, నైపుణ్యం కూడా కావాలి. సరిగ్గా చేయలేకపోతే, అలర్జీలు ఇన్ఫెక్షన్లతో ఇంటిల్లిపాదికీ సమస్యలు తప్పవు.

గ్రూమింగ్ దారి..ఆర్గానిక్ మరి..

నగరంలో ఇలాంటి పెట్ యజమానుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు రకాల సేవలను అందించే వ్యక్తులు, సంస్థలు వచ్చాయి. వీటి మధ్య పోటీ తత్వం కూడా పెరిగింది. పెట్స్‌కు మసాజ్ చేయడం, బబుల్ బాత్ తదితర సదుపాయాలు మనుషుల స్పా మాదిరిగానే రొటీన్ భౌభౌలకు కూడా విస్తరించాయి. వీటికి తూడో మరిన్ని వెరైటీలు కూడా జతయ్యాయి.

అదిరే డ్రెస్సింగ్ స్టైల్..

పెళ్లికి వెళుతూ పిల్లిని చంకనబెట్టుకుపోవడం నామోషీ అనే పరిస్థితి ఇప్పుడు లేదు. అది పిల్లి అయినా కుక్కపిల్లయినా.. సరే దర్జాగా తమ పెట్‌ని కూడా వేడుకల్లో భాగం చేస్తున్నారు. పైగా అదే తమ స్టేటస్ సింబల్‌గానే భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఫంక్షన్ లేదా ఫొటోషూట్‌కు తీసుకెళ్లాల్సి ఉంటే, తగిన దుస్తులు ధరింపజేయడం, ప్రత్యేకంగా హెయిర్‌ను సెట్ చేయడం వంటివి కూడా పెట్ స్టైలిస్ట్స్ చేస్తున్నారు. అలాగే పిల్లులను పెంచుకునేవారికి వీరు సేవలు అందిస్తున్నారు.





వ్యాధుల వ్యయంతో పోలిస్తే నయమే..

శుభ్రత పాటిస్తే పెట్స్ ఆరోగ్యంగా ఉంటాయి. వాటికి సరైన విధంగా స్నానం చేయించడం అన్ని వేళలా సాధ్యం కాక చర్మవ్యాధులు వంటివి రావచ్చు. గ్రూమింగ్ లేకపోయినా ఆరోగ్య సమస్యలే. అందుకే నా పెట్‌కి నెలకోసారి స్పాలో స్నానం, మూడు నెలలకు ఒకసారి గ్రూమింగ్ చేయిస్తాను. నెలవారీగా రూ.3వేలు ఖర్చు అవుతుంది. అయితే వ్యాధులు వస్తే అంతకన్నా ఎక్కువే ఖర్చు చేయాలి. మొబైల్ సేవల వల్ల పెట్ స్పా కోసం దూరభారం ప్రయాణించే అవసరం పోయింది.

- పరిమళ, సికింద్రాబాద్

తరలివచ్చి.. తళుకులద్దగ..

గతంలో ఈ తరహా పెట్ గ్రూమింగ్ సేవల్ని నగరంలో కొన్ని సంస్థలు తమ ఆవరణలో అందించేవి. అయితే కరోనా సమయంలో తమ పెట్స్‌ని గ్రూమింగ్ పార్లర్స్‌కు తీసుకెళ్లలేక పడిన ఇబ్బందులు మొబైల్ పార్లర్స్‌కు ఆజ్యం పోశాయి. ప్రస్తుతం నగరంలో దాదాపు వందకు పైగా మొబైల్ వ్యాన్లు ఈ పెట్ స్పాలను ఇంటింటికీ మోసుకొస్తున్నాయి. తమకు ఏడు వ్యాన్ల దాకా ఉన్నాయని, నగర వ్యాప్తంగా పెట్స్‌కు మొబైల్ స్పా సేవల్ని అందిస్తున్నాయని పెట్ గల్లీ సిబ్బంది సాక్షికి వివరించారు. జూబ్లీహిల్స్‌లోని పెట్ స్పాలో ప్రొఫెషనల్ గ్రూమర్ అయిన డి.సౌమ్య మాట్లాడుతూ, 'ఇంతకుముందు, పెంపుడు జంతువును అలంకరించేందుకు ఇళ్లను సందర్శించేవాళ్లం. అయితే ఇళ్ల దగ్గరకు వెళ్లడం, అక్కడ సరైన ప్రైవసీ లేకపోవడం సహా అనేక రకాల ఇతర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రూమింగ్ వ్యాన్ ఉత్తమ ప్రత్యామ్నాయంగా మారింది' అని చెప్పారు.



- నగరానికి చెందిన ప్రొఫెషనల్ పెట్ కేర్ సంస్థ పెట్‌ఫోక్‌కు చెందిన నిపుణులైన గ్రూమర్‌ల బృందం ఇప్పుడు పెంపుడు జంతువులకు ఇంటి దగ్గరే వారి వస్త్రధారణ సేవలను సైతం అందజేస్తుంది, అత్యాధునిక సాంకేతికతతో ప్రత్యేకంగా రూపొందించిన వ్యాన్‌లను ఈ సంస్థ ఉపయోగిస్తోంది. యూజర్ ఫ్రెండ్లీ ఇ-కామర్స్ ప్లాట్‌ఫారమ్ ద్వారా, వెబ్ యాప్ మొబైల్ యాప్‌గా కూడా ఈ సేవ అందుబాటులో ఉంటుంది.
- మెకానికల్ ఇంజనీర్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ చేసిన చైత్ర సాయి దాసరి ప్రారంభించిన డోర్‌స్టెప్ సర్వీస్ జస్ట్ గ్రూమ్. 'పెంపుడు జంతువులకు రిలాక్సేషన్ ఇచ్చి విశ్రాంతి తీసుకునేలా చేసే గ్రూమింగ్ సర్వీస్ అవసరం. వీటికి వస్త్రధారణ కేవలం సౌందర్య సాధనం కాదు. ఇది పెంపుడు జంతువు మానసిక ఆరోగ్యానికి దారి కూడా. సరైన విధంగా లేని స్నానం చర్మ వ్యాధులు కలిగించి అవి వస్త్రధారణకు భయపడేలా చేస్తుంది' అంటున్నారు చైత్ర. తమ జస్ట్ గ్రూమ్ ప్రస్తుతం జంటనగరాల వ్యాప్తంగా సంచరిస్తున్న తమ వ్యాన్స్ ద్వారా ప్రతిరోజూ కనీసం 50 పెట్స్‌కు సేవలు అందిస్తున్నారు.



సొంత బిడ్డల్లాగే.. పెట్స్ కూడా..

పెట్స్‌ను పెంచుకుంటున్న నగరవాసులు వాటిని సొంత పిల్లల్లాగే భావిస్తున్నారు. వాటి ఆరోగ్య సంరక్షణతో పాటు వాటికి అవసరమైన అన్ని రకాల అలంకరణలూ చేస్తున్నారు. తమతో పాటు వాటిని టూర్లు, షికార్లు, ఈవెంట్స్‌కు తీసుకువెళుతున్నారు. వీటన్నింటి వల్లే పెట్ గ్రూమింగ్ అత్యంత ప్రధానమైన అంశంగా మారింది. పెట్స్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేఫ్‌ను నిత్యం సందర్శిస్తుంటారంటే.. పెట్స్ పట్ల యజమానుల ప్రేమను అర్థం చేసుకోవచ్చు.

-రుధిర, పెట్ కేఫ్ నిర్వాహకులు



ఉన్నది ఒకటే.. జిమ్‌దగీ

ఇటు ఆరోగ్యం.. అటు ఉపాధి..

- రెండు విధాలా లాభదాయకం
- బౌన్సర్లు, బాడీగార్డులుగా ప్రత్యేక గుర్తింపు
- నిత్యం వ్యాయామంతో రోగాలు దూరం
- పార్ట్ టైం, ఫుల్ టైమ్ ఉద్యోగావకాశాలు
- యువతను ఆకర్షిస్తున్న జిమ్‌లు

జిమ్‌కు వెళ్లడం అనేది శారీరక వ్యాయామం, ఆరోగ్యం కోసం అనేది అందరికీ తెలిసిన విషయం. నాణేనికి మరో వైపు ఆదాయ మార్గం ఉంది. శరీర సౌష్టవం కలిగిన వారికి పార్ట్‌టైం, ఫుల్ టైం ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. నగరంలో వందలాది కుటుంబాలు ఈ రకంగా ఉపాధి పొందుతున్నాయి. కండలు తిరిగిన యువత బాడీబిల్డింగ్ పోటీల్లో పాల్గొనడం, ఉన్నత శ్రేణి కుటుంబాలకు బాడీగార్డులుగా, ఈవెంట్స్, ప్రముఖ వ్యాపార సంస్థలకు బౌన్సర్లుగా రాణిస్తున్నారు. దీంతో వీరికి ఉపాధితో పాటు సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తోంది. - సాక్షి, సిటీబ్యూరో

నిత్యం జిమ్ చేస్తూ ఆరోగ్యంగా, బలంగా ఉన్న వారికి మార్కెట్‌లో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయి. కోరుకున్న వారికి పార్ట్ టైం, ఫుల్ టైం రెండు రకాల ఉద్యోగాలూ లభిస్తున్నాయి. భాగ్యనగరంలో రాజకీయ నాయకులు తమ రక్షణ కోసం ప్రైవేటుగా బాడీగార్డులను నియమించుకుంటున్నారు. ఏవైనా జన సమీకరణ కార్యక్రమాలు ఉన్నప్పుడు బౌన్సర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇక ఉన్నత శ్రేణి కుటుంబాలు, సినిమా, ఇతర సెలబ్రిటీలు బయటకు రావాలన్నా, ఏ చిన్న ఫంక్షన్ చేసుకున్నా బౌన్సర్లను పెట్టడం అలవాటుగా మారిపోయింది. కొన్ని వర్గాలకు బౌన్సర్లను పెట్టుకోవడం స్టేటస్‌గానూ భావిస్తున్నారు. దీంతో నగరంలో బౌన్సర్లకు డిమాండ్ పెరుగుతోంది.

ఈవెంట్స్‌ను బట్టి..

ఒక్కో ఈవెంట్‌కు అక్కడ పరిస్థితులను బట్టి 8 గంటలు, 12 గంటలు, 24 గంటలు ఇలా సమయాన్ని బట్టి డబ్బులు చెల్లిస్తారు. బౌన్సర్లకు 8 గంటలకు కనీసం రూ.1,500 నుంచి రూ.2 వేల వరకూ ఇస్తున్నారు. 12 గంటలు, ఆపై సమయాన్ని బట్టి లెక్కలు ఉంటాయి. మరోవైపు పబ్‌లు, పేరొందిన రెస్టారెంట్లు, స్టార్ హోటల్స్, ప్రముఖ దుకాణాల్లోనూ నెలవారీ వేతనాలకు బౌన్సర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. బాడీగార్డు, బౌన్సర్లకు నెలకు కనీసం రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకూ చెల్లిస్తున్నారు.

17 ఏళ్ల వయసు నుంచి..

నాకు 17 ఏళ్ల వయసు నుంచి జిమ్‌కు వెళ్లడం ప్రారంభించాను. ఇపుడు 30 ఏళ్లు. తొలి రోజుల్లో ఆరోగ్యం, శరీర సౌష్టవం కోసం వెళ్లాను. అందరిలోనూ మనం ప్రత్యేకంగా ఉండాలని ఆలోచించాను. శరీరం ఆకర్షణీయమైన ఆకృతిలో తయారయ్యింది. తదుపరి రోజుల్లో బౌన్సర్‌గా అవకాశాలు వచ్చాయి.



కొన్నాళ్ల తరువాత సొంతంగా బిజినెస్ ప్రారంభించాను. ప్రస్తుతం పార్ట్ టైం బౌన్సర్‌గా పనిచేస్తున్నాను. ఈవెంట్స్ ఉన్నపుడు వెళుతున్నా. 8 గంటలకు కనీసం రూ.1500 ఆపైన వస్తాయి. 12 గంటలు అయితే రూ.2 వేల వరకూ ఇస్తున్నారు. ఈ ఆదాయం ఆర్థిక వెసులుబాటు కల్పిస్తుంది.

- అమోల్, బౌన్సర్, బంజారాహిల్స్

పర్సనల్ బాడీగార్డుగా..



గత పదేళ్ల నుంచి జిమ్‌కు వెళుతున్నాను. డైట్ పాటిస్తాను. ఆరోగ్యంగా, శారీరకంగా ఫిట్‌గా ఉంటాను. నాకు తెలిసిన వారి రిఫరెన్స్ ద్వారా పర్సనల్ బాడీగార్డుగా చేరాను. నమ్మకంగా పనిచేసుకుంటున్నాను. మంచి వేతనం వస్తుంది. కుటుంబ సభ్యులతో సంతృప్తికరమైన జీవితం సాగిస్తున్నాను.

- ఆదిల్, జూబ్లీహిల్స్

నగరంలో కిస్నా విస్తరణ..



సాక్షి, సిటీబ్యూరో: జాతీయ స్థాయి ఆభరణ విక్రయ సంస్థ.. కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెలరీ, నగరంలో ఏఎస్‌రావు నగర్, సికింద్రాబాద్ సోమాజిగూడలో తమ షోరూమ్‌లను గురువారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో హరి కృష్ణ గ్రూప్ వ్యవస్థాపకుడు, ఎండీ, ఘనశ్యామ్ ధోలాకియా మాట్లాడుతూ 'హర్ ఘర్ కిస్నా' లక్ష్యానికి అనుగుణంగా నగరంలో మా కార్యకలాపాలను విస్తరిస్తున్నాం' అని చెప్పారు. సంస్థ డైరెక్టర్ పరాగ్ షా మాట్లాడుతూ హైదరాబాద్‌లోని మా వినియోగదారుల విభిన్న అవసరాలను దృష్టిలో పెట్టుకుని వాటిని తీర్చడానికి తాము ఈ షోరూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా సంస్థ మొక్కలు నాటే కార్యక్రమంతో పాటు నిరుపేదలకు ఆహారాన్ని పంపిణీ చేస్తుందని తెలిపారు.

అక్షయ్ సక్సేనాకు సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డు



సాక్షి, సిటీబ్యూరో: జూబిలెంట్ భర్తియా ఫౌండేషన్, స్క్వాబ్ ఫౌండేషన్ ఫర్ సోషల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ సంయుక్తంగా సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్ -ఇండియా 2024ను అవంతి ఫెలోస్ అక్షయ్ సక్సేనాకు బహూకరించారు. ఇటీవల న్యూ ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్క్వాబ్ ఫౌండేషన్ ఫర్ సోషల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ వ్యవస్థాపకురాలు, చైర్‌పర్సన్ హిల్డే స్క్వాబ్, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ప్రొఫెసర్ క్లాస్ స్క్వాబ్, జూబిలెంట్ భర్తియా ఫౌండేషన్ డైరెక్టర్ శ్యామ్ ఎస్ భర్తియా, కో-చైర్మన్, శ్రీ హరి ఎస్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

'అశోకా వన్'లో గ్రీన్ గణేషా..

కూకట్‌పల్లి: వై జంక్షన్‌లోని అశోకా వన్ మాల్‌లో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఆరో రోజు జరిగిన ఈ వేడుకలకు ప్రముఖ తెలుగు నటి రెజీనా కసాండ్రా, టాలీవుడ్ ప్రముఖులు, సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్, హాస్య నటుడు రచ్చ రవి, సంగీత దర్శకుడు భీమ్ సి 92.7 బిగ్ ఎఫ్ఎం బిగ్ గ్రీన్ గణేషుడిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా మాల్ నిర్వాహకులు మాట్లాడుతూ పర్యావరణ స్పృహను నింపుతూ బిగ్ గ్రీన్ గణేషుడిని ఏర్పాటు చేసి వేడుకలకు స్వాగతించామని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలు, ఇంటరాక్టివ్ సెషన్స్ సహా వివిధ కార్యకలాపాల్లో సందర్శకులు ఆసక్తిగా పాల్గొన్నారు. వారం రోజుల పాటు జరిగిన ఈ వేడుకలకు పలువురు ప్రముఖులు హాజరై వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. పర్యావరణ రహిత వేడుకల ప్రాముఖ్యతపై నటి రెజీన తన ఆలోచనలు పంచుకున్నారు. అనంతరం అతిథులు ట్రెండింగ్ మ్యూజిక్‌తో డ్యాన్స్‌లు చేసి ప్రేక్షకులను ఆహ్లాదపరిచారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు.






ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై ముందడుగు

- సిఫార్సుల కోసం ప్రత్యేక కమిటీ
- చైర్మన్‌గా ఉత్తమ్, కోచైర్మన్‌గా దామోదర నియామకం

సాక్షి, హైదరాబాద్: షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) వర్గీకరణపై మరో అడుగు ముందుకు పడింది. ఇప్పటికే వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. వర్గీకరణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగిస్తూ సుప్రీంకోర్టు తీర్పులో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ ప్రక్రియను ఎలా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై సలహాలు, సూచనలు, సిఫార్సులు తీసుకోవాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రత్యేకంగా ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని నియమించింది. అదేవిధంగా కో చైర్మన్‌గా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను నియమించగా.. కమిటీ సభ్యులుగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, ఎంపీ మల్లు రవిని నియమించింది. తాజాగా ఏర్పాటైన ఈ కమిటీ సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహా సూచనలు ఇస్తుంది.

రాష్ట్రంలో ఎమ్మెల్యేల తీరు అభ్యంతరకరం

- ప్రవాస భారతీయుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది
- యూఎస్ కాన్సులేట్ జనరల్‌కు టెక్సాస్‌లోని జలగం సుధీర్‌కుమార్ లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఎమ్మెల్యేల వ్యవహారం తీవ్ర అభ్యంతరకరంగా ఉందని, వారి వైఖరి ప్రవాస భారతీయుల్లో ఆందోళన కలిగిస్తోందని అమెరికాలో ఉంటున్న జలగం సుధీర్‌కుమార్ వ్యాఖ్యానించారు. సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన జలగం సుధీర్ ప్రస్తుతం టెక్సాస్‌లోని ఆస్టిన్‌లో ఉంటున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు అమెరికాలోని ప్రవాస భారతీయులపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని పేర్కొన్నారు. ఈ పరిణామాలు అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడులపై ఎలాంటి దుష్ఫలితాలు చూపిస్తాయో వివరిస్తూ, ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని అమెరికా కాన్సులేట్ జనరల్‌కు లేఖ రాశారు. ఆ లేఖను మెయిల్ ద్వారా మీడియాకు విడుదల చేశారు. ఒక పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత పార్టీ ఫిరాయింపులకు పాల్పడడం ప్రజలను మోసగించినట్లు అవుతుందన్నారు. ఎమ్మెల్యేల చర్య హైదరాబాద్‌లో పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందని అన్నారు. కొంతమంది ఎమ్మెల్యేలు.. బలహీనతకు చిహ్నాలుగా చీరలు, గాజులు పంపడంతోపాటు, బహిరంగంగా మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇలాంటి వ్యాఖ్యలు మహిళల ఆత్మగౌరవాన్ని కించపరచడమేనని అన్నారు.

పోలీసుల వైఫల్యమే..

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: కౌశిక్ నివాసంపై దాడి ముమ్మాటికీ పోలీసుల వైఫల్యమేనని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. కౌశిక్‌రెడ్డిని గృహ నిర్బంధం చేసిన పోలీసులు.. ఎమ్మెల్యే గాంధీని కాన్వాయ్‌గా అనుమతించడం ఏమిటని ప్రశ్నించారు. దాడికి పక్కా ప్రణాళికతో గేటెడ్ కమ్యూనిటీలోకి వెళుతుంటే పోలీసులు లాఠీచార్జి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.



సీపీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు


పోలీసులతో కౌశిక్‌రెడ్డి వాగ్వాదం. చిత్రంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కౌశిక్ ఇంటిపై దాడి

▶ మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ కార్యకర్తలు, ఎమ్మెల్యేలు కౌశిక్ నివాసానికి చేరుకోవడంతో.. పోలీసులు ఎమ్మెల్యే గాంధీని అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. గాంధీపై, ఆయన అనుచరులపై ఫిర్యాదు చేయడానికి కౌశిక్‌రెడ్డి, హరీశ్, ఇతర నేతలు సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌కు వెళ్లగా.. హరీశ్‌రావును, ఇతర ఎమ్మెల్యేలను లోపలికి అనుమతించలేదు. దీంతో తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసుల తీరుపై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు కమిషనర్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. పోలీసులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలను అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. మరోవైపు ఇటీవలే అనారోగ్యానికి గురై కోలుకుంటున్న కౌశిక్ రెడ్డి మామ కృష్ణారెడ్డి.. ఈ దాడితో ఆందోళన చెంది, అస్వస్థతకు లోనయ్యారు.

> నేను ప్యూర్ తెలంగాణ గడ్డ మీద పుట్టిన బిడ్డను. ఎక్కడి నుంచో వచ్చి మా గడ్డమీద కూర్చొని నువ్వు సవాల్ చేస్తే భయపడతామనుకున్నవా.. బిడ్డా! నన్ను హత్య చేసే ప్రయత్నం జరిగింది. రేపు ఉదయం 11 గంటలకు అరికెపూడి గాంధీ ఇంటికి బీఆర్ఎస్ కార్యకర్తలు తరలిరావాలి. నీకు 65 ఏండ్లు, నాకు 35 ఏళ్లు.. నా ఇంటిపై దాడి చేయిస్తవా. సరే చూసుకుందాం. రేపు నా తడాఖా ఏంటో చూపిస్తా. గాంధీ చర్యకు ప్రతి చర్య ఉండటం ఖాయం.
> – హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

> పార్టీని భ్రష్టుపట్టించిన బ్రోకర్ నా కొడుకు కౌశిక్‌రెడ్డి. చీటర్, బ్రోకర్, కోవర్టు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను గౌరవిస్తా. కౌశిక్ లాంటివారే కేసీఆర్ చుట్టూ చేరి పార్టీకి తీవ్ర నష్టం చేశారు. ఇలాంటి బ్రోకర్లను దూరం పెట్టినపుడే బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరిస్తారు. కౌశిక్ నా ఇంటికి వస్తానని చెప్పి దాక్కున్నాడు. కొడకా నీ ఇంటికి వచ్చా.. దమ్ముంటే బయటకు రా..
> – శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

అసలు ఎలా మొదలైంది?

అసెంబ్లీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని నియమించడంతో వివాదం రేగింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఆయనకు పీఏసీ పదవి ఎలా ఇస్తారని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. ఈ క్రమంలోనే తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నానని బుధవారం అరికెపూడి గాంధీ చెప్పడం.. ఎమ్మెల్యే గాంధీ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్న పక్షంలో గురువారం ఉదయం 11 గంటలకు ఆయన ఇంటికి వెళ్లి గులాబీ కండువా కప్పి, ఆయన ఇంటిపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రకటించడం.. అగ్నికి ఆజ్యం పోశాయి. ఈ నేపథ్యంలో గురువారం ఉదయమే హైదరాబాద్ కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసం ఉన్న 'కొల్లూరు లక్సూరియా' నివాస సముదాయం వద్ద పోలీసులు మోహరించారు. గాంధీ ఇంటికి వెళ్లేందుకంటూ బయటికి వచ్చిన కౌశిక్‌రెడ్డిని అడ్డుకున్నారు. ఆయనను అరెస్టు చేసేందుకు వాహనం కూడా సిద్ధం చేశారు. ఈ సమయంలో కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. అరికెపూడి గాంధీ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్న పక్షంలో ఆయనను శుక్రవారం కేసీఆర్ వద్దకు తీసుకెళ్తానని ప్రకటించారు. మరోవైపు కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై స్పందించిన అరికెపూడి.. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు తానే కౌశిక్ ఇంటికి వెళతానని ప్రకటించారు. దీంతో ఎమ్మెల్యే గాంధీ తన ఇంటికి వస్తే పార్టీ కండువా, మంగళ హారతులతో స్వాగతం పలుకుతానని కౌశిక్ ప్రకటించారు. బీఆర్ఎస్ మహిళా విభాగం నేత పావని గౌడ్, మరికొందరు మహిళలు మంగళహారతులతో సిద్ధమయ్యారు.


కౌశిక్‌రెడ్డి నివాసం వద్ద అరికెపూడి గాంధీ

భారీగా అనుచరులను వెంటబెట్టుకుని వచ్చి..

ఇక ఎమ్మెల్యే గాంధీ నివాసానికి వస్తానని కౌశిక్ రెడ్డి చేసిన ప్రకటనతో గురువారం ఉదయం నుంచే కూకట్‌పల్లి వివేకానందనగర్ కాలనీలోని గాంధీ నివాసం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుంచే పలువురు కార్పొరేటర్లు, అనుచరులు గాంధీ నివాసానికి చేరుకున్నారు. ఉదయం 11 గంటలలోపు కౌశిక్ రెడ్డి తన రాకపోతే.. తానే కౌశిక్ నివాసానికి వెళ్తానని అరికెపూడి గాంధీ ప్రకటించారు. 12 గంటల సమయంలో పెద్ద సంఖ్యలో అనుచరులతో భారీ కాన్వాయ్‌గా కౌశిక్ నివాసానికి బయలుదేరారు. పోలీసులు కౌశిక్‌రెడ్డి ఉంటున్న నివాస సముదాయం గేట్లు మూసేసినా.. గాంధీ అనుచరులు పైనుంచి లోనికి దూకారు. గేట్లు తెరుచుకుని కౌశిక్ ఇంటివైపు దూసుకెళ్లారు. అప్పటికే కౌశిక్‌రెడ్డి అనుచరులు కూడా అక్కడ ఉండటంతో.. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఈ క్రమంలో గాంధీ అనుచరులు విధ్వంసానికి పాల్పడ్డారు. పోలీసులు ప్రేక్షకుల్లా వ్యవహరించారని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు.

కౌశిక్ నివాసానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

దాడి విషయం తెలిసిన బీఆర్ఎస్ నేతలు పెద్ద సంఖ్యలో కౌశిక్ నివాసానికి చేరుకున్నారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పార్టీ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బిగాల గణేశ్ గుప్తా, ఎర్రోళ్ల శ్రీనివాస్, రాజీవ్ సాగర్, కొలన్ బాల్‌రెడ్డి తదితరులు కౌశిక్‌రెడ్డిని పరామర్శించారు. కౌశిక్ నివాసంలో భేటీ అయ్యారు. పార్టీ అధినేత కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఘటన తీరును వివరించారు. కౌశిక్ కుటుంబ సభ్యులను కేసీఆర్ ఫోన్‌లో పరామర్శించి ధైర్యంగా ఉండాలని చెప్పారు.

పట్టపగలే ఎమ్మెల్యేపై హత్యాయత్నమా?

- ఇందిరమ్మ రాజ్యమంటే ఇదేనా?.. మాజీ మంత్రి కేటీఆర్ మండిపాటు
- ప్రతిఘటన తప్పదంటూ హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని గృహ నిర్బంధం చేసి.. పోలీసుల సాయంతో అరికెపూడి గాంధీ గుండాలు రెచ్చిపోయి దాడులకు పాల్పడటం దారుణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఇంతకు మించి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ''పట్టపగలే ఒక ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి హత్యాయత్నానికి ప్రయత్నిస్తున్నారంటే రాష్ట్రంలో అసలు లా అండ్ ఆర్డర్ ఉందా? ప్రతిపక్ష ఎమ్మెల్యేపై ప్రభుత్వం దాడి చేయించటమే ఇందిరమ్మ పాలన, ప్రజా పాలనా?'' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలను కచ్చితంగా రాసి పెట్టుకుంటామని వ్యాఖ్యానించారు. అరికెపూడి ఇంటికి వెళ్తానన్న కౌశిక్‌రెడ్డిని గృహ నిర్బంధం చేసిన పోలీసులు.. అరికెపూడిని మాత్రం కౌశిక్‌రెడ్డి ఇంటికి వచ్చేందుకు ఎలా అనుమతించారని ప్రశ్నించారు. వందల మంది కోడిగుడ్లు, రాళ్లతో దాడులు చేశారంటే పక్కాగా ముందస్తు ప్లాన్ ప్రకారమే దాడి చేశారని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని ఫ్యాక్షనిజానికి, రౌడీయిజానికి అడ్డాగా మార్చేస్తుండటం చూస్తుంటే బాధగా ఉందని పేర్కొన్నారు. ఇది కచ్చితంగా సీఎం రేవంత్‌రెడ్డి చేయించిన దాడేనని.. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై న్యాయ పోరాటం చేస్తున్న కౌశిక్‌రెడ్డిని ప్రభుత్వం టార్గెట్ చేసిందని ఆరోపించారు. కావాలనే అక్రమ కేసులు, హత్యాయత్నాలకు పాల్పడి బెదిరించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.

బీఆర్ఎస్ స్థైర్యాన్ని దెబ్బతీయలేరు..

''సీఎం రేవంత్‌రెడ్డీ.. మా పార్టీ సైనికుల పోరాటానికి నీకు నచ్చిన పేరు పెట్టుకో. కాంగ్రెస్ గూండాల దౌర్జన్యాలు, దాడులు బీఆర్ఎస్ సైనికుల స్థైర్యాన్ని ఇసుమంత కూడా దెబ్బ తీయలేవు. తెలంగాణలోని ప్రతి అంగుళాన్ని మీ అవినీతి, దుర్మార్గ పాలన నుంచి కాపాడుకుంటాం. కౌశిక్‌రెడ్డితో తెలంగాణ ప్రజలు ఉన్నారు. ఏ మాత్రం భయపడాల్సిన అవసరం లేదు..'' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

అడుగడుగునా ఉద్రిక్తత!

- సైబరాబాద్ సీపీ కార్యాలయం ముందు బీఆర్ఎస్ నేతల బైఠాయింపు
- హరీశ్‌రావు, ఇతర ఎమ్మెల్యేలు, నేతలను అరెస్టు చేసిన పోలీసులు
- రెండు గంటల పాటు అటూ ఇటూ తిప్పుతూ రంగారెడ్డి జిల్లా కేశంపేట పీఎస్‌కు తరలింపు

సాక్షి, హైదరాబాద్/ గచ్చిబౌలి/ షాద్‌నగర్/ కేశంపేట: కౌశిక్‌రెడ్డి ఇంటిపై అరికెపూడి గాంధీ, ఆయన అనుచరులు దాడి చేయడంపై ఫిర్యాదు చేసేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు, ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు వెళ్లారు. వాహనాలను గేటు వద్దే ఆపేయడంతో.. ఎమ్మెల్యేలు, నేతలు నడుచుకుంటూ సీపీ ఆఫీసు వద్దకు వెళ్లే ప్రయత్నం చేశారు. కానీ పోలీసులు అడ్డుకోవడంతో ఆందోళనకు దిగారు. పోలీసుల వైఫల్యంతోనే దాడి జరిగిందని.. సీఐ, ఏసీపీలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అయితే రాత్రి 7 గంటల సమయంలో పోలీసులు హరీశ్ రావుతోపాటు ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, వివేకానంద, వేముల ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, గంగుల కమలాకర్, ఎర్రోళ్ల శ్రీనివాస్, మరికొందరు నేతలను అరెస్ట్ చేశారు. వారిని సుమారు రెండు గంటల పాటు అటూ ఇటూ తిప్పుతూనే ఉన్నారు. సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ నుంచి శంషాబాద్ మీదుగా తుక్కుగూడ, కందుకూరు, కడ్తాల్ మీదుగా తలకొండపల్లికి, అక్కడి నుంచి రంగారెడ్డి జిల్లా కేశంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అడుగడుగునా ఉద్రిక్తత మధ్య..

హరీశ్‌రావు, ఇతర నేతలను తరలిస్తున్న పోలీసు వాహనాలను తలకొండపల్లి వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. కార్యకర్తలను పోలీసులు చెదరగొట్టారు. ఇక బీఆర్ఎస్ నేతలు కొత్తూరు మండలం ఎక్లాస్‌ఖాన్‌పేట వద్ద రహదారిపై జేసీబీని, కారును అడ్డుగా పెట్టారు. ముళ్ల కంపలు వేశారు. పోలీసులు వీటిని తొలగించే ప్రయత్నం చేయగా అడ్డుకున్నారు. సీఎం డౌన్‌డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసులు వాహనాలను దారి మళ్లించి కొత్తపేట మీదుగా కేశంపేటకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో కేశంపేటకు చేరుకుని, ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీనితో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

హరీశ్‌రావుకు గాయాలు

బీఆర్ఎస్ నేతలను పోలీస్‌స్టేషన్‌లోకి తీసుకెళ్తున్న క్రమంలో జరిగిన తోపులాటలో మాజీ మంత్రి హరీశ్‌రావు స్వల్పంగా గాయపడ్డారు. ఆయన భుజం, కాలికి గాయాలయ్యాయి. ఒకదశలో హరీశ్‌రావు తన కుడిచేతిని ఎడమ భుజం, ఛాతీపై పెట్టుకుని తీవ్ర ఆయాసంగా కనిపించారు.

గాంధీపై కేసు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి ఘటనకు సంబంధించి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మరికొందరిపై గచ్చిబౌలి ఠాణాలో కేసు నమోదైంది. విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించారంటూ భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) చట్టంలోని 11 సెక్షన్ల కింద పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లోని వివరాల ప్రకారం.. ''పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా అరికెపూడి గాంధీని నియమించడంపై పాడి కౌశిక్‌రెడ్డి మీడియాలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గురువారం ఎమ్మెల్యే గాంధీ నివాసానికి వెళ్లి బీఆర్ఎస్ జెండా ఎగరేస్తానని, పార్టీ కండువా కప్పుతానని సవాల్ విసిరారు. మధ్యాహ్నం 12:15 గంటలకు ఎమ్మెల్యే గాంధీ.. తన సోదరుడు అరికెపూడి ప్రసాద్, అనుచరులు ఉప్పలపాటి శ్రీకాంత్, బి.గౌతమ్ గౌడ్, రాంపల్లి వెంకటేశ్, జి.రాములు, గంగారాం యాదవ్, నరేశ్, మేళ శివ, రాధిక, మంజుల, చంద్రికగౌడ్, రాగం నాగేందర్ యాదవ్, డి.వెంకటేశ్‌గౌడ్, అష్రఫ్, రఘునాథ్‌రెడ్డి, మోహన్‌గౌడ్, మరికొందరు వచ్చారు. 12 వాహనాల కాన్వాయ్‌తో నివాస సముదాయంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని నియంత్రించడానికి ప్రయత్నించారు. ఈలోగా ఎమ్మెల్యే గాంధీ అనుచరులు దాదాపు 60–70 మంది డ్యూటీలో ఉన్న పోలీసులను నెట్టి, గేటుపైకి ఎక్కి, బోల్ట్ తీసి వేసి కమ్యూనిటీలోకి చొరబడ్డారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన నివాసం వద్ద ఉన్న పూల కుండీలు, కిటికీని ధ్వంసం చేశారు. ఇంట్లోకి ప్రవేశించడానికి ప్రయత్నించారు. ఈలోగా మాదాపూర్ ఏసీపీ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వారిని చెదరగొట్టి కొందరిని అదుపులోకి తీసుకున్నారు. సుమోటోగా ఎస్సై మహేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పీఎస్‌లో కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో ఏ-1గా అరికెపూడి గాంధీని పేర్కొన్నారు. బీఎన్ఎస్ సెక్షన్లు 189, 191(2),191(3), 61, 132,329,333, 324(4),(5), 351(2) రెడ్ విత్ 190 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

కేంద్ర అధికారాలను పరిమితం చేయకపోవడంతో అంతరాలు

- కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి
- పునర్విభజన ద్వారా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గించే కుట్ర: భట్టి



సాక్షి, హైదరాబాద్: కేంద్ర అధికారాలను పరిమితం చేయకపోవడం వల్ల రాష్ట్రాల అభివృద్ధికి తగినన్ని నిధులు లేకుండా పోయాయని, కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా తగ్గిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను 42 శాతం నుంచి 50శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ, తమిళనాడు, కేరళ, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాల ఆర్థిక శాఖ మంత్రులతో గురువారం తిరువనంతపురం లో జరిగిన 'కేరళ కాంక్లేవ్'కు భట్టి హాజరయ్యారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో భట్టి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆర్థిక సంబంధాలను, దక్షిణాది రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కేంద్రం, రాష్ట్రం దేనికదే బలంగా ఉంటూ తమ విధులు నెరవేర్చడానికి అవసరమైన వనరులతో కూడిన వ్యవస్థను రాజ్యాంగ నిర్మాతలు రూపొందించారని, కానీ కేంద్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా రాష్ట్రాలతో వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను 32 శాతం నుంచి 42 శాతానికి పెంచుతూ 14వ ఆర్థిక సంఘం చేసిన నిర్ణయం తప్పుదోవ పట్టించేదేనని మండిపడ్డారు. సెస్సులు, సర్ చార్జీల ఆదాయాన్ని కేంద్రం రాష్ట్రాలతో పంచుకోవడం లేదన్నారు. వాటిపై ఆధారపడటం వల్ల కేంద్రం స్థూల పన్ను ఆదాయం 28 శాతానికి పెరిగిందని, దీంతో రాష్ట్రాల వనరుల్లో గణనీయంగా కోత పడిందని చెప్పారు. జీఎస్టీలో అవలంబిస్తున్న విధానం వల్ల రాష్ట్రాల ఆర్థిక స్థితి దెబ్బతింటోందన్నారు. దేశ జనాభాలో 19.6 శాతం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు జీడీపీలో 30 శాతంతో గణనీయమైన సహకారం అందిస్తున్నప్పటికీ, ఫైనాన్స్ కమిషన్ పన్నుల పంపిణీలో వాటాను 21.073 శాతం నుంచి 15.800 శాతానికి తగ్గించారన్నారు. అలాగే కేంద్ర ప్రాయోజిత పథకాల కఠినమైన నిబంధనలు, మ్యాచింగ్ గ్రాంట్ షరతులు రాష్ట్ర బడ్జెట్లను ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు.

దక్షిణాది స్వరాన్ని అణగదొక్కే కుట్ర

రాబోయే నియోజకవర్గాల పునర్విభజన కసరత్తు 2011 జనాభా ఆధారంగా జరిపితే లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గుతుందని భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ నిర్ణయాధికారంలో దక్షిణాది రాజకీయ స్వరాన్ని అణగదొక్కే కుట్ర చేస్తున్నారన్నారు. జనాభా నియంత్రణ, సామాజిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చిన రాష్ట్రాలు అన్యాయానికి గురయ్యే అవకాశం ఉందని, అధిక జనాభా ఉన్న రాష్ట్రాలు అసమాన ప్రాతినిధ్యాన్ని పొందే అవకాశం ఉందని చెప్పారు. ఒక శతాబ్దంలో ప్రతినిధుల సభలో సభ్యుల సంఖ్య గరిష్టంగా 435గా ఉండాలని నిర్ణయించిన అమెరికా విధానాన్ని మనం అనుసరించాలన్నారు.

సీఎం రేవంత్ డైరెక్షన్‌లోనే దాడి

- పోలీసులను దౌర్జన్యాలు, అక్రమాలకు వాడుకుంటున్నారు: హరీశ్‌రావు
- ఎమ్మెల్యే కౌశిక్‌ను హత్య చేయడానికి కుట్రపన్నారని ఆరోపణ.. తమ సహనం చేతగానితనం కాదని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్/ షాద్‌నగర్/ కేశంపేట: సీఎం రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లోనే ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి జరిగిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. పోలీసులను తమ దౌర్జన్యాలు, అక్రమాల కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. తమ సహనాన్ని చేతకానితనంగా భావించవద్దన్నారు. గురువారం మధ్యాహ్నం కౌశిక్ రెడ్డి నివాసం వద్ద, సాయంత్రం సైబరాబాద్ సీపీ ఆఫీసు వద్ద, రాత్రి 11:15కి కేశంపేట పోలీస్‌స్టేషన్ నుంచి విడుదలైన తర్వాత హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ''మా కార్యకర్తలను గృహ నిర్బంధం చేసి పట్టపగలు ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేయించారు. అదే కాంగ్రెస్ వాళ్లకు పైలట్, ఎస్కార్ట్ ఇచ్చి మా ఎమ్మెల్యే ఇంటిపై దాడికి పంపించారు. ఇదంతా ప్లాన్ ప్రకారమే చేశారు. సైబరాబాద్ పోలీసులంటే మంచి ఇమేజ్ ఉంది. దాన్ని మంటగలిపారు. రాజ్యాంగబద్ధంగా కాంగ్రెస్ చర్యలను ప్రశ్నిస్తుంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల గొంతు నొక్కేయాలనుకుంటున్నారు..'' అని హరీశ్‌రావు మండిపడ్డారు.

సూత్రధారులెవరో తేలాలి..

కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి, ఎమ్మెల్యేను హత్య చేయడానికి కుట్ర పన్నిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, సీబీఐతో విచారణ చేయించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కౌశిక్ ఇంటిపై దాడి చేసిన గూండాలను నిలువరించడంలో విఫలమైన పోలీసులను సస్పెండ్ చేయకుంటే ఢిల్లీ వెళ్లి రాహుల్ గాంధీ ఇంటి ఎదుట, ఏఐసీసీ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.


విలేకరులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

నేడు గాంధీ ఇంట్లో బీఆర్ఎస్ భేటీ

మేడ్చల్ జిల్లా నేతలంతా హాజరుకావాలని పార్టీ పిలుపు

సాక్షి, హైదరాబాద్: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నివాసంలో ఆ నియోజకవర్గం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తామని పార్టీ ప్రకటించింది. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, ముఖ్య నేతలు, కార్యకర్తలు రావాలని సూచించింది. ఈ మేరకు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ముఖ్యనేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గురువారం రాత్రి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇంటి నుంచి అరికెపూడి నివాసానికి బయలుదేరి వెళ్తారని తెలిపారు. తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నట్టు గాంధీ ప్రకటించిన నేపథ్యంలో.. కావాలనే బీఆర్ఎస్ ఈ పిలుపునిచ్చిందని నేతలు చెప్తున్నారు.

తెలంగాణ భవన్‌ను ముట్టడించిన కాంగ్రెస్

- కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని మహిళా నేతల డిమాండ్..రోడ్డుపై బైఠాయింపు
- అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత

సాక్షి, హైదరాబాద్/మణికొండ: మహిళలను కించపరిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ మహిళా నేతలు బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌ను ముట్టడించారు. ఖబడ్దార్ కౌశిక్‌రెడ్డి అంటూ కల్వ సుజాతతో పాటు పలువురు మహిళా నేతలు ప్లకార్డులను ప్రదర్శించారు. ముట్టడి సమాచారం తెలుసుకున్న పోలీసులు ముందస్తుగా భవన్ ఎదుట బందోబస్తు ఏర్పాటు చేశారు. వారిని లోనికి రాకుండా అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ నేతలు రోడ్డుపైనే బైఠాయించి నిరసన తెలిపారు. లోనికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయడంతో పోలీసులు అడ్డుకోగా కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం ఆందోళనకు దిగిన మహిళా నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా మహిళా నేతలు మాట్లాడుతూ కౌశిక్ రెడ్డి మహిళలను కించపరిచేలా చీర, గాజులను చూపారని ధ్వజమెత్తారు. మహిళలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేకుంటే కౌశిక్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కౌశిక్ క్షమాపణ చెప్పకపోతే గవర్నర్‌ను, స్పీకర్‌ను కలిసి చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు.

కౌశిక్‌రెడ్డీ.. ఖబడ్దార్

కాంగ్రెస్ నాయకుల జోలికి వస్తే కౌశిక్‌రెడ్డి హైదరాబాద్‌లో తిరిగే పరిస్థితి ఉండదని ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, టి.ప్రకాశ్‌గౌడ్ హెచ్చరించారు. నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల అదుపులో ఉన్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి సంఘీభావం తెలిపేందుకు వారు తమ అనుచరులతో కలిసి అక్కడికి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డి పిల్ల బచ్చా అని, తన స్థాయి మరచి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హరీశ్‌రావు సీజనల్ పొలిటీషియన్ అని, వారు మళ్లీ అధికారంలోకి వస్తామనే భ్రమ నుంచి బయటకు రావాలన్నారు. గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ కొనుగోలు చేయలేదా అని ప్రశ్నించారు. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టేందుకు కౌశిక్ యత్నిస్తున్నారని, దానిని ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. రాష్ట్రం విడిపోయినా అన్నదమ్ములుగా కలిసి ఉన్న వారి మధ్య చిచ్చు పెట్టాలని చూస్తే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఫయీమ్ పాల్గొన్నారు.

కేసీఆర్ స్పందించాలి: అద్దంకి దయాకర్

పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీని ఆంధ్రోడు అన్న కౌశిక్ మాట లు హాస్యాస్పదమని, ఈ మాటలపై కేసీఆర్ స్పందించాలని కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ డిమాండ్ చేశారు. పదేళ్లు అరికెపూడి గాంధీ బీఆర్ఎస్‌లోనే ఉన్నాడని, అప్పుడు ఆంధ్రోడని ఎందుకు అనలేదో చెప్పాలన్నారు. సెంటిమెంట్‌ను వాడుకొని పబ్బం గడుపుకుంటున్న వాళ్లను పార్టీ నుంచి సస్పెండ్ చేయాల ని డిమాండ్ చేశారు. కౌశిక్ లాంటి కమెడియన్‌ను ఎందుకు ఎన్నుకున్నామా అని హుజూరాబాద్ ఓటర్లు ఫీలవుతున్నారని పీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నాయకులకు మహిళలంటే చిన్న చూపని ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి విమర్శించారు. అధికారం పోగానే మళ్లీ ఆంధ్ర.. తెలంగాణ లొల్లి గుర్తుకొచ్చిందని ఎద్దేవా చేశారు. కౌశిక్ ఆంధ్రోళ్ల పేరుతో మళ్లీ తెలంగాణ సెంటిమెంటును రెచ్చగొట్టడానికి ప్రయత్నం చేస్తున్నాడని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. కౌశిక్ వ్యాఖ్యలను సమర్థించకపోతే కేసీఆర్ ఆయనను బీఆర్ఎస్ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు.


తెలంగాణ భవన్ వద్ద మహిళా కాంగ్రెస్ నేతల నిరసన


నార్సింగి ఠాణాలో గాంధీకి సంఘీభావం తెలుపుతున్న దానం, కాలె, ప్రకాశ్‌గౌడ్, రంజిత్‌రెడ్డి తదితరులు

ఫీజుల దరువుకు బ్రేకులెలా?

▶ మొదటి పేజీ తరువాయి

ఫీజును వసూలు చేస్తున్నాయి. కొన్ని స్కూళ్లు ప్రతి ఏటా ఏకంగా 25 శాతం వరకూ ఫీజులు పెంచుతున్నాయి. దీనిపై కొన్నేళ్లుగా ఫిర్యాదులొస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఫీజుల నియంత్రణపై దృష్టి సారించింది.

మౌలిక వసతుల ఆధారంగానే ఫీజులు!

ఫీజుల నియంత్రణకు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్తాన్, గుజరాత్, పశ్చిమ బెంగాల్, పంజాబ్, ఉత్తర ప్రదేశ్ సహా 15 రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తెచ్చాయి. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం కూడా ఇదే తరహాలో పటిష్టమైన చట్టాన్ని తీసుకొచ్చే ఆలోచనలో ఉంది. 35 లక్షల మందికిపైగా చదివే 11 వేల ప్రైవేటు స్కూళ్లను దీని పరిధిలోకి తేవాలని భావిస్తోంది. ఇష్టానుసారం కాకుండా స్కూళ్లలోని మౌలిక వసతుల ఆధారంగా ఫీజుల పెంపునకు అనుమతించేలా నిబంధనలు రూపొందించే యోచనలో ఉంది.

ఖర్చు 10 శాతం దాటితే పక్కా లెక్క ఉండాలి

స్కూళ్ల మూడేళ్ల ఖర్చును బట్టి వార్షిక ఫీజుల పెంపునకు అనుమతించవచ్చని తిరుపతిరావు కమిటీ సూచించింది. ప్రతి స్కూలు 10 శాతం లోపు ఫీజు పెంచుకోవచ్చు. పది శాతం దాటి ఖర్చు చేసే ప్రతి పైసా బ్యాంక్ లావాదేవీగా ఉండాలని ప్రతిపాదించారు. వేతనాలు, స్కూలు కోసం కొనుగోలు చేసే మౌలిక వసతులు, ఇతరత్రా ఖర్చులకు బ్యాంకు ద్వారానే చెల్లింపులు ఉండాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలి. వీటితో పాటు మరికొన్ని అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని కసరత్తు కొనసాగించాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. 11 వేల స్కూళ్ళ ఆదాయ, వ్యయ లెక్కలు చూడాలంటే ప్రత్యేక యంత్రాంగం ఉండాలి. ఈ దిశగానూ కొన్ని సిఫారసులు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. 10 శాతం పైగా ఫీజు పెంచే స్కూళ్లు విధిగా లెక్కలు చూపేలా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టనున్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 13-9-2024



కన్నీటికి కూడా ఇష్టం ఉన్నట్టుంది.
కన్నీటికి కూడా ఒక మనిషి కంటినే అంటి పెట్టుకొని ఉండాలన్న కోరిక ఉన్నట్టుంది.
కన్నీరు ఎందుకనో ఒకే మనిషిని పదే పదే ఆలింగనం చేసుకుంటూ
ఆ మనిషికి మరింత ప్రేమను పంచాలని అనుకుంటున్నట్టుంది.
కేరళలో ఒకమ్మాయి శ్రుతి.
ఆ అమ్మాయి గత కొన్ని రోజులుగా కన్నీరు కారుస్తోంది.
ఆమెను ఊరడించడానికి కేరళ ప్రభుత్వం, కేరళ ప్రజలు కదిలారు.
ఈ ప్రేమ కోసమేనా కన్నీరుకు ఆమెపై ప్రేమ?

నువ్వు ఒంటరివి కావు... నీ వెంటే మేముంటాం...

ఉద్విగ్న క్షణాల్లో జాన్సన్ - శ్రుతి

శ్రుతి తప్పిన ప్రకృతి

కనురెప్పనూ కాటేసింది

'బాధ పడకు. నీకు నేనున్నాను. నేను చనిపోయినా నువ్వు ఒంటరివి కావు. నీకంటూ ఒక భరోసా ఉండేలా చూస్తాను' అన్నాడా యువకుడు ఆ అమ్మాయితో ఓదార్పుగా.

ఇవాళ ఆ యువకుడు కన్నుమూశాడు.

ఆ యువకుడి మాటలను గుర్తు చేసుకుంటున్న కేరళ ప్రజలు 'మేమున్నాం' అంటూ ఆ అమ్మాయికి తోడుగా నిలుస్తున్నారు.

ఇలాంటి ఘటన చాలా అరుదు.

ఆ అమ్మాయి పేరు శ్రుతి

అందరు అమ్మాయిల్లాంటిదే శ్రుతి. కోజికోడ్‌లో ఒక ప్రయివేటు ఆస్పత్రిలో ఉద్యోగం చేయడం... సెలవులలో ఇంటికెళ్లి కుటుంబ సభ్యులతో గడపడం... తండ్రి చిన్న ఉద్యోగి... తల్లి చిన్న షాపు నడిపేది... చెల్లెలు కాలేజీ చదువుతోంది. వాళ్ల కుటుంబం వాయనాడ్‌లోని చూరలమలలో కొత్త ఇల్లు కట్టుకుని వరదలకు నెల ముందే షిఫ్ట్ అయ్యారు. అక్కడే శ్రుతి నిశ్చితార్థం జరిపించారు. ఈ డిసెంబర్‌లో పెళ్లి చేయాలని 4 లక్షల డబ్బు. 15 సవర్ల బంగారం ఇంట్లో దాచారు. అంతా సంతోషమే. కాని...

జూలై 30 రాత్రి

ఆ రాత్రి ఉద్యోగరీత్యా శ్రుతి చూరలమలకు రెండు గంటల దూరంలో ఉన్న కోజికోడ్‌లో ఉంది. వరద విజృంభించింది. శ్రుతి వాళ్ల కొత్త ఇల్లు ధ్వంసమైంది. తల్లి, తండ్రి, చెల్లెలు... పెళ్లి కోసం దాచిన డబ్బు మొత్తం పోయాయి. ఎవరూ మిగల్లేదు. ఏమీ మిగల్లేదు. శ్రుతి కన్నీరు కట్టలు తెంచుకుంది. అది ఆగలేదు. ఆపేందుకు ఒక్కడు పూర్తిగా ప్రయత్నించాడు. అతని పేరు జాన్సన్. శ్రుతికి కాబోయే భర్త.

నేనే తోడుంటా...

'శ్రుతికి ఇప్పుడు ఏమీ మిగల్లేదు. అంత మాత్రం చేత నేను వదిలేస్తానా? పదేళ్లుగా మేము స్నేహితులం. పెళ్లి చేసుకోవాలనుకున్నాం. నిశ్చితార్థం కూడా అయ్యింది. ఇప్పుడు ఆమె సర్వం కోల్పోయినా నేను వదలను. తోడుంటా. నేను చనిపోయినా ఆమె ఒంటరిదై పోకుండా మంచి ఉద్యోగం, ఇల్లు ఏర్పాటు చేస్తా' అన్నాడు. ఆ మాటలు ఎందుకన్నాడో. అవి వాయనాడ్ విషాదాన్ని ప్రసారం చేసేటప్పుడు టీవీలో టెలికాస్ట్ అయ్యాయి.

ఆ తోడు కూడా పోయింది...

శ్రుతికి ఇక ఏడవడానికీ కన్నీరు మిగల్లేదు. జాన్సన్ చనిపోయాడు. మొన్నటి మంగళవారం వాయనాడ్‌లో అతను, శ్రుతి, శ్రుతి బంధువులు కొంతమంది ప్రయాణిస్తున్న వ్యాను బస్సుతో ఢీకొంది. శ్రుతి, ఆమె బంధువులు స్వల్పంగా గాయపడ్డారు. కాని జాన్సన్ మృత్యువుతో పోరాడి బుధవారం మరణించాడు. అన్నీ కోల్పోయిన శ్రుతికి ఆఖరి ఆసరా కూడా పోయింది. ఆమె ఏం కావాలి?

మేమున్నాం

ఇక కేరళ జనం తట్టుకోలేకపోయారు. మేమున్నాం అంటూ శ్రుతి, జాన్సన్ జంట ఫొటోలను డీపీగా పెట్టుకోసాగారు. కేరళ ముఖ్యమంత్రి విజయన్ నేనున్నానంటూ ఫేస్‌బుక్ పోస్ట్ రాశారు. ఫహద్ ఫాజిల్, మమ్ముట్టి సంతాపం వ్యక్తం చేశారు. కేరళ మంత్రి ఒకరు శ్రుతికి మంచి ఉద్యోగం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆమెను కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత ప్రభుత్వానిది... కేరళ ప్రజలది అన్నారు. శ్రుతి కోసం కేరళ కన్నీరు కారుస్తోంది. శ్రుతి కన్నీటిని కేరళ పంచుకుంది. అయినవారిని లాక్కుని పరాయివారినెందరినో ఆమె బంధువులుగా మార్చింది కన్నీరు. ఈ కన్నీటిని ఏమని నిందించగలం. కన్నీరా కనికరించు... చల్లగా చూడు అనడం తప్ప.

బంగారం ధర రోజు రోజుకూ కొండెక్కుతోంది.
కొన్నాళ్లలో పది గ్రాముల ధర అక్షరాలా లక్ష అవుతుందంటూ మాటలు వినిపిస్తున్నాయి.
దీంతో ఇటీవల గొలుసు దొంగతనాలు కూడా పెరిగాయని క్రైమ్ బ్యూరో నివేదికలు చెబుతున్నాయి.
ఇలాంటప్పుడు బంగారం ధరను దించేదెలా?
ఈ ఆలోచనతో కేంద్రం 9 కేరెట్ల బంగారాన్ని అందుబాటులోకి తీసుకు రానుంది.
పది గ్రాముల 9 క్యారెట్ల బంగారం ధర 20 వేల నుంచి 30 వేల రూపాయల మధ్య ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.
దీంతో ఈ బంగారం వల్ల లాభం ఎంత? నష్టం ఎంత?
అనే సందేహాలు అంతటా వినిపిస్తున్నాయి.





రేట్లు పెరిగి.. క్యారెట్లు తరిగి...

24కు 9 మార్క్ పడింది

తొమ్మిది క్యారెట్ బంగారంతో ఎలాంటి ఆభరణాలు తయారవుతాయి అనే సందేహం చాలా మందిలో తలెత్తవచ్చు. ఇప్పటికే మార్కెట్లో 22కె, 18కె, 14కె, 9కె బంగారు ఆభరణాలు అందుబాటులో ఉన్నాయి.

లెక్కల్లో బంగారం

బంగారం స్వచ్ఛతను కొలిచే యూనిట్‌ను క్యారెట్లలో లెక్కిస్తారు. 24 క్యారెట్ బంగారంలో 99.9 శాతం స్వచ్ఛంగా ఉంటుంది. 22 క్యారెట్ల బంగారం స్వచ్ఛత స్థాయి 91.7 శాతం కాగా 18 క్యారెట్ల బంగారం 75 శాతం ఉంటుంది. 14 క్యారెట్ల బంగారం 58.3 శాతం స్వచ్ఛమైనది. 12 క్యారెట్ల బంగారం 50 శాతం, 10 కారెట్ల బంగారంలో స్వచ్ఛత 41.7 శాతం కాగా, 9 క్యారెట్లలో బంగారం స్వచ్ఛత 37.5 శాతం మాత్రమే ఉంటుంది. క్యారెట్ తగుతోంది అంటే ఇందులో వెండి, రాగి, జింక్, నికెల్ వంటి లోహాలు కలుపుతారని అర్థం.



పది గ్రాముల బంగారం ధర 30 వేల లోపే ఉంటుంది అంటున్నారు. మేం ఎంత తక్కువ క్యారెట్‌లో ఉన్న లోహాలతోనైనా నగలు డిజైన్ చేస్తాం. అయితే, ప్రజలు ఎప్పుడూ క్వాలిటీ గోల్డ్‌నే కొంటారు. హాల్‌మార్క్ వేసి, తిరిగి అమ్ముకున్నా నష్టపోం అనే నమ్మకం వుంటే 9 క్యారెట్ల నగలు అమ్ముడుపోవచ్చు. సాధారణంగా 9.16 బంగారంతో చేస్తే వేస్టేజ్‌లో కొంత బంగారం పోతుంది. ఇక 9 క్యారెట్ గోల్డ్‌లో అంటే వేస్టేజ్ ఇంత ఉంటుందని ఇతమిద్ధంగా చెప్పలేం. ఆభరణం డిజైన్‌ను బట్టి వేస్టేజ్ ఖర్చు రెట్టింపు ఉండవచ్చు.

– మలుగు రమేష్‌చారి, స్వర్ణకారుడు

హాల్‌మార్క్ తప్పనిసరి!

పెరుగుతున్న ధరల ప్రతికూల ప్రభావాన్ని ఐబిజెఎ జాతీయ కార్యదర్శి సురేంద్ర మెహతా మాట్లాడుతూ 'బంగారం ధరలు నిరంతరం పెరుగుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని 9 క్యారెట్ల ఆభరణాలకు హాల్‌మార్కింగ్‌ను అనుమతించే అవకాశాలపై చర్చ జరుగుతోంది. సావరిన్ గోల్డ్ బాండ్ల ధరను నిర్ణయించడంలో ఐబీజేఏ సహకారాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుర్తించడం ముఖ్యం' అంటున్నారు. 9 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.28,000గా ఉంది. దీనిపై 3 శాతం జీఎస్టీ అదనం. ఈ బంగారానికి హాల్‌మార్కింగ్ ఆమోదిస్తే వినియోగదారులపై ఆర్థిక భారం తగ్గుతుంది. అనిశ్చిత ఆర్థిక పరిస్థితులలో వినియోగదారులకు ఉపశమనం కలుగుతుంది.

నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో

2021తో పోలిస్తే 2022లో దేశంలో గొలుసు దొంగతనాలు 32.54 శాతం పెరిగాయి. దీంతో నగలు వేసుకొని దొంగలకు ముట్టజెప్పడం దేనికి అనే ఆలోచనతో చవక బంగారంపై మహిళలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం 9 క్యారెట్ల బంగారాన్ని హాల్‌మార్క్‌తో అందుబాటులోకి తీసుకొచ్చే యోచనలో ఉన్నట్టు సమాచారం.

కాంటెంపరరీ డిజైన్లకే ప్రాధాన్యత

భారతదేశానికి చెందిన నగల కంపెనీలవాళ్లు ఇప్పటికే 9కె బంగారు ఆభరణాలు తయారు చేస్తున్నారు. వీటిని డిజైన్, తయారీ, మార్కెటింగ్‌తో అనుసంధానించి, నగల డిజైన్ల అభివృద్ధి, ఉత్పత్తిపై దృష్టి పెడుతున్నారు. అయితే, ఈ ఆభరణాలు పెట్టుబడిగా కాకుండా రోజువారీ ఉపయోగకరమైన, కాంటెంపరరీ డిజైన్లతో వస్తున్నాయి. సన్నటి చైన్లు, రింగులు మాత్రమే ఉంటున్నాయి. పెద్ద పెద్ద ఆభరణాలు ఈ జాబితాలో లేవు. 9కెలో వైట్ గోల్డ్, ఎల్లో గోల్డ్, రోజ్ గోల్డ్ అందుబాటులో ఉన్నాయి. ఈ నగలపైన ఆ జ్యువెలరీ బ్రాండ్ లోగో ఉంటోంది.

కరిగిస్తే తరుగే..!

9 క్యారెట్ గోల్డ్ వల్ల అమ్మకాలు ఎక్కువ ఉండవచ్చు అని అనుకోవచ్చు. మార్కెట్లో ప్యూర్ గోల్డ్ గ్రామ్ ధర రూ.7 వేల కు పైనే ఉంది. 22 క్యారెట్ బంగారాన్ని ఆభరణాల కోసం, 18 క్యారెట్ గోల్డ్ ను డైమండ్ జ్యువెలరీకి ఉపయోగిస్తారు. దీంట్లో గోల్డ్ కాంబోజిషన్ తక్కువ ఉంటుంది. 14 క్యారెట్ గోల్డ్‌ను కాంటెంపరరీ డిజైన్స్ కోసం ఉపయోగిస్తారు. గోల్డ్ శాతం ఇంకా తగ్గి 9 క్యారెట్‌కి తీసుకురావచ్చు. అయితే, ఈ నగలను కరిగించినప్పుడు ఏ లాభం రాదు. అయితే, ఈ గోల్డ్ ఎంత మేరకు అమ్ముడుపోతుంది అనేది మార్కెట్‌లోకి వచ్చాక మాత్రమే చెప్పగలం.

– కళ్యాణ్‌కుమార్, జ్యువెలరీ మార్కెట్ నిపుణులు

క్రియేటివ్‌గా.. హుందాగా..!

మైండ్, బాడీ ఫిట్‌గా ఉంటే డ్రెస్సింగ్ కూడా కాన్ఫిడెంట్‌గా కనిపిస్తుంది. 'జిమ్‌లో వర్కవుట్స్ ఫిజికల్ ఎక్సర్‌సైజ్ అయితే, మన వార్డ్‌రోబ్ మైండ్ ఎక్సర్‌సైజ్' అంటున్నారు హైదరాబాద్ వాసి ఫిట్‌నెస్ ట్రైనర్ అనుప్రసాద్. జిమ్‌వేర్‌తో పాటు రెగ్యులర్, పార్టీవేర్ విషయంలో తీసుకునే స్పెషల్ కేర్ గురించి అనుప్రసాద్ మాటల్లో...











మై వార్డ్‌రోబ్

"ఉదయం ఏ డ్రెస్ వేసుకోవాలనేది ప్రతిరోజూ ఆలోచించేలా చేస్తుంది. అందుకే, క్యాజువల్ వేర్‌గా కొన్ని, సందర్భానుసారంగా వార్డ్‌రోబ్‌ను సెట్ చేసుకుంటాను. సాధారణంగా తక్కువ డబ్బులతో డ్రెస్ ఎంపిక చేసుకొని, రిచ్‌గా ఉండేలా కనిపించడానికి ప్లాన్ చేస్తుంటాను. ఇండోవెస్ట్రన్ డ్రెస్‌తోనూ హుందాతనాన్ని, మన సంస్కృతిని ప్రతిబింబిస్తూ స్టైల్‌గా కనిపించవచ్చు. పెయింటింగ్స్ వేస్తుంటాను కాబట్టి కలర్ కాంబినేషన్స్ విషయంలో అవగాహన ఉంది. చాలా వరకు మ్యాచింగ్ గురించి ఆలోచన చేయను. శారీస్ మీదకు కాంట్రాస్ట్, క్రాప్‌టాప్స్, ష్రగ్స్ కూడా సెట్ చేస్తాను. కాటన్స్‌కి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాను.

బెస్ట్ డ్రెస్డ్ అవార్డ్

మిసెస్ ఇండియా తెలంగాణ బెస్ట్ డ్రెస్డ్ ఈవెంట్ (2019)కి క్రియేటివ్‌గా ఆలోచించాలనుకున్నాను. శారీ, బ్లౌజ్‌కి తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా బతుకమ్మ, బోనాలు.. మొదలైనవాటితో నేనే ఫ్యాబ్రిక్ పెయింటింగ్ వేశాను. ఆ శారీనే కట్టుకున్నాను. రెండు వేల రూపాయల్లో ఆ శారీని తయారుచేసి, ప్రదర్శించి, అవార్డు దక్కించుకున్నాను.

పూసలు గుచ్చి

లంగా ఓణీ, పట్టు చీరలు సంప్రదాయ వేడుకల సందర్భాలలో కట్టుకుంటాను. దీంట్లోనే ప్రత్యేకంగా కనిపించాలంటే బ్లౌజ్ సింగిల్ హ్యాండ్‌కి పూసల హారాలు లేయర్లు గుచ్చి, నాట్ చేస్తాను. దాదాపు నెలకు మూడు, నాలుగు ఈవెంట్లకు హాజరవుతుంటాను. అందుకు కొత్తదనం, నిండుదనం ఉండేలా ప్లాన్ చేసుకుంటాను.

జిమ్ టీ షర్ట్స్

శారీస్‌కు సాధారణ బ్లౌజులే కాదు జిమ్‌కు వేసుకునే టీ షర్ట్స్ కూడా వాడతాను. బ్లాక్ క్రాప్‌టాప్ కాటన్ శారీకి వాడతాను. మంచి కలర్ కాంబినేషన్స్ ఉండేలా, సింపుల్ లుక్‌ని క్రియేట్ చేస్తాను. జిమ్‌లో మన కదలికలకు తగ్గినట్టు ఫ్లెక్సిబుల్ డ్రెస్ ఉండాలి. క్వాలిటీ కూడా చూడాలి. క్యాజువల్ వేర్‌గా జీన్స్, టీషర్ట్స్ మాత్రమే కాదు లాంగ్ స్కర్ట్స్ కూడా ఉపయోగిస్తాను.

టై అండ్ డై చేస్తాను..

వైట్ కాటన్ మెటీరియల్ తెప్పించుకొని, టై అండ్ డై టెక్నిక్‌తో కొత్త డిజైన్స్ సృష్టిస్తుంటాను. ఒక శారీకైతే వేరుశనగ గింజలను ముడివేసి, పెయింట్ చేశాను. త్రీడీ పెయింటింగ్స్ చేస్తుంటాను. ఏ వేస్ట్ మెటీరియల్ ఉన్నా దానిని అందంగా క్రియేట్ చేస్తాను. ఇండిపెండెంట్స్ డే వంటి అకేషన్స్‌కి ఎంచుకున్న శారీకి క్రాప్‌టాప్‌తో మ్యాచ్ చేశాను.

జ్యువెలరీ తయారీ


తక్కువ ధరలో జ్యువెలరీ ఇప్పుడు మార్కెట్‌లో దొరుకుతుంది. కొంచెం సమయం కేటాయిస్తే చాలు అలాంటి ఫ్యాషన్ జ్యువెలరీని మనమే ఇంకా తక్కువ ధరలో తయారు చేసుకోవచ్చు. బెల్ట్‌తో మరో స్టైలిష్ లుక్ వచ్చేలా చూసుకుంటాను. అలా.. క్లే జ్యువెలరీ, థ్రెడ్ జ్యువెలరీ నేనే తయారు చేసుకుంటాను" అని వివరించారు ఈ ఫిట్‌నెస్ ట్రైనర్.

క్యాబేజీతో క్రేజీగా...



వంటిల్లు

క్యా... బే... జీ!
పిల్లలు ఈ జోక్‌ని సరదాగా ఎంజాయ్ చేస్తారు.
సిబ్లింగ్స్ ఒకరినొకరు తిట్టుకోనట్లు తిట్టుకుంటారు.
పొగడక తప్పనట్లు పొగుడుకుంటారు.
క్యాబేజీ తినమంటే మాత్రం ముఖం చిట్లిస్తారు.
వారానికి ఒకసారి క్యాబేజ్ తినమంటోంది ఆరోగ్యం.
క్యాబేజీతో ఇలా ట్రై చేస్తే ఎలా ఉంటుంది?



కావలసినవి: గోధుమపిండి– పావు కేజీ; నూనె– 2 టీ స్పూన్లు; నీరు – ముప్పావు కప్పు; ఉప్పు – పావు టీ స్పూన్;

స్టఫింగ్ కోసం... క్యాబేజ్ – పావు కేజీ; నూనె – టేబుల్ స్పూన్; పచ్చిమిర్చి – 2 (తరగాలి); వాము – అర టీ స్పూన్; అల్లం తురుము – టీ స్పూన్; పసుపు – పావు టీ స్పూన్; కొత్తిమీర తరుగు – టీ స్పూన్; జీలకర్ర పొడి– అర టీ స్పూన్; గరం మసాలా పొడి– అర టీ స్పూన్; ఆమ్‌చూర్ – అరటీ స్పూన్; ఉప్పు – అర టీ స్పూన్; నూనె – టేబుల్ స్పూన్.

తయారీ: ● గోధుమపిండిలో ఉప్పు, నీరు పోసి ముద్దగా కలిపి పైన నూనె వేసి అద్ది పలుచని వస్త్రాన్ని కప్పి పక్కన పెట్టాలి. ● క్యాబేజ్‌ని శుభ్రంగా కడిగి మరుగుతున్న నీటిలో వేసి ఐదు నిమిషాల సేపు ఉంచి తీయాలి. నీరు పోయిన తర్వాత తురమాలి. ● వెడల్పు పెనంలో నూనె వేడి చేసి వాము గింజలు వేయాలి. అవి చిటపటలాడిన తర్వాత క్యాబేజ్ తురుము, ఉప్పు వేసి కలిపి మంట తగ్గించి మూతపెట్టాలి. ఏడెనిమిది నిమిషాలకు క్యాబేజ్ మగ్గుతుంది. అవసరమైతే కొద్దిగా నీటిని చిలకరించాలి. ఇప్పుడు పచ్చిమిర్చి, జీలకర్ర పొడి, అల్లం, పసుపు, ఆమ్‌చూర్ పౌడర్, గరం మసాలా పొడులు వేసి కలిపి మూత పెట్టాలి. రెండు నిమిషాల తర్వాత మూత తీసి కొత్తిమీర చల్లి దించేయాలి. చల్లారే వరకు పక్కన పెట్టాలి. ● ఈ లోపు గోధుమ పిండితో చపాతీలు చేయాలి. ఒక చపాతీ మీద ఒక గరిటె క్యాబేజ్ స్టఫింగ్ పెట్టి ఆ పైన మరో చపాతీ పెట్టి అంచులను చేత్తో అతికించాలి. ఇప్పుడు క్యాబేజ్ సమంగా విస్తరించడానికి అప్పడాల కర్రతో జాగ్రత్తగా రోల్ చేస్తే అదే కుల్చా. ఇలాగే పిండి అంతటినీ చేయాలి. ● ఇప్పుడు చపాతీల పెనం వేడి చేసి ఒక్కో కుల్చాను చపాతీలాగానే నూనె వేస్తూ రెండువైపులా కాలనివ్వాలి. స్టఫింగ్ బరువుతో కుల్చా విరిగిపోకుండా జాగ్రత్తగా తిరగేయాలి ● వేడి కుల్చాలోకి వెన్న, పెరుగు మంచి కాంబినేషన్. కారంగా తినాలంటే నిమ్మకాయ పచ్చడి, మామిడికాయ పచ్చడి బాగుంటుంది.

గమనిక: ఆమ్‌చూర్ పౌడర్ లేకపోతే తాజా మామిడి తురుము టీ స్పూన్ తీసుకోవాలి.



కావలసినవి: క్యాబేజ్ – 200 గ్రాములు (తరగాలి); ఉల్లిపాయ – 1 (పెద్దది, తరగాలి); క్యాప్సికమ్ – 1 (తరగాలి); క్యారట్ – 1 (తరగాలి); షెజ్వాన్ సాస్ – అర టేబుల్ స్పూన్; అల్లం తురుము – టీ స్పూన్; కశ్మీరీ మిరప్పొడి– అర టీ స్పూన్; మిరియాల పొడి– పావు టీ స్పూన్; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; శనగపిండి – 100 గ్రాములు; మైదా – 50 గ్రాములు; మొక్కజొన్న పిండి– 50 గ్రాములు; నూనె – వేయించడానికి తగినంత;

గార్నిష్ వేయడానికి... క్యాబేజ్ తురుము – టేబుల్ స్పూన్; కొత్తిమీర తరుగు – టీ స్పూన్.

తయారీ: ● వెడల్పు పాత్ర తీసుకుని అందులో నూనె మినహా మిగిలిన దినుసులన్నీ వేసి కలిపి పక్కన పెట్టాలి. నీరు అవసరం లేదు, కూరగాయల్లోని నీటితోనే పిండి ముద్దగా అవుతుంది. అరగంట తర్వాత మరోసారి బాగా కలుపుకోవాలి ● బాణలిలో నూనె మరిగించి పై మిశ్రమాన్ని చేతి నిండుగా తీసుకుని వేళ్లతో కొద్ది కొద్దిగా నూనెలో వదలాలి. కాలి కొంచెం గట్టి పడిన తర్వాత చిల్లుల గరిటెతో అన్ని వైపులా బాగా కాలే వరకు తిరగేస్తూ కాలనివ్వాలి. ఒక ప్లేట్‌లో టిష్యూ పేపర్ పరిచి మంచూరియా దోరగా కాలిన తర్వాత తీసి పేపర్ మీద వేయాలి. వేడిగా ఉండగానే క్యాబేజ్, కొత్తిమీరతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి.

క్యాంపస్ కబుర్లు చెప్పండి...

హాయ్, ఎలా ఉన్నారు? 'సూ...పర్' అంటారా...అయితే ఓకే! ఇప్పుడంటే 'సూపర్' అంటున్నారుగానీ ఒకప్పుడు? మన దేశం దాటి పర దేశంలో, వినడమే తప్ప ఎప్పుడూ చూడని యూనివర్శిటీలో అడుగు పెట్టినప్పుడు మీకు ఎలా అనిపించింది? కాస్త భయం వేసిందా? బోలెడు ఆనందం వేసిందా? అపరిచితులతో అనుకోని సమస్యలు ఎదురయ్యాయా? మీరు విదేశీ యూనివర్శిటీలో అడుగు పెట్టినప్పటి నుంచి ఆ వాతావరణానికి అలవాటు పడిన ఇప్పటి వరకు రకరకాల అనుభవాలు, అనుభూతులు మీ జ్ఞాపకాల బ్యాంకులో భద్రంగా ఉండే ఉంటాయి. వాటిని షేర్ చేసుకోవాలని మీకు అనిపిస్తే... ఆలస్యం చేయకండి... కలం పట్టండి. యూనివర్శిటీలో మీ ఫోటో జత చేసి మాకు మెయిల్ చేయండి. మా ఈమెయిల్: yourscampus@gmail.com

యువర్స్

● గేమింగ్

హ్యారీ పోటర్ వార్

హ్యారీ పోటర్: క్విడిట్స్ చాంపియన్స్ అనేది స్పోర్ట్స్ వీడియో గేమ్. 'క్విడిట్స్'పై ఫోకస్ చేయబడిన గేమ్ ఇది. 'క్విడిట్' అనేది హ్యారీ పోటర్ యూనివర్స్‌లో పాపులర్ ఆట. ఈ ఫాంటసీ స్పోర్ట్స్ గేమ్‌లో ప్లేయర్ నిర్దిష్ట స్థానంలో ఉన్న పాత్రను నియం



త్రించాల్సి ఉంటుంది. ఛేజర్, సీకర్, బీటర్, కీపర్... ఇలా నాలుగు వేర్వేరు స్థానాల నుంచి ప్లేయర్స్ తమ క్యారెక్టర్‌ను ఎంచుకోవచ్చు. ఈ గేమ్ అద్భుతమైన 'క్విడిట్స్' అనుభవాన్ని అందిస్తుంది. 'హారీ పోటర్'లో బ్రూమ్‌స్టిక్ సాహసాలు, మల్టీప్లేయర్ మోడ్స్ ఉన్నాయి.

సిరీస్: విజార్డింగ్ వరల్డ్ **మోడ్స్:** సింగిల్-ప్లేయర్ మల్టీప్లేయర్
ప్లాట్‌ఫామ్స్: నిన్‌టెండో స్విచ్, ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5. విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

● సోషల్ మీడియా

పదహారు ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియాకు నో



పదహారు ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియాను ఉపయోగించడాన్ని ప్రభుత్వం నిషేధిస్తుందని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ప్రకటించారు. యువతపై రకరకాల సైట్‌ల ప్రభావాన్ని ఆయన 'విపత్తు'గా అభివర్ణించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్‌లాంటి సైట్‌లలోకి లాగిన్ కావడానికి పిల్లల కనీస వయసు ఇంకా నిర్ణయించబడలేదు. ఇది 14 నుండి 16 సంవత్సరాల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. 'సోషల్ మీడియా వ్యసనంగా మారిన పిల్లలను ఆటస్థలాలు, పొలాలు, స్విమ్మింగ్ పూల్స్‌లో చూడాలనుకుంటున్నాను' అంటున్నారు ప్రధాని. 'సామాజిక మాధ్యమాలు సామాజిక హాని కలిగిస్తున్నాయి. యువత మనసులపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. సోషల్ మీడియా దాటి బాహ్య ప్రపంచంలోకి వస్తే వారికి ఎన్నో అనుభవాలు సొంతం అవుతాయి' అంటున్నాడు ఆంథోనీ అల్బనీస్. ప్రధాని నిర్ణయాన్ని ప్రతిపక్ష నేతలు సైతం సమర్థించారు. 'సోషల్ మీడియా సంస్థలు వయసు పరిమితి విధించాలి' అని కోరుతున్నాడు ప్రతిపక్ష నేత పీటర్ డట్టన్. 'సోషల్ మీడియా సంస్థలు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి' అని పాలక, ప్రతిపక్ష నేతలు కోరుకుంటున్నారు.

● యంగ్విస్టిక్స్



● ఇంటర్నేషనల్ లింగ్విస్టిక్స్ ఒలింపియాడ్



● అనిమికా దత్తా ● శ్రీలక్ష్మి

'భాషా'..! ... ఒక్క ప్రశ్న కాదు.. వందైనా ఓకే!

కేవలం 250 మంది మాట్లాడే భాష పేరు చెప్పగలరా? దాని నిర్మాణం ఏమిటి? ఎలా మాట్లాడుతారు, ఎలా రాస్తారో చెప్పగలరా? కొన్ని గంటల్లోనే ఆ భాషను అనువదించగలరా? 'కష్టం' అనేవాళ్లే ఎక్కువ. కాని కొందరు ఇష్టంగా ఇంటర్నేషనల్ లింగ్విస్టిక్స్ ఒలింపియాడ్‌లోకి అడుగుపెట్టి తమ సత్తా చాటుతున్నారు. మన దేశం తరపున ఈ పోటీలో పాల్గొన్న లక్ష్మి, అనిమికా దత్తాలు పతకాలు గెలుచుకున్నారు...

ఇంటర్నేషనల్ లింగ్విస్టిక్స్ ఒలింపియాడ్ అనేది ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులు, భాషాశాస్త్ర నిపుణులను ఒకచోట చేర్చే అంతర్జాతీయ పోటీ. 2003లో ఇది మొదలైంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ భాషల వ్యాకరణం, నిర్మాణం, సంస్కృతి, చరిత్రను విశ్లేషించడానికి, పజిల్స్‌ను సాల్వ్ చేయడం ద్వారా భాష సామర్థ్యాలను ప్రదర్శించడానికి ఈ పోటీ అవకాశం కల్పిస్తుంది. సృజనాత్మకత, ఊహాశక్తిని మెరుగుపరచడానికి ఈ పోటీ ఉపకరిస్తుంది. భవిష్యత్తు భాషాశాస్త్ర నిపుణులను తయారుచేస్తుంది.

'భాష లేదా భాషా శాస్త్రంపై లోతైన పరిజ్ఞానం అవసరం లేదు. అత్యంత సవాలుతో కూడిన సమస్యలకు కూడా తార్కిక సామర్థ్యంతో, ఓపికతో పరిష్కారం కనుక్కోవచ్చు' అంటుంది ఐవోఎల్. పోటీలో పాల్గొన్న వారికి ఇన్‌పుట్స్ ఇస్తారు. వాటి ఆధారంగా పజిల్స్ సాల్వ్ చేయాల్సి ఉంటుంది.

ఈ సంవత్సరం 'ఐవోఎల్'కు బ్రెజిల్ ఆతిథ్యం ఇచ్చింది. ఈ పోటీలో 38 దేశాల నుంచి 51 టీమ్‌లు పాల్గొన్నాయి. బ్రెజిల్ రాజధాని బ్రజిలియాలో జరిగిన 2024 ఇంటర్నేషనల్ లింగ్విస్టిక్స్ ఒలింపియాడ్(ఐవోఎల్)లో మన దేశానికి చెందిన అనిమికా దత్తా ధర్, శ్రీలక్ష్మి వెంకట్రామన్, ఫరాజ్ సిద్దిఖీ, అనన్య అగర్వాల్‌లు అద్భుత ప్రతిభాసామర్థ్యాలను ప్రదర్శించారు.

'ఐవోఎల్ వెబ్‌సైట్‌లో గత ఒలింపియాడ్‌లో వచ్చిన ప్రాబ్లమ్స్‌ను సాల్వ్ చేస్తూ ప్రాక్టీస్ చేశాను' అంటుంది పద్నాలుగు సంవత్సరాల శ్రీలక్ష్మి. బెంగళూరులోని జైగోపాల్ రాష్ట్రీయ విద్యాకేంద్రలో చదువుతున్న శ్రీలక్ష్మి ఐఐటీ కాన్పూర్ విద్యార్థి ఫరాజ్ సిద్దిఖీతో కలిసి కాంస్య పతకం సాధించింది. పదిహేడు సంవత్సరాల అనిమికా దత్తా ఈ ఒలింపియాడ్‌లో రజత పతకం గెలుచుకుంది. అనిమిక చెన్నై మ్యాథమెటికల్ ఇనిస్టిట్యూట్ విద్యార్థి.

తృటిలో పతకం చేజార్చుకున్న అనన్య పతకం సొంతం చేసుకోకపోయినా బోలెడు ప్రశంసలు అందుకుంది.

ఈ ఒలింపియాడ్‌లో పాల్గొన్న మన బృందానికి మైండ్-బ్లోయింగ్ వర్డ్ పజిల్స్ సవాలు విసిరాయి. ఇచ్చిన వ్యవధి ఆరు గంటలు. కొరియాక్(రష్యా), హడ్జా(టాంజానియా), కొమ్బో(పపువా న్యూ గినియా), దావ్ (బ్రెజిల్), యానువ్యవా(ఆస్ట్రేలియా)లాంటి మారుమూల భాషలకు సంబంధించిన పజిల్స్ ఇచ్చారు. 'భాష నుంచి చారిత్రక సందర్భాలను నిర్వచించవచ్చు' అంటున్న అనిమిక పపువా న్యూ గినియాకు చెందిన ఎన్గ భాషతో పాటు చారిత్రక విషయాల గురించి కూడా మాట్లాడగలదు. భాషాశాస్త్రం లోతుపాతుల గురించి పెద్దగా తెలియని అనిమిక ఆ శాస్త్రంపై ఆసక్తి పెంచుకోవడానికి పజిల్స్ కారణం.

'లింగ్విస్టిక్స్ ఒలింపియాడ్‌లో పాల్గొనడం వల్ల కొత్తగా, సృజనాత్మకంగా ఆలోచించే నైపుణ్యం పెరుగుతుంది' అంటుంది శ్రీలక్ష్మి.

'నా సాంస్కృతిక నేపథ్యమే నాకు స్ఫూర్తి' అంటుంది అనన్య అగర్వాల్. 'ఐవోఎల్' బ్రెయిన్‌టీజర్ ఫీచర్‌లు సాంస్కృతిక అంశాలతో ముడిపడి ఉంటాయి. ఆ సంస్కృతి తెలియకపోతే పజిల్స్ పరిష్కరించడం కష్టం. ఉదాహరణకు ఈ సంవత్సరం ఫ్యామిలీ ట్రీ ఇచ్చారు. ఫరెమ్ ప్రజల గురించి తెలియకపోతే ఆ సమస్య పరిష్కరించలేము. ఫరెమ్ అనేవాళ్లు కొమ్బో భాష మాట్లాడే ప్రజలు. వివాహానికి సంబంధించిన వీరి ఆచారవ్యవహారాలు ఆసక్తిగా ఉంటాయి. 'ఒకటి కంటే ఎక్కువ భాషల్లో ప్రవేశం అనేది సూక్ష్మ స్థాయిలో విశ్లేషణకు, సృజనాత్మకంగా ఆలోచించడానికి ఉపకరిస్తుంది' అనే విషయాన్ని 'ఐవోఎల్' పోటీలు చెప్పకనే చెబుతున్నాయి. బహు భాషలపై ఆసక్తి పెంచుకోవడానికి ప్రేరణను ఇస్తున్నాయి.

మరింత సులువుగా...

ఒక భాషకు సంబంధించిన వాక్య నిర్మాణం, వ్యాకరణం, ధ్వనులు... మొదలైన వాటిపై భాషాశాస్త్రం పనిచేస్తుంది. భాషాశాస్త్రానికి సంబంధించిన ఆసక్తి ఉపందుకోవడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రధాన కారణం. జీపీటి-4, క్లాడ్, జెమినిలాంటి లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం) ఇందుకు ఉదాహరణ. మనిషి ఇచ్చే ఇన్‌పుట్స్, కమాండ్స్‌కు మెషిన్ అర్థం చేసుకోవడానికి మధ్య అంతరాన్ని పూడ్చడానికి నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ సిస్టమ్స్ (ఎన్ఎల్‌పీ) అవసరం. ఎక్కువ సంఖ్యలో భాషాశాస్త్రవేత్తలు 'ఎన్ఎల్‌పీ' రిసెర్చ్‌లో భాగం అయితే సహజత్వ ప్రక్రియ మరింత సులువు అవుతుంది.

● టెక్.. టాక్

హానర్ మ్యాజిక్ వి3



సైజ్: 6.43 అంగుళాలు
బరువు: 226 గ్రా.
రిజల్యూషన్: 2156×2344 పిక్సెల్స్ **రిఫ్రెష్‌రేట్:** 120 హెచ్‌జడ్
మెమొరీ: 256జీబి 12జీబి ర్యామ్/512జీబి 16జీబి ర్యామ్
వోఎస్: ఆండ్రాయిడ్ 14 **బ్యాటరీ:** 5150 ఎంఏహెచ్



అలెక్సా ఎకో షో
(హెచ్‌డీ స్మార్ట్ డిస్‌ప్లే విత్ మోషన్)

స్క్రీన్: 10.1 **స్పీకర్:** 10 డబ్ల్యూ స్పీకర్
● ఫేవరెట్ టీవీ షోలను చూడవచ్చు ● వాయిస్ కంట్రోల్ లైట్స్ ● మనతో పాటు స్క్రీన్ కూడా ఆటోమేటిక్‌గా కదులుతుంది ● 13 ఎంపీ కెమెరాతో ఇంటిని మానిటర్ చేయవచ్చు.

ఆసుస్ వివోబుక్ ఎస్ 15



డిస్‌ప్లే: 15.60 అంగుళాలు
రిజల్యూషన్: 1920×1080 పిక్సెల్స్
ర్యామ్: 8జీబి
వోఎస్: విండోస్ 10
బరువు: 1.42 కేజీ
రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్

గూగుల్ ఆస్క్ ఫొటోస్



'ఆస్క్ ఫొటోస్' అనే కొత్త ఫీచర్ గురించి గూగుల్ ప్రకటించింది. గూగుల్ తన ఫొటోస్ యాప్‌లో ప్రవేశపెట్టిన కొత్త సెర్చ్ ఫీచర్ ఇది. నిర్దిష్టమైన ఫొటో, వీడియో కోసం సెర్చ్ చేయవచ్చు. ఉదాహరణకు...'వాట్ డిడ్ వి ఈట్ ఎట్ ది హోటల్ ఇన్ ఆగ్రా?' అని అడిగితే డాటాను విశ్లేషించి స్పెసిఫిక్ పిక్చర్‌ను అందిస్తుంది. సూచనలను పొందడానికి కూడా దీన్ని ఉపయోగించవచ్చు. ఈ ఫీచర్‌కు సంబంధించిన ప్రైవసీ సమస్యలను కూడా గూగుల్ పరిష్కరించింది. ఈ ఫీచర్ ప్రస్తుతం యూఎస్‌లోని పరిమిత యూజర్‌లకు మాత్రమే అందుబాటులో ఉంది.

● ఇంగ్లిష్ ఇడియమ్స్

English Idioms

లాంగ్ ఇన్ ది టూత్

పాతబడి పోవడం, గతానికి సంబంధించిన విషయం, ఔట్‌డేటెడ్ కావడం, వయసు పై బడడం... మొదలైన సందర్భాల్లో వాడే మాట... లాంగ్ ఇన్ ది టూత్.
ఉదా: దిస్ మోడల్ ఆఫ్ స్మార్ట్‌ఫోన్ ఈజ్ లాంగ్ ఇన్ ది టూత్. ఇట్స్ టైమ్ టు లుక్ ఫర్ ఏ న్యూ వెర్షన్.

ఈజీ పీజి

చాలా సులభం, సింపుల్... ఇలాంటి సందర్భాల్లో ఉపయోగించే మాట...ఈజీ పీజి.
ఉదా: జస్ట్ కాపీ వాట్ ఐ డూ. ఇట్స్ ఈజీ పీజి

సినిమా

● వరుణ్ తేజ్



ఫైనల్‌లో మట్కా

వరుణ్ తేజ్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'మట్కా'. కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నోరా ఫతేహి, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. డా. విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా మూవీ తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ''పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న సినిమా 'మట్కా'. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ డిఫరెంట్ మేకోవర్‌లో కనిపిస్తారు. ప్రస్తుతం ఈ సినిమా ఫైనల్ షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. ఈ షెడ్యూల్‌తో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా జరుగుతున్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

బాస్ మళ్లీ వస్తున్నాడు



● రజనీకాంత్

మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నాడు బాస్. రజనీకాంత్ హీరోగా నటించిన సూపర్ హిట్ మూవీ 'శివాజీ: ది బాస్' ఈ నెల 20న రీ రిలీజ్‌కి ముస్తాబవుతోంది. శంకర్ దర్శకత్వంలో రజనీకాంత్, శ్రియ జంటగా నటించిన చిత్రం 'శివాజీ: ది బాస్'. ఈ సినిమాలో సుమన్ విలన్ పాత్ర చేశారు. ఎంఎస్ గుహన్, ఎం. శరవణన్ నిర్మించిన ఈ సినిమా 2007లో విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. తెలుగులోనూ ఈ సినిమా సూపర్ హిట్ అయింది. తమిళ సినిమా ఇండస్ట్రీ చరిత్రలో రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరిన తొలి చిత్రంగా 'శివాజీ' నిలిచింది. సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్‌కు ఇది నూరవ సినిమా కావడం విశేషం. సుమారు 17 ఏళ్ల తర్వాత ఈ సినిమా రీ రిలీజ్ కానుంది. 4కే వెర్షన్‌లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. అయితే ఎంపిక చేసిన స్క్రీన్స్‌లో 'శివాజీ' టికెట్ ధర రూ. 99 మాత్రమే ఉండనుంది.

పాటల రచయిత గురుచరణ్ మృతి



ప్రముఖ పాటల రచయిత గురుచరణ్ (77) కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. గురుచరణ్ అసలు పేరు మానాపురపు రాజేంద్రప్రసాద్. దివంగత దర్శకుడు మానాపురం అప్పారావు, దివంగత నటి ఎం.ఆర్. తిలకంల కుమారుడే గురుచరణ్. ఎంఏ చదివిన ఆయన ప్రముఖ పాటల రచయిత ఆత్రేయ దగ్గర శిష్యరికం చేశారు. 'ముద్దబంతి నవ్వులో మూగ బాసలు' (అల్లుడుగారు), 'కుంతీకుమారి తన నోరుజారి, బోయవాని వేటుకు గాయపడిన కోయిల' (రౌడీగారి పెళ్ళాం) వంటి దాదాపు 200లకుపైగా సూపర్ హిట్ పాటలను రచించారు గురుచరణ్. ముఖ్యంగా నటుడు మోహన్‌బాబుకు ఎంతో ఇష్టమైన పాటల రచయిత ఆయన. అందుకే తన చిత్రాల్లో కనీసం ఒక్క పాట అయినా తప్పకుండా గురుచరణ్‌తో రాయించేవారు మోహన్‌బాబు. చిరస్థాయిగా నిలిచిపోయిన ఎన్నో మెలోడీ, అర్థవంతమైన పాటలను గురుచరణ్ రచించారు. ఆయన మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

భలే ఉన్నాడే నిరుత్సాహపరచదు - మారుతి



● అభిరామి, మనీషా, రాజ్ తరుణ్, మారుతి

''భలే ఉన్నాడే' సినిమాలో కథ, మాటలు, పాటలు, భావోద్వేగాలన్నీ పక్కాగా కుదిరాయి. మంచి సందేశం కూడా ఉంటుంది. కుటుంబమంతా కలిసి చూసేలా ఈ చిత్రాన్ని చక్కగా తీశాడు సాయి. ఈ సినిమా ప్రేక్షకులను నిరుత్సాహపరచదు'' అన్నారు డైరెక్టర్ మారుతి. రాజ్ తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా, అభిరామి కీలక పాత్రలో నటించిన చిత్రం 'భలే ఉన్నాడే'. జె. శివసాయి వర్ధన్ దర్శకుడు. మారుతీ సమర్పణలో ఎన్వీ కిరణ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో ''ఫ్యామిలీ అంతా కలిసి చూడదగ్గ సినిమా ఇది'' అని రాజ్ తరుణ్ పేర్కొన్నారు. ''మా సినిమా పెద్ద హిట్ అవుతుంది'' అన్నారు కిరణ్ కుమార్. ''నా 15 ఏళ్ల కల 'భలే ఉన్నాడే'. ఆ కలని నిజం చేసిన మారుతీగారికి ధన్యవాదాలు. సినిమా చూసి ప్రేక్షకులు చిరునవ్వుతో బయటికొస్తారు'' అని జె. శివసాయి వర్ధన్ తెలిపారు.

ఒకే పాత్రతో...



● ఆదిత్య ఓం

ఆదిత్య ఓం హీరోగా నటించిన చిత్రం 'బంధీ'. తిరుమల రఘు దర్శకత్వంలో వెంకటేశ్వర రావు దగ్గు, తిరుమల రఘు నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్ లాంచ్ వేడుకలో రఘు తిరుమల మాట్లాడుతూ- ''బంధీ' నా మొదటి చిత్రం. ఈ చిత్రంలో కేవలం ఒక పాత్రే (ఆదిత్య వర్మ) ఉంటుంది. ప్రకృతిని నాశనం చేస్తున్న కార్పొరేట్ కంపెనీలకు సపోర్ట్ చేసే లీగల్ అడ్వైజర్ ఆదిత్య వర్మగా ఆదిత్య కనిపిస్తారు. అలాంటి ఆదిత్య వర్మని అడవిలో వదిలేస్తే ఏం జరుగుతుంది? ప్రకృతిని ఎలా కాపాడతాడు? అనేది ఆసక్తిగా ఉంటుంది'' అన్నారు. ''ప్రకృతి కోసం తీసిన ఈ చిత్రం నచ్చడంతో అమెరికాలో పంపిణీ చేయనున్నా'' అని యూఎస్ డిస్ట్రిబ్యూటర్, వీఎఫ్ఎక్స్ హెడ్ జాకబ్ చెప్పారు.

''చిత్ర పరిశ్రమలో నెపోటిజం (బంధుప్రీతి) వల్ల కొన్ని సమస్యలు ఎదుర్కొన్నాను. అలాగే కొన్ని సినిమా అవకాశాలు కోల్పోయాను'' అన్నారు రకుల్ ప్రీత్ సింగ్. తెలుగు, తమిళ భాషల్లో స్టార్ హీరోయిన్‌గా దూసుకెళ్లిన రకుల్ ప్రస్తుతం బాలీవుడ్ పైనే ఎక్కువగా ఫోకస్ పెట్టారు. బంధుప్రీతి గురించి ఎదురైన ఓ ప్రశ్నకు రకుల్ సమాధానం ఇస్తూ- ''సినిమా రంగంలో బంధుప్రీతి ఉన్న మాట నిజమే. ఈ

అందుకే అవకాశాలు కోల్పోయా!

నెపోటిజం కారణంగా కొన్ని సినిమా చాన్స్‌లు మిస్ అయ్యాను. నన్ను సంప్రదించి ఆ తర్వాత మరొకరిని తీసుకున్నారు. అయితే అవి నాకు దక్కలేదని బాధ పడలేదు. అవకాశాలు కోల్పోవడం కూడా జీవితంలో ఓ భాగమే. వాటి గురించి ఆలోచించి టైమ్ వృథా చేసుకోను. ఏం చేస్తే నేను ఎదుగుతానో దానిపైనే శ్రద్ధ పెడతాను. ఒక స్టార్ కిడ్‌కు లభించినంత ఈజీగా మిగతా వారికి అవకాశాలు రావు'' అన్నారు.



● రకుల్ ప్రీత్‌సింగ్

ఇద్దరు సూపర్ హీరోల కథ ఇది - సుధీర్‌బాబు



● ఆర్ణ, సుధీర్‌బాబు

''మనందరికీ కనెక్ట్ అయ్యే భావోద్వేగం నాన్న. గొప్ప జీవితాన్ని ఇవ్వడానికి అహర్నిశలు కష్టపడి, ఈ జీవితం ఇచ్చిన మా నాన్న పోసాని నాగేశ్వరరావుకి కృతజ్ఞతలు. ఇద్దరు సూపర్ హీరోల (తండ్రీ కొడుకులు) మధ్య జరిగే ప్రేమకథే 'మా నాన్న సూపర్ హీరో'. మనస్ఫూర్తిగా నచ్చిన, నా కెరీర్‌లో చాలా సంతృప్తి ఇచ్చిన సినిమా ఇది'' అని హీరో సుధీర్‌బాబు అన్నారు. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో సుధీర్‌బాబు, ఆర్ణ జంటగా నటించిన చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. సాయిచంద్, సాయాజీ షిండే, రాజు సుందరం, శశాంక్, ఆమని ఇతర పాత్రల్లో నటించారు. సునీల్ బలుసు నిర్మించిన ఈ సినిమా అక్టోబర్ 11న విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్‌ను హీరో నాని రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన 'మా నాన్న సూపర్ హీరో' టీజర్ లాంచ్ ఈవెంట్‌లో... ''నేను, నా మిత్రులు వంశీ, సునీల్ కలసి సినిమాల డిస్ట్రిబ్యూషన్ చేసేవాళ్లం. వారి బ్యానర్‌లో నేను హీరోగా చేయాలనే నా కల నెరవేరింది'' అన్నారు సుధీర్‌బాబు. ''ఈ సినిమా చేసినందుకు గర్వంగా ఉంది'' అని సాయాజీ షిండే చెప్పారు. ''తండ్రీ కొడుకుల మధ్య జరిగే అందమైన కథ ఇది'' అని అభిలాష్ కంకర తెలిపారు.

గీతా శంకరంల ప్రేమ



● సురభి ప్రభావతి

ముఖేష్ గౌడ, ప్రియాంకా శర్మ జంటగా సురభి ప్రభావతి కీలక పాత్రలో రుద్ర దర్శకత్వంలో కె. దేవానంద్ నిర్మిస్తున్న లవ్‌స్టోరీ 'గీతా శంకరం'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ బెంగళూరులో జరుగుతోంది. ఇటీవల ఈ సినిమా సాంగ్స్ రికార్డింగ్ కూడా పూర్తి చేశారు. రుద్ర మాట్లాడుతూ- ''ఓ కొత్త పాయింట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం'' అని అన్నారు. ''మంచి ఎమోషనల్ డ్రామాతో సాగే చక్కని ప్రేమకథ ఇది'' అని తెలిపారు దేవానంద్. ఈ చిత్రానికి పాటలు: చంద్రబోస్, సంగీతం: అభు, కెమెరా: శ్యామ్ దూపాటి.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఓ దెయ్యం పరిష్కరించుకున్న కథ!

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం 'నీల వెళిచ్చమ్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఎక్కడైనా ప్రేమ కథలు చూస్తాం లేదంటే హారర్ కథలు చూస్తాం. కానీ 'భార్గవి నిలయం' (1964) హారర్ ప్రేమ కథా చిత్రమని చెప్పవచ్చు. ఎ. విన్సెంట్ దర్శకత్వంలో వచ్చిన ఈ బ్లాక్ అండ్ వైట్ మలయాళ సినిమాని రీమేక్ చేసి 'నీల వెళిచ్చమ్'గా మన ముందు నిలిపారు దర్శకుడు ఆషిక్ అబు. ఈ చిత్రం కథాంశానికొస్తే... ఓ కథా రచయిత మారుమూల గ్రామంలోని ఓ భవంతిలోకి రావడంతో సినిమా మొదలవుతుంది. అదే భార్గవి నిలయం. ఆ ఊళ్లోని వారందరూ ఆ భవంతిలో ఓ అమ్మాయి ఆత్మహత్య చేసుకుందని, ఆ అమ్మాయి ఆత్మ ఆ భవంతిలో తిరుగుతుందని భయపడుతూ ఎవరూ అటు వైపు వెళ్లడానికి కూడా సాహసించరు. కానీ ఈ రచయిత ధైర్యంగా ఆ భవంతిలోకి అడుగుపెట్టి ఆ దెయ్యం కథ రాయాలనుకుంటాడు. భార్గవి నిలయంలో అడుగుపెట్టిన రచయితకు దెయ్యం కనబడిందా? కనబడిన దెయ్యం తన కథ చెప్పిందా? అలాగే ఆ ఆత్మ తన కథలోని సమస్యను ఎలా పరిష్కరించుకోగలిగింది? అనేది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. ఓ రకంగా చెప్పాలంటే ఇదో వింటేజ్ కథ. సినిమా స్క్రీన్‌ప్లే కొంత ల్యాగ్‌లో నడిచినా చూసే ప్రేక్షకుడిని మాత్రం రీ రికార్డింగ్, అద్భుతమైన సంగీతంతో కొంతవరకు ఆకట్టుకుంటుంది. కొంత 'చంద్రముఖి' సినిమా ఛాయలు కనబడినా చివరకు ఓ మంచి సినిమా చూశామన్న అనుభూతి కలుగుతుంది. టొవినో థామస్ హీరోగా నటించారు. ఈ చిత్ర కథానాయకుడు సినిమాలో భార్గవి బంగారం అని దెయ్యాన్ని ప్రేమగా పిలుస్తున్నప్పుడల్లా ప్రేక్షకుడికి ప్రేమానుభూతి కలుగుతుందన్న విషయంలో అతిశయోక్తి లేదు. తెలుగులో 'భార్గవి నిలయం'గా అనువాదం అయి, 'ఆహా ఓటీటీ'లో స్ట్రీమ్ అవుతున్న ఈ చిత్రాన్ని ఓసారి చూడొచ్చు.

– ఇంటూరు హరికృష్ణ

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,440	82,963
నిఫ్టీ ▲	470	25,389

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	17,584	▲	189
డోజోన్స్	41,077	▲	274
ఎఫ్‌టీఎస్ఈ 100	8,241	▲	47
డాక్స్	18,266	▲	188
షాంఘై	2,717	▼	5
నికాయ్	36,833	▲	1,214

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్)	71,350	▼	100
బంగారం (22 క్యారెట్)	67,950	▲	100
వెండి (కిలో)	91,500		0

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	82.13	85.81
£	బ్రిటన్ పౌండ్	[illegible]	107.47	112.32
€	యూరో	[illegible]	90.53	94.96
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	48.00	70.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	58.66	58.66
S$	సింగపూర్ డాలర్	[illegible]	62.07	66.74
SAR	సౌదీ రియాల్	[illegible]	21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.97	23.75
¥	చైనా యువాన్	[illegible]	10.92	12.74

బుల్ హైజంప్

సెన్సెక్స్ @ 83,000
- ఫెడ్ వడ్డీరేట్ల తగ్గింపుపై మరింత పెరిగిన ఆశలు
- అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లో సానుకూలతలు
- ఇంట్రాడే, ముగింపులోనూ సరికొత్త రికార్డులు
- ర్యాలీకి అధిక వెయిటేజీ షేర్ల దన్ను



ముంబై: దేశీయ స్టాక్ సూచీలు గురువారం ఇంట్రాడే, ముగింపులోనూ సరికొత్త రికార్డులు నమోదు చేశాయి. ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలు మరింత బలపడడంతో పాటు అధిక వెయిటేజీ షేర్లు రాణించడంతో సూచీలు రెండు శాతం మేర ర్యాలీ చేశాయి. సెన్సెక్స్ 1,440 పాయింట్లు పెరిగి 82,963 వద్ద ముగిసింది. నిఫ్టీ 470 పాయింట్లు బలపడి 25,389 వద్ద ముగిసింది. ఈ ముగింపు సరికొత్త గరిష్టాలుకావడం విశేషం. ఇంట్రాడేలో అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈలో ప్రధాన రంగాల సూచీలన్నీ లాభపడ్డాయి. మెటల్ ఇండెక్స్ 3%, టెలికమ్యూనికేషన్ 2.50%, పవర్, ఆటో, యుటిలిటీ, కమోడిటీ సూచీలు రెండు శాతం చొప్పున రాణించాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు 1.32%, 0.79 శాతం లాభపడ్డాయి.

ఇంట్రాడేలో 83,000 స్థాయికి సెన్సెక్స్

ఉదయం లాభాలతో ప్రారంభమైన సూచీలు ప్రథమార్ధమంతా ఓ మోస్తరు లాభాలతో కదలాడాయి. మిడ్ సెషన్ నుంచి కొనుగోళ్ల వెల్లువెత్తడంతో భారీ ఆర్జించాయి. ట్రేడింగ్ చివర్లో సెన్సెక్స్ 1,593 పాయింట్లు ఎగసి 83,000 స్థాయిని అధిగమించి 83,116 వద్ద జీవిత కాల గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ సైతం 515 పాయింట్లు బలపడి 25,433 రికార్డును తాకింది.

మరిన్ని సంగతులు...

శ్రీ తిరుపతి బాలాజీ అగ్రో షేరు లిస్టింగ్‌లో మెరిసింది. ఇష్యూ ధర (రూ.83)తో పోలిస్తే 12% ప్రీమియంతో రూ.93 వద్ద లిస్టయ్యింది. చివరికి 17.51 శాతం పెరిగి రూ.98 వద్ద అప్పర్ సర్క్యూట్‌లో లాకైంది.

జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద

సెన్సెక్స్ రెండు శాతం ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.6.59 లక్షల కోట్లు పెరిగి జీవితకాల గరిష్టం రూ.467 లక్షల కోట్ల(5.57 ట్రిలియన్ డాలర్లు) వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ సూచీలో మొత్తం 30 షేర్లన్నీ లాభంతో ముగిశాయి. ఇక బీఎస్ఈ ఎక్స్ఛేంజీలో నమోదైన మొత్తం 4,069 కంపెనీ షేర్లలో 2,335 షేర్లు లాభపడ్డాయి. 278 షేర్లు ఏడాది గరిష్ట స్థాయిని తాకాయి.

పరుగులు ఎందుకంటే...

❐ అమెరికా ద్రవ్యోల్బణం వరుసగా అయిదోనెలా తగ్గుముఖం పట్టింది. ఆగస్టులో స్వల్పంగా అంచనాల కంటే తక్కువ 2.5% శాతంగా నమోదైంది. ఇది 43 నెలల కనిష్టం. దీంతో వచ్చే వారం ఫెడరల్ రిజర్వ్ 25 బేసిస్ పాయింట్ల వడ్డీరేట్ల కోతకు మార్గం సుగమం అయ్యింది.

❐ ఫెడ్ వడ్డీరేట్లను పావు శాతం తగ్గిస్తుందన్న అంచనాలు బలపడడంతో బుధవారం అమెరికా మార్కెట్లు 2% లాభపడ్డాయి. ఆసియా మార్కెట్లు 2% ర్యాలీ చేయగా. ఈసీబీ మరో దఫా వడ్డీరేట్ల కోతతో యూరప్ సూచీలు 1% ఎగబాకాయి.

❐ చైనాలో డిమాండ్ తగ్గడం, అధిక సరఫరాల ఆందోళనలతో క్రూడాయిల్ ధరలు ఈ సెప్టెంబర్‌లో 10% పైగా దిగివచ్చాయి. భారత్‌లో అధికంగా వినియోగించే బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ ధర 70 డాలర్ల దిగువకు చేరుకుంది. దీంతో చమురు దిగుమతులపై ప్రధానంగా ఆధారపడే దేశమైన భారత్‌కు ఇది సానుకూలాంశం.

❐ అధిక వెయిటేజీ భారతీ ఎయిర్‌టెల్ (4%), రిలయన్స్ ఇండస్ట్రీస్ (2%), ఇన్ఫోసిస్(2%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(1.25%), ఐసీఐసీఐ బ్యాంకు(1%) షేర్లు రాణించి సూచీల ర్యాలీకి బాసటగా నిలిచాయి. సెన్సెక్స్ ఆర్జించిన మొత్తం పాయింట్లలో ఈ షేర్ల వాటాయే 700 పాయింట్లు కావడం విశేషం. ఎల్అండ్‌టీ(2.50%), ఎంఅండ్ఎం(3%), ఎన్‌టీపీసీ(4%), కోటక్ బ్యాంక్(2%) షేర్లు పెరగడం కూడా బెంచ్‌మార్క్ సూచీలకు కలిసొచ్చింది.

ఈ-టూవీలర్లపై 10 వేలు



- పీఎం ఈ-డ్రైవ్ స్కీము కింద తొలి ఏడాది గరిష్ఠ సబ్సిడీ
- రెండో ఏడాది రూ. 5 వేలు
- కేంద్ర మంత్రి కుమారస్వామి వెల్లడి

న్యూఢిల్లీ: త్వరలో అమల్లోకి రానున్న పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనదారులు తొలి ఏడాదిలో గరిష్టంగా రూ. 10,000 వరకు సబ్సిడీని పొందవచ్చని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. ఈ స్కీమ్ ప్రకారం ఎలక్ట్రిక్ టూ-వీలర్ల విషయంలో బ్యాటరీ సామర్థ్యాన్ని బట్టి కిలోవాట్ అవర్‌కు (కేడబ్ల్యూహెచ్) సబ్సిడీని రూ. 5,000గా నిర్ణయించినట్లు చెప్పారు. అయితే, తొలి ఏడాది ఇది మొత్తమ్మీద రూ. 10,000కు మించదు. రెండో ఏడాది ఇది కిలోవాట్ అవర్‌కు సగానికి తగ్గి రూ. 2,500కు పరిమితమవుతుంది. మొత్తమ్మీద సబ్సిడీ రూ. 5,000కు మించదు. ఇక, ఈ-రిక్షా కొనుగోలుదారులు తొలి ఏడాది రూ. 25,000 వరకు, రెండో ఏడాది రూ. 12,500 వరకు సబ్సిడీ ప్రయోజనాలు పొందవచ్చని కుమారస్వామి చెప్పారు. కార్గో త్రీ వీలర్లకు తొలి ఏడాది రూ. 50,000, రెండో ఏడాది రూ. 25,000 సబ్సిడీ లభిస్తుంది. స్కీమ్ ప్రకారం పీఎం ఈ-డ్రైవ్ పోర్టల్‌లో ఆధార్ ఆధారిత ఈ-వోచర్ జారీ అవుతుంది. కొనుగోలుదారు, వినియోగదారు దానిపై సంతకం చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్రోత్సాహకాన్ని పొందేందుకు కొనుగోలుదారు సెల్ఫీని కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

25 లక్షల టూ-వీలర్లకు..

పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద వివిధ రకాల ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు రూ. 3,679 కోట్ల మేర సబ్సిడీలు/ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు కుమారస్వామి చెప్పారు. మొత్తం మీద 24.79 లక్షల ఈ-టూవీలర్లు, 3.16 లక్షల ఈ-త్రీ వీలర్లు, 14,028 ఈ-బస్సులకు స్కీముపరమైన తోడ్పాటు ఉంటుందన్నారు. ప్రస్తుతం ఓలా, టీవీఎస్, ఏథర్ ఎనర్జీ, హీరో విడా, బజాజ్ చేతక్ వంటి ఎలక్ట్రిక్ స్కూటర్ల ధరల శ్రేణి రూ. 90,000 నుంచి రూ. 1.5 లక్షల వరకు ఉంది.

ఈవీల వినియోగానికి ప్రోత్సాహం..

పీఎం ఈ-డ్రైవ్ స్కీమును ఆటోమొబైల్ దిగ్గజాలు స్వాగతించాయి. ఈవీల వినియోగం జోరందుకుంటుందని, ఫాస్ట్ చార్జింగ్ మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెట్టడం కూడా ఈవీలపై వినియోగదారుల నమ్మకాన్ని పెంపొందిస్తుందని మహీంద్రా గ్రూప్ సీఈవో అనీష్ షా తెలిపారు. ఉద్గారాల విషయంలో వేగంగా తటస్థ స్థాయిని సాధించేందుకు స్కీమ్ ఉపయోగపడుతుందని టాటా మోటార్స్ ఈడీ గిరీష్ వాఘ్ చెప్పారు. ఈవీ రంగం వేగంగా విస్తరించేందుకు పథకం తోడ్పడుతుందని ఓలా ఫౌండర్ భవీష్ అగర్వాల్ తెలిపారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
విదేశీ ఖనిజ నిల్వలపై ఎన్ఎండీసీ దృష్టి | 310 మిలియన్ డాలర్ల అదానీ స్విస్ నిధులు ఫ్రీజ్

రిటైల్ ధరలు దిగొచ్చాయ్..!


ఆగస్టులో ద్రవ్యోల్బణం 3.65%

న్యూఢిల్లీ: వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం వరుసగా రెండవ నెల ఆగస్టులో కూడా పూర్తి అదుపులో ఉంది. ధరల స్పీడ్ 3.65%గా (2023 ఇదే నెలతో పోల్చితే) నమోదైంది. అయితే నెలవారీగా 2024 జూలై (ఐదేళ్ల కనిష్ట స్థాయి 3.6%)తో పోల్చితే స్వల్పంగా పెరగడం గమనార్హం. జాతీయ గణాంకాల కార్యాలయం విడుదల చేసిన సమాచారం ప్రకారం... సూచీలోని ఫుడ్ బాస్కెట్ విభాగంలో ధరల స్పీడ్ ఆగస్టులో 5.66 శాతంగా ఉంది. జూలైలో ఈ రేటు 5.42 శాతం. ఒక్క కూరగాయలు చూస్తే, ద్రవ్యోల్బణం 10.71 శాతంగా ఉంది. కాగా, అక్టోబర్ 7 నుంచి 9 వరకూ తదుపరి పాలసీ సమీక్షా సమావేశం జరగనుంది. అప్పటి వరకూ రిటైల్ ద్రవ్యోల్బణం ఇదే దిగువస్థాయి ధోరణిలో కొనసాగితే ఆర్‌బీఐ రెపో రేటును తగ్గించే అవకాశాలు ఉన్నాయన్నది నిపుణుల అంచనా.



పరిశ్రమలు పేలవం...

పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) 2024 జూలైలో పేలవ పనితీరును ప్రదర్శించింది. వృద్ధి రేటు కేవలం 4.8%గా నమోదైంది. తయారీ, మైనింగ్ రంగాల పేలవ పనితీరు దీనికి నేపథ్యం. 2023 జూలై ఈ వృద్ధి రేటు 6.2%. ఇక ఏప్రిల్ నుంచి జూలై మధ్య కాలంలో ఐఐపీ వృద్ధి స్వల్పంగా 5.2%కి పెరిగింది.



థాయ్‌ల్యాండ్‌కు ఎయిర్ ఏషియా మరిన్ని సర్వీసులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: థాయ్ ఎయిర్ ఏషియా తాజాగా భారత్ నుంచి థాయ్‌ల్యాండ్‌కు డైరెక్ట్ ఫ్లయిట్ సర్వీసులను విస్తరించింది. కొత్త రూట్లలో హైదరాబాద్-బ్యాంకాక్, చెన్నై-ఫుకెట్ ఉన్నాయి. హైదరాబాద్ నుంచి సర్వీసులు అక్టోబర్ 27న, చెన్నై నుంచి ఫ్లయిట్స్ అక్టోబర్ 30న ప్రారంభమవుతాయి. లాంచ్ ఆఫర్ కింద హైదరాబాద్-బ్యాంకాక్ రూట్లో వన్-వే టికెట్ చార్జీ రూ. 7,390గా ఉంటుంది. వచ్చే నెల 27 నుంచి 2025 మార్చి 29 వరకు ప్రయాణాల కోసం సెప్టెంబర్ 22 వరకు ఈ ప్రమోషనల్ ఆఫర్ కింద బుక్ చేసుకోవచ్చు. కొత్తగా 2 సర్వీసుల చేరికతో భారతీయ మార్కెట్లో తాము సర్వీసులు నిర్వహించే రూట్ల సంఖ్య 14కి చేరుతుందని థాయ్ ఎయిర్‌ఏషియా హెడ్ (కమర్షియల్) తన్సితా అక్రారిత్‌పిరోమ్ తెలిపారు.



గాయత్రి-ట్రెసా జోడీ ఓటమి

హాంకాంగ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. గురువారం జరిగిన మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీకి ఓటమి ఎదురైంది. ప్రపంచ మూడో ర్యాంక్ జంట లియు పెంగ్-టాన్ నింగ్ (చైనా) 21-11, 22-20తో గాయత్రి-ట్రెసా జోడీపై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సిక్కి రెడ్డి-సుమీత్ రెడ్డి జంట కూడా పరాజయం పాలైంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి-సుమీత్ ద్వయం 11-20, 20-22తో గో సూన్ హువాట్-లాయ్ షెవోన్ జేమీ (మలేసియా) జోడీ చేతిలో ఓడిపోయింది.

నాలుగో రోజూ వర్షార్పణం


గ్రేటర్ నోయిడా: గత మూడు రోజుల్లో కనీసం టాస్‌కు నోచుకోలేకపోయిన అఫ్గానిస్తాన్, న్యూజిలాండ్ జట్ల మధ్య ఏకైక టెస్టు మ్యాచ్ నాలుగో రోజు కూడా ముందుకు సాగలేదు. వర్షం కారణంగా నాలుగో రోజు ఆట కూడా రద్దయింది.



పారాలింపిక్స్ పతక విజేతలతో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ

న్యూఢిల్లీ: పారిస్ పారాలింపిక్స్‌లో పతకాలు సాధించిన విజేతలతో గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పారాలింపియన్ల అంకితభావాన్ని కొనియాడిన ప్రధాని వారిని అభినందించారు. ప్రతి ఒక్కరితో విడివిడిగా కలుసుకొని ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా శారీరక ఎదుగుదల లోపం ఉన్న జావెలిన్ త్రోయర్ నవ్‌దీప్ సింగ్‌తో మోదీ అహ్లాదంగా గడిపారు. మరుగుజ్జు క్రీడాకారుడైన అతని చేతుల మీదుగా టోపీ ధరించేందుకు నేలపై కూర్చున్నారు. దీంతో నవ్‌దీప్ అమితానందంతో ప్రధానికి టోపీ తొడిగాడు. అనంతరం తన చేతి భుజంపై ఆటోగ్రాఫ్ కోరగా... ప్రధాని వెంటనే పెన్ తీసుకొని అతని ముచ్చట తీర్చారు. జావెలిన్ త్రోలో బంగారు పతకం సాధించిన అతని గురించి అడిగి తెలుసుకున్నారు. షూటర్ అవని లేఖరా, జూడో ప్లేయర్ కపిల్ పర్మార్, ఆర్చర్లు శీతల్ దేవి, రాకేశ్ కుమార్ తదితరులు ప్రధానితో ముచ్చటించారు.

భారత జట్లకు రెండో గెలుపు



దివ్య

బుడాపెస్ట్: చెస్ ఒలింపియాడ్ రెండో రౌండ్‌లోనూ భారత పురుషుల, మహిళల జట్లు గెలుపొందాయి. చెక్ రిపబ్లిక్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 3.5-0.5తో నెగ్గింది. భారత క్రీడాకారిణులు ద్రోణవల్లి హారిక 53 ఎత్తుల్లో జూలియాపై, దివ్య దేశ్‌ముఖ్ 41 ఎత్తుల్లో నటాలీ కనకోవాపై, వంతిక 31 ఎత్తుల్లో తెరెజాపై గెలిచారు. కొరెనోవాతో జరిగిన గేమ్‌ను తానియా సచ్‌దేవ్ 35 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. ఐస్‌లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు 4-0తో విజయం సాధించింది. గుకేశ్ 40 ఎత్తుల్లో విగ్నిర్ వత్నార్ స్టెఫాన్సన్‌పై, ఇరిగేశి అర్జున్ 38 ఎత్తుల్లో హేన్స్ స్టెఫాన్సన్‌పై, విదిత్ 39 ఎత్తుల్లో హెమిసన్ ఫ్రెయర్‌పై, పెంటేల హరికృష్ణ 58 ఎత్తుల్లో గ్రేటర్సన్‌పై గెలిచారు.

మళ్లీ హైదరా'బాద్‌షా' అయ్యేనా!

కొత్త యాజమాన్యం నేతృత్వంలో ఐఎస్ఎల్ బరిలో •టీమ్‌ను కొనుగోలు చేసిన బీసీ జిందాల్ గ్రూప్ •19న బెంగళూరుతో తొలి మ్యాచ్

జట్టులోని ఆటగాళ్లకు ఫీజులు కూడా చెల్లించలేని నిస్సహాయత... కాంట్రాక్టల రద్దు... ఆటగాళ్ల బదిలీలపై నిషేధం... టీమ్‌పై నిషేధం... కొద్ది రోజుల క్రితం వరకు ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (హెచ్ఎఫ్‌సీ) పరిస్థితి ఇది. వరుణ్ త్రిపురనేని తదితరులు యజమానులుగా ఉన్న ఈ టీమ్‌కు ఐఎస్ఎల్ నిర్వాహకులు హెచ్చరికలు జారీ చేస్తూ నోటీసులు ఇచ్చినా స్పందించలేని వైనం... చివరకు ఐఎస్ఎల్ నుంచి హైదరాబాద్ టీమ్‌ను తప్పించేందుకు రంగం సిద్ధం! ఇలాంటి సమయంలో బీసీ జిందాల్ గ్రూప్ బరిలోకి దిగింది. అన్ని రకాల బాకీలను తీరుస్తూ జట్టును తీసుకునేందుకు సిద్ధమైంది. చర్చోపచర్చల తర్వాత ఎట్టకేలకు యాజమాన్య మార్పు ఖాయమైంది. ఇప్పుడు అధికారిక అనుమతి తర్వాత హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ ఎలాంటి అంతరాయం లేకుండా ఐఎస్ఎల్‌లో ఆరో సీజన్‌కు 'సై' అంటోంది.



హైదరాబాద్ ఎఫ్‌సీ హోం గ్రౌండ్ గచ్చిబౌలి స్టేడియం

సాక్షి, హైదరాబాద్: ఐఎస్ఎల్‌లో హైదరాబాద్ టీమ్ అడుగు పెట్టడమే అనూహ్యంగా జరిగింది. 2018-19 సీజన్ తర్వాత ఆర్థిక సమస్యలతో పుణే సిటీ టీమ్ సతమతమైంది. దాంతో తర్వాతి సీజన్‌లో పుణే స్థానాన్ని మరో జట్టుతో భర్తీ చేసేందుకు ఐఎస్ఎల్ నిర్వాహకులు సిద్ధం కాగా... అప్పటికే కేరళ బ్లాస్టర్స్ టీమ్‌తో కలిసి పని చేసిన వరుణ్ ఎక్కువ వాటాతో పుణే స్థానాన్ని హైదరాబాద్ టీమ్‌తో భర్తీ చేశాడు. తొలి సీజన్ (2019-20)లో పేలవమైన ఆటతో జట్టు చివరి స్థానానికే పరిమితమైంది. తర్వాతి ఏడాది కాస్త మెరుగైన ప్రదర్శనతో జట్టు ఐదో స్థానంతో ముగించింది. అయితే 2021-22లో ప్రస్తుత భారత జట్టు హెడ్ కోచ్ మనోలో మార్క్వెజ్ నేతృత్వంలో చాంపియన్‌గా నిలిచింది. తర్వాతి ఏడాదీ రన్నరప్‌గా మెరుగైన ప్రదర్శన కనబర్చింది. అయితే గత సీజన్‌లో జట్టు గతి తప్పింది. మైదానంలో ప్రదర్శన ఘోరంగా ఉండగా... మైదానం బయట సమస్యలు టీమ్ పరిస్థితిని పూర్తిగా దిగజార్చాయి. 22 మ్యాచ్‌లు ఆడితే 1 మ్యాచ్‌లో నెగ్గి, 16 మ్యాచ్‌లలో ఓడి, 5 మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని అట్టడుగున నిలిచింది.

అన్నీ సమస్యలే...

బయటకు కనిపించని ఎన్నో కారణాలతో హైదరాబాద్ ఎఫ్‌సీ టీమ్ పరిస్థితిపై అనిశ్చితి నెలకొంది. కొన్ని నెలల పాటు తమకు ఒప్పందం ప్రకారం ఫీజులు చెల్లించలేదంటూ ఎనిమిది మంది ఆటగాళ్లు జట్టు నుంచి తప్పుకున్నారు. దాంతో ఆటగాళ్ల బదిలీపై కూడా 'ఫిఫా' నిషేధం విధించింది. టీమ్ అప్పులు పెరిగిపోయాయి. మ్యాచ్‌ల కోసం ప్రయాణాలను కూడా సరిగా ప్లాన్ చేయలేక వేదిక అయిన మరో నగరానికి మ్యాచ్ రోజు ఉదయం చేరిన ఘటనలు కూడా జరిగాయి. ఐఎస్ఎల్ నుంచి నోటీసు వచ్చినా టీమ్ యాజమాన్యం స్పందించలేదు. ఒక దశలో మాకు జీతాలు చెల్లించండి ప్రభూ అంటూ టీమ్‌తో కలిసి పని చేసిన పలువురు సహాయక సిబ్బంది మ్యాచ్‌ల సమయంలో గచ్చిబౌలి స్టేడియంలో పెద్ద బ్యానర్లను ప్రదర్శించారు. సమస్య తాత్కాలికమేనని, త్వరలో పరిష్కరిస్తామని వరుణ్ ప్రకటించినా ఎవరికీ నమ్మకం కుదరలేదు. గచ్చిబౌలి స్టేడియంలో కూడా జీతాలు ఇవ్వకపోవడంతో అక్కడి సిబ్బంది ఎవరూ మ్యాచ్ నిర్వహణకు సహకరించలేదు. చివరకు యాజమాన్య హక్కులను వదులుకోవాల్సి వచ్చింది.

కొత్త యాజమాన్యంతో...

సమస్యలను పరిష్కరించుకునేందుకు ఆగస్టు 15ను డెడ్‌లైన్‌గా విధించగా... టీమ్ యాజమాన్యం మరో రెండు వారాలు అదనపు గడువు అడిగింది. దాంతో హైదరాబాద్ మ్యాచ్‌లను మినహాయించి ఇతర మ్యాచ్‌ల షెడ్యూల్‌ను ఐఎస్ఎల్ ప్రకటించింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ వ్యాపారాల్లో ఉన్న సంస్థ బీసీ జిందాల్ గ్రూప్ క్రీడల్లో అడుగు పెట్టేందుకు సిద్ధమై ముందుకు వచ్చింది. 1952 నుంచి వ్యాపార రంగంలో ఉన్న ఈ సంస్థ 'జిందాల్ ఫుట్‌బాల్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో తొలిసారి లీగ్‌లో ఒక టీమ్‌ను కొనుగోలు చేసింది. గత యాజమాన్యం చేసిన అప్పులు, లాభాలు, ఇతర లెక్కలు అన్నీ తేలిన తర్వాత ఈ నెల 2న హైదరాబాద్ టీమ్‌ను జిందాల్ గ్రూప్ తీసుకున్నట్లుగా అధికారికంగా ప్రకటించారు. కొత్త మేనేజ్‌మెంట్ అండతో హెచ్ఎఫ్‌సీ 2024-25 సీజన్‌లో ఎలా ఆడుతుందనేది ఆసక్తికరం.

హైదరాబాద్ ఎఫ్‌సీ జట్టు వివరాలు

అర్ష్‌దీప్ సింగ్ సైనీ, లాల్‌బియాక్లువా జాంగ్తే, అలెక్స్ షాజీ, లియాండర్ కన్హా, మనోజ్ మొహమ్మద్, మొహమ్మద్ రఫీ, పరాగ్ సతీశ్ శ్రీవాస్, సోయల్ జోషి, విజయ్ మరాండి, రామ్‌లన్‌చుంగా, అబ్దుల్ రబీ అంజుకందన్, అభిజిత్ పా, ఆయుశ్ అధికారి, ఐజాక్ వన్మల్‌సవ్మా, చాక్‌చువాక్, లాల్‌చన్‌హిమా చైలో, లెనీ రోడ్రిగ్స్, రబీద్ మదమ్‌బల్లత్, అమోన్ లెప్చా, ఆరోన్ వన్‌లాల్‌రించనా, స్టీఫెన్ గొడార్డ్, దేవేంద్ర ధాకూ ముర్గాంవ్‌కర్, జోసెఫ్ సన్నీ, కోచ్: తంగ్‌బోయ్ సింగ్తో.




నేటి నుంచి ఐఎస్ఎల్



తొలి పోరులో మోహన్ బగాన్‌తో ముంబై సిటీ 'ఢీ'

కోల్‌కతా: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫుట్‌బాల్ టోర్నీ 11వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. టోర్నీలో మొత్తం 13 జట్లు బరిలోకి దిగుతున్నాయి. నేడు జరిగే తొలి పోరులో డిఫెండింగ్ చాంపియన్ ముంబై సిటీ ఎఫ్‌సీతో గత ఏడాది రన్నరప్ మోహన్ బగాన్ సూపర్ జెయింట్ జట్టు తలపడుతుంది. ఈ రెండు టీమ్‌లతో పాటు డ్యురాండ్ కప్ విజేత నార్త్‌ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సీ కూడా చక్కటి ఫామ్‌తో సవాల్ విసురుతోంది. నేడు జరిగే మొదటి మ్యాచ్‌లో రెండు జట్లలో కలిపి భారత సీనియర్ జట్టు ఆటగాళ్లంతా పెద్ద సంఖ్యలో ఉండటం ఆసక్తిని పెంచింది. టోర్నీలో ప్రాథమిక లీగ్ దశ పోటీలు డిసెంబర్ 30 వరకు సాగుతాయి. ఆ తర్వాత నాకౌట్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం హోం టీమ్ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ ఆడే ఆరు మ్యాచ్‌లకు (అక్టోబర్ 1, 30...నవంబర్ 25...డిసెంబర్ 4, 23, 28) ఆతిథ్యం ఇవ్వనుంది. మ్యాచ్‌లన్నీ స్పోర్ట్స్ 18 చానెల్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.



హర్మన్‌ప్రీత్

ఎదురులేని భారత్


హులున్‌బుయిర్ (చైనా): ఆసియా పురుషుల చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు విజయపరంపర కొనసాగుతోంది. దక్షిణ కొరియా జట్టుతో గురువారం జరిగిన నాలుగో లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 3-1 గోల్స్ తేడాతో గెలిచింది. వరుసగా నాలుగో విజయం నమోదు చేసిన భారత్ 12 పాయింట్లతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే లీగ్ టాపర్‌గా స్థానాన్ని ఖరారు చేసుకుంది. కొరియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (9వ, 43వ ని.లో) రెండు గోల్స్ చేయగా... అరిజీత్ సింగ్ హుందల్ (8వ ని.లో) ఒక గోల్ సాధించాడు. కొరియా జట్టుకు యాంగ్ జిహున్ (30వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. ఇతర లీగ్ మ్యాచ్‌ల్లో మలేసియా 5-4తో జపాన్‌పై, పాకిస్తాన్ 5-1తో చైనాపై గెలిచాయి. శుక్రవారం విశ్రాంతి దినం. శనివారం జరిగే తమ చివరి లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో భారత్ తలపడుతుంది.

స్విమ్మర్ వృత్తి అగర్వాల్‌కు స్వర్ణ, రజత పతకాలు



మంగళూరు: జాతీయ సీనియర్ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్విమ్మర్ వృత్తి అగర్వాల్ మరో రెండు పతకాలు సాధించింది. గురువారం జరిగిన మహిళల 800 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో స్వర్ణ పతకం (9ని:16.14 సెకన్లు) నెగ్గిన వృత్తి... 200 మీటర్ల బటర్‌ఫ్లయ్ విభాగంలో రజత పతకాన్ని (2ని:21.89 సెకన్లు) సొంతం చేసుకుంది. పురుషుల 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సంపత్ కుమార్ కాంస్య పతకాన్ని (16ని:26.48 సెకన్లు) సాధించాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



గుండెపోటు మరణాలు తగ్గాయ్!

అత్యాధునిక జన్యు పరీక్షతో రోగులకు ప్రయోజనం..

ఎవరెవరికి ఏ మందు ఎంతమేరకు పని చేస్తుందో ఈ పరీక్షతో తెలుసుకోవచ్చు

జీనోమ్ ఫౌండేషన్ వర్క్‌షాప్‌లో డాక్టర్ సోమరాజు, డాక్టర్ ప్రసాదరావు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: గత పది, పది హేనేళ్లతో పోలిస్తే ఇప్పుడు గుండెపోటు మరణాలు తగ్గాయని ప్రముఖ వైద్యులు వెల్లడించారు. కోవిడ్ తర్వాత గుండెపోటు మరణాలు పెరిగాయన్నది వాస్తవం కాదన్నారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు అత్యాధునిక జన్యు పరీక్షతో ఎంతో ప్రయోజనం ఉంటుందని జీనోమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన వర్క్‌షాప్‌లో పలు వురు డాక్టర్లు, శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని జీనోమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఏఐజీ ఆసుపత్రికి చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ బి.సోమరాజు, నిమ్స్ మాజీ డైరెక్టర్, అపోలో స్పెక్ట్రా ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ ప్రసాదరావు, అపోలో ఆసుపత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాసరావు, యూరాలజిస్ట్ డాక్టర్ దీపిక, డాక్టర్ సత్యనారాయణ, జీ నోమ్ ఫౌండేషన్ ఎండీ డాక్టర్ గాంధీ మాట్లాడారు. జెనెటిక్ పరీక్షల వల్ల కొందరికి కొన్ని రోగాలకు మందులు వాడాల్సిన అవసరం ఉండకపోవచ్చని, కొందరికి ఎంత డోసు వాడాలో స్పష్టత వస్తుందన్నారు. మనిషికీ, మనిషికీ జన్యుపరంగా తేడా ఉంటుందని... ఆ ప్రకారమే మందుల అవసరం ఉంటుందన్నా రు. ఆ తేడాను గుర్తించకపోతే కొందరికి మందులు సరిగా పనిచేస్తే, కొందరిపై దుష్ప్రభావాలు ఉండొచ్చని అభిప్రాయపడ్డారు.

ఔషధాల వినియోగంలో..: కార్డియాక్ ఔషధాల దీర్ఘకాలిక వినియోగంలో లోతైన అవగాహన అవసరమని వక్తలు చెప్పారు. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో క్లోపిడోగ్రెల్, రక్తం గడ్డకట్టే స్థాయిలను తగ్గించడంలో స్టాటిన్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని, అయితే అవి వ్యక్తిగతంగా రోగులపై ఏ స్థాయిలో పనిచేస్తున్నాయోననే విషయాన్ని అర్థం చేసుకోవడంలో జన్యు పరీక్షలు దోహదపడతాయని తెలిపారు. డాక్టర్ సోమరాజు మాట్లాడు తూ, జెనెటిక్ టెస్టు వల్ల ఏ వ్యక్తికి ఏ మందు అవసరం? ఎంత మోతాదులో అవసరం? అసలు మందులు వేయాల్సిన అవస రం ఉందా? లేదా? వంటి స్పష్టత వస్తుందన్నారు.అపోలో స్పెక్ట్రా చైర్మన్ డాక్టర్ ప్రసాదరావు మాట్లాడుతూ, డాక్టర్లు రాసిచ్చే మందుల్లో ప్రతీ నలుగురిలో ఒకరికి పని చేయడం లేదన్నారు. అందుకే జన్యు పరీక్ష చేస్తే ఏది అవసరమో నిర్ధారణకు రావొచ్చన్నారు.

జెనెటిక్ పరీక్ష ధర రూ.10 వేలు: జీనోమ్ ఫౌండేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 4.15 ఎకరాల భూమి కేటాయించిందని డాక్టర్ గాంధీ వెల్లడించారు. త్వరలో భవన నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారన్నారు. జీనోమ్ టెస్ట్‌కు తాము రూ.10 వేలు చార్జి చేస్తున్నామన్నారు. ఒకసారి పరీక్ష చేస్తే జీవితాంతం ఆ రిపోర్టు ఉపయోగపడుతుందన్నారు. దాని ప్రకారం అవసరమైన మోతాదులో డాక్టర్లు మందులు ఇవ్వడానికి వీలుపడుతుందని చెప్పారు.

చిన్ని గుండెకు పెద్ద కష్టం

హృదయ సమస్యతో బాధపడుతున్న టెన్త్ విద్యార్థి..

ఆపరేషన్‌కు రూ.8 లక్షలు అవుతుందన్న వైద్యులు

సాయం కోసం అర్థిస్తున్న బాలుడి అమ్మమ్మ


బాబుకు మంచంపై సపర్యలు చేస్తున్న అమ్మమ్మ

జీడిమెట్ల (హైదరాబాద్): బాబు పుట్టగానే తల్లి చనిపోయింది.. నాన్న రెండో పెళ్లి చేసుకుని బంధాన్ని తెంచుకున్నాడు. చివరకు అమ్మమ్మ సుబ్బలక్ష్మి అక్కున చేర్చుకుని వృద్ధాప్యంలోనూ అట్టల పరిశ్రమలో పనిచేస్తూ అన్నీ తానై సాకుతోంది. అంతా సాఫీగా సాగుతున్న సమయంలో బాబుకు ఊహించని విపత్తుగా గుండెకు సంబంధించిన సమస్య వచ్చి పడింది. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం దూలపల్లి ప్రశాంత్‌నగర్‌లో ఉంటున్న నూకల లక్ష్మీనారాయణ (15) ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. వారం క్రితం బాబుకు ఛాతీలో నొప్పి రావడంతో అమ్మమ్మ ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లింది. ఆయన సూచన మేరకు మల్లారెడ్డి ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ డాక్టర్లు బాబుకు ఆపరేషన్ చేయాలని, ప్రాణాలకు భరోసా ఇవ్వలేమని చెప్పారు. దీంతో బాబును అమ్మమ్మ నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లగా ఆరోగ్యశ్రీ లేదని తిప్పి పంపించారు. అనంతరం బాబును రెయిన్‌బో ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు బాబు గుండె నుంచి వచ్చే నాళానికి రంధ్రం పడిందని, ఆపరేషన్‌కు రూ.8 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. ఐదు రోజుల్లో బాబుకు ఆపరేషన్ చేయకపోతే ప్రాణానికి ముప్పు ఉందని తెలిపారు. రెక్కాడితేగానీ డొక్కాడని అమ్మమ్మ కంట నీరు పెట్టడమే తప్ప ఏమీ చేయలేని స్థితిలో ఉంది. దీంతో ఆమె అందరి కాళ్ల మీద పడి తన మనవడిని రక్షించాలని రోదిస్తున్న తీరు అందరినీ కలిచివేస్తుంది. ఆమె అట్టల కంపెనీలో పనిచేస్తే నెలకు రూ.7 వేలు వస్తుంది. ఇంటి అద్దె రూ.2,500 పోను మిగిలిన సొమ్ముతోనే మనవడిని చదివిస్తూ తిండిపెట్టాలి. దీంతో దాతల సహాయం కోసం ఆ చిన్ని గుండె ఎదురుచూస్తుంది. బాలుడికి ఆర్థికంగా సాయం చేయాలనుకునేవారు 9177376666 (సాయి), 912159 3999(కృష్ణ)లను సంప్రదించవచ్చు.

అకౌంట్ నంబర్: 240810100015391
పేరు: చింతలపూడి రామకృష్ణ,
బ్యాంక్: యూనియన్ బ్యాంక్,
బ్రాంచ్: అపురూపా కాలనీ,
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: UBIN0824089

చిన్నారిపై హత్యాచారం కేసులో దోషికి మరణశిక్ష..

సంగారెడ్డి జిల్లా 'పోక్సో'కోర్టు సంచలన తీర్పు

11 నెలల వ్యవధిలోనే శిక్ష విధించిన కోర్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి జోన్: ఆరేళ్ల చిన్నారిపై హత్యాచారం కేసులో సంగారెడ్డి జిల్లా పోక్సో కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. బాలికపై అత్యాచారం, హత్య చేసిన కేసులో దోషికి కోర్టు మరణ శిక్ష విధించినట్లు సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. ఆయన గురువారం ఎస్పీ కార్యాలయంలో మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు. బిహార్‌లోని సికిందర్ ప్రాంతానికి చెందిన గఫాఫర్ అలీఖాన్ (61) బీడీఎల్ పరిధిలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గత అక్టోబర్ 16న ఆద్రి కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేసే భార్యాభర్తలు తమ మనవరాలిని సెక్యూరిటీ గార్డు వద్ద ఉంచి పనికివెళ్లారు. అదేరోజు వీరి పక్క రూములో ఉండే గఫాఫర్ అలీ పనికి వెళ్లకుండా మద్యం తాగి తిరుగుతున్నాడు. 11 గంటల ప్రాంతంలో సెక్యూరిటీ గార్డు వద్ద ఉన్న చిన్నారిని గమనించాడు. బాలికకు కూల్‌డ్రింక్ ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడు. చిన్నారికి నిందితుడు మద్యం కలిపి ఉన్న కూల్‌డ్రింక్ తాగించి పత్తి చేనులోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ విషయం అందరికీ చెబుతుందేమోనని చిన్నారిని అక్కడే హత్య చేశాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి బీడీఎల్ భానూర్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రవీందర్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అప్పటి డీఎస్పీ పురుషోత్తం రెడ్డి చార్జ్‌షీటు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు విన్న ప్రత్యేక పోక్సో కోర్టు జడ్జి జయంతి.. బాలికపై హత్యాచారం చేసిన గఫాఫర్‌ను దోషిగా నిర్ధారించి మరణశిక్ష విధించారు. అతడి కుటుంబ సభ్యులు చిన్నారి కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలని తీర్పు ఇచ్చారు.

27 ఏళ్ల తర్వాత జిల్లాలో మరణశిక్ష: 27 ఏళ్ల తర్వాత జిల్లాలో కోర్టు మరణశిక్షను విధించినట్లు ఎస్పీ చెన్నూరి రూపేష్ వెల్లడించారు. కేసును త్వరితగతిన విచారించేందుకు హైకోర్టు నుంచి అనుమతి తీసుకున్నామని, కేవలం 11 నెలల వ్యవధిలోనే విచారణ పూర్తిచేసి నిందితుడికి కోర్టు మరణ శిక్ష విధించిందని చెప్పారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి ఎస్ఐ, విచారణ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లను ఎస్పీ అభినందించారు.

దోస్త్ స్పెషల్ డ్రైవ్ ద్వారా 12,756 సీట్లు భర్తీ

సాక్షి, హైదరాబాద్: దోస్త్ ప్రత్యేక డ్రైవ్ ద్వారా 12,756 డిగ్రీ సీట్లు భర్తీ చేసినట్టు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి తెలిపారు. ఈ వివరాలను ఆయన గురువారం మీడియాకు వెల్లడించారు. ఆర్ట్స్‌లో 2,143, కామర్స్‌లో 5,137, లైఫ్‌సైన్స్‌లో 2,789, ఫిజికల్ సైన్స్‌లో 2,330, డీఫార్మసీలో 354, ఇతర కోర్సుల్లో మూడు సీట్లు భర్తీ చేశామని తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 16లోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు.

ఎక్స్ఛేంజీల్లో 'కరెంట్'పై ఆంక్షలు

పవర్ ఎక్స్ఛేంజీల్లో క్రయవిక్రయాలు జరపకుండా టీజీఎస్పీడీసీఎల్‌పై కేంద్రం ఆంక్షలు

గతంలో విధించిన రూ.261.31 కోట్ల చార్జీలను చెల్లించకపోవడంతో చర్యలు

టీజీఎస్పీడీసీఎల్‌ను బ్లాక్ లిస్టులో చేర్చిన గ్రిడ్ కంట్రోలర్

సాక్షి, హైదరాబాద్: పవర్ ఎక్స్ఛేంజీల్లో విద్యుత్ క్రయవిక్రయాల ట్రేడింగ్ జరపకుండా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్)పై గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా గురువారం ఆంక్షలు విధించింది. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోళ్ల కోసం గతంలో బుక్ చేసుకున్న 1,000 మెగావాట్ల కారిడార్‌ను వదులుకున్నందుకు రూ.261.31 కోట్ల చార్జీలను టీజీఎస్పీడీసీఎల్ చెల్లించడం లేదంటూ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (పీజీసీఐఎల్) చేసిన ఫిర్యాదుతో ఈ మేరకు తీవ్ర చర్యలకు ఉపక్రమించింది. కేంద్ర విద్యుత్ శాఖ 2022 మార్చి 10న ప్రకటించిన లేట్ పేమెంట్ సర్‌చార్జీ రూల్స్ కింద విద్యుదుత్పత్తి, ట్రాన్స్‌మిషన్ సంస్థలకు చెల్లింపులను ఇన్వాయిస్‌ల జారీ నుంచి 75 రోజుల్లోగా విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు చెల్లించాల్సి ఉంటుంది. గడువులోగా బకాయిలను చెల్లించడంలో విఫలమైన దేశంలోని 16 డిస్కంలను బ్లాక్ లిస్టులో పెడుతూ 'ప్రాప్తి'పోర్టల్‌లో గ్రిడ్ కంట్రోలర్ గురువారం ప్రకటన చేయగా, ఆ జాబితాలో టీజీఎస్పీడీసీఎల్ సైతం ఉండటం గమనార్హం.

2,000 మెగావాట్ల కారిడార్ బుక్ చేసిన గత ప్రభుత్వం

తెలంగాణ ఏర్పడిన కొత్తలో రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండటంతో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ నుంచి 2,000 మెగావాట్ల విద్యుత్ కొనుగో లు చేయాలని నిర్ణయించింది. ఛత్తీస్‌గఢ్ నుంచి రాష్ట్రానికి విద్యుత్‌ను సరఫరా చేసుకోవడం కోసం అప్పట్లో పీజీసీఐఎల్ నిర్మిస్తున్న వార్ధా–డిచ్‌పల్లి 765/400 కేవీ కారిడార్‌లో ముందస్తుగా 2,000 మెగావాట్ల కారిడార్‌ను బుక్ చేసుకోవడానికి దరఖాస్తు చేసుకుంది. అయితే, ఛత్తీస్‌గఢ్ నుంచి 1,000 మెగావాట్ల విద్యుత్‌ను 12 ఏళ్ల పాటు కొనుగోలు చేసుకునేందుకు మాత్రమే అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఆ విద్యుత్ ధరలు అధికంగా ఉంటాయని విమర్శలు రావడంతో మరో 1,000 మెగావాట్లను కొనుగోలు చేసే ఆలోచనను విరమించుకుంది. ఈ నేపథ్యంలో 1000 మెగావాట్ల కారిడార్‌ను మాత్రమే కేటాయించాలని పీజీసీఐఎల్‌కు విజ్ఞప్తి చేసింది. దీంతో పీజీసీఐఎల్ ఆ కారిడార్ కేటాయింపులను రద్దు చేసింది. కారిడార్‌ను వదులుకున్నందుకు రూ.261.31 కోట్ల రిలింక్విష్‌మెంట్ చార్జీలను చెల్లించాలని టీజీఎస్పీడీసీఎల్‌కు డిమాండ్ నోటీసులు చేసింది. టీజీఎస్పీడీసీఎల్ ఈ చార్జీలను చెల్లించకపోవడంతో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ సీఈఆర్సీని ఆశ్రయించింది. టీజీఎస్పీడీసీఎల్ తరహాలోనే దేశంలో కారిడార్ వదులుకున్న మిగిలిన అన్ని డిస్కంల వివరాలను సమర్పించాలని పీజీసీఐఎల్‌ను అప్పట్లో సీఈఆర్సీ ఆదేశించింది. ఈ వివరాలేవీ అందించకుండా పీజీసీఐఎల్ రూ.261.31 కోట్ల చార్జీలను ఎలా లెక్కించిందని టీజీఎస్పీడీసీఎల్ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. మరోవైపు టీజీఎస్పీడీసీఎల్ డిపాజిట్ చేసిన రూ.కోటి బ్యాంకు గ్యారంటీని పీజీసీఐఎల్ ఏకపక్షంగా జప్తు చేసుకుంది. చార్జీలు అడగకుండా పీజీసీఐఎల్‌ను నిలువరించాలని కోరుతూ 2021 జూన్ 25న సీఈఆర్సీని టీజీఎస్పీడీసీఎల్ సంప్రదించగా, కేసు విచారణ తుది దశకు చేరింది. కేసు పెండింగ్‌లో ఉండగానే టీజీఎస్పీడీసీఎల్‌ను బ్లాక్ లిస్టులో పెట్టడం గమనార్హం.

విద్యుత్ క్రయవిక్రయాలకు ఓకే

▶ మొదటి పేజీ తరువాయి

ప్రమాదం ఉందని పేర్కొంది. రోజుకు 60 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొనుగోళ్లు నిలిచిపోతాయని.. వ్యవసాయం, పరిశ్రమలు, ఆస్పత్రులు, గృహాలు.. ఇలా యావత్ రాష్ట్రానికి ఇబ్బంది ఏర్పడుతుందని వివరించింది. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు.

కమిషన్ వద్ద పెండింగ్‌లో పిటిషన్

ప్రభుత్వం తరఫున ఏజీ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పీజీసీఐఎల్‌కు రూ.261.31 కోట్ల చార్జీల చెల్లింపు విషయంలో సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (సీఈఆర్సీ) వద్ద కేసు పెండింగ్‌లో ఉండగా, ఆంక్షలు విధిస్తూ నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. కేంద్రం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ కుమార్ వాదనలు వినిపిస్తూ.. రూ.261.31 కోట్ల చెల్లింపులో తెలంగాణ ప్రభుత్వం విఫలమైనందునే లేట్ పేమెంట్ సర్‌చార్జీ నిబంధనల మేరకు ఆంక్షలు విధించినట్లు చెప్పారు. బకాయి పడిన మొత్తంలో 25 శాతం చెల్లించాలని గత ఫిబ్రవరిలో సూచించామని, అయినా చెల్లించలేదని పీజీసీఐఎల్ తరఫు న్యాయవాది తెలిపారు.

గ్రిడ్ కంట్రోలర్‌కు అధికారం లేదు

వాదనలు విన్న న్యాయమూర్తి.. 'రూ.261.31 కోట్ల చార్జీల చెల్లింపు వ్యవహారం సీఈఆర్సీలో పెండింగ్‌లో ఉన్నందున విద్యుత్ క్రయవిక్రయా లపై నిషేధం విధిస్తూ తెలంగాణ పేరును ప్రాప్తి పోర్టల్‌లో ప్రచురించే అధికారం గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు లేదు. అందువల్ల లేట్ పేమెంట్ సర్‌చార్జ్ నిబంధనల ప్రకారం ప్రాప్తి వెబ్‌సైట్‌లో ప్రచురణపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తున్నాం. ఈ ఆదేశాలను వెంటనే పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, కేంద్ర విద్యుత్ శాఖకు తెలియజేయాలని డీఎస్‌జీకి సూచిస్తున్నాం' అని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.



జికా వ్యాక్సిన్ క్లినికల్ ట్రయల్స్

ఐసీఎంఆర్‌తో ఐఐఎల్ ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే తొలిసారిగా జికా వ్యాక్సిన్ క్లినికల్ ట్రయల్స్ కోసం ప్రముఖ టీకా తయారీ సంస్థ ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ లిమిటెడ్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఏడిస్ దోమల ద్వారా సంక్రమించే జికా వైరస్.. గర్భధారణ సమయంలో, లైంగిక సంపర్కం, రక్తమార్పిడి, అవయవ మార్పిడి ద్వారా పిండానికి కూడా వ్యాపించే ప్రమాదం ఉందని గుర్తించారు. అయితే గర్భధారణ సమయంలో వచ్చే ఇన్‌ఫెక్షన్ మాత్రం చాలా ప్రమాదకరమైనదని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం దీని నివారణకు ఎలాంటి వ్యాక్సిన్ అందుబాటులో లేదు. ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ లిమిటెడ్, ఆస్ట్రేలియా గ్రిఫిత్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో కోడాన్ డీ–ఆప్టిమైజ్డ్ లైవ్ అటెన్యూయేటెడ్ జికా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసింది. ఇది ప్రీ క్లినికల్ పరీక్షలు పూర్తి చేసుకోగా, ప్రస్తుతం క్లినికల్ డెవలప్‌మెంట్ కోసం ఐసీఎంఆర్‌తో కలసి పని చేయనుంది. జికా వ్యాక్సిన్ అభివృద్ధిలో ఐసీఎంఆర్‌తో అనుసంధానం కావడం హర్షణీయమని ఐఐఎల్ డైరెక్టర్ డాక్టర్ ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు.

రూ.2.94 కోట్ల విలువైన బంగారం స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: కారులో అత్యంత పకడ్బందీగా తరలిస్తున్న బంగారాన్ని డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు హైదరాబాద్ శివారులో బుధవారం స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ. 2,94,55,372 విలువైన 3,982 గ్రాముల బంగారం పట్టుబడినట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం డీఆర్ఐ అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. కోల్‌కతా నుంచి కారులో కొందరు వ్యక్తులు పెద్ద మొత్తంలో బంగారం తరలిస్తున్నట్టు డీఆర్ఐ హైదరాబాద్ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు హైదరాబాద్ శివారులో మాటువేసిన డీఆర్ఐ అధికారులు ఆ కారును అడ్డుకుని సోదా చేశారు. కారు డిక్కీ ప్రాంతంలో, డ్రైవర్ సీటు కింది భాగాల్లో రహస్యంగా ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో బంగారాన్ని దాచి ఉంచినట్టు కనుగొన్నారు. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు తెలిపారు.

చట్టప్రకారం బదిలీలు చేపట్టండి

మోడల్ స్కూల్ టీచర్ల పిటిషన్‌లో సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మోడల్ స్కూల్స్ టీచర్ల మార్గదర్శకాలు–2023 ప్రకారం మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్ల బదిలీలు చేపట్టడానికి చట్టప్రకారం తుది సీనియారిటీ జాబితా రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. 2023, జూలై 3న పాఠశాల విద్యా శాఖ కమిషనర్ జారీ చేసిన మార్గదర్శకాలు 2018లో ప్రభుత్వం ఇచ్చిన జీవో 81కు విరుద్ధమంటూ జనగామ జిల్లా ఘన్‌పూర్ మోడల్ స్కూల్‌కు చెందిన వెంకటరమేశ్‌తోపాటు మరో 14 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గతంలో కోర్టు తీర్పు ఇచ్చినా ఇప్పటివరకు తెలంగాణ మోడల్ స్కూల్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ల (పీజీటీ) సీనియారిటీ జాబితా ఇంకా ఖరారు కాలేదని పేర్కొన్నారు. సర్వీసు, వయసు ఆధారంగా అర్హత పాయింట్లను లెక్కించడానికి కొత్తగా జారీ చేసిన మార్గదర్శకాలు ఏకపక్షం, చట్టవిరుద్ధమన్నారు. 2012, ఫిబ్రవరి 6 నాటి నోటిఫికేషన్‌కు అనుగుణంగా జూన్ 2013లో నియామకం అయిన వారితో సమాన అర్హత పాయింట్లను ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. చట్టప్రకారం బదిలీలు చేపట్టాలని పాఠశాల విద్యా శాఖ కమిషనర్, మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

17 నుంచి లాసెట్ రెండో దశ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: లాసెట్ రెండవ దశ కౌన్సెలింగ్ ఈ నెల 17 నుంచి మొదలవుతుందని సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పి.రమేశ్ బాబు తెలిపారు. ఈ నెల 21 వరకూ అభ్యర్థుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేపడుతున్నట్టు, 23, 24 తేదీల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. సీట్ల కేటాయింపు ఈ నెల 30వ తేదీన ఉంటుందని, వచ్చే 4లోగా సీటు వచ్చిన అభ్యర్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

తెలంగాణలో జంతుజాతులు
రెండున్నర వేలకు పైమాటే

జీవవైవిధ్యం అలరారుతుండటంతో వివిధ రకాల జంతువుల సంఖ్య వృద్ధి

1,744 వెన్నుముక లేని, 706 రకాల వెన్నుముక గల జంతుజాతులు

169 రకాల చేప జాతులు కూడా...



సాక్షి, హైదరాబాద్

ఉష్ణమండల ప్రాంతమైన తెలంగాణ రాష్ట్రంలోని అటవీ ప్రాంతాల్లో పర్యావరణం పచ్చగా ఉండటంతో పాటు, జీవవైవిధ్యం అలరారుతుండటంతో... జంతుజాలం, వాటికి సంబంధించిన వివిధ రకాల జీవుల సంఖ్య బాగా వృద్ధి చెందుతోంది. మన అడవులు జీవ వైవిధ్యం, విభిన్నరకాల జంతుజాలానికి ప్రత్యేక నెలవుగా నిలుస్తున్నాయి. 2014 తర్వాత రాష్ట్రంలోని అడవుల్లో కనిపించే వివిధ రకాల జంతుజాలంపై కొంతకాలం క్రితం జరిపిన ఓ ప్రత్యేక అధ్యయనం ప్రకారం చూస్తే... రాష్ట్రంలో మొత్తం రెండున్నర వేలకు పైగా జంతువులు, పశుపక్ష్యాదులు, పాములు, కీటకాలు తదితర భిన్నరకాల జాతులు ఉన్నట్టుగా గుర్తించారు. (తాజా గణాంకాలు ఇంకా అందుబాటులోకి రాలేదు కాని...గతంలో వెల్లడైన సంఖ్య కూడా కొన్ని కొత్త జాతులు ఈ జాబితాలో చేరి ఉండొచ్చునని పర్యావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు) తెలంగాణలోని వివిధ అడవుల పరిధిలో 1,744 వెన్నుముక లేని జంతుజాతులు (అకోరుకాలు), 706 రకాల వెన్నుముక ఉన్న జంతుజాతులు (సకోరుకాలు), 169 రకాల చేపలు, ఇతర జంతు జాతులున్నాయి. గతంలో...రాష్ట్ర అటవీశాఖ సహకారంతో జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సేకరించిన సమాచారం, వివరాలను క్రోడీకరించి, వివిధ రకాల జంతు జాతులపై ఓ అంచనాకు రాగలిగారు. చీమలు అంతకంటే అతి సూక్ష్మజీవులు మొదలు పెద్ద జంతువులతో కూడిన వాటిని గుర్తించారు.

బయోడైవర్సిటీ పరిధిలోకి అనేక అంశాలు...: తెలంగాణలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్), కవ్వాల్ టైగర్ రిజర్వ్ (కేటీఆర్)లు, ప్రాణహిత, శివారం, ఏటూరునాగారం, పాకాల, కిన్నెరసాని, మంజీరా, పోచారం అభయారణ్యాలు, కాసు బ్రహ్మానందరెడ్డి పార్క్ (కేబీఆర్), మృగవాని, హరిణ వనస్థలి జాతీయ పార్కులు, ఇతర అటవీ ప్రాంతాల్లోని వివిధ రకాల జంతువులపై ఈ పరిశీలన నిర్వహించారు. ప్రధానంగా జీవ వైవిధ్యంపైనే జంతుజాతుల వైవిధ్యం ముడిపడి ఉన్నా విస్తృతార్థంలో బయోడైవర్సిటీ పరిధిలోకి అనేక అంశాలు వస్తాయి. రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు ఆధ్వర్యంలో వివిధ పరిశోధకులు, పర్యావరణ నిపుణుల సహకారంతోనూ జంతువులు, పక్షులు, పాములు, కీటకాలు, తదితరాలపై పరిశీలించారు. తెలంగాణలోని అన్ని రక్షిత అడవులు, ప్రాంతాల్లోని ప్రతీ జంతుజాతి జీవనానికి సంబంధించిన అధ్యయన క్రియను జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిర్వహించాక పూర్తి సమాచారాన్ని తెలంగాణ అటవీ శాఖకు అప్పగించనున్నారు. ఈ అంశంతో పాటు రాష్ట్రంలోని చిత్తడి నేలల్లో జీవించే జంతుజాతులపై పరిశీలన బాధ్యతను కూడా జూలాజికల్ సర్వే సంస్థకే అప్పగించారు. తెలంగాణలోని రక్షిత అటవీ ప్రాంతాలు, అడవులు, జాతీయ పార్కులు, చిత్తడి నేలలు తదితరాలపై అటవీశాఖ, పరిశోధకులు, పర్యావరణవేత్తలు, ఇతర స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ బృహత్ అధ్యయనాన్ని పూర్తిచేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నిపుణులు ఏమన్నారంటే...

రాష్ట్రంలో రెండున్నరవేలకు పైగా జంతుజాతుల రకాల్లో 52 శాతం దాకా కీటకాల (ఇన్‌సెక్ట్‌లు) జాతు ల గ్రూపులున్నాయి. వీటిలో సాలీళ్లు, ఎండ్రకాయలు లేదా పీతలు, తేళ్లు వంటివి అధికంగా ఉన్నాయి. దేశంలో ఎక్కడా లేని 82 రకాల జంతుజాతులు తెలంగాణలోనే ఉన్నట్టుగా తెలుస్తోంది.

రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు ఆధ్వర్యంలోనూ...ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో జరిపిన 'ఫానల్ డైవర్సిటీ అధ్యయనం'మాదిరిగానే జిల్లా స్థాయిల్లోనూ వృక్ష, జంతుజాతులపై పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉంది. జంతుజాతులపై రాష్ట్రస్థాయి మాదిరిగానే జిల్లాస్థాయిలో కూడా సమగ్ర సమాచారం రావాల్సి ఉంది. దీని ద్వారా జిల్లాల వారీగా ఉన్న జంతుజాతులు, వాటి రకాలు, ప్రత్యేకతల గురించి తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది.

– బయో డైవర్సిటీ నిపుణుడు



25కేజీల చేపతో మత్స్యకారుడు తెలుగు మద్దిలేటి

తుంగభద్ర నదిలో 25 కిలోల చేప లభ్యం

రాజోళి: తుంగభద్ర నదిలో 25 కేజీల చేప లభ్యమైంది. రాజోళికి చెందిన మత్స్యకారుడు తెలుగు మద్దిలేటి గురువారం సుంకేసుల డ్యాం దిగువ భాగాన వేసిన వలలో పాండుగ జాతికి చెందిన చేప చిక్కింది. దానిని మార్కెట్‌కు తీసుకురాగా స్థానికులు చూసేందుకు ఎగబడ్డారు. చేపను రూ.10 వేలకు విక్రయించినట్లు మద్దిలేటి తెలిపాడు.



గుడ్డెందొడ్డి వద్ద పట్టుకున్న మొసలి

గుడ్డెందొడ్డిలో మొసలి కలకలం

జూరాల రిజర్వాయర్‌లో వదిలేసిన అధికారులు

ధరూరు: జోగుళాంబ గద్వాల జిల్లా గుడ్డెందొడ్డి రిజర్వాయర్ దిగువన ఉన్న నెట్టెంపాడు క్వార్టర్స్ సమీపంలోకి వచ్చిన మొసలి కలకలం రేపింది. అలంపూర్‌కు సంబంధించిన తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను నెట్టెంపాడు క్వార్టర్స్ సమీపంలో నడుపుతున్నారు. బుధవారం రాత్రి గుడ్డెందొడ్డి రిజర్వాయర్ కట్టపై నుంచి దిగువన ఉన్న గురుకుల పాఠశాల వద్దకు వస్తున్న మొసలిని గమనించిన గ్రామస్తులు, వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అధికారులు గ్రామస్తుల సహాయంతో మొసలిని తాళ్లతో బంధించారు. చీకటి కావడంతో అక్కడే కంచె కోసం ఏర్పాటు చేసిన ఇనుపకడ్డీలకు కట్టి ఉంచారు. గురువారం ఉదయం ఆ మొసలిని ట్రాక్టర్‌లో తీసుకెళ్లి జూరాల రిజర్వాయర్‌లో వదిలేశారు. గుడ్డెందొడ్డి గ్రామం రిజర్వాయర్ పక్కనే ఉండడంతో ఎప్పుడైనా మొసలి కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ రేంజ్ అధికారి పర్వేజ్ అహ్మద్ సూచించారు.

సెక్యులరిజం పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

- ఏఐసీసీ నాయకుడు వి.హన్మంతరావు

శాలిగౌరారం: భారతదేశం సెక్యులర్ దేశమని, సెక్యులరిజం పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఏఐసీసీ నాయకుడు, మాజీ ఎంపీ వి.హన్మంతరావు అన్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో నాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో రజాకార్ల చేతిలో పది మంది ప్రాణాలు కోల్పోయిన చరిత్రాత్మక సంఘటనా స్థలాన్ని గురువారం ఆయన సందర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, దేశంలో హిందువులు మాత్రమే ఉండాలనే విధంగా ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. దేశంలో ప్రజలు ధరల పెరుగుదలతో అవస్థలు పడుతున్నారన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటం, తెలంగాణ సాయుధ పోరాటాల కాలంలో బీజేపీ ఎక్కడుందో ఆ పార్టీ జాతీయ నాయకులు చెప్పాలన్నారు. నాడు ప్రధానమంత్రి నెహ్రూ మంత్రివర్గంలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ హోంశాఖ మంత్రిగా ఉన్నారని, కనీసం ఆ విషయం కూడా తెలుసుకోకుండా బీజేపీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని అన్నారు. బీజేపీ పాలకులది రాజకీయ స్వార్థమే తప్ప ప్రజలకు మేలుచేసే కార్యాచరణ కాదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కందాల సమరంరెడ్డి, అన్నెబోయిన సుధాకర్, గూని వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వి.హన్మంతరావు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది, శివరామకృష్ణ భజన మండలి ప్రతినిధులు

రాజన్నకు రూ.1.82 కోట్ల ఆదాయం

వేములవాడ: వేములవాడ రాజన్నకు 30 రోజుల్లో హుండీల ద్వారా రూ.1.82 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. స్వామి వారి ఓపెన్‌స్లాబ్‌లో గురువారం హుండీలలోని కట్నాలు, కానుకలను లెక్కించారు. రూ.1,82,33,710 నగదు, 150 గ్రాముల బంగారం, 14.700 కిలోల వెండి సమకూరినట్లు ఈవో వివరించారు. ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఏఈవోలు శ్రావణ్, జయకుమారి, బ్రాహ్మణగారి శ్రీనివాస్, రమేశ్‌బాబు, శివరామకృష్ణ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

నాలుగు కార్యాలయాలను ముంచెత్తిన మున్నేటి వరద

ఎంపీడీఓ, ఎంఈఓ, స్త్రీ శక్తి, ఈజీఎస్ ఆఫీసుల్లో రికార్డులు, కంప్యూటర్లు బురదమయం

ఇదీ ఖమ్మం రూరల్ మండలంలో పరిస్థితి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం

ఈనెల 1న మున్నేటి వరద ఖమ్మం పరీవాహకాన్ని అతలాకుతలం చేసింది. పంట పొలాలు, ఇళ్లను వరద, బురద కమ్మేయడంతో తీవ్ర నష్టం కలిగింది. ఈ పరీవాహకంలోనే ఖమ్మం రూరల్ మండలానికి సంబంధించి ఒకే ప్రాంగణంలో ఉన్న నాలుగు ప్రభుత్వ కార్యాలయాలను కూడా వరద ముంచెత్తింది. జలగంనగర్‌లో ఎంపీడీఓ, ఎంఈఓ, స్త్రీ శక్తి, ఈజీఎస్ భవనాలు ఒకే ప్రాంగణంలో ఉండగా.. ఒక్కో కార్యాలయంలోకి 8 నుంచి 10 అడుగుల మేర వరద రావడంతో భారీ నష్టం ఏర్పడింది. నాలుగు కార్యాలయాల్లో కలిపి 25 కంప్యూటర్లు, ఐదేసి జిరాక్స్ మిషన్లు, ప్రింటర్లు, స్కానర్లతో పాటు ఇన్వర్టర్లు, బ్యాటరీలు, ఫర్నిచర్, ఫైల్స్ భద్రపరిచే బీరువాల్లో బురద మేటలు వేసింది. ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులు, ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయని ఫైళ్లు తడిసి ముద్దయ్యాయి. ఈ కార్యాలయాల సముదాయం నిర్మించి 25 ఏళ్లు అవుతోంది. గత ఏడాది ప్రాంగణం వరకు వరద రాగా, ఈసారి కార్యాలయ గదుల్లోకి చేరడంతో సుమారు రూ.కోటి రూపాయల వరకు నష్టం జరిగినట్లు అంచనా. ప్రస్తుతం అధికారులు వీలున్న చోట విధులు నిర్వర్తిస్తూ.. తడిసిన ఫైళ్లను ఆరబెట్టడంతో పాటు కార్యాలయాలను శుభ్రం చేయిస్తున్నారు. అంతా సర్దుకున్నాక వచ్చే నెల 1 నుంచి కార్యాలయాల్లో పాలన ప్రారంభమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో సమస్యలు విన్నవించుకుందామని వస్తున్న ముంపు కాలనీల ప్రజలు ఇక్కడి పరిస్థితి చూసి వెనుదిరుగుతున్నారు.



ఎంపీడీఓ కార్యాలయంలో ఆరబెట్టిన ప్రజాపాలన దరఖాస్తులు




బురదమయమైన కుర్చీలు, ఇతర సామగ్రిని శుభ్రం చేస్తున్న సిబ్బంది



బురదమయమైన కంప్యూటర్లు, ప్రింటర్లు

శ్రీశైలం ఆనకట్ట వద్ద రెండు గేట్లు ఎత్తివేత



శ్రీశైలం ఆనకట్ట వద్ద రెండు గేట్లు ఎత్తివేత

దోమలపెంట: శ్రీశైలం జలాశయానికి మళ్లీ వరద పెరగడంతో బుధవారం ఉదయం మూసివేసిన గేట్లను గురువారం మధ్యాహ్నం తెరిచారు. రెండు గేట్లను పైకెత్తి స్పిల్‌వే ద్వారా 55,782 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 884.6 అడుగుల వద్ద 213.4011 టీఎంసీల నిల్వ ఉంది. జూరాల నుంచి స్పిల్‌వే ద్వారా 28,300 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 37,021, సుంకేసుల నుంచి 20,196 మొత్తం 85,517 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వస్తోంది. శ్రీ శైలం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,116 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 31,119 మొత్తం 68,235 క్యూసెక్కుల నీరు అదనంగా సాగర్‌కు విడుదలవుతున్నాయి. ఎడ మగట్టు భూగర్భ కేంద్రంలో 17.03 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 15.560 మి.యూనిట్ల విద్యుదు త్పత్తి చేపట్టారు. అయితే వరద ప్రవాహం తగ్గడంతో రాత్రి పది గంటల తరువాత ఒక గేటు మూసేశారు.

మళ్లీ తెరుచుకున్న సాగర్ గేట్లు

12 గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు



సాగర్ 12 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్: సాగర్‌కు మళ్లీ వరద పెరగడంతో గురువారం అధికారులు 12 క్రస్ట్‌గేట్లు ఎత్తారు. ఎగువన శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జునసాగర్‌కు 1,41,188 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అంతే నీటిని సాగర్ నుంచి విడుదల చేస్తున్నారు. 12 గేట్ల ద్వారా స్పిల్‌వే మీదుగా 97,008 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 28,826 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వలు, ఏఎమ్మార్పీ, వరద కాల్వకు 15,284 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

"విశాలమైన సరస్సులో ఈదులాడే చేపలు.. విదేశాల నుంచి విడిదికి వచ్చి విహరించే పక్షి సమూహాలు.. నీటి మధ్య వెలసిన ఊర్లలో రెక్కల కష్టంతో బతికే మనసులు".. ఇది సహజ సిద్ధమైన కొల్లేరులో మామూలు రోజుల్లో కన్పించే సుందర దృశ్యం..

"ఎటు చూసినా సముద్రంలా ఉప్పొంగిన నీరు.. వరద నీటిలో మునిగిన గ్రామాలు.. రెక్కల కష్టం మొత్తం నీటిపాలై బతుకు జీవుడా అనుకుని భోరున విలపించే ప్రజలు.. నిలువ నీడలేక విలవిల్లాడే పక్షులు.. వరద పోటుకు గల్లంతయ్యే చేపలు".. ఇదీ ఏటా వరద ధాటికి కొల్లేరు ఉగ్రరూపం.

సుందర కొల్లేరు.. ఉప్పొంగితే 'ముప్పు'టేరు

ఏలూరు-పశ్చిమ గోదావరి జిల్లాల్లో సహజ సిద్ధమైన మంచినీటి సరస్సు



కొల్లేరు సరస్సు



శృంగవరప్పాడు గ్రామం

- బుడమేరు, తమ్మిలేరు, రామిలేరుతోపాటు 35 డ్రెయిన్లు, కాలువలతో సతమతం
- ఏటా వరదలు పోటెత్తడంతో అతలాకుతలం
- ఫలితంగా దీని చుట్టుపక్కల గ్రామాలు, లంకలకు ముంపు ముప్పు
- కొల్లేరు పరిరక్షణకు 1964లో మిత్ర కమిటీతోపాటు అనేక సిఫార్సులు
- పర్యాటక కేంద్రంగా.. పర్యావరణ క్షేత్రంగా తీర్చిదిద్దితే మేలు

కొల్లేరుకు మళ్లీ వరద పోటెత్తింది. వర్షాకాలం వచ్చిందంటే కొల్లేరు చిగురుటాకుల్లా వణికిపోతోంది. కృష్ణా-గోదావరి నదుల మధ్య డెల్టా ప్రాంతంలో సహజ సిద్ధమైన లోతట్టు ప్రాంతంలో విస్తరించిన ఈ సరస్సుకు ఏటా భారీగా వరదనీరు పోటెత్తడంతో అతలాకుతలమవుతోంది. ప్రధానంగా బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు, గుండేరు భారీ డ్రెయిన్లతో పాటు మరో 31 మీడియం, మైనర్ డ్రెయిన్లు, కాలువలు, ఛానల్స్ ద్వారా వరద నీరు ఎగువ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున కొల్లేరుకు చేరుతుంది. ప్రస్తుతం వరద పోటు పెరగడంతో 1,10,920 క్యూసెక్కుల నీరు కొల్లేరుకు వస్తోందని అంచనా. కొల్లేరు నుంచి కేవలం 12 వేల క్యూసెక్కులు మాత్రమే ఉప్పుటేరు డ్రెయిన్ ద్వారా 62 కిలోమీటర్లు ప్రయాణించి బంగాళాఖాతంలోకి చేరుతుంది. దీంతో కొల్లేరులోని గ్రామాలు, లంకలతోపాటు దానికి ఆనుకుని ఉన్న గ్రామాలు సైతం ముంపు ముప్పుతో సతమతమవుతున్నాయి.

– సాక్షి, అమరావతి

కొల్లేరును కాపాడుకునేలా సిఫార్సులు..

రెగ్యులేటర్ల నిర్మాణంతోపాటు కొల్లేరుకు సమాంతరంగా ప్రత్యామ్నాయ ఛానల్స్ ఏర్పాటుచేసి వరద నీటిని సముద్రానికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. కొల్లేరును కనీసం మూడో కాంటూర్‌గా నిర్ణయించి ఆ పరిధిలో ఆక్వా సాగును అనుమతించకూడదు. వీటితోపాటు..

- సరస్సులోను, దానికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లోను పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి.
- కొల్లేరు నుంచి ఎటువంటి అడ్డంకులు లేకుండా సముద్రానికి వెళ్లేలా ఉప్పుటేరును పూర్తిగా తవ్విన తర్వాతే ప్రత్యామ్నాయ ఛానలైజేషన్ పథకాన్ని పునఃప్రారంభించాలి.
- సరస్సు లోపల నీటి ప్రవాహ మార్గాలను అడ్డుకునే నిర్మాణాలు, చెరువులను, రోడ్లను తొలగించాలి.
- కొల్లేరు పూడిపోకుండా ఎప్పటికప్పుడు డీసిల్టింగ్ కార్యకలాపాలు తప్పనిసరిగా నిర్వహించాలి.
- కాలువలకు అడ్డంగా ఉన్న అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లను ఏర్పాటుచేయాలి.
- కొల్లేరుకు ఉప్పునీటి చొరబాటును నియంత్రించేలా ఉప్పుటేరుపై పడతడిక, మొల్లపర్రు ఓల్డ్ కోర్సు, ఆకివీడు సమీపంలోని పేరంటాల కనుమ వద్ద మూడు రెగ్యులేటర్లను నిర్మించాలి.
- ఆలపాడు నుండి గుండుగొలను రహదారికి తూర్పున ఉన్న ఈ అలైన్‌మెంట్‌ను ఒక భాగం.. కైకలూరు-ఏలూరు రహదారితోపాటు ఆళ్లపాడు-ప్రత్తికోళ్లలంక-గుడివాకలంక-ఏలూరు మధ్య రెండో భాగం.. కైకలూరు-ఏలూరు రహదారికి పశ్చిమం వైపు 3వ భాగం.. ఏలూరు-గుడివాకలంక-కొక్కిరాయిలంక-చెట్టున్నపాడు-కమ్మగుండపాడు-ఆగడాలలంక-గుండుగొలను రోడ్డు ('యు' ఆకారంలో రహదారి) అలైన్‌మెంట్‌ను 4వ భాగంగా అభివృద్ధి చేసి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి.
- సరస్సు నీటిమట్టం తగినంతే ఉండేలా బుడమేరు, తమ్మిలేరు వంటి ప్రధానమైన వాటి నీటి ప్రవాహాలను నియంత్రించేలా చర్యలు చేపట్టాలి.
- రోడ్డు నిర్మాణాల కారణంగా ఛిన్నాభిన్నమైన కొల్లేరు సరస్సును రహదారి అమరికల ఆధారంగా నాలుగు భాగాలుగా (10,000 నుండి 12,000 ఎకరాల వరకు) విభజించి అభివృద్ధి చెయ్యొచ్చు.
- కొల్లేరుకు తూర్పున పందికోడు, తోకలపల్లి, కాపవరం కాలువలను ఉప్పుటేరులో ఒకటి,పశ్చిమ వైపున బుడమేరు, రామిలేరు, పోల్రాజు, చంద్రయ్య, పెద కొమ్మిలేరు, చైనా కొమ్మిలేరు కాలువలను ఉప్పుటేరులో కలుపుతూ మరొకటి.. వరదను నివారించేలా ఇరువైపులా డ్రెయిన్లు నిర్మించాలి.
- సరస్సు చుట్టూ ఉన్న పరిశ్రమలు, పట్టణాలు, గ్రామాల నుండి వ్యర్థ జలాలను నివారించడంతోపాటు వాటి నుంచి వచ్చే నీటి నాణ్యతను, సరస్సు జలాల నాణ్యతను క్రమం తప్పకుండా పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా మానిటరింగ్ స్టేషన్‌ను ఏర్పాటుచేయాలి.
- సరస్సు నీటి పర్యావరణ నాణ్యతను పర్యవేక్షించడానికి ప్రయోగశాల సౌకర్యాలతో కూడిన హైడ్రో బయోలాజికల్ స్టేషన్‌ను ఏర్పాటుచేయాలి.

దేశంలోనే అతిపెద్ద మంచినీటి సరస్సు..

ఏలూరు-పశ్చిమ గోదావరి జిల్లాల సరిహద్దుల్లో 250 నుండి 340 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన కొల్లేరు దేశంలోనే అతిపెద్ద మంచినీటి సరస్సుగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రపంచ చిత్తడి నేలల జాబితాలో దీన్ని గుర్తిస్తూ 1971లో ఇరాన్ సదస్సు తీర్మానించింది. కొల్లేరు ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని జాతీయ, అంతర్జాతీయ పర్యావరణ సంస్థలు, ఉద్యమకారులు గళమెత్తారు. కొల్లేరులో చేపల చెరువుల సాగుతోపాటు గ్రామాలు కూడా పెద్దఎత్తున వెలిశాయి. ఏలూరు జిల్లాలోని కైకలూరు, మండవల్లి, పెదపాడు, ఏలూరు, దెందులూరు, భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు మండలాలతోపాటు పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలంలో విస్తరించిన కొల్లేరులో 71 గ్రామాలు, కొల్లేరుకు ఆనుకుని 150 గ్రామాలు కలిపి మొత్తం 221 గ్రామాలున్నాయి.

కొల్లేరు రక్షణకు అధ్యయనాలెన్నో..

కొల్లేరు సరస్సు గొప్ప జీవవైవిధ్యం కలిగి ఉంది. వలస పక్షులు, అరుదైన చేప జాతులతోపాటు ప్రజలకు జీవనాధారంగా మారింది. కానీ, చేపల చెరువుల సాగు, ఆక్రమణలతో సహజత్వాన్ని కోల్పోయింది. దీనికితోడు.. వస్తే వరదలు ముంచెత్తడం.. లేదంటే ఉప్పుటేరు ముఖద్వారం ద్వారా సముద్రపు నీరు చొచ్చుకురావడంతో కొల్లేరు దెబ్బతింటోంది. ఈ నేపథ్యంలో.. అక్కడి ప్రజలకు ఇబ్బందిలేకుండా కొల్లేరు సహజత్వాన్ని కాపాడి పర్యావరణానికి ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు పర్యాటక రంగాన్ని కూడా పెంపొందిస్తే మేలని పలు సంస్థలు, పర్యావరణవేత్తలు అధ్యయనం చేసి పలు సిఫార్సులు చేశారు. 1964లో మిత్ర కమిటీ నివేదిక తర్వాత అనేక కమిటీలు అధ్యయనం చేశాయి. తాజాగా.. న్యూఢిల్లీలోని ఎర్త్ సిస్టమ్ సైన్స్ విభాగం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సహకారంతో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సమీకృత అధ్యయనం నిర్వహించింది.



కొల్లేరు నీటిని బంగాళాఖాతంలోకి తీసుకెళ్లే ఉప్పుటేరు

ఇది కథ కాదు..

వచ్చినట్టే వచ్చి.. శాశ్వతంగా దూరం

- మూడేళ్ల వయసులో బాలుడి అదృశ్యం
- పుట్టుమచ్చ ఆధారంగా 14 ఏళ్ల తర్వాత ఇంటికి..
- రెండేళ్ల అనంతరం చవితి ఉత్సవాల్లో గుండెపోటు
- 19 ఏళ్ల యువకుడి మృతితో ఆ తల్లికి కడుపుకోత



ఇంటికి వచ్చిన రోజు తమ్ముడు, పెదనాన్న కొడుకు, కూతురుతో ఆకాశ్ (వృత్తంలో.. ఫైల్)

బి.కొత్తకోట: మూడేళ్ల వయసులో అదృశ్యమైన బిడ్డ.. 14 ఏళ్ల తర్వాత తల్లిదండ్రుల వద్దకు చేరాడు. బిడ్డను చూసుకుని మురిసిపోతున్న ఆ తల్లిదండ్రుల నుంచి రెండేళ్ల తరువాత శాశ్వతంగా దూరమయ్యాడు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం నాయనబావికి చెందిన శంకర, రెడ్డెమ్మ దంపతులకు ఆకాశ్, అభిలాష్ ఇద్దరు కుమారులు. 2008లో పెద్దకొడుకు ఆకాశ్ మూడేళ్ల వయసులో ఇంటి ముందు ఆడుకుంటూ అదృశ్యమయ్యాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఆచూకీ లభించలేదు. కాగా.. ఆకాశ్‌ను బెంగళూరులో ఉంటున్న రత్నమ్మ అనే మహిళ పెంచుకుంది. మూడేళ్లు పెంచుకున్నాక ఆమె మదనపల్లె మండలం కొత్తపల్లెలో ఉంటున్న ఆటో డ్రైవర్ నాగరాజు, లలితమ్మ దంపతుల వద్దకు ఆకాశ్‌ను పంపించింది. వాళ్లే ఆకాశ్‌ను పెంచుతూ వచ్చారు. ఆ తర్వాత నాగరాజు కుటుంబం నాయనబావికి మకాం మార్చింది.

ఆ బిడ్డ.. మీ బిడ్డే..

ఆకాశ్ తల్లి రెడ్డెమ్మ చెల్లెలు మంజు బెంగళూరులో ఉంటూ కూలి పనులకు వెళ్తోంది. ఓ రోజు ఆకాశ్‌ను మూడేళ్ల పాటు పెంచిన రత్నమ్మ, మంజు కూలీ పనుల్లో కలుసుకున్నారు. మూడేళ్ల వయసులో అదృశ్యమైన పిల్లాడు దొరికాడా అని మంజును ఆరా తీసింది. లేదని మంజు చెప్పడంతో రత్నమ్మ అసలు విషయం చెప్పింది. నాగరాజు దంపతులు ఆ బిడ్డను తెచ్చి తనకు ఇచ్చారని, మళ్లీ వారికే ఇచ్చినట్టు తెలిపింది. ఈ విషయాన్ని మంజు తన అక్క రెడ్డమ్మకు ఫోన్ చేసి చెప్పింది. బిడ్డను తెచ్చుకునేందుకు తల్లి రెడ్డెమ్మ ఆటోడ్రైవర్ నాగరాజు వద్దకు వెళ్లగా.. ఆకాశ్ నీ బిడ్డ అనేందుకు ఆధారమేంటని గ్రామ పెద్దలు ప్రశ్నించారు. వాడి నాలుకపై పుట్టుమచ్చ ఉంటుందని రెడ్డెమ్మ చెప్పింది. తల్లి చెప్పినట్టే ఆకాశ్ నాలుకపై పుట్టుమచ్చ ఉంది. తల్లి వద్దకు వెళ్లేందుకు మొదట్లో ససేమిరా అన్న ఆకాశ్.. రెండేళ్ల క్రితం తల్లిదండ్రుల ఇంటికి వచ్చేశాడు. ఇప్పుడు ఆకాశ్ వయసు 19. ఈ క్రమంలో మంగళవారం రాత్రి వినాయక ఉత్సవాల్లో నృత్యం చేస్తూ గుండెపోటుతో కుప్పకూలి మృత్యుఒడికి చేరాడు.

మంత్రి ఎస్కార్ట్ వాహనానికి ప్రమాదం

- ఎస్కార్ట్ వాహనం, మినీ వ్యాన్ ఢీ
- ఆర్ఎస్ఐతో ముగ్గురు పోలీసులు, డ్రైవర్‌కు గాయాలు
- మినీ వ్యాన్ డ్రైవర్, మరో ఇద్దరు రైతు కూలీలకు స్వల్ప గాయాలు
- తప్పును మినీ వ్యాన్ డ్రైవర్‌పై నెట్టేందుకు మంత్రి యత్నం



మంత్రి ఎస్కార్ట్ వాహనం, వ్యాన్ ఢీ కొన్న దృశ్యం

సాక్షి, పార్వతీపురం మన్యం/రామభద్రపురం/విజయనగరం క్రైమ్: విజయనగరం జిల్లా రామభద్రపురం మండలంలోని బూసాయవలస-ఆరికతోట మధ్యలో జాతీయ రహదారిపై గురువారం ఉదయం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి కాన్వాయ్‌లోని ఎస్కార్ట్ వాహనం, ఓ మినీ వ్యాన్ ఢీ కొన్నాయి. ప్రమాదంలో ఎస్కార్ట్ వాహన డ్రైవర్‌తో సహా ఆర్ఎస్ఐ, ముగ్గురు పోలీసులు, మినీ వ్యాన్‌లో ఉన్న మరో ముగ్గురికి గాయాలయ్యాయి. మెంటాడ మండలంలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి సంధ్యారాణి సాలూరు నుంచి రామభద్రపురం మీదుగా వెళ్తున్నారు. అదే సమయంలో ఆరికతోటకు చెందిన రైతులు తమ పొలంలో మొక్కజొన్న కంకులు లోడు చేసేందుకు మినీ వ్యాన్‌పై ఎదురుగా వస్తున్నారు. బూసాయవలస-ఆరికతోట మధ్యలో మంత్రి కాన్వాయ్‌లోని ఎస్కార్ట్ వాహనం, మినీ వ్యాన్ ఢీ కొన్నాయి. ఎస్కార్ట్ వాహనంలోని ఆర్ఎస్ఐ రమణ, ఏఆర్ హెచ్‌సీ సునీల్, ఏఆర్ పీసీలు గణపతి, మహేష్, ఎస్కార్ట్ వాహనం డ్రైవర్ రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108లో విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ మినీవ్యాన్ డ్రైవర్ త్రినాథరావు, బోను గౌరమ్మ, కడుగండి సీతమ్మలను స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. ఆర్ఎస్ఐ రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రసాదరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, విజయనగరం ఆస్పత్రి వద్ద మంత్రి సంధ్యారాణి మీడియాతో మాట్లాడుతూ మినీ వాహన డ్రైవర్ పూటుగా మద్యం తాగి ఉన్నాడని.. ఆ మత్తులోనే తమ ఎస్కార్ట్ వాహనాన్ని ఢీకొట్టినట్టు చెప్పారు. ఆ డ్రైవర్‌కు పరీక్షలు నిర్వహించగా.. ఆల్కాహాల్ శాతం సున్నా వచ్చిందని తెలిసింది. మద్యం తాగకపోయినా తప్పును ఆ వాహనదారుడిపై నెట్టేందుకు మంత్రి అలా మాట్లాడారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేగంగా వస్తూ తమ వాహనాన్ని ఢీకొట్టడమే కాకుండా.. పోలీసులే దిగి వచ్చి తమపై చేయి చేసుకున్నారని మినీ వ్యానులో ఉన్న డ్రైవర్ త్రినాథరావు, ధనుంజయ్, గాయపడిన మరో మహిళ చెప్పారు. కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఐదుగురు ఏఆర్ పోలీసులను ఎస్పీ వకుల్ జిందాల్ పరామర్శించారు. అలాగే గాయపడిన ఎస్కార్ట్ పోలీసులతో రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు.

నా పాస్‌పోర్ట్‌ను పునరుద్ధరించేలా ఆదేశాలివ్వండి

హైకోర్టులో మంత్రి కొల్లు రవీంద్ర పిటిషన్ విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: తన పాస్‌పోర్ట్‌ను పునరుద్ధరించేందుకు ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హైకోర్టును ఆశ్రయించారు. తనపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్న కారణంతో పాస్‌పోర్ట్ పునరుద్ధరణను తిరస్కరించడం సుప్రీం కోర్టు తీర్పులకు, రాజ్యాంగ అధికరణలకు విరుద్ధమంటూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. లాస్ వేగాస్‌లో ఈ నెల 24 నుంచి జరగనున్న మైన్స్ ఎక్స్‌పో-2024లో పాల్గొనేందుకు వెళ్లాల్సి ఉందని రవీంద్ర తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు గురువారం విచారణ జరిపారు. విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు. అయితే మైన్స్ ఎక్స్‌పోలో పాల్గొనాల్సి ఉన్నందున అత్యవసరంగా విచారణ చేపట్టాలని రవీంద్ర తరఫు న్యాయవాదులు మల్లవోలు నిఖిత, ఎం.వీ.రమణకుమారి పట్టుబట్టారు. దీంతో న్యాయమూర్తి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

సోమిరెడ్డి దోపిడీకి అడ్డుకట్ట వేస్తాం..

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి




నెల్లూరు (బారకాసు): సర్వేపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దోపిడీని ఎదుర్కొంటామని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నెల్లూరు నగరంలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక హామీగానే మిగిలిపోయిందన్నారు. సూరాయపాళెం ఇసుక రీచ్ వద్దకు కొంతమంది తోడుదొంగలు, చిల్లర దొంగలతో పాటు డూప్‌షాట్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని తన వెంట సోమిరెడ్డి తీసుకెళ్లి అక్కడేదో జరిగిపోతోందన్నట్లు నాటకాలాడుతున్నారని ధ్వజమెత్తారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, మైనింగ్ ఈడీని తీసుకెళ్లి అక్కడ ప్రజాభిప్రాయం సేకరిస్తే.. సోమిరెడ్డి చేస్తున్న దోపిడీ వెలుగులోకి వస్తుందని చెప్పారు. పెన్నానదిలో పేరుకు డ్రెడ్జింగ్ చేసినట్లు చెప్పి ఇసుక నిల్వలను ఎత్తేయాలని ప్లాన్ వేశారని మండిపడ్డారు. అధికారులను రీచ్ వద్దకు తీసుకొస్తే తాను వస్తానని.. అక్కడే అక్రమాలకు స్కెచ్ వేశారా లేదా అనేది నిరూపిస్తానన్నారు.

అంతా మా ఇష్టం



గడ్డూరు కాలనీ రోడ్డులో అక్రమంగా నిర్మిస్తున్న షాపు

పలమనేరు: 'గవర్నమెంట్ మాది.. ఇక మా ఇష్టం' అంటూ ఓ టీడీపీ నేత చిత్తూరు జిల్లా పలమనేరు సమీపంలో రోడ్డు పక్కనున్న ప్రభుత్వ స్థలంలో సెలవు దినాల్లో మాత్రమే అక్రమంగా షాపు కడుతున్న విషయం తాజాగా వెలుగు చూసింది. ఈ ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకుడని చెప్పుకుంటున్న సుబ్రమణ్యం అనే వ్యక్తి మున్సిపాలిటీ పరిధిలోని గడ్డూరు రోడ్డు పక్కన ఓ దుకాణాన్ని నిర్మిస్తున్నాడు. చాలా తెలివిగా కేవలం ప్రభుత్వ సెలవు దినాల్లో మాత్రం దీన్ని నిర్మిస్తూ ఎవరికీ అనుమానం రాకుండా వ్యవహరిస్తున్నట్టు సమాచారం. ఈ పనులకు మున్సిపల్ అధికారులు ఎలా అనుమతులిచ్చారో ఎవరికీ తెలియడం లేదు. దీనిపై తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డిని వివరణ కోరగా అధికారులతో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 04 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 67,668 మంది స్వామి వారిని దర్శించుకోగా 23,157 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.56 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.




శ్రీకాళహస్తిలో నేటి నుంచి పవిత్రోత్సవాలు



శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం నుంచి 17వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. భక్తులు, సిబ్బంది వల్ల ఏదైనా పొరబాట్లు జరిగి ఉంటే సంవత్సరంలో ఒకసారి నిర్వహించే ఈ పవిత్రోత్సవాలతో తొలుగుతాయని తెలిపారు.

అప్పన్న అన్న ప్రసాదానికి విరాళాలు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం శాశ్వత అన్నప్రసాద పథకానికి విశాఖ నగరంలోని మల్కాపురానికి చెందిన కాపు దుర్గేశ్వర రావు రూ.1,00,116 విరాళాన్ని నగదురూపంలో, శివాజీపాలేనికి చెందిన కోన వసంతలక్ష్మి రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతలకు అన్నప్రసాద బాండ్లను ఏఈవో పిల్లా శ్రీనివాసరావు అందజేశారు.

నేటి నుంచి కనకమహాలక్ష్మి పవిత్రోత్సవాలు



డాబాగార్డెన్స్: విశాఖ నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో శుక్రవారం నుంచి 16వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఇందుకు అవసరమైన పవిత్రాలు సిద్ధం చేసినట్లు వివరించారు. వార్షిక ఉత్సవాల్లో వైదికపరంగా ఎలాంటి దోషాలు, పొరపాట్లు జరిగినా వాటిని నివారించేందుకు వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ.

విద్యా గణపతిగా సంపత్ వినాయగర్



సీతమ్మధార: విశాఖలోని ఆశీలమెట్టలో గల శ్రీ సంపత్ వినాయగర్ స్వామి గురువారం శ్రీ విద్యా గణపతి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి పోటెత్తారు. గణపతి హోమం, నాదస్వర కచేరి, ఉభయ దాతలచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

అయినవిల్లి గణపతికి లక్ష గరిక పూజ




అయినవిల్లి: గణపతి నవరాత్రుల్లో భాగంగా కాకినాడ జిల్లా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామికి వేద పండితుల ఆధ్వర్యంలో గురువారం లక్ష దూర్వార్చన పూజలు జరిపారు. ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో స్వామిని పంచామృతాభిషేకాలు, లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాలు, శ్రీలక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. వేదమంత్రాలతో స్వామిని మూషిక వాహనంపై ఉంచి వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు.

స్పష్టమైన వైఖరితో కెరీర్‌కు బాటలు వేసుకోవాలి



వైవీయూ: ఎంపిక చేసుకున్న లక్ష్యాలపై స్పష్టమైన వైఖరితో కెరీర్‌కు బాటలు వేసుకోవాలని స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో స్టెప్ ఆధ్వర్యంలో 'కెరీర్ కౌన్సెలింగ్'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ కోర్సుల ఎంపిక ఇష్టం మేరకు చేసుకోవాలే తప్ప ఒత్తిడితోనో, ఎవరి కోసమో చేసుకోకూడదన్నారు. న్యాయమూర్తి శంకర్ మాట్లాడుతూ కౌన్సెలింగ్ అనేది సరైన మార్గాన్ని కనుగొనడంలో సహాయపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ కెరీర్ కౌన్సెలింగ్‌ను విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు.



నైరాలో పీజీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం జిల్లా నైరాలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కళాశాలలో పీజీ కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వ్యవసాయ కళాశాల డీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 35 ఏళ్లు పూర్తి చేసుకున్న వారు 2024-25కు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఇందులో సస్యపోషణ (అగ్రోనమి)లో ఆరుసీట్లు, జన్యుశాస్త్రం, మొక్కల ప్రజనన శాస్త్రం (జెనిటిక్స్ ప్లాంట్ బ్రీడింగ్), కీటక శాస్త్రం (ఎంటమాలజీ) వ్యవసాయ విస్తరణ విద్య (అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్) విభాగాల్లో 3 సీట్లు ఉన్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు నైరా వ్యవసాయ కళాశాలను సంప్రదించాలన్నారు.

ఏపీటీఎఫ్‌ను బలోపేతం చేస్తాం

మాచర్ల: ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్)ను బలోపేతం చేసేందుకు మండలాలు, నియోజకవర్గాల్లో కమిటీలను నియమిస్తూ ఉపాధ్యాయ సమస్యల పై ఉద్యమించేందుకు తమ సంఘం ప్రత్యేక కృషి జరుపుతున్నట్లు ఆ సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు బి సంపత్‌బాబు, జిల్లా ప్రధానకార్యదర్శి పమ్మి వెంకటరెడ్డిలు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా పర్యటనలో భాగంగా గురువారం మాచర్ల వచ్చిన వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1938లో ఏర్పడిన ఏపీటీఎఫ్ 20వ విద్యా, వైజ్ఞానిక మహాసభలు, 80వ వసంతాల వేడుకలను అక్టోబర్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టీచర్ల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసి పలు విజయాలు సాధించామని తెలిపారు.

వర్సిటీ అభివృద్ధికి రిటైర్డ్ ఉద్యోగుల సలహాలు అవసరం

తిరుపతి సిటీ: ఎస్వీయూ అభివృద్ధికి విశ్రాంత ఉద్యోగుల సలహాలు, సూచనలు ఎంతో అవసరమని వీసీ డాక్టర్ సీహెచ్ అప్పారావు పేర్కొన్నారు. గురువారం తిరుపతిలోని ఎస్వీయూ సెనేట్ హాల్‌లో రిటైర్డ్ నాన్ టీచింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధిలో రిటైర్డ్ ఉద్యోగుల కృషి ఎంతో ఉందన్నారు. నేటి యువత పెడదారిన పడకుండా విద్యార్థుల ఉన్నతి తమ వంతు సూచనలు ఇవ్వాలని కోరారు.

జాతీయ స్థాయిలో సత్తెనపల్లి విద్యార్థినుల ప్రతిభ

సత్తెనపల్లి: జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని కేంద్రీయ విద్యాలయ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 6 నుంచి 10 వరకు గురుగావ్ రీజియన్ అంబాల (హరియాణా)లో జరిగిన 53వ జాతీయ వాలీబాల్ సమ్మిట్‌లో 25 రీజియన్‌లలో సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయ విద్యార్థినులు విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ జగదీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ ఇంతటి ఘన విజయంలో విద్యాలయ పీఈటీ బి కిరణ్‌రెడ్డి కృషి ఎంతగానో ఉందని అభినందించారు. విద్యార్థినులు పట్టుదలతో కృషి చేశారన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు.

సినిమా


● కమల్ హాసన్

సంక్రాంతి బరిలో థగ్ లైఫ్

కమల్‌హాసన్ 'థగ్ లైఫ్' సినిమా సంక్రాంతి బాక్సాఫీస్ బరిలో నిలిచే అవకాశాలు ఉన్నాయనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. హీరో కమల్ హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'థగ్ లైఫ్'. ఈ చిత్రంలో త్రిష, శింబు, అశోక్ సెల్వన్, అలీ ఫజల్, అభిరామి, ఐశ్వర్యా లక్ష్మి, జోజూ జార్జ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో రంగరాయ శక్తివేల్ నాయకర్ పాత్రలో కమల్‌హాసన్ నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. 'థగ్ లైఫ్'ని సంక్రాంతికి రిలీజ్ చేసే ఆలోచనలో ఉందట చిత్రబృందం. మరి.. సంక్రాంతికి బాక్సాఫీస్ బరిలో 'థగ్ లైఫ్' నిలుస్తుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ. మరోవైపు 1987లో వచ్చిన 'నాయగన్' ('నాయకుడు') సినిమా తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో 37 ఏళ్లకు రానున్న ఈ చిత్రంపై కోలీవుడ్‌లో అంచనాలు ఉన్నాయి.


● ప్రభాస్

కామెడీ టు యాక్షన్

కామెడీ మోడ్ నుంచి యాక్షన్ మోడ్‌కు షిఫ్ట్ అయ్యారు హీరో ప్రభాస్. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'రాజా సాబ్'. ఈ చిత్రంలో మాళవికా మోహనన్, నిధీ అగర్వాల్ హీరోయిన్లు. రిద్ధీ కుమార్ మరో హీరోయిన్ పాత్రలో కనిపిస్తారని తెలిసింది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రభాస్‌తో పాటు ప్రధాన తారాగణం అంతా ఈ షూటింగ్ షెడ్యూల్‌లో పాల్గొంటున్నారు. కాగా నిన్న మొన్నటి వరకు కామెడీ, రొమాంటిక్ సన్నివేశాలను చిత్రీకరించారట మారుతి. తాజాగా ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను తెరకెక్కించేందుకు సన్నాహాలు చేశారట. ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్ నేతృత్వంలో సాగే ఈ యాక్షన్ సీక్వెన్స్‌లో ప్రభాస్ పాల్గొంటారని తెలిసింది. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఇక తాజా షెడ్యూల్ పూర్తి కాగానే, హను రాఘవపూడి దర్శకత్వంలోని 'ఫౌజి' సినిమా చిత్రీకరణ కోసం ప్రభాస్ చెన్నై వెళ్లనున్నారని తెలిసింది. అలాగే ప్రభాస్ హీరోగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందనున్న 'స్పిరిట్' చిత్రం షూటింగ్ వచ్చే ఏడాది ప్రారంభంలో మొదలు కానుందని తెలిసింది.

తొలి వారంలోనే బెజవాడకు బెజవాడ బేబక్క



ఎంతో ఆర్భాటంగా, అట్టహాసంగా ప్రారంభమైన బిగ్ బాస్ 8వ సీజన్‌కి మునుపటిలాగే నాగార్జున వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సీజన్‌కు ట్యాగ్‌లైన్‌గా 'ఎంటర్‌టైన్‌మెంట్‌కు లిమిటే లేదు' అని నిర్ణయించారు. మొత్తంగా 14 కంటెస్టెంట్లలో చెప్పుకోదగ్గ వారెవరూ లేకపోయినా కంటెస్టెంట్లందరూ ఫుల్‌గా తయారై వచ్చినట్టుగా తెలుస్తోంది. మొదటి వారం నామినేషన్ల కన్నా ముందే కంటెస్టెంట్ల మధ్య వాడి వేడి వాదనలు జరగడం ప్రేక్షకులకు కనువిందు చేసినట్టింది. బిగ్ బాస్ అనేది భావోద్వేగభరితమైన షో అని మరోసారి మొదటి రెండు రోజుల్లోనే నిరూపించింది ఈ సీజన్. బిగ్ బాస్‌లో ఏడుపులు... పెడబొబ్బలు అనేవి కామన్ అయినా ఏ సీజన్‌లోనూ జరగని ఓ వింత ఈ సీజన్ మొదటి వారంలోనే జరిగింది. కంటెస్టెంట్ అయిన మణికంఠ నామినేషన్స్ పై వాడి వేడి వాదనలు జరుగుతున్న సమయంలో తన విగ్గును పూర్తిగా తీసేసి విలపించడం ఓ హైలెట్. ఈ చర్యపై చూసే ప్రేక్షకులే కాదు అక్కడున్న కంటెస్టెంట్స్ కూడా అవాక్కయ్యారు. మిగతా కంటెస్టెంట్‌లలో నిఖిల్, శేఖర్ భాషా, సోనియా, విష్ణుప్రియ, యష్మి తదితరులు ఈ వారం తమ అరుపులతో ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి ప్రయత్నించారు. ప్రధానంగా ఓ మెరుపు మెరిసినట్టు హౌస్‌లోకి అడుగుపెట్టి, తన నలభీమ పాక చేతి వంటతో అందరి మన్ననలు పొందాలనుకున్న బెజవాడ బేబక్క అలియాస్ మధు ఆశలు మొదటివారంలోనే ఆడియాసలై హౌస్ నుండి ఎలిమినేట్ అయింది. తన మూర్ఖత్వపు రూల్స్‌తో బేబక్క తమ కడుపును మాడుస్తుందని హౌస్‌లోని దాదాపు ప్రతి కంటెస్టెంట్ పేర్కొనడం గమనార్హం. అలా బెజవాడ బేబక్క బిగ్ బాస్ ప్రస్థానం ముగిసి బెజవాడ బాట పట్టింది. మరి రానున్న వారాల్లో ఈ బిగ్ బాస్‌లో ఇంకెన్ని సంచలనాలు జరుగుతాయో చూడాలి.

పల్లెటూరి రాధ

కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన పీరియాడికల్ థ్రిల్లర్ మూవీ 'క'. ఈ చిత్రంలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ విలేజ్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ థ్రిల్లర్ మూవీని దర్శక ద్వయం సుజీత్, సందీప్ తెరకెక్కించారు. త్వరలోనే ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. తెలుగులో నిర్మాత వంశీ నందిపాటి, మలయాళంలో దుల్కర్ సల్మాన్ నిర్మాణ సంస్థ వేఫరర్ ఫిలిమ్స్ ఈ సినిమాను రిలీజ్ చేయనున్నాయి. ఈ సినిమాలో ఓ హీరోయిన్‌గా నటిస్తున్న తన్వీ రామ్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేసి, ఆమె రాధ అనే పాత్రలో నటిస్తున్నట్లుగా చిత్రయూనిట్ గురువారం వెల్లడించింది. ''2018' సినిమాతో ఇప్పటికే తెలుగు ప్రేక్షకుల ఆదరణ దక్కించుకున్న తన్వీ 'క' సినిమాతోనూ ఇంప్రెస్ చేస్తారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సామ్ .సీఎస్.


● తన్వీ రామ్

జోడీ రిపీట్?


● సాయి పల్లవి

● నాని

'ఎమ్‌సీఏ' (మిడిల్ క్లాస్ అబ్బాయి) చిత్రం తర్వాత హీరో నాని-హీరోయిన్ సాయిపల్లవిల కాంబినేషన్ మరోసారి రిపీట్ అయ్యే అవకాశం కనిపిస్తోంది. హీరో నాని-దర్శకుడు శేఖర్ కమ్ముల కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనుందనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. నాని కోసం ఓ కథను రెడీ చేశారట శేఖర్ కమ్ముల. అలాగే శేఖర్ కమ్ములతో సినిమా చేసేందుకు కూడా నాని సుముఖంగానే ఉన్నారట. కాగా ఈ కథలో హీరోయిన్‌గా సాయిపల్లవి అయితే బాగుంటుందని శేఖర్ భావిస్తున్నారని భోగట్టా. ప్రస్తుతం ధనుష్‌తో 'కుబేర' చేస్తున్నారు శేఖర్ కమ్ముల. నాని కూడా 'హిట్ 3', దర్శకుడు సుజిత్, శ్రీకాంత్ ఓదెలలతో సినిమాలు కమిట్ అయ్యారు. కాబట్టి... నాని-శేఖర్ కమ్ముల కాంబినేషన్ సెట్ కావడానికి కాస్త సమయం పడుతుందని ఊహించవచ్చు. మరి నాని-శేఖర్ కమ్ముల కాంబినేషన్‌లోని మూవీ అనౌన్స్‌మెంట్ ఎప్పుడు వస్తుంది? ఈ సినిమాలో నాని-సాయి పల్లవి జోడీ కడతారా? అనేది తెలియాలంటే వేచి చూడాల్సిందే. మరోవైపు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన 'లవ్‌స్టోరీ' చిత్రంలో సాయి పల్లవి హీరోయిన్‌గా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది. ఈ చిత్రంలో నాగచైతన్య హీరోగా నటించారు.

అరుదైన గౌరవం

బాలీవుడ్ నటుడు వీర్ దాస్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఈ ఏడాది నవంబరులో న్యూయార్క్‌లో జరగనున్న 52వ ఎమ్మీ అవార్డ్స్ ప్రదానోత్సవానికి వ్యాఖ్యాతగా వీర్ దాస్ వ్యవహరించనున్నారు. ఈ గౌరవం దక్కించుకున్న తొలి భారతీయుడు వీర్ దాస్‌యే కావడం విశేషం. "అంతర్జాతీయ వేడుకకు భారతీయ నటుడు వ్యాఖ్యాతగా ఉండనున్నాడు. ఈ అవకాశాన్ని గౌరవంగా భావిస్తున్నాను. అలాగే ఈ సమయం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను" అని సోషల్ మీడియాలో పేర్కొన్నారు వీర్ దాస్. దీంతో బాలీవుడ్ సినీ ప్రముఖులు హృతిక్ రోషన్, ప్రియాంకా చోప్రా, ఆలియా భట్, కృతీ సనన్, దియా మీర్జా, బిపాసా బసు వంటి వారు వీర్ దాస్‌కు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఇక గత ఏడాది జరిగిన ఎమ్మీ అవార్డ్స్ వేడుకలో 'వీర్ దాస్: ల్యాండింగ్' వెబ్ షోకుగాను హాస్య నటుడిగా వీర్ దాస్ ఎమ్మీ అవార్డు అందుకున్నారు. ఇలా ఎమ్మీ అవార్డు అందుకున్న తొలి భారతీయుడు కూడా తనే కావడం మరో విశేషం.


● వీర్ దాస్



వరద బాధితులకు మా వంతు సాయం చేస్తాం

– ప్రసాద్ రావు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు తెలుగు టెలివిజన్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఆర్థిక సహాయం ప్రకటించింది. ఈ సందర్భంగా తెలుగు టీవీ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్ రావు మాట్లాడుతూ– ''తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితుల కష్టాలు చూస్తే మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ స్పందిస్తారు. మా అసోసియేషన్ తరపున మేం కూడా మాకు వీలైనంతగా ఆర్థిక సాయం చేయాలని భావించాము. 260 మంది ప్రొడ్యూసర్స్‌లో ఇప్పుడు 60మందే యాక్టివ్‌గా సీరియల్స్ చేస్తున్నారు. అయినా.. 5 వేల రూపాయల నుంచి 25 వేల రూపాయల వరకు వీలైనంత సాయం చేయాలని మా అసోసియేషన్ సభ్యులను కోరాం. వారంతా స్పందించారు. తోచినంత విరాళం ఇచ్చారు. ఈ డబ్బుకు మా అసోసియేషన్ ఫండ్ నుంచి మరికొంత యాడ్ చేసి, రూ. 10 లక్షల నుంచి 15 లక్షల వరకు ఎంత కలెక్ట్ అయితే అంత డబ్బును తెలుగు రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేస్తాం. ముఖ్యమంత్రి లేదా ఉప ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ తీసుకుని ఆ చెక్స్ అందిస్తాం'' అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు టీవీ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ సెక్రటరీ వినోద్ బాల, నటుడు- నిర్మాత ప్రభాకర్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.


● ప్రసాద్ రావు, ప్రభాకర్, వినోద్ బాల


● జాక్వెలిన్ ఫెర్నాండెజ్

● అక్షయ్ కుమార్

లండన్ కాలింగ్

లండన్ కాలింగ్ అంటూ అక్షయ్ కుమార్ అండ్ టీమ్ అక్కడికి ప్రయాణం కానున్నారు. హిందీలోని హిట్ ఫ్రాంచైజీస్‌లో ఒకటైన 'హౌస్‌ఫుల్' నుంచి రానున్న తాజా చిత్రం 'హౌస్‌ఫుల్ 5'. ఈ చిత్రంలో అక్షయ్ కుమార్, అభిషేక్ బచ్చన్, రితేష్ దేశ్‌ముఖ్ హీరోలుగా నటించనున్నారు. జాక్వెలిన్ ఫెర్నాండెజ్, నర్గీస్ ఫక్రీ, సోనమ్ బజ్వా, చిత్రాంగదా సింగ్, సౌందర్యా శర్మ హీరోయిన్లుగా కనిపిస్తారని తెలిసింది. కాగా ఈ రొమాంటిక్ ఫుల్ లెంగ్త్ కామెడీ చిత్రం షూటింగ్ ఈ నెలలో లండన్‌లో ప్రారంభం కానుందని బాలీవుడ్ సమాచారం. అక్కడ దాదాపు యాభై రోజులు ఉంటుందని బీ టౌన్ టాక్. మేజర్ టాకీ పార్టు అంతా లండన్‌లోనే ముగించేస్తారట. ఇంకా ఈ చిత్రంలో సంజయ్ దత్, ఫర్దీన్ ఖాన్, నానా పటేకర్, చంకీ పాండే, జాకీ ష్రాఫ్, డినో మోరియా ఇతర కీలక పాత్రల్లో కనిపిస్తారని టాక్. తరుణ్ మన్సుఖాని దర్శకత్వంలో సాజిద్ నడియాడ్‌వాలా నిర్మించనున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 6న రిలీజ్ కానుంది.



● త్రిష, విజయ్ సేతుపతి


● త్రిష

రామ్... జానూ మళ్లీ వస్తారా?

విజయ్ సేతుపతి, త్రిష లీడ్ రోల్స్‌లో నటించిన రొమాంటిక్ డ్రామా '96'. సి. ప్రేమ్‌కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2018లో విడుదలై, బ్లాక్‌బస్టర్ అయింది. రామ్, జానుగా విజయ్ సేతుపతి, త్రిష కెమిస్ట్రీ అద్భుతంగా పండింది. కాగా ఈ సినిమాకు సీక్వెల్ తీసే ఆలోచన ఉందని ఈ చిత్రదర్శకుడు సి. ప్రేమ్‌కుమార్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. '96' సినిమాకు తాను తొలుత సీక్వెల్ తీయకూడదనే అనుకున్నానని, అయితే ఈ సినిమా రిలీజ్ తర్వాత సినిమాపై ప్రేక్షకులు చూపిన ప్రేమ, అభిమానం తన ఆలోచనా ధోరణిని మార్చివేశాయని, స్క్రిప్ట్ కూడా ఆల్మోస్ట్ పూర్తయిందని, త్రిష-విజయ్ సేతుపతిల షూటింగ్ కాల్షీట్స్ లభిస్తే '96' సీక్వెల్ తీస్తానని ప్రేమ్ కుమార్ చెప్పారని కోలీవుడ్ మీడియా అంటోంది. మరి... దర్శకుడు ప్రేమ్‌కుమార్ ఆశించినట్లుగా '96' చిత్రానికి సీక్వెల్ వస్తుందా? త్రిష-విజయ్ సేతుపతి ఈ సినిమా కోసం డేట్స్ కేటాయిస్తారా? వేచి చూడాలి. ఈ సంగతి ఇలా ఉంచితే... ఈ తమిళ హిట్ ఫిల్మ్ '96' తెలుగులో 'జాను'గా రీమేక్ కాగా, శర్వానంద్-సమంత లీడ్ రోల్స్‌లో నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.

బిజినెస్ రీల్

వృద్ధే లక్ష్యంగా యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ రేటు కోత



ఫ్రాంక్‌ఫర్ట్ (జర్మనీ): ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ బెంచ్‌మార్క్ రేటును మరోసారి పావు శాతం తగ్గించింది. డిపాజిట్ రేటును 3.75 శాతం నుంచి 3.5 శాతానికి తగ్గింపునకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రుణ రేట్లూ తగ్గనున్నాయి. జూన్‌లో 4 శాతం నుంచి 3.75 శాతానికి రేటు తగ్గించిన సంగతి తెలిసిందే. తక్కువ రుణ వ్యయాలతో కంపెనీలు, గృహ వినియోగానికి సంబంధించి డిమాండ్, తద్వారా ఆర్థిక వృద్ధి.. రేటు తగ్గింపు లక్ష్యం. అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడ్ ఫండ్ రేటు కూడా తగ్గనుందన్న వార్తల నేపథ్యంలో యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ తాజా నిర్ణయం తీసుకోవడం గమనార్హం. యూరో కరెన్సీ వినియోగిస్తున్న 20 దేశాల్లో 2022 అక్టోబర్‌లో 10.6 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం 2024 ఆగస్టులో 2.2 శాతానికి (లక్ష్యం 2 శాతం) తగ్గింది.

సందిగ్ధంలో యస్ బ్యాంక్ వాటా అమ్మకం...

ముంబై: యస్ బ్యాంక్‌లో వాటాల విక్రయం అంశం సందిగ్ధంలో పడినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రిజర్వ్ బ్యాంక్ అభిప్రాయానికి భిన్నంగా బిడ్డర్లు 51 శాతం వాటా కోసం పట్టుబడుతుండటం ఇందుకు కారణమని పేర్కొన్నాయి. యస్ బ్యాంక్‌లాంటి పెద్ద బ్యాంకులో విదేశీ సంస్థ 51 శాతం వాటాలు తీసుకునే ప్రతిపాదనను ఆమోదించేందుకు ఆర్‌బీఐ సుముఖంగా లేదని వివరించాయి. బిడ్డర్లు నేరుగా ఆర్‌బీఐని సంప్రదిస్తున్నప్పటికీ, యాజమాన్య అధికారాలను ఇవ్వడంపై రిజర్వ్ బ్యాంక్ ఇష్టపడటం లేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. దీంతో వాటాల విక్రయ ప్రతిపాదన విషయంలో ఎలాంటి పురోగతి లేదని వివరించాయి. యస్ బ్యాంకులో వాటాలు కొనుగోలు చేసేందుకు ఎమిరేట్స్ ఎన్‌బీడీ, జపాన్‌కి చెందిన ఎస్‌ఎంబీసీ పోటీపడుతున్నట్లు సమాచారం.

భారత్‌లో హెచ్‌పీ పీసీల తయారీ

న్యూఢిల్లీ: పీసీల తయారీ దిగ్గజం హెచ్‌పీ.. నోట్‌బుక్స్, డెస్క్‌టాప్స్, ఆల్ ఇన్ వన్ పీసీలను దేశీయంగా ఉత్పత్తి చేయనుంది. డిక్సన్ టెక్నాలజీస్‌కు చెందిన ప్యాడ్జెట్ ఎలక్ట్రానిక్స్‌తో ఈ మేరకు ఒప్పందం చేసుకోనుంది. పీఎల్ఐ 2.0 పథకంలో భాగంగా పీసీల తయారీకై హెచ్‌పీ ఇండియాతో ప్యాడ్జెట్ ఎలక్ట్రానిక్స్ అవగాహన ఒప్పందం కుదుర్చుకోనుంది. చెన్నై సమీపంలో ప్యాడ్జెట్ నూతన ప్లాంటును ఏర్పాటు చేస్తోంది. ఏటా గరిష్టంగా 20 లక్షల పీసీలను తయారు చేయగలిగే సామర్థ్యంతో ఈ కేంద్రం రానుంది.

టాటా మోటర్స్‌తో టాటా పవర్ ఈవీ చార్జింగ్ సొల్యూషన్స్ జట్టు

200 స్టేషన్ల ఏర్పాటుకు ఎంవోయూ



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 200 ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు టాటా మోటర్స్‌తో టాటా పవర్ ఈవీ చార్జింగ్ సొల్యూషన్స్ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ముంబై, ఢిల్లీ తదితర మెట్రో నగరాలన్నింటిలోనూ వీటిని నెలకొల్పనుంది. టాటా మోటర్స్ వాణిజ్య వాహనదారులకు ప్రత్యేక చార్జింగ్ టారిఫ్‌లు అమలు చేస్తామని, దీంతో కస్టమర్లకు నిర్వహణ వ్యయాలు తగ్గి, లాభదాయకత పెరుగుతుందని ఇరు సంస్థలు ఒక ప్రకటనలో తెలిపాయి. దేశవ్యాప్తంగా విస్తృతమైన చార్జింగ్ నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తేవడం ద్వారా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-9-2024	
విశాఖ	535-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	530-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.60

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,073
ఎన్ఎస్ఈ	1,22,763
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,72,420
ఎఫ్ఐఐ	+ 7,695
డీఐఐ	+ 1,802

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.05	$ 72.04
బ్రెంట్	67.31	$ 70.61

విదేశాల్లో కీలక ఖనిజాలపై ఎన్‌ఎండీసీ దృష్టి

లిథియం, కోబాల్ట్, నికెల్ ప్రాజెక్టులు • సబ్సిడరీ ద్వారా అవకాశాల అన్వేషణ

న్యూఢిల్లీ: విదేశాల్లో కీలక ఖనిజ వనరులపై దృష్టి సారించినట్లు ప్రభుత్వరంగ ఐరన్ ఓర్ ఉత్పత్తి సంస్థ ఎన్‌ఎండీసీ ప్రకటించింది. పర్యావరణ అనుకూల శుద్ధ ఇంధన వనరులకు కేంద్రం ప్రాధాన్యం ఇస్తుండడం తెలిసిందే. వీటి కోసం కాపర్, లిథియం, నికెల్, కోబాల్ట్ అవసరం ఎక్కువగా ఉంటుంది. దీంతో ప్రభుత్వరంగ సంస్థలు విదేశాల్లో ఈ కీలకమైన ఖనిజాల అన్వేషణ అవకాశాలను పరిశీలిస్తుండడం తెలిసిందే. ఇందులో ఎన్‌ఎండీసీ కూడా ఒకటి. "లిథియం, కోబాల్ట్, నికెల్ తదితర ఖనిజ అవకాశాలను సబ్సిడరీ సంస్థ లెగసీ ఇండియా ఐరన్ ఓర్ ద్వారా పరిశీలిస్తున్నాం. ఆస్ట్రేలియాలో లిథియం మైనింగ్ కూడా ఈ అన్వేషణలో భాగంగా ఉంది" అని ఎన్‌ఎండీసీ తన ప్రకటనలో వివరించింది. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి 8 మిలియన్ టన్నుల కోకింగ్ కోల్ ఉత్పత్తి ప్రారంభిస్తామని తెలిపింది. దీంతో దిగుమతులపై ఆధారపడడం తగ్గుతుందని పేర్కొంది. 2030 నాటికి రెట్టింపు స్థాయిలో 100 మిలియన్ టన్నుల ఐరన్ ఓర్ ఉత్పత్తి లక్ష్యాన్ని పెట్టుకున్నట్టు చెప్పింది.

రూ.2,200 కోట్ల పెట్టుబడులు:

"కేవలం ఉత్పత్తి పెంపునకే మా కార్యాచరణ పరిమితం కాదు. బాధ్యతతో చేయడం ఇది. పర్యావరణంపై ప్రభావాన్ని తగ్గించి, సమాజానికి సానుకూల ఫలితాలు అందించేందుకు కట్టుబడి ఉన్నాం" అని ఎన్‌ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ వివరించారు. 45 మిలియన్ టన్నుల నుంచి 100 మిలియన్ టన్నుల ఉత్పత్తికి విస్తరించేందుకు పెద్ద మొత్తం నిధులు అవసరం పడతాయంటూ.. 2024-25లోనే ఇందుకు రూ.2,200 కోట్లు కేటాయించినట్టు ఎన్‌ఎండీసీ తెలిపింది. స్లర్రీ పైపులైన్, కొత్త ప్రాసెసింగ్ ప్లాంట్లపై పెట్టుబడులు పెట్టనున్నట్టు, సామర్థ్య విస్తరణకు, పర్యావరణంపై ప్రభావాన్ని తగ్గించేందుకు ఇవి కీలకమని వివరించింది. కేకే లైన్ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా రైలు ద్వారా ఐరన్ ఓర్ రవాణాను విస్తరించనున్నట్టు తెలిపింది. ఐరన్ ఓర్ వనరులను గరిష్ట స్థాయిలో వినియోగించుకునేందుకు వీలుగా బచేలీలో 4 మిలియన్ టన్నుల బెనిఫికేషన్ ప్లాంట్, నాగర్నార్‌లో 2 మిలియన్ టన్నుల పెల్లెట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించింది.



సీఎండీ అమితవ ముఖర్జీ

ఆఫీస్ స్పేస్‌లో.. దేశీ కంపెనీల హవా

- 47 శాతానికి చేరిన వినియోగం
- సీబీఆర్ఈ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: కార్యాలయ వసతుల వినియోగంలో దేశీ కంపెనీల వాటా గణనీయంగా మెరుగుపడింది. 2022కు ముందు తొమ్మిది పట్టణాల్లోని మొత్తం ఆఫీస్ వసతుల్లో దేశీ కంపెనీల వాటా మూడింట ఒక వంతే ఉండగా, ఆ తర్వాత (2022 నుంచి 2024లో మొదటి ఆరు నెలలు) చోటుచేసుకున్న 154 మిలియన్ చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) లీజు లావాదేవీల్లో దేశీ కంపెనీల వాటా 47 శాతానికి (72 మిలియన్ ఎస్ఎఫ్‌టీ) చేరుకుంది. ఈ వివరాలను రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సీబీఆర్ఈ విడుదల చేసింది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పుణె, ముంబై, ఢిల్లీ ఎన్‌సీఆర్, కోల్‌కతా, కోచి, అహ్మదాబాద్‌కు సంబంధించి గణాంకాలను ఈ నివేదికలో సీబీఆర్ఈ వెల్లడించింది. "వృద్ధి, వ్యాపార కార్యకలాపాల విస్తరణ పట్ల దేశీ కంపెనీల అంకిత భావాన్ని ఈ గణంకాలు తెలియజేస్తున్నాయి. రానున్న సంవత్సరాల్లో ఆఫీస్ వసతుల్లో దేశీ కంపెనీల వాటా మరింత పెరుగుతుంది. దేశంలో స్టార్టప్ ఎకోసిస్టమ్ ఎంతో వేగంగా విస్తరిస్తోంది. నైపుణ్య మానవవనరులు దండిగా ఉన్నాయి. డిమాండ్‌ను కీలకంగా ఇవే నడిపిస్తున్నాయి. వ్యాపారంలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా అధిక నాణ్యత, సౌకర్యవంతమైన పని వాతావరణానికి భారత కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి" అని సీబీఆర్ఈ ఇండియా చైర్మన్, సీఈవో అన్షుమన్ మ్యాగజిన్ పేర్కొన్నారు. టాప్-9 పట్టణాల్లో 2026 నాటికి అదనంగా 189 మిలియన్ ఎస్ఎఫ్‌టీల ప్రీమియం ఆఫీస్ వసతి అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

మెరుగుపడిన సామర్థ్యాలు..

అంతర్జాతీయ అనిశ్చితుల్లోనూ దేశ ఆర్థిక భవిష్యత్ వృద్ధి పట్ల స్థానిక కంపెనీల్లో ఉన్న ఆశాభావాన్ని సీబీఆర్ఈ డేటా తెలియజేస్తోందని భీవ్ వర్క్‌స్పేసెస్ వ్యవస్థాపకుడు, సీఈవో శేషురావు పప్లికర్ పేర్కొన్నారు. "ఇది దేశ వాణిజ్య రియల్ ఎస్టేట్ మార్కెట్ పరిణతిని తెలియజేస్తోంది. స్థిరమైన వృద్ధిలో దేశీ డిమాండ్ కీలక పాత్ర పోషిస్తోంది. మరిన్ని భారత కంపెనీలు తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నందున, ఇదే ధోరణి ఇక ముందూ కొనసాగుతుంది" అని శేషురావు వివరించారు. స్థానిక కంపెనీల సామర్థ్యాలను ఈ డిమాండ్ ధోరణులు తెలియజేస్తున్నట్టు ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతానికి చెందిన బ్రహ్మ గ్రూప్ ఏవీపీ (ఆపరేషన్స్) ఆశిష్ శర్మ అన్నారు. టెక్నాలజీ, బీఎఫ్ఎస్ఐ రంగాల మద్దతుతో ఆఫీస్ స్పేస్ డిమాండ్ పుంజుకున్నట్టు చెప్పారు.

బయోటెక్‌కు భారీగా పెట్టుబడులు కావాలి

బయోకాన్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా వెల్లడి



న్యూఢిల్లీ: బయోటెక్ రంగంలో మేధో సంపత్తి సంస్కృతిని పెంపొందించేందుకు, పరిశోధనలు, అభివృద్ధి కార్యకలాపాలకు ఊతమిచ్చేందుకు భారీగా పెట్టుబడులు అవసరమని బయోకాన్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా తెలిపారు. ఇప్పటికే జనరిక్స్‌కి సంబంధించి అతి పెద్ద ఎగుమతిదారుగాను, టీకాల తయారీలో కీలకంగాను ఉన్న భారత్.. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా విలువను మరింతగా పెంచుకోగలదని పేర్కొన్నారు. గ్లోబల్ బయో-ఇండియా 2024 కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమె ఈ విషయాలు చెప్పారు. భవిష్యత్తులో కొత్త ఆవిష్కరణల విషయంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందని షా తెలిపారు. ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలు, సాంకేతిక సామర్థ్యాలు పుష్కలంగా ఉండటం తదితర అంశాలు.. బయో-ఇన్నోవేషన్ హబ్‌గా ఎదగడంలో భారత్‌కు సహాయకరంగా ఉంటాయని ఆమె వివరించారు.

నికర లాభాల్లోకి వస్తాం: పేటీఎం సీఈవో

న్యూఢిల్లీ: నిర్వహణ లాభం కంటే నికర లాభంపై పేటీఎం దృష్టి సారించినట్టు సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో విజయ్ శేఖర్ శర్మ తెలిపారు. ఈసాప్ (ఉద్యోగులకు స్టాక్స్) వ్యయాలకు ముందు ఎబిట్డా పాజిటివ్ సాధిస్తామని పేటీఎం గతంలో ప్రకటించడం గమనార్హం. "ఈసాప్‌కు ముందు ఎబిట్డా కంటే నికర లాభం గురించే చెప్పాలంటూ కంపెనీ బోర్డు సభ్యుడు ఒకరు నాకు సూచించారు. ఇప్పుడు ఈసాప్ వ్యయాలకు ముందు ఎబిట్డా ఒక్కటే కాకుండా, నికర లాభాన్ని నమోదు చేయాలని అనుకుంటున్నాం. ఇదే మా కొత్త సంకల్పం" అని శర్మ తెలిపారు. పేటీఎం మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ వార్షిక సాధారణ సమావేశంలో భాగంగా వాటాదారులకు ఈ వివరాలు వెల్లడించారు. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో పేటీఎం రూ.840 కోట్ల నష్టాలను నమోదు చేయడం గమనార్హం. క్రితం ఏడాది ఇదే కాలంలో నష్టం రూ.358 కోట్లుగా ఉంది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లైసెన్స్‌ను ఆర్‌బీఐ రద్దు చేయడం తదనంతర పరిణామాలతో కంపెనీల నష్టాలు పెరిగాయి. కృత్రిమ మేధ ప్రభావాన్ని ఈ సందర్భంగా శర్మ ప్రస్తావించారు. వివిధ రంగాల్లో ఏఐ ఎన్నో మార్పులకు కారణమవుతోందంటూ.. వచ్చే ఐదేళ్లలో ఆటోమేటెడ్ కార్లు పెరిగిపోవచ్చన్నారు. ఫైనాన్షియల్ టెక్నాలజీలో అగ్రగామిగా ఎదిగిన భారత్, ఏఐ టెక్నాజీలోనూ ఇదే విధంగా అవకాశాలను సొంతం చేసుకోవాలన్నారు. రిస్క్ నిర్వహణలో ఏఐ సాంకేతికతకు పేటీఎం ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు శర్మ చెప్పారు.



విజయ్ శేఖర్ శర్మ

అదానీ గ్రూప్ సంస్థకు చెందిన 310 మిలియన్ డాలర్లు ఫ్రీజ్



న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ ఆరోపణలపై దర్యాప్తులో భాగంగా అదానీ గ్రూప్ సంస్థకు చెందినవిగా భావిస్తున్న 310 మిలియన్ డాలర్ల మొత్తాన్ని స్విస్ అధికారులు ఫ్రీజ్ చేసినట్లు సమాచారం. స్విట్జర్లాండ్‌కి చెందిన ఇన్వెస్టిగేటివ్ న్యూస్ వెబ్‌సైట్ గోథమ్ సిటీ ఈ మేరకు కథనాన్ని ప్రచురించింది. దీని ప్రకారం అదానీ గ్రూప్‌నకు చెందినవిగా భావిస్తున్న సంస్థలపై 2021లో మనీ లాండరింగ్ ఆరోపణలకు సంబంధించి స్విట్జర్లాండ్ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. అందులో భాగంగానే పలు స్విస్ బ్యాంకు ఖాతాల్లోని నిధులను ఫ్రీజ్ చేశారు. అదానీ గ్రూప్ కంపెనీల ఖాతాలు, షేర్లలో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలతో సంచలనం రేపిన అమెరికన్ సంస్థ హిండెన్‌బర్గ్ ఈ కథనాన్ని ట్విటర్‌లో షేర్ చేసింది.

ద్రవ్యలోటు కట్టడికి భారత్ చిత్తశుద్ధి: ఫిచ్



న్యూఢిల్లీ: అధిక ప్రభుత్వ వ్యయాలు, సంకీర్ణ ప్రభుత్వ డిమాండ్లపై దృష్టి సారించినప్పటికీ మధ్యకాలానికి ద్రవ్యలోటును (ప్రభుత్వ ఆదాయాలు-వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం) తగ్గించడానికి భారతదేశం కట్టుబడి ఉందని ఫిచ్ రేటింగ్స్ కితాబునిచ్చింది. గత కొద్ది సంవత్సరాలుగా బడ్జెట్ లక్ష్యాలను భారత్ విజయవంతంగా చేరుకోగలుగుతోందని తాజా నివేదికలో పేర్కొంది. తద్వారా ద్రవ్య విశ్వసనీయతను మెరుగుపరుచుగలుగుతోందని వివరించింది. 2025 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును తగ్గించుకోడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) డివిడెండ్లను కేంద్రం వినియోగించుకోనుందని పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి కేంద్రానికి ఆర్‌బీఐ రూ. 2.11 లక్షల కోట్ల మిగులు నిధులను బదలాయించిన సంగతి తెలిసిందే.

తోటి దేశాలతో పోల్చితే...నిరాశే..

కాగా, "బీబీబీ" కేటగిరి సావరిన్ రేటింగ్ ఉన్న తోటి దేశాలతో పోల్చితే భారత్ ద్రవ్యలోటు, వడ్డీ: ఆదాయాలు-రుణ నిష్పత్తులు ఇప్పటికీ అధికంగానే ఉన్నాయని ఫిచ్ పేర్కొనడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు రూ.16,13,312 కోట్లుగా (జీడీపీలో 4.9 శాతం కట్టడి అంచనా) ఉండాలన్నది బడ్జెట్ లక్ష్యం. జూలై నాటికి రూ.2,76,945 కోట్లకు చేరింది. 2023-24లో జీడీపీలో ద్రవ్యలోటు 5.6 శాతానికి కట్టడి జరిగింది. 2025-26 ఆర్థిక సంవత్సరం నాటికి ద్రవ్యలోటును 4.5 శాతానికి కట్టడి చేయాలన్న లక్ష్యానికి కట్టుబడి ఉన్నట్లు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేస్తున్నారు. భారత్‌కు ఫిచ్ స్టేబుల్ అవుట్‌లుక్‌తో 'బీబీబీ మైనస్' సావరిన్ రేటింగ్ ఇస్తోంది. ఇది 'చెత్త' స్టేటస్‌కు ఒక అంచె ఎక్కువ.


రానున్న దశాబ్దంలో భారత్‌దే హవా!

- ప్రపంచ ఆర్థికాభివృద్ధిలో వాటా 20%
- జీ20 షెర్పా అమితాబ్ కాంత్ విశ్లేషణ

న్యూఢిల్లీ: భారతదేశం ప్రపంచవ్యాప్తంగా మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించనున్న నేపథ్యంలో వచ్చే దశాబ్దంలో ప్రపంచ ఆర్థిక వృద్ధిలో 20 శాతం వాటను కలిగి ఉంటుందని జీ20 షెర్పా అమితాబ్ కాంత్ పేర్కొన్నారు. ఇక్కడ జరిగిన ఏఐఎంఏ సదస్సులో ఆయన మాట్లాడుతూ, భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోందని, ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని పేర్కొన్నారు. రాబోయే మూడు సంవత్సరాలలో భారత్ ఎకానమీ జపాన్, జర్మనీలను అధిగమించి ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందన్న భరోసాను ఇచ్చారు. ప్రపంచ ఎకానమీకి భారత్ ఛోదక శక్తిగా ఆవిర్భవిస్తోందని పేర్కొన్నారు. "ఈ రోజు మనం చూస్తున్నది ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ఒక తరానికి ఒకసారి జరిగే మార్పు. కొన్ని సంవత్సరాల క్రితం భారత్ బలహీనమైన ఐదు దేశాల్లో ఉంది. బలహీనమైన ఐదు నుంచి ఒక దశాబ్దంలో మొదటి ఐదు స్థానాలకు చేరుకున్నాము" అని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

గ్రామీణుల జీవన ప్రమాణాలు పెరగాలి..

మూడు దశాబ్దాల్లో 9-10 శాతం వృద్ధి సాధించి, 2047 నాటికి దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజల జీవితాలను మార్చాలని, ఆరోగ్య రంగం మెరుగుపడాలని, పోషకాహార ప్రమాణాలు పెరగాలని అమితాబ్ కాంత్ ఉద్ఘాటించారు. భవిష్యత్ వృద్ధిని సాధించడానికి భారత్‌లో రాష్ట్రాల పాత్ర కీలకమని అన్నారు. "అంటే దేశ జనాభాలో దాదాపు 50 శాతం ఉన్న బీహార్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి అనేక రాష్ట్రాలు పరివర్తన చెందాల్సిన అవసరం ఉంది" అని ఈ వివరించారు. "మనం వాటిని మార్చడం చాలా క్లిష్టమైనది. ఎన్ని అవరోధాలు ఎదురయినప్పటికీ, ఆయా రాష్ట్రాలు మానవ అభివృద్ధి సూచికలో మెరుగుదలకు కీలకమైన ఛోదక శక్తిగా మారడం చాలా ముఖ్యం" అని కాంత్ అన్నారు. భారతదేశ జనాభాలో 50 శాతం మంది వృద్ధిని సృష్టిలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. అయితే దిగువ 50 శాతం మంది ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో జీవిస్తున్నారని పేర్కొన్నారు. ప్రాథమిక జీవన ప్రమాణాలను సాధించడానికి వ్యవసాయ కూలీ లేదా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆధారపడుతున్నారని ఆయన తెలిపారు. ఈ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం చాలా ముఖ్యమని ఆయన ఉద్ఘాటించారు.



అభివృద్ధి చెందిన దేశమంటే...

ప్రస్తుతం భారత్ తలసరి ఆదాయం దాదాపు 2,300 డాలర్లు. 2031 ఆర్థిక సంవత్సరం భారత్ తలసరి ఆదాయం 4,500 డాలర్లకు పెరగాలన్నది లక్ష్యం. ఇదే జరిగితే దేశం ఎగువ మధ్య-ఆదాయ దేశాల క్లబ్లో ప్రవేశిస్తుంది. ప్రస్తుతం అనుసరిస్తున్న ఆర్థిక సూత్రాల ప్రకారం... తలసరి ఆదాయం 1,036 డాలర్ల నుంచి 4,045 డాలర్ల మధ్య ఉన్న దేశాన్ని దిగువ మధ్య తరగతి ఆదాయ దేశంగా పరిగణిస్తారు. 4046 డాలర్ల నుంచి 12,535 డాలర్ల మధ్య ఆదాయ దేశాలను ఎగువ మధ్య తరగతి ఆదాయ దేశాలుగా పేర్కొంటారు. ఆ స్థాయి ఆదాయం దాటితే అది అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంది.

వచ్చే మూడు నెలల్లో నియామకాలు

ఆశాజనకం

- 37% కంపెనీల్లో సానుకూల సెంటిమెంట్
- ఫైనాన్షియల్, రియల్టీ, ఐటీ టాప్
- మ్యాన్‌పవర్ గ్రూప్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: భారత కంపెనీలు నియామకాల పట్ల బలమైన ధోరణితో ఉన్నట్టు మ్యాన్‌పవర్ గ్రూప్ 'ఎంప్లాయిమెంట్ అవుట్‌లుక్ సర్వే క్యూ4, 2024' నివేదిక వెల్లడించింది. 37 శాతం భారత కంపెనీలు వచ్చే మూడు నెలల్లో (అక్టోబర్-డిసెంబర్) నికరంగా తమ సిబ్బందిని పెంచుకోనున్నట్టు ఈ సర్వేలో తెలిపాయి. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ కాలంలోని గణాంకాలతో పోల్చి చూసినప్పుడు 7 శాతం అధికం. క్రితం ఏడాది అక్టోబర్-డిసెంబర్‌తో పోల్చి చూస్తే తటస్థంగా ఉంది. వివిధ రంగాల్లోని 3,150 కంపెనీల అభిప్రాయాలను సర్వేలో భాగంగా మ్యాన్‌పవర్ గ్రూప్ తెలుసుకుంది. భారత్ తర్వాత కోస్టారికాలో అత్యధికంగా 36 శాతం కంపెనీలు, ఆ తర్వాత యూఎస్‌లో 34 శాతం కంపెనీలు నియామకాల పట్ల సానుకూలంగా ఉన్నాయి. సిబ్బందిని తగ్గించుకునే కంపెనీలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే నికర నియామకాల గణాంకాలను ఈ సంస్థ రూపొందించింది. "నియామకాల ఉద్దేశ్యం భారత ఆర్థిక వ్యవస్థ పట్ల సానుకూల ధోరణిని తెలియజేస్తోంది. విదేశీ విధానాలు, పెద్ద ఎత్తున మౌలిక వసతుల అభివృద్ధికి తోడు మనకున్న అధిక యువ జనాభా సానుకూలతలు అంతర్జాతీయ మార్కెట్లో భారత పోటీతత్వాన్ని పెంచుతాయి" అని మ్యాన్‌పవర్ గ్రూప్ ఇండియా ఎండీ సందీప్ గులాటి పేర్కొన్నారు.

రంగాల వారీగా..

మ్యానపవర్ గ్రూప్ సర్వే ప్రకారం.. దాదాపు అన్ని రంగాల్లోనూ నియామకాల పట్ల సానుకూలత వ్యక్తమైంది. ఫైనాన్షియల్, రియల్ ఎస్టేట్ రంగాల్లో వచ్చే మూడు నెలల్లో 47 శాతం కంపెనీలు నియామకాల పట్ల సానుకూలంగా ఉంటే, ఐటీలో 46 శాతం, ఇండస్ట్రియల్స్, మెటీరియల్స్ రంగాల్లో 36 శాతం, కన్స్యూమర్ గూడ్స్ అండ్ సర్వీసెస్ రంగాల్లో 35 శాతం కంపెనీలు సిబ్బందిని పెంచుకోవాలని అనుకుంటున్నాయి. అతి తక్కువగా కమ్యూనికేషన్ సర్వీసెస్ రంగాలో 28 శాతం కంపెనీలే వచ్చే మూడు నెలల్లోనియామకాల పట్ల సానుకూలంగా ఉన్నాయి. ఉత్తరాదిలో ఉద్యోగాల డిమాండ్ 41 శాతంగా ఉంటే, పశ్చిమాదిన 39 శాతంగా ఉంది. అధిక దేశీయ వినియోగం, ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే పథకాలు, ఔట్‌సోర్స్ సేవల డిమాండ్ పెంచడం, తయారీపై భారత్ దృష్టి సారిస్తుందని అంచనా వేస్తున్నట్టు గులాటి తెలిపారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం చూస్తుంటే.. భారత్ నిరుద్యోగాన్ని తగ్గించి, కొత్త తరహా పరిశ్రమల అవసరాలు తీర్చే మానవ వనరుల అభివృద్ధి ద్వారా ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయొచ్చని గులాటీ వివరించారు.



6జీ టెక్నాలజీ పేటెంట్లపై దృష్టి

టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే 5జీ నెట్‌వర్క్‌లో వేగంగా విస్తరిస్తున్న భారత్.. 6జీ టెక్నాలజీపై దృష్టిపెట్టినట్లు కేంద్ర టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నారు. తద్వారా 6వ జనరేషన్(6జీ) మొబైల్ సర్వీసులలో ప్రపంచ పేటెంట్లలో 10వ వంతును అందిపుచ్చుకోవాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. ఏఐఎంఏ నేషనల్ మేనేజ్‌మెంట్ కన్వెన్షన్ ఇక్కడ నిర్వహించిన 51వ సదస్సు(ఎడిషన్) సందర్భంగా కీలకోపన్యాసం చేశారు. 5జీ సేవల నెట్‌వర్క్‌లో ప్రపంచంలోనే భారత్ వేగంగా విస్తరిస్తున్నట్లు ప్రస్తావించారు. పీఎస్‌యూ సంస్థ బీఎస్ఎన్ఎల్ కోసం సొంత 4జీ టెక్నాలజీకి తెరతీసినట్లు పేర్కొన్నారు. 22 నెలల్లోనే 4.5 లక్షల 4జీ టవర్లు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఈ బాటలో 6జీ సాంకేతికతలోకి ప్రవేశించేందుకు భారత్ 6జీ కూటమి(అలయెన్స్)ను నెలకొల్పినట్లు వెల్లడించారు. దీంతో రానున్న రోజుల్లో ప్రపంచవ్యాప్త పేటెంట్లలో 10 శాతాన్ని సాధించేందుకు కృషి చేయనున్నట్లు తెలియజేశారు. ప్రస్తుతం భారత్ ప్రపంచస్థాయిలో పురోగమిస్తున్నదని, సవాళ్లు ఎదుర్కొంటున్న ఆర్థిక వ్యవస్థ స్థాయిని అధిగమించిందని వివరించారు. ప్రపంచ ఆర్థిక, సామాజిక అనిశ్చిత పరిస్థితుల్లో భారత్ నిలకడ, నమ్మకాల దిక్సూచిలా అవతరించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే మొబైల్ ఫోన్ల తయారీలో రెండో పెద్ద దేశంగా భారత్ నిలుస్తున్నదని వెల్లడించారు. గత దశాబ్దంలో దేశీ కమ్యూనికేషన్ పరిశ్రమ సొంత బాటలో పరివర్తన చెందినట్లు తెలియజేశారు. సొంతంగా పూర్తి 4జీ టెక్నాలజీని అభివృద్ధి చేయడంతోపాటు.. వచ్చే ఏడాది మధ్యలో మార్కెట్లోకి ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. దేశీయంగా టెక్నాలజీ డిజైన్, అభివృద్ధి, అమలును చేపట్టినట్లు తెలియజేశారు. గ్లోబల్ ప్రమాణాలను అనుసరించడంతోపాటు.. రానున్న రోజుల్లో భారత్ సొంతంగా ప్రపంచానికి ప్రమాణాలను నిర్దేశించనున్నట్లు అభిప్రాయపడ్డారు.



ఇషాన్ శతకం



- భారత్ 'సి' తొలి ఇన్నింగ్స్ 357/5
- రాణించిన ఇంద్రజిత్
- భారత్ 'బి'తో దులీప్ ట్రోఫీ మ్యాచ్

సాక్షి, అనంతపురం: యువ ఆటగాడు ఇషాన్ కిషన్ (126 బంతుల్లో 111; 14 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీతో చెలరేగాడు. ఫలితంగా అనంతపురంలో భారత్ 'బి' జట్టుతో గురువారం మొదలైన దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ మ్యాచ్‌లో భారత్ 'సి' జట్టు భారీ స్కోరు దిశగా సాగుతోంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 'సి' జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 79 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 357 పరుగులు చేసింది. ఫస్ట్‌క్లాస్ క్రికెట్ పునరాగమనంలో ఆడిన తొలి మ్యాచ్‌లోనే ఇషాన్ కిషన్ శతక్కొట్టగా... మిగతా బ్యాటర్లు కూడా విలువైన పరుగులు చేయడంతో భారత్ 'సి' జట్టు మెరుగైన స్కోరు చేయగలిగింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (50 బంతుల్లో 46 బ్యాటింగ్; 7 ఫోర్లు, 2 సిక్సర్లు), సాయి సుదర్శన్ (75 బంతుల్లో 43; 8 ఫోర్లు), రజత్ పాటిదార్ (67 బంతుల్లో 40; 8 ఫోర్లు), బాబా ఇంద్రజిత్ (136 బంతుల్లో 78; 9 ఫోర్లు) రాణించారు. మ్యాచ్ ఆరంభంలో రెండు బంతులు ఎదుర్కోగానే మడమ నొప్పితో మైదానాన్ని వీడిన కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్... కోలుకొని తిరిగి క్రీజులో అడుగు పెట్టి అజేయంగా నిలిచాడు. అతడితో పాటు మానవ్ సుతార్ (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. గాయం కారణంగా దులీప్ ట్రోఫీ తొలి రౌండ్ మ్యాచ్‌కు అందుబాటులో లేకుండా పోయిన ఇషాన్ కిషన్... రెండో రౌండ్ మ్యాచ్‌లో చక్కటి ఆటతీరు కనబర్చాడు. ఇంద్రజిత్‌తో కలిసి మూడో వికెట్‌కు 189 పరుగులు జోడించి జట్టును పటిష్ట స్థితికి చేర్చాడు. ఇటీవల బుచ్చిబాబు టోర్నమెంట్‌లో జార్ఖండ్ తరఫున సెంచరీతో చెలరేగిన ఇషాన్ కిషన్... ఇక్కడే అదే జోరు కొనసాగించాడు. భారత్ 'బి' బౌలర్లలో ముఖేశ్ కుమార్ 3 వికెట్లు పడగొట్టగా... నవ్‌దీప్ సైనీ, రాహుల్ చహర్ చెరో వికెట్ తీశారు.

స్కోరు వివరాలు

భారత్ 'సి' తొలి ఇన్నింగ్స్: రుతురాజ్ గైక్వాడ్ (బ్యాటింగ్) 46; సాయి సుదర్శన్ (సి) నవ్‌దీప్ సైనీ (బి) ముకేశ్ కుమార్ 43; రజత్ పాటిదార్ (బి) నవ్‌దీప్ సైనీ 40; ఇషాన్ కిషన్ (బి) ముకేశ్ కుమార్ 111; బాబా ఇంద్రజిత్ (బి) రాహుల్ చాహర్ 78; అభిషేక్ పొరేల్ (ఎల్బీడబ్ల్యూ) ముకేశ్ కుమార్ 12; మానవ్ సుతార్ (బ్యాటింగ్) 8; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (79 ఓవర్లలో 5 వికెట్లకు) 357. వికెట్ల పతనం:** 1-96, 2-97, 3-286, 4-311, 5-345. **బౌలింగ్:** ముకేశ్ కుమార్ 21-3-76-3; నవ్‌దీప్ సైనీ 17-2-78-1; వాషింగ్టన్ సుందర్ 10-0-55-0; నితీశ్ కుమార్ రెడ్డి 14-2-58-0; సాయికిశోర్ 12-0-46-0; రాహుల్ చహర్ 5-0-35-1.

ఆదుకున్న ములానీ


షమ్స్ ములానీ

సాక్షి, అనంతపురం: ఆల్‌రౌండర్ షమ్స్ ములానీ (174 బంతుల్లో 88 బ్యాటింగ్; 8 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. దీంతో దులీప్ ట్రోఫీలో భాగంగా భారత్ 'డి'తో గురువారం మొదలైన రెండో రౌండ్ మ్యాచ్‌లో భారత్ 'ఎ' జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 82 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది. ప్రధాన ఆటగాళ్లు విఫలమైన చోట... ములానీ చక్కటి ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ 'ఎ' జట్టుకు శుభారంభం దక్కలేదు. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (7)తో పాటు మరో ఓపెనర్ ప్రథమ్ సింగ్ (7) సింగిల్ డిజిట్‌కే పరిమితం కావడంతో 21 పరుగులకే ఆ జట్టు రెండు వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత హైదరాబాద్ ఆటగాడు తిలక్ వర్మ (10), రియాన్ పరాగ్ (37; 5 ఫోర్లు, ఒక సిక్సర్), శాశ్వత్ రావత్ (15) **ఎక్కువసేపు నిలవలేకపోయారు.** దీంతో భారత్ **'ఎ' జట్టు 93 పరుగులకే** ఐదు వికెట్లు **కోల్పోయింది. కాసేపటికే** కుమార్ కుశాగ్ర **(28) కూడా వెనుదిరి**గాడు. ఈ దశలో **తనుశ్ కొటియాన్** (53; 6 ఫోర్లు, **ఒక సిక్సర్)తో** కలిసి షమ్స్ **ములానీ** ఇన్నింగ్స్‌ను చక్క**దిద్దాడు.** టాపార్డర్ సత్తా **చాటలే**కపోయిన చోట **నం**యమనంతో క్రీజులో నిలిచి ఒక్కో పరుగు జోడిస్తూ స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. అతడికి తనుశ్ నుంచి చక్కటి సహకారం లభించింది. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 91 పరుగులు జోడించారు. ఆట ముగిసే సమయానికి షమ్స్ ములానీతో పాటు ఖలీల్ అహ్మద్ (15 బ్యాటింగ్; 3 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు.

స్కోరు వివరాలు

భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్: ప్రథమ్ సింగ్ (సి) అర్ష్‌దీప్ (బి) విద్వత్ 7; మయాంక్ (సి) సామ్సన్ (బి) విద్వత్ 7; తిలక్ వర్మ (సి) శ్రేయస్ (బి) సారాంశ్ జైన్ 10; రియాన్ పరాగ్ (సి) పడిక్కల్ (బి) అర్ష్‌దీప్ 37; శాశ్వత్ రావత్ (సి) శ్రేయస్ (బి) హర్షిత్ రాణా 15; కుశాగ్ర (సి) యశ్ దూబే (బి) అర్ష్‌దీప్ 28; షమ్స్ ములానీ (బ్యాటింగ్) 88; తనుశ్ (సి) అర్ష్‌దీప్ (బి) సౌరభ్ 53; ప్రసిద్ధ్ కృష్ణ (సి) (సబ్) శ్రీకర్ భరత్ (బి) హర్షిత్ రాణా 8; ఖలీల్ అహ్మద్ (బ్యాటింగ్) 15; **ఎక్స్‌ట్రాలు:** 20; **మొత్తం: (82 ఓవర్లలో 8 వికెట్లకు)** 288. **వికెట్ల పతనం:** 1-18, 2-21, 3-65, 4-69, 5-93, 6-144, 7-235, **బౌలింగ్:** హర్షిత్ రాణా 16-4-49-2; విద్వత్ 14-5-30-2; అర్ష్‌దీప్ 18-3-73-2; సారాంశ్ జైన్ 14-3-55-1; సౌరభ్ కుమార్ 20-1-65-1.

'డైమండ్' మెరుపులకు 'సై'



- నేడు, రేపు డైమండ్ లీగ్ మీట్ ఫైనల్స్
- భారత్ నుంచి బరిలో నీరజ్, అవినాశ్ సాబ్లే

బ్రసెల్స్ (బెల్జియం): అథ్లెటిక్స్ ప్రపంచంలో ప్రతిష్టాత్మక ఈవెంట్ అయిన డైమండ్ లీగ్ మీట్ ఫైనల్స్‌కు రంగం సిద్ధమైంది. శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో అగ్రశ్రేణి అథ్లెట్లంతా తమ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. ముఖ్యంగా ఇటీవల పారిస్ ఒలింపిక్స్ పతకాలతో మెరిసిన ఆటగాళ్లంతా మళ్లీ తమ స్థాయిని ప్రదర్శించాలని పట్టుదలగా ఉన్నారు. పోటీ పడేందుకు ఈ ఏడాది మొత్తం 14 డైమండ్ లీగ్ సిరీస్‌లు అందుబాటులో ఉండగా... తాము ఎంచుకున్న సిరీస్‌లలో పాల్గొనడం ద్వారా సాధించిన పాయింట్లతో ఆటగాళ్లు ఫైనల్‌కు అర్హత సాధించారు. ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లు కలిపి మొత్తం 32 అంశాల్లో పతకాలు గెలిచేందుకు అవకాశం ఉంది. పోల్‌వాల్ట్‌లో ప్రపంచ రికార్డు సృష్టించిన అర్మాండ్ డుప్లాంటిస్ (స్వీడన్), అమెరికా స్ప్రింటర్ ష కారీ రిచర్డ్సన్, స్టార్ హర్డ్‌లర్ సిడ్నీ మెక్‌లాలిన్, లాంగ్ డిస్టెన్స్ రన్నర్ ఫెయిత్ కిప్యెగాన్ లాంటి టాప్ ప్లేయర్లు ఫైనల్లో బరిలోకి దిగుతున్నారు. లెట్సిల్ టెబొగో (బోట్స్‌వానా), ర్యాన్ క్రౌజర్, యరస్లావా మహుచిక్ తదితరులు కూడా తుది సమరంలో పోటీ పడుతున్నారు. ఓవరాల్‌గా 18 మంది ఒలింపిక్ విజేతలు ఇక్కడ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుండటం విశేషం. 50 వేల సామర్థ్యం గల కింగ్ బౌదిన్ స్టేడియంలో పోటీలు నిర్వహిస్తారు. ఇక్కడ విజేతగా నిలిచిన వారికి డైమండ్ లీగ్ ట్రోఫీతో 30 **వేల డాలర్ల ప్రైజ్** మనీ, వచ్చే **ఏడాది జపాన్‌లో** జరిగే **వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు వైల్డ్ కార్డ్ ఎంట్రీ లభిస్తుంది. అగ్రశ్రేణి అథ్లెట్ల ఆటతో రెండు** రోజుల పాటు ప్రపంచవ్యాప్తంగా అభిమానులకు మరింత వినోదం ఖాయం.

నేడు సాబ్లే... రేపు నీరజ్

డైమండ్ లీగ్ ఫైనల్‌లో భారత్ నుంచి ఇద్దరు అథ్లెట్స్ పోటీ పడుతుండటం ఇదే తొలిసారి కావడం విశేషం. 3000 మీటర్ల స్టీపుల్ చేజ్‌లో జాతీయ రికార్డు సాధించిన అవినాశ్ సాబ్లే ఈ పోటీల్లో బరిలో నిలిచాడు. నేటి రాత్రి 12.30 గంటలకు అతని ఈవెంట్ మొదలవుతుంది. ఈ ఏడాది పారిస్, సిలేసియాలలో జరిగిన సిరీస్‌లలో పాల్గొన్న సాబ్లే మొత్తం 3 పాయింట్లతో 14వ స్థానంలో నిలిచాడు. ఫైనల్లో 12 మంది మాత్రమే పోటీ పడే అవకాశం ఉంది. అయితే తనకంటే మెరుగైన స్థానంలో నిలిచిన నలుగురు అథ్లెట్లు తప్పుకోవడంతో సాబ్లేకు చాన్స్ లభించింది. మరోవైపు భారత దిగ్గజ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఫైనల్‌కు అర్హత సాధించడంలో ఎలాంటి ఇబ్బందీ ఎదురు కాలేదు. దోహా, లుసాన్ సిరీస్‌లలో పాల్గొన్న అతను మొత్తం 14 పాయింట్లు సాధించి ఓవరాల్‌గా నాలుగో స్థానం సాధించాడు. గత ఏడాది డైమండ్ లీగ్‌లో చోప్రా రన్నరప్‌గా నిలిచాడు. రేపు అర్ధరాత్రి 12 గంటల నుంచి నీరజ్ చోప్రా ఈవెంట్ జరుగుతుంది. జ్యూరిక్ (స్విట్జర్లాండ్)లో జరిగిన 2022 డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో నీరజ్ చోప్రా విజేతగా... యూజీన్ (అమెరికా)లో జరిగిన 2023 డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో నీరజ్ రన్నరప్‌గా నిలిచాడు.


హంపి

'మహిళల టోర్నీల సంఖ్య పెంచాలి'

- లేదంటే రాబోయే రోజుల్లో చెస్ ప్లేయర్లు కనిపించరు
- అమ్మగా మారాక ఆట మారింది
- భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి మనోగతం

న్యూఢిల్లీ: మహిళల చెస్‌కు మన దేశంలో మరింత ప్రోత్సాహం అందించాలని, లేదంటే రాబోయే రోజుల్లో మంచి ప్లేయర్లు రావడం తగ్గిపోతుందని భారత అగ్రశ్రేణి చెస్ క్రీడాకారిణి, వరల్డ్ ర్యాపిడ్ మాజీ చాంపియన్ కోనేరు హంపి అభిప్రాయపడింది. ఇందులో భాగంగా ఎక్కువ సంఖ్యలో టోర్నీలు నిర్వహించాలని ఆమె సూచించింది. ఇటీవలి కాలంలో గుకేశ్, ప్రజ్ఞానంద తదితరుల ఆటతో పురుషుల విభాగంలో చెస్‌కు ప్రాచుర్యం బాగా పెరిగింది. అయితే మహిళల విభాగంలో మాత్రం పరిస్థితి అలా లేదు. ఇప్పటికి 37 ఏళ్ల హంపి, 33 ఏళ్ల ద్రోణవల్లి హారికలే ప్రపంచ వేదికపై మన చెస్‌ను నడిపిస్తున్నారు. 'మహిళా చెస్ ప్లేయర్ల శాతం చాలా తక్కువగా ఉంది. మనం మరిన్ని మహిళా టోర్నీలు నిర్వహించాలని నా అభిప్రాయం. ప్రతిభావంతులను గుర్తించి వారికి శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. చెస్ భవిష్యత్తు కోసం ఇది ఎంతో ముఖ్యం. లేదంటే ఇద్దరు, ముగ్గురికి మించి టాప్ ప్లేయర్లు ఉండరు. రాబోయే తరంపై దృష్టి పెట్టకపోతే చెస్ ఆటగాళ్లు వెలుగులోకి రావడం కష్టంగా మారి అంతరం చాలా పెరిగిపోతుంది. వచ్చే 10-15 ఏళ్లలో కూడా మీకు మంచి ఆటగాళ్లు కనిపించరు' అని హంపి ఆందోళన వ్యక్తం చేసింది.

చైనాను చూసి నేర్చుకోవాలి

భవిష్యత్ ఆటగాళ్లను ఎలా తయారు చేసుకోవాలనే విషయంలో చైనాను చూసి భారత్ ఎంతో నేర్చుకోవాలని హంపి వ్యాఖ్యానించింది. సోవియట్ యూనియన్ విడిపోయిన తర్వాత చైనా చెస్‌లో పవర్‌హౌస్‌గా ఎదిగిన విషయాన్ని ఆమె గుర్తు చేసింది. 'ఈ విషయంలోనే భారత్, చైనాకు మధ్య చాలా తేడా ఉంది. చైనాలో ఒకరి తర్వాత మరొకరు కొత్త ప్లేయర్ వెంటవెంటనే వచ్చేస్తుంటారు. ఒక అగ్రశ్రేణి ప్లేయర్ కెరీర్ ముగుస్తున్న దశలో కొత్త తరం ఆటగాళ్లు సిద్ధంగా ఉంటారు. మన దేశంలో మహిళల చెస్‌పై ఫెడరేషన్ మరింత దృష్టి పెట్టాలి' అని హంపి పేర్కొంది. కోవిడ్ సమయంలో ఇతర క్రీడా పోటీలన్నీ దాదాపుగా రద్దు కాగా... ఆన్‌లైన్ టోర్నీల కారణంగా చెస్ మాత్రమే బాగా ప్రజాదరణ పొందిందని హంపి చెప్పింది. 'కోవిడ్ సమయాన్ని సానుకూలంగా వాడుకున్న క్రీడ చెస్ మాత్రమే. ఆ సమయంలో పెద్ద సంఖ్యలో ఆన్‌లైన్ టోర్నీలు జరిగాయి. ఇతర పనులేవీ లేకపోవడంతో ప్రేక్షకుల సంఖ్య కూడా పెరిగింది. ఆ సమయంలో మన దేశంలో చెస్ దూసుకుపోయింది. ప్రజ్ఞానంద, అర్జున్ ఇరిగేశి లాంటివారు కూడా కోవిడ్ సమయంలో పెద్ద సంఖ్యలో టోర్నీలు ఆడారు. తర్వాతి రోజుల్లో ఇదే జోరును కొనసాగించి వారి రేటింగ్‌ను మెరుగుపర్చుకున్నారు' అని హంపి విశ్లేషించింది.

సరైన ప్రాక్టీస్ లేకనే...

తన కూతురి వయసు పెరుగుతుండటంతో చెస్‌కు ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నానని హంపి వెల్లడించింది. 'పాపకు ఇప్పుడు ఏడేళ్లు. ఆమెకు ఏడాది వయసు ఉన్నప్పుడైతే ఇంట్లో అమ్మ దగ్గర వదిలి టోర్నీలకు వెళ్లిపోయేదాన్ని. ఇప్పుడు అలా సాధ్యం కావడం లేదు. స్కూల్ హోమ్‌వర్క్, ఆటలు... ఎక్కడైనా నేను తనతో ఉండాలని ఆమె కోరుకుంటోంది. దాంతో ప్రాక్టీస్‌కు సమయం లభించక టోర్నీలకు దూరమవుతున్నా. అయితే అమ్మగా మారిన తర్వాత నా ఆలోచనల్లో చాలా మార్పు వచ్చింది. అంతకు ముందు చిన్నపాటి అంతరాయం వచ్చినా నా ఏకాగ్రత చెదిరిపోయేది. ఇప్పుడు అలా కాదు. గతంలో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతోనే ఆడేదాన్ని. ఇప్పుడు స్థితప్రజ్ఞత వచ్చింది' అని ఈ ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ వివరించింది. ప్రస్తుతం బుడాపెస్ట్‌లో జరుగుతున్న ఒలింపియాడ్‌కు దూరంగా ఉన్న హంపి త్వరలో జరిగే గ్లోబల్ చెస్ లీగ్‌లో ముంబా మాస్టర్స్ తరఫున బరిలోకి దిగనుంది. ఆ తర్వాత కజకిస్తాన్‌లో జరిగే మహిళల గ్రాండ్‌ప్రి, టాటా స్టీల్ ర్యాపిడ్, బ్లిట్జ్ ఈవెంట్లలో ఆడుతుంది.

మను భాకర్‌కు విశ్రాంతి

ప్రపంచకప్ షూటింగ్ ఫైనల్ టోర్నీకి భారత జట్టు ఎంపిక



న్యూఢిల్లీ: వచ్చే నెల భారత్‌లో జరిగే సీజన్ ముగింపు టోర్నమెంట్ ప్రపంచకప్ ఫైనల్స్‌లో మను భాకర్ పాల్గొనడం లేదు. ఆమె మూడు నెలల పాటు విశ్రాంతి తీసుకోవాలని నిర్ణయించుకుంది. పారిస్ ఒలింపిక్స్‌లో ఆమె రెండు కాంస్య పతకాలు సాధించింది. జాతీయ రైఫిల్ సంఘం (ఎన్ఆర్ఏఐ) గురువారం 23 మంది సభ్యుల భారత షూటింగ్ జట్టును ఎంపిక చేసింది. ఇందులో పారిస్‌కు వెళ్లొచ్చిన తొమ్మిది మంది షూటర్లున్నారు. అయితే మొత్తం 23 మందిలో ఒక్క రిథమ్ సాంగ్వాన్ మాత్రమే రెండు ఈవెంట్లలో పోటీపడనుంది. ఆమె మహిళల 10 మీటర్ల, 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్లలో తలపడుతుంది. మిగతా వారంతా ఒక ఈవెంట్‌కే పరిమితం కానున్నారు. వచ్చే నెల 13 నుంచి 18 వరకు ఢిల్లీలోని డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్‌లో ప్రపంచకప్ షూటింగ్ పోటీలు జరుగనున్నాయి. రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తారు.

భారత జట్టు వివరాలు

పురుషుల విభాగం: దివ్యాన్ష్ సింగ్, అర్జున్ బబుతా (ఎయిర్ రైఫిల్), చైన్ సింగ్, అఖిల్ షెరాన్ (50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్), అర్జున్ సింగ్, వరుణ్ తోమర్ (ఎయిర్ పిస్టల్), అనీష్, విజయ్‌వీర్ (25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్), వివాన్ కపూర్, భౌనీశ్ (ట్రాప్), అనంత్‌జీత్ సింగ్, మేరాజ్ అహ్మద్ ఖాన్ (స్కీట్).

మహిళల విభాగం: సోనమ్, తిలోత్తమ సేన్ (ఎయిర్ రైఫిల్), ఆశి చౌక్సీ, నిశ్చల్ (50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్), రిథమ్ సాంగ్వాన్, సురభి రావు (ఎయిర్ పిస్టల్), రిథమ్, సిమ్రన్‌ప్రీత్ కౌర్ (25 మీ. స్పోర్ట్స్ పిస్టల్), రాజేశ్వరి కుమారి, శ్రేయసి సింగ్ (ట్రాప్), గనీమత్ సెఖోన్, మహేశ్వరి చౌహాన్ (స్కీట్).



రష్మిక ముందంజ

పెర్త్ (ఆస్ట్రేలియా): అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ75 టోర్నీలో భారత మూడో ర్యాంకర్, హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ 374వ ర్యాంకర్ రష్మిక 6-3, 7-5తో గాబ్రియేలా (ఆస్ట్రేలియా)పై గెలిచింది. గంటా 42 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది.

హెడ్ దూకుడు: తొలి టి20లో ఆసీస్ గెలుపు

సౌతాంప్టన్: ఓపెనర్ ట్రావిస్ హెడ్ (23 బంతుల్లో 59; 8 ఫోర్లు, 4 సిక్సర్లు) విజృంభించడంతో ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా ఘనవిజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం అర్ధరాత్రి దాటాక జరిగిన తొలి టి20లో ఆస్ట్రేలియా 28 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తుచేసింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆసీస్ 19.3 ఓవర్లలో 179 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్, మాథ్యూ షార్ట్ (26 బంతుల్లో 41; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) వీర విహారం చేయడంతో ఆస్ట్రేలియా జట్టు పవర్‌ప్లే (6 ఓవర్లు) లోపే వికెట్ నష్టపోకుండా 86 పరుగులు చేసింది. ఇంగ్లండ్ పేస్ ఆల్‌రౌండర్ సామ్ కరన్ వేసిన ఐదో ఓవర్‌లో హెడ్ వరుసగా 4,4,6,6,6,4 బాది మొత్తం 30 పరుగులు రాబట్టాడు. ఈ జోరు చూస్తుంటే... ఆసీస్ మరింత భారీ స్కోరు ఖాయమే అనిపించినా... స్పిన్నర్ల రంగప్రవేశంతో కంగారూల స్కోరు వేగానికి బ్రేక్‌లు పడ్డాయి. తక్కిన వాళ్లలో జోష్ ఇంగ్లిస్ (27 బంతుల్లో 37; 2 ఫోర్లు, ఒక సిక్సర్) ఫర్వాలేదనిపించగా... కెప్టెన్ మిషెల్ మార్ష్ (2), మార్కస్ స్టొయినిస్ (10), టిమ్ డేవిడ్ (0), కామెరూన్ గ్రీన్ (13) విఫలమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో లివింగ్‌స్టోన్ 3... జోఫ్రా ఆర్చర్, సాఖిబ్ మహమూద్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ జట్టు 19.2 ఓవర్లలో 151 పరుగులకు ఆలౌటైంది. లివింగ్‌స్టోన్ (37) టాప్ స్కోరర్ కాగా... ఫిల్ సాల్ట్ (20), విల్ జాక్స్ (6), జోర్డాన్ కాక్స్ (17), జాకబ్ బెథెల్ (2), సామ్ కరన్ (18), జేమీ ఓవర్టన్ (15), ఆర్చర్ (4) విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో సీన్ అబాట్ 3... హాజల్‌వుడ్, ఆడమ్ జంపా చెరో రెండు వికెట్లు తీశారు. ట్రావిస్ హెడ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య శుక్రవారం రెండో టి20 జరగనుంది.



భారత్‌తో టెస్టు సిరీస్‌కు బంగ్లాదేశ్ జట్టు ప్రకటన

ఢాకా: భారత్‌లో పర్యటించే బంగ్లాదేశ్ క్రికెట్ జట్టును గురువారం ప్రకటించారు. గజ్జల్లో గాయంతో బాధపడుతున్న లెఫ్టార్మ్ పేసర్ షోరిఫుల్ ఇస్లామ్ ఈ జట్టుకు అందుబాటులో లేడు. షోరిఫుల్ స్థానంలో కొత్తగా బ్యాటర్ జాకీర్ అలీని తీసుకున్నారు. తొలిటెస్టు ఈ నెల 19 నుంచి చెన్నైలో, రెండో టెస్టు 27 నుంచి కాన్పూర్‌లో జరుగుతుంది.

బంగ్లాదేశ్ టెస్టు జట్టు: నజ్ముల్ హొస్సేన్ శాంటో (కెప్టెన్), షాద్‌మన్ ఇస్లామ్, జాకీర్ హసన్, మోమినుల్, ముష్ఫికర్, షకీబుల్ హసన్, లిటన్ దాస్, మెహదీ హసన్ మిరాజ్, జాకీర్ అలీ, తస్కిన్ అహ్మద్, నహిద్ రాణా, తైజుల్ ఇస్లామ్, మెహముదుల్ హసన్, నయీమ్, ఖాలిద్ అహ్మద్.

సాక్షి ప్లస్
శుక్రవారం । 13-9-2024

భారత సంతతి ఇజ్రాయెల్ సైనికుడు మృతి

జెరూసలేం: ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో బుధవారం జరిగిన ఘటనలో భారత సంతతికి చెందిన ఇజ్రాయెల్ సైనికుడొకరు ప్రాణాలు కోల్పోయారు. బెయిట్ ఎల్ నివాస ప్రాంతంలోని అసాఫ్ జంక్షన్ వద్ద ఆర్మీ పోస్ట్ వద్ద విధుల్లో ఉన్న స్టాఫ్ సార్జెంట్ గెరి గిడియోన్ హంఘాల్(24)ను ఓ మిలిటెంట్ ట్రక్కుతో వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఘటనలో హంఘాల్ అక్కడికక్కడే చనిపోయారు. మిలిటెంట్‌ను రఫాకు చెందిన హాయిల్ ధయిఫల్లాహ్(52)గా గుర్తించారు. నోఫ్ హగలిల్ ప్రాంతానికి చెందిన హంఘాల్ కెఫిర్ బ్రిగేడ్‌లోని నహ్‌షోన్ బటాలియన్‌లో పనిచేస్తున్నారు. బినెయి మెనాషె వర్గం యూదులు భారత్‌లోని మణిపూర్, మిజోరం రాష్ట్రాల్లో ఉంటున్నారు. వీరిలో 5వేల మంది ఇప్పటికే ఇజ్రాయెల్‌లో స్థిరపడగా, మరో 5,500 మంది అదే బాటలో ఉన్నారు. హంఘాల్ కుటుంబం 2020లో ఇజ్రాయెల్‌కు వెళ్లిపోయింది. యూదుల్లో అత్యంత పురాతనమైన వర్గంగా బినెయి మెనాషె శాఖను అక్కడి మత పెద్దలు గుర్తించారు.

టీఎంసీ ఎమ్మెల్యేను ప్రశ్నించిన సీబీఐ

కోల్‌కతా: ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీలో పీజీ ట్రైనీ డాక్టర్ హత్యాచారం కేసులో తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే సుదీప్తో రాయ్‌ను సీబీఐ ప్రశ్నించింది. సుదీప్తో రాయ్ స్వయంగా డాక్టరే కాకుండా ఆర్.జి.కర్. ఆసుపత్రి పేషెంట్స్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు కూడా. సీబీఐ అధికారులు గురువారం మధ్యాహ్నం రాయ్ ఇంటికి చేరుకొని.. ఆయనను విచారించారు. 'సీబీఐ అధికారులు నన్ను ప్రశ్నించడానికి వచ్చారు. నేను వారికి సహకరించారు' అని సుదీప్తో రాయ్ తెలిపారు. ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీలో ఆగస్టు 9న వైద్యురాలిని రేప్ చేసి, హత్య చేసిన విషయం తెలిసిందే.

బ్యాగ్ కలకలం: ఆర్.జి.కర్ ఆసుపత్రి ప్రాంగణంలో ఎవరో వదిలేసిన బ్యాగ్ గురువారం తీవ్ర కలకలం రేపింది. బాంబు డిస్పోజల్ స్క్వాడ్, పోలీసు శునకాలు అక్కడికి చేరుకొని తనిఖీలు చేపట్టాయి. ప్రమాదకరమైన వస్తువులేమీ లభించలేదని పోలీసులు తెలిపారు. జూనియర్ డాక్టర్లు నిరసన దీక్షకు దిగిన ప్రదేశంలో ఈ బ్యాగ్ కనిపించింది. అయితే జూడాలు ప్రస్తుతం అక్కడ లేరు. స్వాస్థ్య భవన్ (ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయం) వద్ద బైఠాయించారు.

లాలుకు ముంబైలో యాంజియోప్లాస్టీ

ముంబై: రాష్ట్రీయ జనతా దళ్(ఆర్‌జేడీ)చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్(76)కు ముంబైలోని ఆసియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో యాంజియోప్లాస్టీ జరిగింది. మంగళవారం ఆస్పత్రిలో చేరిన ఆయనకు బుధవారం డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ తిలక్ సువర్ణ యాంజియోప్లాస్టీ చేసినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఒకట్రెండు రోజుల్లో లాలును డిశ్చార్జి చేస్తామని వెల్లడించాయి. బిహార్ మాజీ సీఎం, కేంద్ర మాజీ మంత్రి కూడా అయిన లాలు ఇదే ఆస్పత్రిలో 2014లో గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స చేయించుకున్నారు.

బిహార్ అసెంబ్లీలోని అన్ని సీట్లకూ పోటీ చేస్తాం

- ప్రకటించిన ప్రశాంత్ కిశోర్

పుర్నియా: వచ్చే ఏడాది బిహార్ అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో తమ జన్ సురాజ్ పార్టీ మొత్తం 243 సీట్లలోనూ అభ్యర్థులను బరిలో నిలుపుతుందని ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ప్రకటించారు. జన్ సురాజ్‌కు నెల రోజుల్లోగానే రాజకీయ పార్టీగా గుర్తింపు లభించనుందని చెప్పారు. అక్టోబర్ 2వ తేదీన పార్టీ ఏర్పాటును అధికారికంగా ప్రకటిస్తామన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన గంటలోనే రాష్ట్రంలో మద్య నిషేధాన్ని ఎత్తివేస్తామని చెప్పారు. నిషేధం కారణంగా రాష్ట్రం ఏటా రూ.20 వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోతుందని, ప్రస్తుతం అమలవుతున్న మద్య నిషేధం వట్టి బూటకమని వ్యాఖ్యానించారు.

భారత్, చైనా సరిహద్దుల్లో సైనికీకరణ ఆందోళనకరం

- విదేశాంగ మంత్రి జైశంకర్

జెనీవా: తూర్పు లద్దాఖ్‌లో భారత్–చైనా సరిహద్దులో నాలుగేళ్ల క్రితం మొదలైన ఉద్రిక్తతలను తగ్గించడానికి ప్రయత్నాలు ఊపందుకున్నాయని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు. వివాదాస్పద సరిహద్దు ప్రాంతాల నుంచి ఇరుదేశాల సైన్యం వెనక్కి వెళ్లిపోయే విషయంలో చైనాతో నెలకొన్న సమస్యలు 75 శాతం పరిష్కారమైనట్లు తెలిపారు. చేయాల్సింది ఇంకా మిగిలే ఉందని పేర్కొన్నారు. గురువారం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఓ చర్చా కార్యక్రమంలో జైశంకర్ మాట్లాడారు. 2020లో జరిగిన గల్వాన్ లోయ ఘర్షణలు భారత్–చైనా సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపాయని పేర్కొన్నారు. సరిహద్దుల్లో శాంతియుత పరిస్థితులు ఉంటేనే ఇరుదేశాల మధ్య సంబంధాలు బలపడతాయని ఉద్ఘాటించారు. భారత్, చైనా సైన్యం మధ్య ఘర్షణలకు పూర్తిగా తెరదించడానికి నాలుగేళ్లుగా చర్చలు జరుగుతున్నాయని వివరించారు. తూర్పు లద్దాఖ్‌లో సరిహద్దుల వెంబడి భారత్, చైనా సైన్యం వెనక్కి వెళ్తుండగా, మరోవైపు అక్కడ మిగిలి ఉన్న రెండు దేశాల సేనలు ఎదురెదురుగా సమీపంలోకి వస్తుండడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. సరిహద్దుల్లో సైనికీకరణ జరుగుతోందని వెల్లడించారు. ఈ సమస్యను కచ్చితంగా పరిష్కరించాల్సి ఉందన్నారు.

సేనలను పూర్తిగా ఉపసంహరించుకోవాలని భారత్, చైనా నిర్ణయం

తూర్పు లద్దాఖ్‌లో వివాదాస్పద సరిహద్దుల నుంచి తమ సేనలను సాధ్యమైనంత త్వరగా పూర్తిగా ఉపసంహరించుకోవాలని భారత్, చైనా నిర్ణయించుకున్నాయి. ఈ దిశగా ప్రయత్నాలను వేగవంతం, రెట్టింపు చేయాలని తీర్మానించుకున్నాయి. భారత భద్రతా సలహాదారు అజిత్ దోవల్ గురువారం రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో సమావేశమయ్యారు. సరిహద్దుల్లో శాంతి, సామరస్యం నెలకొనాలని తాము కోరుకుంటున్నామని అజిత్ దోవల్ ఈ సందర్భంగా తేల్చిచెప్పారు. వాస్తవాధీన రేఖను(ఎల్‌ఏసీ)ని గౌరవించాలని వాంగ్ యీకి సూచించారు. భారత్, చైనా మధ్య సంబంధాలు సాధారణ స్థితికి చేరుకోవాలంటే ఎల్‌ఏసీని గౌరవించాల్సిందేనని స్పష్టంచేశారు.

ఈ వృద్ధ మహిళలు రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న క్వీనీ హాల్(100), డొరోతియా బరోన్(99). వందో పుట్టిన రోజు సందర్భంగా ట్యాక్సీ చారిటీ ఫర్ మిలటరీ వెటరన్స్ సంస్థ స్పిట్ ఫైర్ యుద్ధ విమానంలో గురువారం వీరిద్దరినీ గగన విహారం చేయించింది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో సింగిల్ సీట్ స్పిట్ ఫైర్ విమానాలు బ్రిటన్ విజయంలో కీలకంగా ఉన్నాయి.



నీకూ ఆర్.జి.కర్ వైద్యురాలి గతే

- కోల్‌కతాలో వైద్యురాలికి బెదిరింపు

కోల్‌కతా: ఆర్.జి.కర్ ఆసుపత్రిలో మెడికోకు ఎదురైన గతే నీకూ పడుతుందని ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యురాలిని బెదిరించిన ఘటన కోల్‌కతాలో చోటుచేసుకుంది. 58 ఏళ్ల మహిళ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, పలు మానసిక రుగ్మతలతో సోమవారం ప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. ఆమె కుమారుడు, అతని స్నేహితులు ఆసుపత్రి సిబ్బందిని పలురకాలుగా వేధిస్తున్నారు. పేషెంట్ పరిస్థితి విషమంగా ఉండటంతో తాము సంయమనం పాటిస్తున్నామని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. బుధవారం రాత్రి ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో విధులు నిర్వహిస్తున్న వైద్యురాలిని పేషెంట్ కుమారుడు తీవ్రంగా బెదిరించాడని, ఆర్.జి.కర్ వైద్యురాలికి పట్టిన గతే నీకూ పడుతుందని హెచ్చరించాడని ఆసుపత్రి వర్గాలు వెల్లడించారు. పోలీసులు ఈ ఉదంతంపై దర్యాప్తు చేపట్టారు.

నర్సు ఓల్గా.. ఇంటెన్సివ్ కేర్ యూనిట్ అంతటా విరామం లేకుండా తిరుగుతూనే ఉన్నారు. రోగుల ఆక్సిజన్ స్థాయిలను తనిఖీ చేసి నోట్ చేసుకుంటున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న రోగులను ఓ కంట కనిపెడుతున్నారు. ఓ ఆస్పత్రిలో ఇదో సాధారణ దృశ్యం. కానీ ఆమె పనిచేస్తున్నది నడుస్తున్న రైలులో. వైద్యం అందిస్తున్నది యుద్ధంలో గాయాలపాలైన సైనికులకు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించడానికి ఉక్రెయిన్ ఈ రైలాస్పత్రిని నడుపుతోంది. ఆ దేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో ఇప్పుడిది కీలక భాగంగా మారింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

పట్టాలపై లైఫ్‌లైన్

బోగీలను ఐసీయూలుగా మార్చిన ఉక్రెయిన్ ప్రభుత్వం | **యుద్ధక్షేత్రంలో గాయపడిన సైనికులను ఆస్పత్రులకు తరలింపు** | **సైనికుల ప్రాణాలు కాపాడటంలో ఇప్పుడిదే లైఫ్ లైన్**

రెండు భిన్న దృశ్యాలు..

తొమ్మిది గంటల ప్రయాణం తరువాత రైలాస్పత్రి ఒక నగరంలోని రైల్వేస్టేషన్‌లోకి ప్రవేశించగానే.. అంబులెన్సులు సైనికుల కోసం ఎదురు చూస్తుంటాయి. ఐసీయూలోని నర్సులు సైనికులను ప్లాట్‌ఫామ్‌పై ఎదురుచూస్తున్న వైద్యులకు అప్పగిస్తారు. స్టేషన్ నుంచి అంబులెన్సులు బయల్దేరి వెళ్లాక ఊపిరి పీల్చుకుంటారు. వారికి ఎదురుగా కొత్తగా రిక్రూట్ అయిన సైనికులతో ఓ రైలు బయలుదేరడానికి సిద్ధంగా ఉంటుంది. తల్లిదండ్రులకు వీడ్కోలు పలుకుతూ పిల్లలు కనపడతారు. సాయంత్రానికి ఆ యువసైనికులు అపస్మారక స్థితిలోనో, తీవ్ర గాయాలతోనే అదే రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారు. ఈ రెండు దృశ్యాలకు ప్రత్యక్ష సాక్ష్యులు రైలాస్పత్రి సిబ్బందే. యుద్ధం మిగుల్చుతున్న అంతులేని విషాదమిది. 'యుద్ధ క్షేత్రం నుంచి తీవ్రంగా గాయపడి వచ్చే సైనికులను చూడటం బాధాకరమైన విషయమే. కానీ, వారికి సేవ చేస్తున్నామన్న తృప్తి మాత్రం మాకు మిగులుతుంది'అని చెబుతున్నారు ఐసీయూ నర్సు ఓల్గా. 2015లో సైన్యంలో నర్సుగా చేరిన ఆమె.. 2022 నుంచి యుద్ధంలో గాయపడిన సైనికులకు చికిత్స అందిస్తున్నారు.

అలసిపోయాం..

యుద్ధం చెల్లించుకుంటున్న మూల్యానికి ఈ రైలాస్పత్రి ఓ చిన్న ఉదాహరణ. 'రష్యన్ విసిరిన గ్రైనేడ్‌తో నా చేతులు, భుజాలు, వీపుపై తీవ్ర గాయాలయ్యాయి. పేలుడు శబ్దాలు నా వినికిడి శక్తినే దెబ్బతీశాయి. నేనే కాదు.. చాలా మందికి మనోధైర్యం ఉంది. కానీ చాలా అలసిపోయారు. ఇలాంటప్పుడు ఏదేమైనా కానీ భారమంతా దేవుడిదే అనుకుంటాం'అని చెబుతున్నారు రష్యా డ్రోన్ దాడిలో గాయపడి రైలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 35 ఏళ్ల సైనికుడు. అలసట యుద్ధక్షేత్రంలోని సైనికుల మనోధైర్యాన్ని దెబ్బతీస్తోందనడానికి ఇదో ఉదాహరణ. ఇద్దరు పిల్లల తండ్రి అయిన ఈయన 18 నెలల నుంచి డోనెట్స్క్ ప్రాంతంలోని పదాతిదళంలో యాంటీ ట్యాంక్ గన్నర్‌గా పనిచేస్తున్నారు. ఇన్ని రోజుల్లో కేవలం 45 రోజులు మాత్రమే ఫ్రంట్‌లైన్‌కు దూరంగా ఉన్నారు.



ఐసీయూలో ఓ క్షతగాత్రుడికి పరీక్షలు చేస్తున్న నర్సు



అచ్చం ఆస్పత్రి వార్డుగా మారిన బోగీ

యుద్ధంలో గాయపడిన సైనికుల కోసం తూర్పు ఉక్రెయిన్‌లోని చాలా నగరాల్లోని ఆసుపత్రుల్లో పడకలు లేవు. అవి ఖాళీ చేయడానికి కొందరిని సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లాల్సి వస్తుంది. అంబులెన్సుల్లో సుదూర ప్రయాణంతో సైనికుల ప్రాణాలకే ముప్పుకావచ్చు. రష్యా దాడుల నేపథ్యంలో హెలికాప్టర్ అంబులెన్స్‌లు కూడా ఉపయోగించలేరు. ఈ క్లిష్ట స్థితిలో రైళ్లు సైనికుల ప్రాణాలను కాపాడుతున్నాయి. గాయపడిన సైనికులను ఆస్పత్రికి తీసుకెళ్లేలోగానే ఇందులోని బోగీలు పూర్తి స్థాయి ఇంటెన్సివ్ కేర్ యూనిట్లుగా పనిచేస్తున్నాయి. ఆర్మీ డాక్టర్లు, ఇతర సిబ్బంది సైనికులకు రైలులోనే సేవలు అందిస్తున్నారు. కదులుతున్న రైలులో ఐసీయూ యూనిట్ నడపడం చాలా కష్టమైన పని. అయినా సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. 'ఇక్కడ మా సామర్థ్యం చాలా పరిమితం. ఏదైనా జరిగితే బయటి కన్సల్టెంట్‌ను పిలవలేం. రక్తస్రావాన్ని ఆపడానికి చిన్న చిన్న ఆపరేషన్లు వంటివి చేస్తాం. పెద్ద పెద్ద శస్త్రచికిత్సలు చేయలేం'అని డాక్టర్స్ చీఫ్ ఒకరు తెలిపారు.

పర్యాటక రైలు కాస్తా ఆస్పత్రిగా..

యుద్ధం ప్రారంభంలో ప్రపంచాన్ని ఆకట్టుకున్న ఉక్రెయిన్ సమయస్ఫూర్తికి రైలాస్పత్రి ఒక ఉదాహరణ. 2022 ఫిబ్రవరిలో దేశంపై రష్యా దాడులు ప్రారంభించినప్పుడు ఉక్రెయిన్ వద్ద ఎటువంటి మెడికల్ రైలు బోగీలు లేవు. గాయపడిన సైనికులను సాధారణ రైళ్లలోకి కిటికీల గుండా బలవంతంగా ఎక్కించేవారు. దీనికి పరిష్కారం ఆలోచించిన ఉక్రెయిన్ రైల్వే.. సాధారణ రోజుల్లో పర్యాటకులను కార్పాతియన్ పర్వతాలకు తీసుకెళ్లడానికి ఉపయోగించే రైళ్లను పునరుద్ధరించింది. అలా ఆస్పత్రి రైలుకు రూపకల్పన జరిగిందని ఉక్రెయిన్ రైల్వే ప్యాసింజర్ ఆపరేషన్స్ సీఈఓ ఒలెక్సాండర్ పెర్ట్సోవ్‌స్కీ చెప్పారు.

గంటకు 50 మైళ్ల వేగంతో..

ఈ రైలు గంటకు 80 కిలోమీటర్లు (50 మైళ్లు) వేగంతో ప్రయాణిస్తుంది. సాధారణ రైలు వేగంలో సగమే అయినప్పటికీ ఐసీయూ మాత్రం అటూఇటూ కదిలిపోతూంటుంది. దీంతో పనిచేసేటప్పుడు సిబ్బంది చాలా అదనపు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అంబులెన్స్ రైళ్లను మొదట 1850లలో క్రిమియన్ యుద్ధం సమయంలో ఉపయోగించారు. కానీ ఈ ఆధునిక వెర్షన్లలో వెంటిలేటర్లు, లైఫ్ సపోర్ట్ యంత్రాలు, అల్ట్రాసౌండ్ స్కానర్లు, పోర్టబుల్ ఎయిర్ కండిషనర్లు ఉన్నాయి. ప్రతి క్యారేజీలో నిరంతర విద్యుత్ కోసం జనరేటర్లుంటాయి. బోగీల్లో పిల్లల చిత్రాలు, ఉక్రెయిన్ జాతీయ జెండాలు ఉంటాయి. గాయపడిన సైనికులకు ఇవి కొంత ఓదార్పును అందిస్తాయి.

గాయాల నుంచి ప్రేరణ..

ఈయనకు కొన్ని పడకల దూరంలో కూర్చున్న స్టానిస్లావ్ మూడు నెలల క్రితం స్వచ్ఛందంగా సైన్యంలో చేరారు. అతడున్న కందకంపైన డ్రోన్ దాడి జరగడంతో ఊపిరితిత్తులకు గాయమైంది. పక్కటెముకలు విరిగాయి. అయినా స్టానిస్లావ్ పూర్తి భిన్నమైన మానసిక స్థితిలో కనిపించారు. ''గాయపడ్డాక నాలో ఆత్మస్థైర్యం తగ్గలేదు. నేను మరింత ప్రేరణ పొందాను''అని చిరునవ్వుతో చెబుతున్నారు. యుద్ధంలో ఉక్రెయిన్ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కోట గోడ కూలి.. ఏడుగురు మృతి

దతియా: సుమారు 400 ఏళ్లనాటి కోటగోడ కూలి దాన్ని ఆనుకునే ఉన్న ఇంటిపై పడి ఏడుగురు చనిపోయారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం దతియా పట్టణంలోని ఖల్కాపురా ప్రాంతంలో గురువారం వేకువజామున 4గంటల సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. రాజ్‌గఢ్‌గా స్థానికులు పిలిచే ఈ కోటలో కొంతకాలం మ్యూజియం కూడా నడిచిందని అధికారులు తెలిపారు. ఇటీవలి వర్షాలకు కోట గోడ కూలి పక్కనే ఉన్న ఇంటిపై పడటంతో అందులోని 9 మంది మట్టిదిబ్బల కింద కూరుకుపోయారన్నారు. రక్షణ, సహాయక సిబ్బంది ఆరుగంటలపాటు శ్రమించి వారిని వెలుపలికి తీయగలిగారు. ఏడుగురు చనిపోగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఐదుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు. కాగా, రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఇళ్లు కూలిన ఘటనల్లో మరో నలుగురు చనిపోయారు.

శోభాయాత్రలో ఘర్షణలు..51 మంది అరెస్ట్

- కర్ణాటకలోని నాగమంగళలో ఘటన

నాగమంగళ: కర్ణాటకలోని నాగమంగళలో బుధవారం రాత్రి వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా రెండు వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తాయి. దుండగులు ఊరేగింపుపై రాళ్లు రువ్వారు. ఒక వర్గానికి చెందిన దుకాణాలు, వాహనాలను ధ్వంసం చేయడంతోపాటు నిప్పుపెట్టారు. దుండగుల దాడిలో ఇద్దరు పోలీసులు సైతం గాయపడ్డారు. దీంతో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. మొత్తం 51 మందిని అదుపులోకి తీసుకున్నామని, మరిన్ని బలగాలను ఆ ప్రాంతానికి తరలించామని ఉన్నతాధికారులు గురువారం తెలిపారు. ముందు జాగ్రత్తగా 14వ తేదీ వరకు మాండ్య జిల్లా వ్యాప్తంగా నిషేధాజ్ఞలు విధించారు. నలుగురికి మించి గుమికూడరాదని స్పష్టం చేశారు.

ప్రభుత్వ స్థలంలోని మసీదు భాగాన్ని మేమే కూలుస్తాం

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలోని సంజౌలి మసీదు అంశంలో సానుకూల పరిణామమిది. ప్రభుత్వ స్థలంలో ఉన్న మసీదు భాగాన్ని తామే కూల్చివేస్తామంటూ స్థానిక ముస్లిం సంక్షేమ సంఘం ముందుకు వచ్చింది. సిమ్లా మునిసిపల్ కమిషనర్ భూపేంద్ర అత్రికి గురువారం ఈ మేరకు వినతిపత్రం సమర్పించింది. కమిటీలో మసీదు ఇమామ్‌తోపాటు వక్ఫ్ బోర్డు, మసీదు యాజమాన్య కమిటీ సభ్యులున్నారు. తమపై ఎలాంటి ఒత్తిడీ లేదనీ, దశాబ్దాలుగా ఇక్కడే నివాసముంటున్న తాము శాంతి, సామరస్యంతో అందరితో కలిసిమెలిసి ఉండాలనే ఈ నిర్ణయం తీసుకున్నామని వారు తెలిపారు. 'కోర్టులో ఈ కేసు తేలేవరకు మసీదు నిర్మాణం అనధికారికంగా ఉన్న భాగం వరకు సీల్ వేసి ఉంచుతామనీ, వ్యతిరేకంగా వస్తే స్వయంగా ఆ భాగాన్ని కూలుస్తామని వారు చెప్పారు'అని కమిషనర్ వివరించారు.

మమతతో ఇక వేదిక పంచుకోను: ఆనంద బోస్


కోల్‌కతా: ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో ఇకపై ఎక్కడా వేదికను పంచుకోబోనని పశ్చిమబెంగాల్ గవర్నర్ సి.వి.ఆనంద బోస్ ప్రకటించారు. ఆర్.జి.కర్ ఆసుపత్రి వైద్యురాలి హత్యాచారంపై ప్రజల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహావేశాలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోస్ గురువారం ఒక వీడియో సందేశంలో తెలిపారు. తాను కూడా ముఖ్యమంత్రిని సామాజిక బహిష్కరణ చేస్తున్నట్లు వెల్లడించారు. 'ముఖ్యమంత్రితో నేనెలాంటి ప్రజావేదికను పంచుకోను. రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్నందుకు ఆమెపై క్రియాశీలక చర్యలు చేపడతాను. గవర్నర్‌గా రాజ్యాంగబద్ధంగా పనిచేస్తా' అని ఆనంద బోస్ తెలిపారు. బెంగాల్ ప్రజల పక్షాన నిలుస్తానని, తన అంచనా ప్రకారం ప్రభుత్వం విధినిర్వహణలో విఫలమైందన్నారు.

పెరూ మాజీ అధ్యక్షుడు ఫుజిమోరి కన్నుమూత

లిమా (పెరూ): పెరూ మాజీ అధ్యక్షుడు అల్బెర్టో ఫుజిమోరి బుధవారం రాజధాని లిమాలో కన్నుమూశారు. దీర్ఘకాలంగా క్యాన్సర్‌తో పోరాడి మరణించారని ఆయన కుమార్తె కీకో ఫుజిమోరి 'ఎక్స్'లో ప్రకటించారు. విద్యావేత్త నుంచి పెరూ రాజకీయాల్లోకి మెరుపులా వచ్చిన ఆయన తీసుకొచ్చిన సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టాయి. అవే సంస్కరణలు ఆయన్ను చిక్కుల్లోకీ నెట్టాయి. వామపక్షాల సహకారంతో అధికారంలోకి వచ్చి తిరుగుబాటుదారులపై తీవ్రమైన అణచివేతను అమలు చేశారు. చివరకు దేశం నుంచి పారిపోయి, ఆ తరువాత జైలు పాలై.. తీవ్ర అనారోగ్యం బారిన పడ్డారు. పరిస్థితి విషమించడంతో 86 ఏళ్ల వయసులో మృతి చెందారు. 2026 ఎన్నికల్లో అధ్యక్ష పదవికి మళ్లీ పోటీ చేయాలని తన తండ్రి భావిస్తున్నారంటూ కొన్ని నెలల క్రితం కీకో ప్రకటించడం గమనార్హం.

ఆర్థిక వ్యవస్థ బలోపేతం..

పెరూ స్వాతంత్య్ర దినం 1938 జూలై 28వ తేదీన రాజధాని లిమాలో ఫుజిమోరి జన్మించారు. ఈయన కుటుంబం జపాన్ నుంచి వలస వచ్చింది. గణిత శాస్త్రవేత్త, వ్యవసాయ ఇంజనీర్ అయిన ఫుజిమోరి 1990 ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీ చేయాలని నిర్ణయించుకున్నప్పుడు ఆయనెవరికీ తెలియదు. తన ప్రచార ర్యాలీల్లో ట్రాక్టర్ నడుపుతూ అందరినీ ఆకట్టుకున్నారు. వామపక్షాల భారీ మద్దతుతో ప్రఖ్యాత రచయిత మారియో వర్గాస్ లోసాను ఓడించి అధ్యక్ష పీఠాన్ని దక్కించుకున్నారు. ద్రవ్యోల్బణం తగ్గిస్తానన్న హామీతో అధికారంలోకి వచ్చిన ఫుజిమోరి రెండో వారంలోనే నిత్యావసరాలపై సబ్సిడీలను ఎత్తివేయడం 'ఫుజీ–షాక్'గా పేరుగాంచింది. డజన్ల కొద్దీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించారు. వాణిజ్య సుంకాలను తగ్గించారు. ఆయన చేపట్టిన ఆర్థిక సంస్కరణలు పెరూ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాయి. లాటిన్ అమెరికాలో అత్యంత స్థిరమైన ఆర్థిక వ్యవస్థగా మారడానికి పునాదులు వేశాయి. ఇక స్వేచ్ఛా–మార్కెట్ సంస్కరణలు, కఠినమైన ఉగ్రవాద వ్యతిరేక చట్టాల అమలు కోసం రాజ్యాంగాన్ని పునర్నిర్మించారు.



వ్యతిరేకత.. అణచివేత.. కేసులు..

1992లో పార్లమెంట్‌పైకి యుద్ధ ట్యాంకులను ఉపయోగించడంతో పెరూ ప్రజల్లో ఆయనపై వ్యతిరేకత పెరిగింది. పదేళ్ల పాలనలో అవినీతి కుంభకోణాలు కూడా ప్రజలను ఆయనకు వ్యతిరేకంగా మార్చాయి. అయినా రెండోసారి అధికారంలోకి వచ్చాక తిరుగుబాటుదారులపై తీవ్రమైన అణచివేత, నిర్బంధం అమలు చేశారు. 2000లో మూడోసారి గెలిచిన తరువాత ఫుజిమోరి ఉన్నత సలహాదారు, గూఢచారి చీఫ్ వ్లాదిమిరో మాంటెసినోస్ రాజకీయ నాయకులకు లంచం ఇస్తున్న వీడియోలు బయటకు వచ్చాయి. దీంతో ఫుజిమోరి తన పూర్వీకుల జపాన్‌కు పారిపోయారు. టోక్యో నుంచి ఫ్యాక్స్ ద్వారా రాజీనామా లేఖ పంపారు. రెండు దేశాల పౌరసత్వం ఉన్న ఆయన.. ఆ తరువాత జపాన్ సెనేటర్ పదవికి పోటీపడి ఓడిపోయారు. షైనింగ్ పాత్ మిలిటెంట్ల అణచివేతకు ఆదేశించారనే ఆరోపణలతో ఫుజిమోరిపై పలు కేసులు నమోదయ్యాయి.

25 ఏళ్ల జైలు శిక్ష

2005లో పెరూకు తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. 2007లో చిలీ వచ్చిన ఆయన్ను అక్కడి అధికారులు 2009లో పెరూకు అప్పగించారు. పలు కేసుల్లో దోషిగా 25 ఏళ్ల జైలుపాలయ్యారు. తరచూ అనారోగ్యం పాలవ్వడంతో క్షమాభిక్ష కోసం అప్పీలు చేశారు. అయితే జైలు నుంచి బయటకు రావడానికి అదో ఎత్తుగడగా ప్రత్యర్థులు తోసిపుచ్చారు. అప్పటి అధ్యక్షుడు పెడ్రో పాబ్లో కుజిన్‌స్కీ 2017లో ఫుజిమోరికి క్షమాభిక్ష ప్రసాదించారు. కొన్ని నెలల తరువాత కుజిన్‌స్కీ అభిశంసనకు గురయ్యారు. పెరూ న్యాయస్థానం ఫుజిమోరి క్షమాభిక్షను రద్దు చేసి, ప్రత్యేక జైలుకు పంపింది. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయనకు 2023లో కోర్టు క్షమాభిక్షను పునరుద్ధరించింది. అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే మొదటి భార్య సుసానాతో విభేదాలు రావడంతో విడిపోయారు. తరువాత ఆయన కుమార్తె కీకోను ప్రథమ మహిళగా నియమించారు. ఆమె మూడుసార్లు పెరూ అధ్యక్ష పదవికి పోటీ పడి, ఓడిపోయారు. కుమారుడు కెంజో కూడా రాజకీయాల్లోనే ఉన్నారు.

హరియాణా బీజేపీ సర్కారుకు కౌంట్‌డౌన్

- మాజీ సీఎం భూపీందర్ హుడా

న్యూఢిల్లీ/చండీగఢ్/కురుక్షేత్ర: హరియాణాలోని బీజేపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని మాజీ సీఎం భూపీందర్ హుడా వ్యాఖ్యానించారు. అవినీతి, చేతగాని ప్రభుత్వం గద్దెదిగడం ఖాయమని స్పష్టం చేశారు. బీజేపీ ప్రభుత్వం కుంభకోణాలు, తప్పుడు హామీలతో పదేళ్లుగా ప్రజలను దోచుకుందని, అందుకు ఇప్పుడు మూల్యం చెల్లించనుందని ఆయన ఆరోపించారు.

నామినేషన్ వేసిన ప్రముఖులు: కాంగ్రెస్ నేత రణ్‌దీప్ సూర్జేవాలా కుమారుడు ఆదిత్య సూర్జేవాలా, మాజీ సీఎం బన్సీలాల్ మునిమనవరాలు, బీజేపీకి చెందిన శ్రుతి చౌదరి, కురుక్షేత్ర ఎంపీ నవీన్ జిందాల్ తల్లి సావిత్రీ జిందాల్ గురువారం నామినేషన్లు వేసిన ప్రముఖుల్లో ఉన్నారు.

కరెంట్ అఫైర్స్



జాతీయం

'అపరాజిత బిల్లు'కు ఏకగ్రీవ ఆమోదం

పశ్చిమ బెంగాల్ శాసనసభ రాష్ట్ర అత్యాచార నిరోధక బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్ర రాజధాని కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన నేపథ్యంలో.. 'అపరాజిత ఉమెన్ అండ్ చైల్డ్ బిల్లు(పశ్చిమ బెంగాల్ క్రిమినల్ లాస్ అండ్ అమెండ్మెంట్) 2024' పేరిట రాష్ట్ర ప్రభుత్వం దీనిని తీసుకువచ్చింది. చర్చ అనంతరం భాజపా సహా ప్రతిపక్షాలన్నీ బిల్లుకు మద్దతు పలకడంతో దీనికి ఏకగ్రీవంగా ఆమోదం లభించింది. ఈ ముసాయిదా బిల్లు ప్రకారం-అత్యాచారానికి గురైన బాధితులు మరణించినా, కోమాలోకి వెళ్లిపోయినా దోషికి ఉరిశిక్ష విధిస్తారు. అత్యాచారానికి పాల్పడిన దోషులకు పెరోల్ లేని జీవిత ఖైదును విధిస్తారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు పించన్ బంద్

ఒక రాజకీయ పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలోకి ఫిరాయించి అనర్హత వేటుకు గురైన ఎమ్మెల్యేలకు పించన్ ఇవ్వొద్దని హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటుకు గురైన ఎమ్మెల్యేలు అందరికీ ఇది వర్తిస్తుంది.

23వ లా కమిషన్ ఏర్పాటు

కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 2న 23వ లా కమిషన్ ను ఏర్పాటు చేసింది. మూడేళ్ల కాలపరిమితితో దీన్ని ప్రకటించింది. 22వ లా కమిషన్ పదవీకాలం ఆగస్టు 31న ముగియడంతో.. కొత్త లా కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్‌ను జారీచేసింది. ఒక చైర్‌పర్సన్, మెంబర్ సెక్రటరీతో కలిపి నలుగురు సభ్యులు ఉంటారని పేర్కొంది. వీరందరూ లా కమిషన్‌లో పూర్తికాలపు బాధ్యతలు నిర్వర్తిస్తారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు మూడేళ్ల పాటు, లేదా జడ్జిలుగా తమ పదవీకాలం పూర్తయ్యేవరకు లా కమిషన్‌లో పూర్తికాలపు సభ్యులుగా ఉంటారని వెల్లడించింది. న్యాయశాఖ కార్యదర్శి, శాసన వ్యవహారాల కార్యదర్శులు లా కమిషన్‌లో ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు.

అగ్ని-4 క్షిపణి పరీక్ష విజయవంతం

అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ పరీక్షను భారత్ సెప్టెంబర్ 6న విజయవంతంగా పూర్తి చేసింది. మధ్యస్థ రేంజ్ క్షిపణి అయిన అగ్ని-4ను ఒడిశాలోని చాందీపూర్ నుంచి ప్రయోగించినట్లు అధికారులు తెలిపారు. భారత న్యూక్లియర్ కమాండ్ అథారిటీలో భాగమైన స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ దీనిని నిర్వహించిందన్నారు. అగ్ని-4తో లక్ష్య పరిధి మరింత పెరిగింది. 4 వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఇది ఛేదిస్తుంది. 20 మీటర్ల పొడవున్న ఈ క్షిపణి వెయ్యి కిలోల పేలోడ్‌ను మోసుకుపోగలదు.

రూ.1.45 లక్షల కోట్ల ఆయుధ కొనుగోళ్లు

భారత సైనిక దళాలను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రూ.1.45 లక్షల కోట్ల విలువైన ఆయుధాల సమీకరణకు ఆమోదం తెలిపింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సెప్టెంబర్ 3న సమావేశమైన ఆయుధ కొనుగోళ్ల మండలి(డీఏసీ) ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. మొత్తంమీద 10 రకాల సాధన సంపత్తి సమీకరణకు ఉద్దేశించిన ప్రతిపాదనలకు 'యాక్సెప్టెన్స్ ఆఫ్ నెసిసిటీ' (ఏవోఎన్) మంజూరుచేసింది. ఇందులో 99 శాతాన్ని దేశీయ సంస్థల నుంచే సేకరించనున్నట్లు రక్షణ శాఖ పేర్కొంది. భారత సైన్యంలోని యుద్ధట్యాంకుల ఆధునికీకరణ కోసం భవిష్యత్తరం పోరాట శకటా(ఫ్యూచర్ రెడీ కంబాట్ వెహికల్స్-ఎఫ్ ఆర్సీవీ)ల సమీకరణకు సమ్మతి లభించింది.

భారత వృద్ధి అంచనా 6.6% నుంచి 7 శాతానికి పెంచిన ప్రపంచబ్యాంకు

భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు అంచనాలను ప్రపంచ బ్యాంకు పెంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 6.6% వృద్ధిరేటు లభిస్తుందని గత జూన్‌లో అంచనా వేసిన బ్యాంక్, తాజాగా 7 శాతానికి పెంచింది. వ్యవసాయ రంగం, గ్రామీణ గిరాకీ ఇందుకు దోహదం చేస్తాయని పేర్కొంది. వర్షాలు, ప్రైవేటు పెట్టుబడులు, ఎగుమతులు రాణించి, జీడీపీ వృద్ధికి ఊతంగా నిలుస్తాయని ప్రపంచ బ్యాంకు తెలిపింది.

మానవ రహిత బాంబర్ విమాన గగన విహారం

స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన మానవ రహిత బాంబర్ విమానం 'ఎఫ్ డబ్ల్యూడీ 200బీ' తొలిసారిగా విజయవంతంగా గగన విహారం చేసింది. బెంగళూరుకు చెందిన ఫ్లయింగ్ వెడ్జ్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్(ఎఫ్ డబ్ల్యూడీఏ) సంస్థ దీన్ని రూపొందించింది. ఇది సుమారు 15వేల అడుగుల ఎత్తులో, ఏడు గంటల పాటు నింగిలోనే ఉండగలదు. ఈ విమానం నిఘా కోసం ఆప్టికల్ పరికరాలు, గగనతల దాడులు, బాంబింగ్ కోసం క్షిపణి తరహా ఆయుధాలను మోసుకెళుతుంది. దీని ఏరోడైనమిక్స్ డిజైన్, ఎయిర్ ఫ్రేమ్, ప్రొపల్షన్, నియంత్రణ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్స్‌ను తమ కర్మాగారంలోనే రూపొందించారు. ఈ విమానం బరువు 102 కిలోలని, గరిష్ఠంగా 250 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లగలదు.

'ఇండియా' సైజ్‌లో దుస్తులు

భారత్‌లో త్వరలోనే 'ఇండియాసైజ్'లో దుస్తులు లభించనున్నాయి. ఇందుకోసం కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ కొత్త ప్రాజెక్టును చేపట్టనుంది. ఈ విషయాన్ని సెప్టెంబర్ 5న ఢిల్లీలో కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ ప్రకటించారు. ఇప్పటివరకు భారత్‌లో దుస్తులు అన్నీ యూఎస్ లేదా యూకే సైజ్‌లలోనే లభిస్తున్నాయి. ఈ సమస్యకు 'ఇండియా సైజ్' ప్రాజెక్టు పరిష్కారం చూపిస్తుందని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. భారతీయుల శరీరాలకు తగ్గట్టుగా కొత్త ప్రామాణిక కొలతలను రూపొందించనున్నట్లు ఆయన చెప్పారు. కాగా,దుస్తుల డిజైన్‌ల తయారీ కోసం టెక్స్‌టైల్స్ శాఖ, ఎన్ఐఎఫ్‌టీ కలిసి రూపొందించిన ఏఐ ఆధారిత 'విజన్ నెక్సస్' పోర్టల్‌ను గిరిరాజ్ సింగ్ ప్రారంభించారు.

రైతులకు త్వరలో డిజిటల్ ఐడీలు

దేశంలోని 11 కోట్ల మంది రైతులకు ఆధార్ తరహాలో డిజిటల్ ఐడీలు జారీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. రైతులను సాధికారులను చేసేందుకు వచ్చే మూడు ఆర్థిక సంవత్సరాలలో ఈ కార్డులను జారీచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. అగ్రిస్టాక్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అందజేసే సేవలు, పథకాలను క్రమబద్ధం చేసేందుకు డిజిటల్ ఐడీలను ఇవ్వనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆరు కోట్ల మందికి, వచ్చే ఆర్థిక సంవత్సరం మూడు కోట్ల మందికి, ఆ తరువాత ఏడాది రెండు కోట్లమందికి డిజిటల్ ఐడీలను జారీచేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వాలు/కేంద్రపాలిత ప్రాంతాలు ఈ ఐడీలను తయారు చేసి, నిర్వహిస్తాయని పేర్కొంది. రైతుల భూమి రికార్డులు, వారి పశు సంపద, పంటల సాగు, వారికి లభించే సదుపాయాలకు ఐడీలను అనుసంధానం చేస్తారని వివరించింది. త్వరలో దేశవ్యాప్తంగా పంటల సర్వేను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 400 జిల్లాల్లో, వచ్చే ఆర్థిక సంవత్సరంలో మిగిలిన జిల్లాల్లో డిజిటల్ సర్వే పూర్తిచేస్తామని పేర్కొంది.

అంతర్జాతీయం

ప్రపంచంలోనే తొలి న్యూక్లియర్ క్లాక్

ప్రపంచంలోనే తొలి న్యూక్లియర్ క్లాక్‌ను అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఈ గడియారం ద్వారా అత్యంత కచ్చితత్వంతో సమయాన్ని గుర్తించవచ్చు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో బౌల్డర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టాండర్డ్స్ అండ్ టెక్నాలజీకి చెందిన శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన ఈ గడియారానికి సంబంధించిన వివరాలు 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

రష్యా నిఘా తిమింగలం హ్వాల్దిమిర్ మృతి

'హ్వాల్దిమిర్' పేరుతో 2019లో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన బెలుగా రకపు తిమింగలం నార్వేలోని ఓస్లోఫ్జోర్డ్‌లో ఆగస్టు 31న మరణించింది. 14 అడుగుల పొడవు, 2700 పౌండ్ల బరువు గల ఈ తిమింగలం మెడకు సెయింట్ పీటర్స్ బర్గ్ అనే లేబుల్ ఉండటంతో దాన్ని రష్యా నిఘా తిమింగలంగా అనుమానించారు. అయితే ఆ తిమింగలం తమదేనని రష్యా ఎలాంటి అధికార ప్రకటన చేయకపోవడంతో అది నిఘా తిమింగలమా లేదా వింత పరిస్థితుల్లో అలా చిక్కుకుపోయిందా అని ఎవరూ తేల్చుకోలేకపోయారు.

భారత్‌లో భారీగా పెరిగిన ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తి

ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తిలో భారత్ అగ్రస్థానంలో ఉంది. ప్రతి ఏడాది 10.2 మిలియన్ టన్నుల వ్యర్థాలను ఉత్పత్తి చేస్తుంది. ఇది తరువాతి పెద్ద కాలుష్య దేశాల కంటే రెండింతలు ఎక్కువని ఒక నివేదిక వెల్లడించింది. యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ లీడ్స్‌కు చెందిన పరిశోధకులు తెలిపిన వివరాల ప్రకారం- ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది 57 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ వ్యర్థాలు సముద్ర గర్భం నుంచి కొండ శిఖరాల వరకు, ఆఖరికి మానవ శరీరంలో సైతం పెద్దయెత్తున పేరుకుపోతున్నాయి. ఈ వ్యర్థాల్లో మూడింట రెండు వంతులు ప్రపంచంలోని దక్షిణ దేశాల నుంచే వస్తున్నట్లు ఈ నివేదిక వెల్లడించింది.

వార్తల్లో వ్యక్తులు-కమిటీలు

రైతుల సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీ

పంటల కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత సహా పలు డిమాండ్లతో శంభు సరిహద్దు వద్ద నిరవధిక నిరసనను కొనసాగిస్తున్న రైతుల సమస్యల పరిష్కారానికి సర్వోన్నత న్యాయస్థానం ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. అయిదుగురు సభ్యుల కమిటీకి పంజాబ్, హరియాణా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నవాబ్ సింగ్ చైర్ పర్సన్‌గా వ్యవహరించనున్నారు. జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలిచ్చింది.

ఫ్రాన్స్ నూతన ప్రధానిగా మిషెల్ బార్నియర్

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మెక్రాన్ ఆ దేశ ప్రధానిగా ఐరోపా యూనియన్ తరుపున బ్రెగ్జిట్ సంధానకర్తగా గతంలో వ్యవహరించిన మిషెల్ బార్నియర్‌ను ఎంపిక చేశారు.

క్రీడలు

లార్డ్స్‌లో తొలిసారి డబ్ల్యూటీసీ ఫైనల్

ప్రతిష్టాత్మక ప్రపంచ టెస్టు చాంపియన్షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ మ్యాచ్‌కు ఈసారి ఇంగ్లండ్ లోని విఖ్యాత లార్డ్స్ మైదానం వేదిక కానుంది. వచ్చే ఏడాది జూన్ 11 నుంచి 15 వరకు లార్డ్స్ మైదానంలో డబ్ల్యూటీసీ తుది పోరు జరుగుతుందని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) ప్రకటించింది. ఫైనల్ మ్యాచ్‌కు 16వ తేదీని రిజర్వ్ డేగా కేటాయించింది. 'అతి తక్కువ కాలంలో అత్యంత ప్రేక్షకాదరణ పొందిన డబ్ల్యూ టీసీ 2023-25 సీజన్ ఫైనల్ వచ్చే సంవత్సరం జూన్ 11 నుంచి నిర్వహిస్తాం' అని ఒక ప్రకటనలో తెలిపింది. గతంలో జరిగిన రెండు డబ్ల్యూటీసీ ఫైనల్స్‌కు ఇంగ్లండ్‌లోని సౌతాంప్టన్ (2021), ఓవల్ (2023) ఆతిథ్యమివ్వగా... ఈసారి లార్డ్స్‌లో ప్రతిష్టాత్మక మ్యాచ్ జరగనుంది. గత రెండు ఎడిషన్‌లలోనూ ఫైనల్ చేరిన భారత జట్టు రెండు పర్యాయాలూ రన్నరప్‌తోనే సరిపెట్టుకోగా... న్యూజిలాండ్, ఆస్ట్రేలియా ఒక్కోసారి విజేతగా నిలిచాయి. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో టీమిండియా టాప్‌లో కొనసాగుతుండగా... ఆస్ట్రేలియా రెండో స్థానంలో ఉంది. డబ్ల్యూటీసీ సీజన్ ముగిసే సమయానికి అనుకూల వాతావరణం, విశ్వవ్యాప్త అభిమానులకు వీక్షణ సమయం కూడా అనుకూలంగా ఉండటంతో.. ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్ నిర్వహణకు ఇంగ్లండ్ సరైన వేదిగా ఐసీసీ భావిస్తోంది. వరుసగా నాలుగో డబ్ల్యూటీసీ ఫైనల్ కు కూడా ఇంగ్లండ్ 2027లో ఆతిథ్యమిస్తుంది.



ఎం.బాలలత, సబ్జెక్ట్ నిపుణులు

The autobiography of Kamala Das is..



Kamala Das (1934-2009)

- an **Indian poet, novelist and short story writer.**
- pen name - **'Madhavi Kutty'.**
- changed her name to **"Suraiya Begum"** after embracing Islam.
- Nominated and **shortlisted for Nobel Prize** in 1984.
- She received **"Sahitya Akademi Award"** in 1985 and **"Asian World Prize"** in 2000 for her poetry.

Works:

- Summer in Calcutta (first volume of poetry; Kent's Award for Asian English Writing winner)
- The Descendants (second volume of poetry)
- The Old Playhouse and Other Poems (poetry)
- The Tattered Blanket (A Short story from Class -8)

Charles Dickens (1812-1870):

- One of the most popular **Victorian Novelist**
- published his first sketch about the London life in **the Old Monthly Magazine.**
- This gave rise to "Sketches by Boz" (A short story collection. Boz was Dickens' family name)

Works:

- 'Sketches by Boz" was followed by his first novel ***"the Posthumous Papers of the Pickwick Club" (also known as "Pickwick Papers")*** in 1836-37, it brought him great success.
- Oliver Twist (1837-39) his second novel
- Nicholas Nickleby (1838-39),
- The Old Curiosity Shop (1840-41)
- David Copperfield (1849-50) (It was the most popular of Dickens' novels and it has a good deals of his autobiographical material.)
- Bleak House (1852)
- Hard Times (1854)
- Little Dorrit (1855-57)
- A Tale of Two Cities (1859)
- Great Expectations (1860-61)
- Our Mutual Friend (1864-65) (His last completed novel)

Elizabeth Barret Browing (1806-61):

- an **English poet of the Victorian age**
- Her love story and marriage with another major poet of the period, **Robert Browning** is a classic of romance in real life.

Works:

- **"The Seraphim and Other Poems"** (1838) - First collection
- **"Poems"** (1844)
- **"Sonnets from the Portugese" (1850)** (It consists of **44 sonnets** about the course of their love.)
- **"Aurora Leigh" (1856)** - it is a novel in verse.
- Her **last two volumes of poetry** were posthumous works. They were;
- **Poems before Congress**
- **Last Poems**
- **'The Cry of Children'** is a lyric poem taken from 'Poems". (from class 8[th])

Harindranath Chattopadhyay (1898-1990):

- the younger brother of Sarojini Naidu
- an **Indian English poet, dramatist, mystic, actor, musician, composer, revolutionary and the member of the first Lok Sabha from Vijayawada Constituency.**

Works:

- **"The Feast Of Youth"** (1918) - first collection of poems
- Shaper Shaped • Noon
- He was awarded the **Padma Bhushan** in 1973.

Ravindranath Tagore (1861-1941):

- An Indian poet, novelist, short story writer, musician, actor, painter, dramatist and statesman.
- popularly known as Vishwa Kavi and Gurudev.
- received the Nobel Prize in literature for his Gitanjali, the Song of Offeringsin 1913.
- My Mother, Freedom, Where the Mind is without Fear are his well known poems.
- Famous novels: 1) The House of the World 2) The Wreck 3) Gora
- Important stories: 1) Home Coming 2) The Cabuliwallah 3) The Postmaster (these three stories are based on delicate human feelings, instincts and affections)
- His autobiography is "My Reminiscences".

Oscar Wilde (1854-1900):

- An Irish poet, novelist and playwright.
- Full name - Oscar Fingal O'Flahertie Wills Wilde

Works:

- The Importance of Being Earnest (it's a social satirical play)
- The Picture of Dorian Gray (his famous novel)
- The Happy Prince and Other Tales (it's a collection of children's stories)
- The Selfish Giant (a short story from 8th class)

Abburi Chayadevi (1933 - .....)

- a Telugu fiction writer and also feminist writer.
- born in Rajamundry, East Godavari district of AP.

Works:

- Mritunjaya (a short autobiographical novel)
- Abburi Chayadevi Kathalu, (a short story collection)
- Tana Margam (a short story collection; Sahitya Akademi Award in 2005)

R.K.Narayan (1906-2001):

- one of the three greatest Indian novelists in English.(other two are Milk Raj Anandand Raja Rao)
- full name- Rasipuram Krishnaswami Iyer Narayanaswami
- created the famous imaginary town - Malgudi
- first recipient of the Sahitya Akademi Award (in 1961 for The Guide)

Novels:

- Swami and Friends
- The Bachelor of Arts
- The Man-Eater of Malgud
- The English Teacher
- Mr. Sampath • The Guide (1958)

Collection of Short Stories:

- Malgudi Days
- Dodu and Other Stories

Notable Short Stories:

- An Astrologers Day
- The Snake Song
- Man Hunt • A Hero

Model Questions

1. "Aurora Leigh" is novel in verse form written by____
   1) Tagore
   2) Elizabeth Barret Browning
   3) Charles Dickens 4) Kamala Das
2. The main theme of the poem "The Earthen Goblet" is ____
   1) how nature is brutally treated by human beings.
   2) the goblet's sense of sadness and helplessness on being shaped into the present form.
   3) to know the likes and dislikes of a goblet.
   4) to know the worth of true friendship.
3. A very eminent English Poet edited Dr. Ravindranath Tagor's "Gitanjali". Who is that poet?
   1) W.B.Yeats 2) William Morris
   3) AC Swinburne
   4) DG Rosetti.
4. Match the following items in Column-A with those in Column - B:
   Column-A
   1. Summer in Calcutta
   2. Shaper Shaped
   3. Great Expectations
   4. Last Poems
   Column - B
   P. Sarojini Naidu
   Q. Kamala Das
   R. Elizabeth Barrett Browning
   S. Charles Dickens
   T. Harindranath Chattopadhyay
   1) 1-Q, 2-S, 3-R, 4-P
   2) 2-Q, 1-S, 3-E, 4-P
   3) 3-S, 2-T, 1-P, 4-R
   4) 2-T, 3-S, 1-Q, 4-R
5. In Tagore's poem 'My Mother', which one of the following is time about the child's memory of his mother?
   1) He listens to the songs she sang
   2) He sees her pictures which he has preserved
   3) He remembers her through sense associations
   4) He associates her drawings with her touch
6. In the short story 'The Selfish Giant' with whom had the Giant been staying for seven long years, before returning to his castle?
   1) His Irish brother
   2) With no one 3) His mother
   4) The Cornish Ogre.
7. Who, among the following Indian writers in English, has created an identifiable imagined locale ?
   1) Mulk Raj Anand 2) Raja Rao
   3) R.K. Narayan 4) Tagore
8. Which of the following is a gentle nostalgic poem?
   1) In the Bazaars of Hyderabad.
   2) My Mother
   3) Freedom 4) Mother's Day
9. What does Oliver ask for more in the novel Oliver Twist?
   1) entertainment 2) games
   3) Holidays 4) gruel
10. A very popular film was made on one of the novels of RK Narayan. Which of these novels is that?
    1) Waiting for the Mahatma
    2) Malgudi Days
    3) The Guide 4) Mr.Sampath
11. Identify the incorrect pair from the following:
    1) My Life - Sarojini Naidu
    2) Wings of Fire - Dr.APJ Abdul Kalam
    3) A Long Walk to Freedom - Nelson Mandela.
    4) My Life in My Words - Tagore
12. Who among the following is an Irish writer?
    1) Elizabeth Barrett Browning
    2) Oscar Wilde
    3) Alfred Tennyson
    4) Ruskin Bond
13. Which of the following pairs is incorrectly matched?
    1) Alfred Tennyson:In Memoriam
    2) Charles Dickens. :Little Dorrit
    3) Elizabeth Browning: Sonnets from the Portuguese
    4) Oscar Wilde: The Testament of Beauty
14. Which of the following is NOT a character from 'The Tattered Blanket'?
    1) Kamala 2) An Old Woman
    3) Gopi 4) A boy
15. Which of the following work is a part of the book "The Happy Prince and the Other Tales"?
    1) The Selfish Giant
    2) The Tattered Blanket
    3) The Town Child.
    4) The Gold Frame
16. A lyric poem which is a strong protest against the employment of children in coal-mines and factories
    1) My Mother
    2) The Country Child
    3) The Cry of Children
    4) Freedom
17. Which of the following is not a recipient of Sahitya Akademi Award?
    1) Ruskin Bond 2) R.K.Narayan
    3) Sarojini Naidu 4) Kamala Das
18. Match the following items in Column-A with those in Column - B:
    Column-A
    1. In the Bazaars of Hyderabad
    2. The Earthen Goblet
    3. Oliver Asks for More
    4. The Cry of Children
    Column - B
    P. Sarojini Naidu Q. Kamala Das
    R. Elizabeth Barrett Browning
    S. Charles Dickens
    T. Harindranath Chattopadhyay
    1) 1-Q, 2-S, 3-R, 4-P
    2) 2-Q, 1-S, 3-E, 4-P
    3) 3-S, 2-T, 1-P, 4-R
    4) 2-T, 3-S, 1-Q, 4-R
19. What are the main themes of RK Narayan's fiction?
    1) the main character's search for identity
    2) everyday village life in South India
    3) simple people with simple lives living in a changing world
    4) all of these
21. Which author helped R.K. Narayan get his novels published?
    1) Graham Greene
    2) Arundhati Roy 3) James Joyce
    4) Salman Rushdie.
22. 'Swami' is the characters from ___
    1) A Hero
    2) Swami was Expelled from School
    3) The Tattered Blanket
    4) The Dear Departed
23. The autobiography of Kamala Das is____
    1) My Life in My Words
    2) My Life 3) My Story
    4) My History
24. Name the author of The Gardener, The Fugitive, Chitra, Sacrifice, The Post Office is____
    1) Rabindra Nath Tagore
    2) Sarojini Naidu
    3) RK Narayan 4) Oscar Wilde
25. The short story that presents how a mother craves for her son's love is____
    1) My Mother 2) Mother's Day
    3) The Tattered Blanket
    4) Oliver Twist

KEY

1) 4	2) 1	3) 2	4) 4	5) 4
6) 3	7) 2	8) 4	9) 3	10) 4
11) 2	12) 3	13) 1	14) 3	15) 3
16) 2	17) 4	18) 1	19) 2	20) 4
21) 2	22) 4	23) 1	24) 3	25) 1

కృత్రిమ రేడియోధార్మికత అంటే ఏమిటి?

సహజ రేడియోధార్మికత

- ఈ ధర్మాన్ని క్రీ.శ.1896లో హెన్రీ బెకరల్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. ఇతనికి 1903లో నోబెల్ బహుమతి లభించింది.
- ప్రతి పరమాణు కేంద్రకం పరిమాణం 1 Fermiగా (10^{-15}m) ఉంటుంది. ఈ పరమాణు కేంద్రకంలోని ప్రోటాన్లు, న్యూట్రాన్లను కేంద్రక బలాలు బంధిస్తాయి. ఈ విశ్వంలో ఇతర బలాలతో పోలిస్తే (అయస్కాంత, విద్యుత్, గురుత్వాకర్షణ మొదలైనవి) కేంద్రక బలాలు అత్యంత బలమైనవి.
- కేంద్రక బలాల గురించి కూలూంబ్ అనే శాస్త్రవేత్త అధ్యయనం చేసి వాటిని కూలూంబ్ ఆకర్షణ బలాలు, వికర్షణ బలాలు అని రెండు రకాలుగా వర్గీకరించాడు.

1. పరమాణు సంఖ్య 1 నుంచి 30 వరకు గల పరమాణు కేంద్రకాల్లో కూలూంబ్ ఆకర్షణ బలాలు ఎక్కువగా, వికర్షణ బలాలు తక్కువగా ఉంటాయి. అందువల్ల ఇలాంటి పరమాణు కేంద్రకాల్లో స్థిరత్వం ఎక్కువగా ఉండి అవి సహజ రేడియోధార్మికతను ప్రదర్శించవు.
   ఉదా: $_1H^1$, $_6C^{12}$, $_7N^{14}$
2. పరమాణు సంఖ్య 31 నుంచి 82 వరకు [Pb_{82}] గల పరమాణు కేంద్రకాల్లో కూలూంబ్ ఆకర్షణ బలాలు క్రమక్రమంగా తగ్గి వికర్షణ బలాలు పెరుగుతాయి. కాబట్టి ఇలాంటి పరమాణు కేంద్రకాల్లో అస్థిరత్వం క్రమంగా పెరుగుతుంది.
   ఉదా: Kr^{92}_{36}, Ba^{141}_{56}

సహజ రేడియోధార్మికత నిర్వచనం

పరమాణు సంఖ్య 82 కంటే ఎక్కువగా ఉన్న పరమాణు కేంద్రకాల్లో కూలూంబ్ వికర్షణ బలాలు ఎక్కువగా, ఆకర్షణ బలాలు తక్కువగా ఉంటాయి. కాబట్టి ఇలాంటి పరమాణు కేంద్రకాల్లో అస్థిరత్వం ఎక్కువగా ఉండి, స్థిరత్వాన్ని పొందేందుకు తమంతట తాముగా α, β, γ కిరణాలను బయటకు విడుదల చేస్తాయి. ఈ ధర్మాన్ని సహజ రేడియో ధార్మికత అంటారు.

ఉదా: $_{92}Th^{232}$. దీన్ని బెర్జిలియస్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.

ఉదా: $_{92}U^{238}$. దీన్ని పెలిగాట్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.

1. సహజ రేడియోధార్మికతలో వెలువడిన α, β, γ కిరణాలను బెకరల్ కిరణాలు అని కూడా అంటారు.
2. సహజ రేడియోధార్మికత అనేది ఆయా రేడియోధార్మిక పదార్థాల స్వభావంపై ఆధారపడి ఉంటుంది. అంతేకానీ బాహ్య కారకాలైన ఉష్ణోగ్రత, పీడనాలపై ఆధారపడదు.



α–(ఆల్ఫా) కణం: ఈ కణం రెండు యూనిట్ల ధనావేశాన్ని, నాలుగు యూనిట్ల ద్రవ్యరాశిని కలిగి ^4_2He అనే జడవాయు కేంద్రకాన్ని పోలి ఉంటుంది. కాబట్టి ఒక రేడియోధార్మిక పదార్థం నుంచి α– కణం విడుదలైతే దాని పరమాణు సంఖ్య రెండు ప్రమాణాలు, ద్రవ్యరాశి నాలుగు ప్రమాణాలు తగ్గుతాయి.

β–కిరణం: పరమాణు కేంద్రకంలో ఒక న్యూట్రాన్ విచ్ఛిన్నమైనప్పుడు ఒక ప్రోటాన్, ఒక ఎలక్ట్రాన్‌గా విడిపోతుంది. దీనిలో భారయుత ప్రోటాన్ పరమాణు కేంద్రకంలో ఉంటుంది. తేలికగా ఉన్న ఎలక్ట్రాన్ బయటకు విడుదలవుతుంది. దీన్ని β– కిరణం అని అంటారు. పరమాణు కేంద్రం నుంచి β– కణం విడుదలైతే దాని పరమాణు సంఖ్య 1 పెరుగుతుంది. కానీ ద్రవ్యరాశిలో మార్పు ఉండదు.

γ– (గామా) కిరణం: ఇది కేవలం శక్తిని కలిగి ఉన్న ఒక రకమైన విద్యుదయస్కాంత తరంగం మాత్రమే. ఈ కిరణాలకు ద్రవ్యరాశి, ఆవేశం ఉండవు. కాబట్టి ఈ కిరణం విడుదలైనప్పుడు పరమాణు కేంద్రకంలో కొంత శక్తి మాత్రమే తగ్గుతుంది. అంతేకాని పరమాణు సంఖ్యలో, పరమాణు ద్రవ్యరాశిలో ఎలాంటి మార్పు ఉండదు.

- ఒక పదార్థంలో రేడియోధార్మిక కిరణాలు చొచ్చుకొని వెళ్లే సామర్థ్యం $\gamma > \beta > \alpha$

వివిధ రేడియోధార్మిక కిరణాల ధర్మాలు

ధర్మం	ఆల్ఫా కిరణాలు	బీటా కిరణాలు	గామా కిరణాలు
విద్యుదావేశం	రెండు ప్రమాణాల ధన విద్యుదావేశం ఉంటుంది	ప్రమాణ రుణ విద్యుదావేశం ఉంటుంది	విద్యుదావేశ రహితం
ద్రవ్యరాశి	ప్రోటాన్ ద్రవ్యరాశికి నాలుగు రెట్లు ఉంటుంది	ఎలక్ట్రాన్ ద్రవ్యరాశికి సమానం	ద్రవ్యరాశి లేదు
స్వభావం	హీలియం కేంద్రకం	వేగవంతమైన ఎలక్ట్రాన్లు	విద్యుదయస్కాంత తరంగజాతికి చెందినవి
అయనీకరణ శక్తి	తక్కువ	ఆల్ఫాలో వందో వంతు	కనిష్ఠం
చొచ్చుకుపోయే శక్తి	ఎక్కువ	ఆల్ఫా కంటే వంద రెట్లు ఎక్కువ	బీటా కంటే వంద రెట్లు ఎక్కువ
అయస్కాంత విద్యుత్ క్షేత్రాల్లో..	అపవర్తనం చెందుతాయి	అపవర్తనం చెందుతాయి	అపవర్తనం చెందవు
ఫొటోగ్రాఫిక్ పలకలను	ప్రభావితం చేస్తాయి	ప్రభావితం చేస్తాయి	ప్రభావితం చేస్తాయి
వేగం	1.6×10^7 మీ/సె. వీటి వేగం మూలక స్వభావంపై ఆధారపడి ఉంటుంది.	1.08×10^8 నుంచి 2.9×10^8 మీ/సె	3×10^8 మీ/సె
ప్రతిదీప్తి	కలగజేస్తాయి	కలగజేస్తాయి	కలగజేస్తాయి

సహజ రేడియోధార్మికతకు ప్రమాణాలు

1) 1 Curie=3.7×10^{10} విఘటనం/ సెకన్
2) రూథర్‌ఫర్డ్ (Rd) = 10^6 విఘటనం/ సెకన్
3) బెకరల్ (Bq) = 1 విఘటనం/ సెకన్ (S.I. ప్రమాణం)

- రేడియోధార్మిక కిరణాల ఉనికిని తెలుసుకునేందుకు ఉపయోగించే సాధనాలు.
  1) గిగ్గర్ ముల్లర్ కౌంటర్
  2) సింటిలేషన్ కౌంటర్
  3) క్లౌడ్ చాంబర్ 4) బబుల్ చాంబర్

కృత్రిమ రేడియోధార్మికత

- స్థిరమైన మూలకాన్ని భారయుత కణాలతో తాడనం చెందించినప్పుడు అది రేడియోధార్మిక పదార్థంగా మారుతుంది. ఈ పద్ధతిని కృత్రిమ రేడియోధార్మికత అంటారు.
- ఈ ధర్మాన్ని కనుగొన్న శాస్త్రవేత్తలు ఐరిన్ క్యూరీ, ఫ్రెడ్రిక్ జోలిట్ క్యూరీ.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జనరల్ సైన్స్

- ఇప్పటి వరకు అనేక కృత్రిమ రేడియోధార్మిక మూలకాలను కనుగొన్నారు. వాటిలో ముఖ్యమైనవి.
  1) ప్లూటోనియం 2) నెప్ట్యూనియం
  3) అమరేషియం 4) లారెన్షియం
  5) క్యూరియం 6) ఫెర్మియం
  7) ఐన్‌స్టీనియం 8) స్ట్రాన్షియం
  మొదలైనవి..
- వీటిలో ప్లూటోనియాన్ని అత్యుత్తమ అణు ఇంధనంగా భావిస్తారు.

ఆల్బర్ట్ ఐన్‌స్టీన్: ఇతను చేసిన పరిశోధనల్లో ముఖ్యమైనవి.
1) ద్రవ్యరాశి శక్తి తుల్యతానియమం ($E=mc^2$)
2) సాపేక్ష సిద్ధాంతం
3) కాంతి విద్యుత్ ఫలిత సమీకరణం. ఈ పరిశోధనకు ఐన్‌స్టీన్‌కు నోబెల్ బహుమతి (1921లో) లభించింది.

కేంద్రక విచ్ఛిత్తి

- ఒక భారయుత పరమాణు కేంద్రకాన్ని తటస్థ ఆవేశం గల ఒక న్యూట్రాన్‌తో ఢీ కొట్టించినప్పుడు అది విచ్ఛిన్నం చెంది దాదాపు సరిసమానమైన రెండు కొత్త పరమాణు కేంద్రకాలుగా విడిపోయి వాటిలో నుంచి మూడు న్యూట్రాన్లు, కొంత అణుశక్తి విడుదల కావడాన్ని కేంద్రక విచ్ఛిత్తి అంటారు.
- కేంద్రక విచ్ఛిత్తి అనే ప్రక్రియను ఆటోహాన్, స్ట్రాస్‌మన్ కనుగొన్నారు.

Eg: $^{235}_{92}U + ^1_0n \rightarrow ^{141}_{56}Ba + ^{92}_{36}Kr + 200MeV + 3^1_0n$
(యురేనియం, బేరియం, క్రిప్టాన్, న్యూట్రాన్)

- కేంద్రక విచ్ఛిత్తికి లోనయ్యే యురేనియం, థోరియం, ప్లూటోనియం అనే వాటిని అణు ఇంధనాలుగా ఉపయోగిస్తారు.
- యురేనియం అనేది పిచ్‌బ్లెండ్ రూపంలో, థోరియం మోనోజైట్ రూపంలో లభిస్తుంది.
- థోరియం నిల్వల రీత్యా ప్రపంచంలో భారత్ తొలి స్థానంలో ఉంది. ఈ నిల్వలు ఎక్కువగా కేరళ తీరంలోని ఇసుకలో ఉన్నాయి.
- సహజసిద్ధంగా లభిస్తున్న మూలకాల్లో భారయుత మూలకం 'యురేనియం'. యురేనియాన్ని 'Yellow Cake' అంటారు.
- ప్లూటోనియాన్ని ల్యాబ్‌లో తయారు చేస్తారు.

శృంఖల చర్య లేదా గొలుసు చర్య

- విచ్ఛిత్తిశీల పదార్థంలో కేంద్రక విచ్ఛిత్తి అనేది తనంతట తానుగా అన్ని కణాలకు విస్తరించడాన్ని గొలుసు చర్య (లేదా) శృంఖల చర్య అంటారు.
- ఒక సెకను కాలంలో విచ్ఛిన్నం చెందుతున్న కణాల సంఖ్యను విచ్ఛిత్తి రేటు (లేదా) గొలుసు చర్య రేటు అని అంటారు. ఈ గొలుసు చర్య రేటు అనేది రెండు అంశాలపై ఆధారపడుతుంది.

1) విచ్ఛిత్తిశీల పదార్థ స్వభావం
2) గొలుసు చర్యలో పాల్గొంటున్న న్యూట్రాన్ల వేగం.

గొలుసు చర్య అనేది కేవలం 10^{-8} sec కాలంలో జరుగుతుంది. ఈ కాలాన్ని ఒక SHAKE అని అంటారు.

- కాలాన్ని కొలిచేందుకు ఉపయోగించే అతి చిన్న ప్రమాణం SHAKE
  గమనిక: కాలాన్ని కొలిచేందుకు ఉపయోగించే అతిపెద్ద ప్రమాణం – కాస్మిక్ సంవత్సరం. అంటే సూర్యుడు ఒకసారి ఈ విశ్వం చుట్టూ తిరిగి రావడానికి పట్టే సమయం. 1 కాస్మిక్ సంవత్సరం = 250 మిలియన్ సంవత్సరాలు (సుమారుగా)
- గొలుసు చర్యలో వెలువడే న్యూట్రాన్ల సగటు సంఖ్య 2.5 మాత్రమే.
- గొలుసు చర్యను రెండు రకాలుగా వర్గీకరించొచ్చు. 1) అనియంత్రిత 2) నియంత్రిత గొలుసు చర్య

1. **అనియంత్రిత గొలుసు చర్య**
- గొలుసు చర్యలో పాల్గొంటున్న న్యూట్రాన్ల వేగాన్ని అదుపు చేయకుంటే అది నిరంతరంగా జరుగుతుంది. దీన్ని అనియంత్రిత గొలుసు చర్య అంటారు.
  అనువర్తనాలు: అణుబాంబు తయారీలో ఉపయోగించే సూత్రం కేంద్రక విచ్ఛిత్తి. శక్తి అనియంత్రిత గొలుసు పద్ధతిలో విడుదల.

2. **నియంత్రిత గొలుసు చర్య**
- గొలుసు చర్యలో పాల్గొంటున్న న్యూట్రాన్ల వేగాన్ని తగ్గిస్తే గొలుసు చర్య అదుపులోకి వస్తుంది. కాబట్టి దాన్ని నియంత్రిత గొలుసు చర్య అంటారు.
- ఈ పద్ధతిలో వెలువడిన అణుశక్తిని మానవాళి ప్రయోజనం కోసం వినియోగించొచ్చు.

Family Relations

This topic has become all time favourite topic for the examiner, irrespective of it being State Bank of India's or IBPS, either Probationary Officers' or clerical exam.

Family relations questions may be asked in the puzzle form (or) in the form of seating arrangement (or) in the symbolic form.

Generally, a roundabout complicated description is given in the form of certain small relationships and direct relationship between the persons concerned is to be found out. Hence, the candidate is definitely required to know the following:

- **Strong knowledge of family relations**
- **Analysis of the given statements carefully and connecting them systematically.**

Hence, a foolproof methodology has to be followed.

The following methods can be applied for solving the questions;

1. **Personalization method**
   (Or)
2. **Pictorial method**

Personalization Method

Here, the problems can be solved by translating the given information into one's own mother tongue and substituting unknown relationships with one's own kith and kin. To simply put it, visualizing the information from your point of view by being a part of it.

Pictorial Method

Representing the given statement(s) in the form of a diagram/chart.

In drawing the diagram/chart, there are no hard and fast rules. You can use your own symbols to depict the information, but give no room for ambiguity. Generally we can draw a diagram similar to the 'Traditional Family Tree' as used in history books. To be clear about the gender, **we use '+' for male and '-' for female and '?' for unknown.**




GOLDEN RULE:
The key factors for clearly answering the question on blood relations are
GENDER OF THE PERSON
GENERATION

The following notations can be drawn to indicate the relations as one has to take care of not to misrepresent the data, while drawing the diagram.

'Horizontal lines' are drawn to indicate marriage;
= marriage relationship
'Broken lines' for sibling relationship
= sibling relationship

'Vertical lines' indicate Parents and children,



Remember the important points given below

(1) After you have read the question, identify the persons between whom relationship is to be established.
(2) Try to correlate the given relationships.
(3) While concluding about the relationship between the two persons; be careful about the genders of the persons involved.

Point to remember

Generally, candidates get carried away by their personal biases and preconceived notions. For example, Sandeep is brother of Krishna. Krishna is brother of Chaitanya. Then, how Chaitanya is related to Sandeep?
We only know that Chaitanya is sibling of Sandeep and Krishna. But, we don't know the gender of Chaitanya. Hence, Chaitanya can be brother or sister of Sandeep.

As said above, a roundabout description is given which should be put in direct form. Below are some of such statements:

- **My mother's only child means myself.**
- **My grand father's only child (the only child of my grandfather) is my father (or) my mother.**
- **My grand mother's only child (the only child of my grandmother) is my father (or) my mother.**
- **My father's mother's only child is my father**
- **My father's brother's only sibling is my father.**
- **My grandfather's only son = My grandfather has only one son. But, it does'nt specify whether my grandfather has got daughters or not. Hence, my grandfather's only son could be my father or my maternal uncle.**
- **Similarly, My grandfather's only daughter = My grand father has only one daughter. But, it does not specify whether my grandfather has got sons or not. Hence, my grandfather's only daughter could be my mother or my paternal aunt.**
- **Kavya's husband's father-in-law's only daughter means Kavya (herself).**

The following summary of some common Blood relationships will be useful to the students.

Relation	Commonly used terms
Mother's Brother	Maternal Uncle
Father's brother	Paternal Uncle
Mother's Sister	Maternal Aunt
Father's Sister	Paternal Aunt
Mother's Father	Maternal Grandfather
Father's Father	Paternal Grandfather
Mother's Mother	Maternal Grandmother
Father's Mother	Paternal Grandmother
Son's Wife	Daughter-in-law
Daughter's husband	Son-in-law
Husband's (or) Wife's sister	Sister-in-law
Husband's (or) Wife's brother	Brother-in-law
Brother's (or) sister's son	Nephew
Brother's (or) sister's daughter	Niece
Uncle's son (or) daughter	Cousin
Aunt's son (or) daughter	Cousin

BANK EXAMS

REASONING

Sister's husband	Brother-in-law
Brother's wife	Sister-in-law
Grandson's (or) grand daughter's daughter	Great grand daughter
Grandson's (or) granddaughter's son	Great grandson

Note: **Whenever we are describing a relation on father side, prefix 'paternal' is used while that on the mother side, prefix 'maternal' is used.**

In addition to the above, the following terms and statements should be noted for clearly understanding the relationship.

SIBLINGS : children of same parents (brothers and sisters)

CHILD: son or daughter (the term 'child' indicates son (or) daughter as it does not indicate any gender)

SPOUSE: Husband (or) Wife

The generation of a family can be understood as follows:

Great Grandfather	Great Grandmother
Grandfather –	Grandmother
Father ——	Mother
Husband ——————	Wife
Daughter in law ——	Son-----Daughter Son in law
Grandson------------	Granddaughter

Following are the models in blood relations.

1. **IDENTIFICATION MODEL**
2. **SYMBOLIC RELATION MODEL**
3. **INTRODUCTION MODEL**

Model No. 1 and 2 are important as 4-5 questions are expected from either of these models.

ఉద్యోగాలు

డీఆర్‌డీవో, హైదరాబాద్‌లో రీసెర్చ్ అసోసియేట్, జేఆర్ఎఫ్‌లు

హైదరాబాద్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో)కు చెందిన సెంటర్ ఫర్ హై ఎనర్జీ సిస్టమ్స్ అండ్ సైన్సెస్(చెస్)లో రీసెర్చ్ అసోసియేట్, జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 08.
- **ఖాళీల వివరాలు:** రీసెర్చ్ అసోసియేట్-02, జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్)-06.
- **విభాగాలు:** మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్, లేజర్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, కెమిస్ట్రీ తదితరాలు.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. నెట్/గేట్ స్కోరు తప్పనిసరిగాఉండాలి.
- **వయసు:** రీసెర్చ్ అసోసియేట్ పోస్టుకు 35 ఏళ్లు, జూనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుకు 28 ఏళ్లు మించకూడదు.
- **స్టైపెండ్:** నెలకు రీసెర్చ్ అసోసియేట్ పోస్టులకు రూ.67,000, జూనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టులకు రూ.37,000.
- **ఎంపిక విధానం:** విద్యార్హత, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ, అనుభవం ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
- **ఈమెయిల్:** hrd.chess@gov.in.
- **దరఖాస్తులకు చివరితేది:** 29.09.2024.
- **వెబ్‌సైట్:** www.drdo.gov.in

టీసీఐఎల్, న్యూఢిల్లీలో 204 పోస్టులు

న్యూఢిల్లీలోని టెలికమ్యూనికేషన్స్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(టీసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 204.
- **పోస్టుల వివరాలు:** నర్సింగ్ ఆఫీసర్-152, ల్యాబ్ టెక్నీషియన్-04, ల్యాబ్ అసిస్టెంట్-01, ఫార్మసిస్ట్-11, జూనియర్ రేడియోగ్రాఫర్-05, ఈసీజీ-03, రిఫ్రాక్షనిస్ట్-02, ఆడియోమెట్రీ అసిస్టెంట్-01, ఫిజియోథెరపిస్ట్-02, ఓటీ టెక్నీషియన్-04, ఓటీ అసిస్టెంట్-05, ఆక్యుపేషనల్ థెరపిస్ట్-02, అసిస్టెంట్ డైటీషియన్-01, పోస్ట్‌మార్టమ్ టెక్నీషియన్-02, మార్చురీ అసిస్టెంట్-01, డ్రస్సర్-04, ప్లాస్టర్ రూమ్ అసిస్టెంట్-04.
- **అర్హత:** పదో తరగతి, ఇంటర్, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 27 నుంచి 32 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విదానం:** స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూ, షార్ట్‌లిస్టింగ్, సర్టిఫికేట్ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరితేది:** 13.09.2024.
- **వెబ్‌సైట్:** www.tcil.net.in